NPP01 B 281

Cover

1

కల్పన

[illegible]
[illegible]
6-7-1953

2

NPR01B281

ఆధునిక కవితా సంపుటి 3

కల్పన

సంపాదకులు :

అనిసెట్టి సుబ్బారావు

ఆవసరాల సూర్యారావు

బెల్లంకొండ రామదాసు

రెంటాల గోపాలకృష్ణ

చేతన సాహితి

చేతన సాహితి
విజయవాడ - 2

ఆధునిక కవుల కృతులను సేకరించి ఈకావ్యసంపుటిని
సర్వాంగసుందరం చేసిన సంపాదకవర్గానికి –
తమ రచనలు ప్రచురించుటకు అనుమతించి
తోడ్పడిన కవులందరికీ –

కల్పన రేఖాసంకేతాన్ని రచించి యిచ్చిన
ఆంధ్ర ఆర్ట్స్ ఎకాడమీ ప్రిన్సిపాల్ (విజయనగరం)
శ్రీ అ. పైడిరాజుగారికి

మా కృతజ్ఞతాభివందనాలు

వెల : నాలుగున్నర రూపాయలు

ప్రతులకు : విశాలాంధ్ర ప్రచురణాలయం
గవర్నరుపేట – విజయవాడ-2.

కల్పన : ఆధునిక కవితా సంపుటి
తొలిముద్రణ : 26, ఏప్రిల్ , 1953 : పదకొండువందల ప్రతులు
ముద్రణ : వాహిని ప్రెస్, విజయవాడ-1.

5



శ్రీ గంగినేని వెంకటేశ్వరరావు

గీతాదేవిగార్లకు



894.8271008
Sej — 1
8773

౨

చింతన

రామదాసు :

రెండు ప్రపంచ యుద్ధాల తరువాత, మూడవ ప్రపంచయుద్ధ భయానక చ్ఛాయలు ఆవరిస్తున్న విషమసమయంలో ఈ కవితా సంపుటి వెలువడుతున్నది. ఒక యుగం సమాప్తమై మరో యుగం ప్రారంభం కానున్న సందిగ్ధ సంధ్యా సమయం ఇది.

అవసరాల :

ఈరెండు ప్రపంచయుద్ధాల ఫలితంగా మానవజాతి ఎన్నో భీకర ఘట్టాలను అధిగమించింది. ఒక ప్రక్క సాంస్కృతిక సంక్షోభం, మరోప్రక్క ఈ సంక్షోభంనుంచి నివృత్తి పొందడానికి యత్నం—ఈ రెండింటి సంఘర్షణవల్ల జీవితాన్ని ఒక నూతన దృక్పథంతో పరిశీలించ వలసిన ఆవశ్యకత ఏర్పడింది. వివిధ దేశాల్లో వివిధ ఘణీతుల్లో ఈ ఆవేదన వ్యక్తీకరించబడింది.

రెంటాల :

ప్రతి యుగంలోనూ సాహిత్యోపాసకులు ఉత్తమాదర్శాలతో మానవజాతిని అభ్యున్నత దశకు తీసుకపోతూ వచ్చారు. నేటి సాహిత్య వేత్తలలో ఈ కృషి అతి పటిష్టంగాను, తీవ్రంగాను ఉన్నట్లు గోచరిస్తుంది. అందుచేతనే ఈ యుగం విప్లవాత్మక మైంది.

అనిసెట్టి :

అంతేకాదు. ఇంతకుముందు మానవ చరిత్రలో ఏదుస్సం ఘటన జరిగినా అసలు మానవుని ఉనికికే ప్రమాదం వచ్చే పరిస్థితి ఎన్నడూ ఏర్పడలేదు. మరఫిరంగికంటె మల్లెమొగ్గకే ఎక్కువ విలువవున్నదని మానవులంతా అంగీకరించేవారు. కాని, నేడు మన నాగరికతకొక సుస్థిరమైన ప్రాతిపదికలేదు. ఇప్పుడు విలువలు, విశ్వాసాలు, వ్యవస్థలు – అన్నిటిలో కల్లోలం ఏర్పడింది. ప్రశ్న తలఎత్తింది. మానవుడు ఈకల్లోలం నుండి బయటపడి, తన స్వరూపాన్నే ఒక మహత్తరాదర్శంతో, ఒక వినూత్నాకృతితో నిర్మించుకోవలసిన అవసరం కలిగింది. కవిత్వంలోనూ ఇంతే, నేటి విజ్ఞానం, సాహిత్యం– అన్ని, మానవుల నిత్యకృత్యాల్లో, చింతనలో చేస్తున్నతపస్సుకు ఫలితాలే.

రామదాసు :

ఇదే నేటి మానవునిలో కన్పించే అస్పష్టమైన ఆంతరంగిక వేపన. మారుపడిన పసిబిడ్డలాగ దారీతెన్నూ కన్పించని ఈ జీవితపు తిరునాళ్ళలో ఏకాంతంగా సంచరిస్తున్నాడు. అంతే కాదు. అతను కల్పించుకున్న ముక్తి సాధనాలే ఒక దశ తర్వాత అతనిని బంధాలై కలవర పరుస్తున్నాయి. మేధావుల వాదోప వాదాలకు, రాజకీయ నాయకుల వివిధ పథకాలకు, శాస్త్రజ్ఞుల పరిశీలనా పద్ధతులకు కేంద్రంగా వుండపలసిన మానవాత్మయే వీటివల్ల మరుగుపడి పోతున్నది. మానవుని భౌతిక ఆధ్యాత్మిక వ్యక్తిత్వాల మధ్య సమన్వయం కుదరడం

లేదు. ఈ విచిత్ర వేదనే నేటి సాహిత్య రూపాలలో, ముఖ్యంగా కవిత్వంలో గోచరిస్తున్నది.

రెంటూల :

కవివేదనాత్మకమైన ఈ పరిశోధనలో జీవితంలోని అంతర్గర్భిత సత్యాలను బహిర్గతం చేస్తాడు. ఉత్తమ కళాసృష్టికి ఈ యుగంలో కవికున్నంత అవకాశం మరెప్పుడూ కనుపించదు.

అవసరాల :

వేదన అనేది ఎప్పుడూ వున్నదే. జీవితమే ఒక నిత్య సంఘర్షణ. ఈ సంఘర్షణలు, మార్పులు మానవుడు సృజించుకుంటున్న నాగరికతలోనూ, సంస్కృతీలోనూ ప్రతిబింబిస్తున్నాయి. కళను అర్థంచేసుకోవాలంటే ప్రత్యేకంగా ఒక కళాకృతినేగాక, ఈ కృతులన్నీ అంతర్భాగాలైన సంస్కృతి దృష్ట్యా అవలోకించవలసి వుంటుంది. మానసికంగా అభివృద్ధి పొందుతున్న మనం కొత్త ఆదర్శాలను, మార్గాలను సృష్టించుకున్నాం.

ఆంధ్ర జాతీయ పునరుజ్జీవన కాలంలో సామాజిక పరిస్థితుల్లో కలిగిన మార్పు ఫలితంగా సాహిత్యంలో ఒక నూతన దశ ప్రారంభమైనదని చెప్పవచ్చు.

అనిసెట్టి:

ఆ తరువాతనే కాల్పనిక యుగంప్రారభంమైన దనుకుంటాను. సాహిత్యం పురాచేతిహాసాలను విడిచి జీవితం లోనుంచి

పైకుబికే ఒక జీవనదిగా వెలువడ నారంభించింది. మన భారతీయ సంస్కృతితోపాటు, పాశ్చాత్య కాల్పనిక సాహిత్య ప్రభావాన్నికూడ స్వీకరించిన భావకవులు, పూర్వసాహిత్య రూపాలకు, ఛందస్సులకు ఒక వినూత్న సారళ్యాన్ని సమకూర్చారు. జీవితాన్ని ఆదర్శవాద దృక్పథంతో పరిశీలించి, భావ ప్రకటనలోను, శైలిలోను స్వేచ్ఛా ప్రియత్వాన్ని ప్రకటించారు. భావకవులు మన జీవితాన్ని కొత్తగా కనుగొనడానికి ప్రయత్నిస్తూ ఆఉత్సాహంలో ఆశ్చర్యానందాలను, అనురాగాభిమానాలను వెల్లడిచేశారు. వారిది ప్రధానంగా వ్యక్తిగత దృష్టి కావడం వల్లనే వారి ఆవేశానికి ఒక సాంఘికాదర్శంకంటె ఊహాప్రేయసి ఆలంబనమైంది.

సాహిత్యం ఉద్వేగమార్గాన జరిపే సత్యాన్వేషణ. ఈయుగంలో మన కవిత్వం జీవితాన్ని వాస్తవ దృక్పథంతో పరిశీలించి, ఎదుర్కొని అందులో భాగస్వామిగా పాల్గొనే యౌవనదశ ఆరంభమైంది. వెంటనే, యీ యుగపు ప్రధాన లక్షణాలైన ఆందోళనా భయాలు, ఆకలి, ఆశ, ముందుచూపు, విప్లవం సహజంగానే సాహిత్యంలో ప్రవేశించాయి. జాతులన్నీ ఏక కుటుంబంగా ఏర్పడడంచేత జాతీయ అంతర్జాతీయ జీవితాలు పెనవేసుకు పోవడంచేత సాహిత్యంలో మానవవ్యక్తి అంతర్జాతీయ వ్యక్తిగా రూపొందాడు. అంతేకాదు. అంతర్జాతీయ సాహిత్యంలోని సంప్రదాయాలు, మార్పులు ఆంధ్ర సాహిత్యంలో ప్రవేశించాయి.

నేటికవులు ప్రస్తుతంలో నిలిచి భవిష్యత్స్వరూపాన్ని దర్శించడానికి యత్నిస్తున్నారు. దీనికి పురికొల్పే సమస్య 'లేమి'.

భౌతిక, అధ్యాత్మిక కల్లోలం ప్రస్తుత జీవితం దుస్సహమని, మార్పు అత్యవసరమని స్పష్టం చేస్తున్నది. ఆమార్పుపేరు 'విప్లవం'. 'ఆశ' ప్రగతికి వెన్నెముక. మృత్యువును జయించా లనే చిరవాంఛా సాఫల్యానికి యుద్ధనివారణ, 'శాంతి' సాధన ప్రథమ సోపానాలు. 'స్వేచ్ఛ' నరుల నిత్యాదర్శం. 'శాంతి' సుఖమయ స్వేచ్ఛాయుత జీవనానికి ప్రాతిపదిక. ఇవినేటి సత్యాలు. అయినప్పుడు ఈ మాటలు మన కవితలో తరచు వినిపించడం, చైతన్య జ్యోతులుగా వెలిగి మన కవిత్వాదర్శా నికి మార్గదర్శకాలు కావడం ఆశ్చర్యంకాదు.

రామదాసు :

ఈ యుగంలో వ్యక్తి చైతన్యం సాంఘిక చైతన్యంగా విస్త రిల్లింది. వికలమైన సంఘవ్యవస్థ ఫలితంగా శకలాలై చెదిరిన జీవిత చిత్రణకు ప్రాధాన్యత కనిపిస్తుంది. ఈ యుగాన్ని ఆవ రించిన ప్రధాన తత్వదృష్టి మార్క్సిజం. నేటి సాంఘిక విషబంధంలో చిక్కిన మానవునికి మార్క్సిజం గొప్ప నిష్కృతి మార్గంగా కనిపించింది. అందుచేత, వివిధ అంత ర్వైరుధ్యాలతో సంఘర్షిత మౌతున్న సంఘ సంగీతం ఈ యుగంలోని కవితలో వినిపిస్తుంది. నేటికవులు యుద్ధాన్ని, పరపీడనను, ఆర్థిక అసమానతను ద్వేషించి, విశ్వశాంతిని, నవమానవ ప్రాదుర్భావాన్ని ఆశిస్తున్నారు.

రెంటాల :

విముక్తి కోసం మానవుడు నడుపుతున్న ప్రధానయంత్రమే కవిత్వం. ఈ యంత్రం ప్రఫుల్లమైన ప్రచండ ఘోషలను

ప్రసారం చేస్తుంది. కనుకనే నేటి కవిత్వంలో ఇతః పూర్వము లేని పునస్సృష్టి ఉద్భవిస్తున్నది.

ఆవసరాల :

కాల్పనిక యుగం తనముందు యుగంపై తిరుగబడినట్లే, కాల్పనిక కవితాయుగంపై ఆధునిక యుగం తిరుగుబాటుచేసి విప్లవ పరివర్తనలను తీసుకొచ్చింది. ఈమ హోదయ ప్రథమ రేఖలు శ్రీ శిష్ట్లా రచనలలో కనుపించాయి. కాల్పనిక యుగంపై విముఖత్వము నూతనత్వం కోసం ఒక అవ్యక్తవేదన ప్రస్ఫుటమౌతాయి. అధునాతన పాశ్చాత్య సాహిత్యరీతుల ననుసరించడానికి, భాషను పునఃసృష్టి చెయ్యడానికి ఈయన ప్రయత్నించాడు. పురాతన రీతులనుంచి విడిపడి, నూతన పథాన్ని అవలంబించి, రానున్న మార్పుకు అంకురార్పణ చేసిన ప్రథముడీయన. శ్రీ శ్రీతో విస్పష్టంగా ఆధునిక యుగం ప్రారంభించిందని చెప్పవచ్చు. ఈ యుగవేదనను, అశాంతిని, విముక్తికై పోరాడుతున్న ప్రగతిశక్తుల సంఘర్షణను తన కావ్యాలలో శ్రీ శ్రీ ప్రచండశక్తితో రూపొందించాడు. ఈయన ధోరణి అనేకులకు మార్గదర్శక మయింది.

అనిసెట్టి :

శ్రీ శ్రీ తన నిశిత తీక్ష్ణదృష్టితో నేడు శిథిలమౌతున్న నాగరికతను నిర్మితమౌతున్న నూత్న మానవోద్యమాన్ని దర్శించాడు. శ్రీరంగం నారాయణబాబు తన సహజ వైచిత్రితో నేటి జీవితపు అట్టడుగులను శోధించి, నేటి జీవితంలోని కల్లోలాన్ని నిర్భ

యుంగా పెల్లడించాడు. నేటి జీవితంలోని సుఖదుఃఖాలు వీరిద్దరినీ ఆవహించి, నేటి మానవుల అంతరాంతరాలలో దాగి వున్న తీరనికోరికలను, భావిసమాజ నిర్మాతలుగా రూపొందు తున్న ఆదర్శాలను పలికింప జేశాయి.

వీరి తర్వాత వచ్చిన కవిత్వోపాసకులు వారవలంబించిన ఉత్తమ శాస్త్రీయ పృక్పథాన్ని బహుముఖమైన జీవితానికి అనువర్తింపజేసి స్వరూప, స్వభావాలలో కొత్త పోకడలు చూప డానికి ప్రయత్నిస్తున్నారు. చిరతరమైన ఒక మానవతత్వాన్ని సాధించడం ద్వారా నేటి జీవితాన్ని ఉదాత్త రీతిలో వ్యక్తం చేయడానికి, నేటికవిత్వానికి శాశ్వతమానవత్వ ప్రయోజనం సిద్ధింపజెయడానికి కృషిచెస్తున్నారు.

వివిధ రీతులలో పెంపొందుతున్న ఆధునిక కవిత్వానికి ప్రతి నిధిగా ఈ కవితా సంపుటిని వెలువరించడానికి మనం చేస్తున్న ప్రయత్నం క్లిష్టమైనది. సమకాలీనసాహిత్యానికి విలువ కట్టడం వివాదాస్పద విషయమని తెలిసిగూడా మనమీ ప్రయ త్నానికి పూనుకోపలసి వస్తున్నది. వీలైనంతవరకు ఆధునాతన అభ్యుదయ కవిత్వంలోని ఉత్తమ గీతాలను సమకూర్చుతూ, వివిధ ఆధునిక రీతులను పొందుపరుస్తూ, యువకవులకు సాధ్యమైనంతగా అవకాశమివ్వాలని మనం చేసిన ఈ కృషి ఆంధ్రప్రజల ఆదరాభిమానాలను పొందగలుగు తుందను కుంటాను.

రెంటూల :

నవకవి ఉజ్వలమైన భవిష్యత్తును దర్శిస్తున్నాడు. ఆ నిశ్చల


విశ్వాసాన్నే కవిత్వంలో ప్రకటిస్తూ మానవ జీవనమూలిన్యాన్ని క్షాళితంచేసి మానవ జాతిని పునరుజ్జీవితం చేస్తున్నాడు.

రామదాను :

ఈ అధునాతన సాహిత్యోద్యమాన్ని పరిపూర్ణం చెయ్యడానికే మనకవులు ఇంకా ఎన్నో కొత్త ప్రయోగాలు జరుపుతున్నారు. ఎదురయ్యే అనేక సందేహాలను, సమస్యలను క్రమంగా పరిష్కరించుకుంటూ మనయుగపు కవిత్వానికి విశ్వసాహిత్యంలో ఒక విశిష్టమైన ఉన్నతస్థానం ఏర్పరచగలమని, అందుకు ఈ కవితాసంపుటి దోహదం చెయ్యగలదని విశ్వసించవచ్చు.

ఇలాంటి ఉత్తమ కృషిని ఆంధ్ర పాఠకులు, సాహిత్యాభిమానులు ఆదరించి ప్రోత్సహిస్తారు.

★



కవితా! ఓ కవితా!

కవితా! ఓ కవితా!
నా యువకాశల నవవేశల సుమగీతావరణంలో,
నినునే నొక సుముహూర్తంలో,
అతిసుందర సుస్యందనమందున
దూరంగా వినువీథుల్లో విహరించే
అందని అందానివిగా
భావించిన రోజులలో,
నీకై బ్రబుకే ఒక తపమై
వెదుకాడే నిమిషాలందు నిషాలందున,
ఎటు నే చూచిన చటులాలంకారపు
మటుమాయల నటనలలో
నీరూపం కనరానంచున,
నా గుహలో, కుటిలో, చీకటిలో
ఒక్కడనై బ్రుక్కిన రోజులు లేవా?

నీ బ్రాబల్యంలో,
చిరదీక్షాశిక్షా తపస్సమీక్షణలో,
నిశ్చలసమాధిలో,
స్వర్గద్వారపు తోరణమై బ్రవేలిన నా
మస్తిష్కంలో
ఏయే ఘోషలు, భాషలు, దృశ్యాల్ తోచాయో!

నే నేయే చిత్రవిచిత్రశ్యామంత
రోచిర్నివహం చూశానో !
నా గీతం ఏయే శక్తులలో
ప్రాణస్పందన పొందిందో ?
నీకై నే నేరిన వేయేధ్వానులలో,
ఏయే మూలల వెదకిన ప్రోవుల
ప్రోవుల రణన్నినాదాలో !
నడిరే యాకస మావర్తించిన,
మేఘూ లావర్షించిన,
ప్రచండ ఝుంఝూ ప్రభంజనం
గజగజ లాడించిన
నడిసంద్రపు కెరటాల్లో ప్రమోగిన
శంఖారావం, ఢంకాధ్వానం !
ఆ రాత్రే,
కారడవులలో లయాతీతమై
విరుతించిన నానాజంతుధ్వనులో ?
నట్రాంతర్ని బిడ నిఖిలగానం,
భూకంపాలు, ప్రభుత్వపతనాలు,
విప్లవం, యుద్ధం,
అన్నీ నీచైతన్యం !
నీ విశ్వరూప సాక్షాత్కారం !

మరి నిన్ను స్మరిస్తే
నా కగుపించే దృశ్యాలా ?

వినిపించే భాష్యాలా ?

అగ్నిసరస్సున వికసించిన వజ్రం !
ఎగిరే లోహశ్యేనం !
శిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగనాదం !

ఇంకా నేనేం విన్నానా ?
నడిరే నిద్దురలో
అపుడే ప్రసవించిన శిశువు నెడద నిమురుకొని
రుచిర స్వప్నాలను కాంచే
జవరాలి మనఃప్రపంచపు టావర్తాలు !
శిశువు చిత్రనిద్రలో
ప్రాచీనస్మృతు లూచే చప్పుడు !
వైద్యశాలలో,
శస్త్రకారుని మహేంద్రజాలంలో,
చావుబ్రదుకుల సంధ్యాకాలంలో
కన్నులుమూసిన రోగార్తుని
రక్తనాళ సంస్పందన !
కాలువనీళులలో జారిపడి
కదలగనైనా చాలని
ప్రాగుబోతు వ్యక్తావ్యక్తాలాపన !
ప్రేలాపన !
కడుపు దహించుకుపోయే
పదుపుకత్తె రాక్షసరతిలో

అర్ధనిమీలిత నేత్రాల
భయంకర బాధల పాటల పల్లవి !
ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం !
ఉన్మాది మనస్సినీవాలిలో
ఘూకం కేకా, భేకం బాకా !
సమ్మెకట్టిన కూలీల,
సమ్మెకట్టిన కూలీల భార్యల, బిడ్డల
ఆకటి చీకటిచిచ్చుల
హాహాకారం ! ఆర్తారావం !
ఒక లక్ష నక్షత్రాల మాటలు,
ఒక కోటి జలపాతాల పాటలు,
శతకోటి సముద్రతరంగాల ప్రోతలు !
విన్నానమ్మా ! విన్నా, నెన్నో విన్నాను.
నా విన్నవి కన్నవి విన్నవించగా
మాటలకై వెదుకాడగబోతే-
అవి,
పుంఖాను పుంఖంగా
శ్మశానాలవంటి నిఘంటువులదాటి,
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి,
ఛందస్సుల సర్వపరిష్వంగం వదలి-
వడిగా, వడివడిగా
నెలువడినై, పరుగిడినై, నా యెద నదుగిడినై !
ఆ చెలరేగిన కలగాపులగపు
విలయావర్తపు

బలవత్ ఝరవత్ పరివర్తనలో,
నే నేయే వీథులలో
చంక్రమణం చేశానో,
నా సృష్టించిన గానంలో
ప్రక్షాళిత మామక పాపపరంపర
లానందవశంవదహృదయుని జేస్తే—
నీకై మేలుకొనిన
సకలేంద్రియములతో
ఏది రచిస్తున్నానో, చూస్తున్నానో,
ఊపిరి తీస్తున్నానో,
నిర్వికల్పసమాధిలో
నా ప్రాణం నిర్వాణం పొందిందో,
అటు నను మంత్రించిన,
సమ్మగ్ధంగావించిన ఆ గాంధర్వానికి,
తారానివహపు ప్రేమసమాగమంలో
జన్మించిన సంగీతానికి...
నా నాడుల తీగలపై సాగిన
నాదబ్రహ్మపు పరిచుంబనలో,
ప్రాణావసాన వేళాజనితం,
నానాగానాసూనస్వానావళితం,
బ్రదుకును ప్రచండభేరుండ గరు
త్వరిరంభంలో పట్టినగానం,
సుఖదుఃఖాదిక ద్వంద్వాతీతం,
అమోఘు, మగాధ, మంచిత్య. మమేయం,

ఏకాంతం, ఏకైకం,
ఋణికమై శాశ్వతమైన దివ్యానుభవం,
బ్రహ్మానుభవం కలిగించిన,
నను కరిగించిన కవనఘ్నీ !
రమణీ !
కవితా ! ఓ కవితా !

నా జనని గర్భంలో,
ఆకారం లేకుండా నిద్రిస్తూన్న
నా అహంకారానికి
ఆకలి కల్పించిన నాడో !
నా బహిరంతరింద్రియాలలో
ప్రాణం ప్రసరించగ, నేనీ భూలోకంలో పడి
సుఖదుఃఖా లేవేవో
వస్తూంటే తలదాలిచి
ప్రపంచ పరిణాహంలో
ప్రయాణికుడనై,
పరివ్రాజకుడనై,
విహ్వలంగా వర్తించేవేళ
అభయహస్తముద్రతో ననుపరిసిన,
నన్ను పునీతుని కావించిన కవితా !
లలిత లలిత కమనీయమహితా !
అనుపమితా !
అపరిమితా !

కవితా ! ఓ కవితా !

నేనో, నా ఊహాంచల
సాహసికాంసం కప్పిన నా
నిట్టూర్పులు వినిపిస్తాయా ?
నేనేదో విరచిస్తానని,
నా రచనలలో లోకం ప్రతిఫలించి,
నా తపస్సు ఫలించి,
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతి జనులు పాడుకొనే
మంత్రంగా ప్రమోగించాలని,
నా ఆకాశాలను
లోకానికి చేరువగా,
నా ఆదర్శాలను
సోదరులంతా పంచుకునే
వెలుగుల రవ్వల జడిగా,
అందీ అందకపోయే
నీ చేలాంచముల విసరుల
కొసగాలులతో నిర్మించిన
నా నుడి నీ గుడిగా,
నా గీతం నైవేద్యంగా, హృద్యంగా,
అర్పిస్తానో
నా విసరిన రస విస్ఫమర
కుసుమ పరాగం !

ఓహో ! ఓ రసధుని ! మణిఖని ! జనని ! ఓ కవితా !
కవితా ! కవితా ! ఓ కవితా !

— శ్రీ శ్రీ

మ హా ప్ర స్థా న ం

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది !
పదండి ముందుకు,
పదండి త్రోసుకు !
పోదాం, పోదాం, పైపైకి !

కదం త్రొక్కుతూ,
పదం పాడుతూ,
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం,
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం ?

దారిపొడుగునా గుండెనెత్తురులు
తర్పణచేస్తూ పదండి ముందుకు !
బాటలు నడచీ,
పేటలు గడచీ,

కోటలన్నిటిని దాటండి !
నదీ నదాలూ,
అడవులు, కొండలు,
ఎడారులా మన కడ్డంకి ?

పదండి ముందుకు !
పదండి త్రోసుకు !
పోదాం, పోదాం, పైపైకి !
ఎముకలు క్రుళ్ళిన,
వయస్సు మళ్ళిన
సోమరులారా ! చావండి !
నెత్తురుమండే,
శక్తులునిండే
సైనికులారా ! రారండి !
"హరోం ! హరోం హర !
హర ! హర ! హర ! హర !
హరోం హరా !" అని కదలండి !

మరో ప్రపంచం,
మహాప్రపంచం
ధర్త్రినిండా నిండింది !

పదండి ముందుకు !
పగండి త్రోసుకు !
ప్రభంజనంవలె హోరెత్తండీ !

భావవేగమున ప్రసరించండీ !
వర్షకాభముల ప్రళయఘోషవలె
పెళపెళ పెళపెళ విరుచుకు పడండి !

పదండి,
పదండి,
పదండి ముందుకు !
కనబడలేదా మరో ప్రపంచపు
కణకణ మండే ప్రేతాగ్ని ?

ఎగిరి, ఎగిరి, ఎగిరి పడుతున్నవి
ఎనభైలక్షుల మేరువులు !
తిరిగి, తిరిగి, తిరిగి సముద్రాల్
జలప్రళయ నాట్యం చేస్తున్నవి !
సలసల ప్రాగే చమురా ? కాదిది,
ఉష్ణార్ద్ర కాసారం !
శివసముద్రమూ,
నయాగరావలె
ఉరకండీ ! ఉరకండీ ముందుకు !
పదండిముందుకు !
పదండి ప్రతీకారానికి !
మరో ప్రపంచపు కంచు నగారా
విరామమెరుగక మ్రోగింది !

ప్రాచులవలెనూ,

రేచులవలెనూ,
ధనంజయునిలా సాగండి!
కనబడలేదా మరో ప్రపంచపు
అగ్నికిరీటపు ధగధగలు,
ఎర్రబావుటా నిగనిగలు,
హోమజ్వాలల భుగభుగలు?

— శ్రీ శ్రీ

నవమి చిలుక మున్నుడి!

నవమి చిలుక కులుకుతూ పలికింది! పలు
కులో నవ్య నవ్య కవిత్వం రాలింది! నవ్య
నవ్య కవిత్వం – ఇది నూతనములో బహు నూతన
కవిత్వం! అందుకనే ఇది పూర్వ కవిత్వం
గాదు ఇది నవ్య కవిత్వంగాదు ఇది భావ
కవిత్వం గాదు!

అడ్డము హిరణ్య కాశ్యపుడు! శంక హిరణ్య
కాశ్యపుడు! అధైర్యము హిరణ్యకాశ్యపుడు
అస్మితము హిరణ్య కాశ్యపుడు!

మూలము సములముగా ప్రతించి హృదయ
సభామంటప స్తంభము పగిల్చి మనస్సు
విజృంభించి నరసింహామూర్తిత్వము తాల్చును!

అప్పుడే ప్రాహ్లాద కవిత్వమాహ్లాదముగా
ఉద్భవిస్తుంది !

అందాము ప్రాహ్లాద కవిత్వమిది అని
అందాము అందుకొని ఆదరిద్దాము !
నవమి చిలుక పలికింది ప్రాహ్లాద కవిత్వము !
ప్రాహ్లాద కవిత్వంలో ప్రౌఢత్వమున్నది
పామరత్వమున్నది ! దేశివిదేశీక నేస్తమున్నది !

ప్రాహ్లాద కవిత్వం ఆరిపోయే దీపాన్నిరగు
ల్పుతుంది ! పరుగెత్తే పామరుణ్ణి నిలేస్తుంది !
తాను నిలుస్తుంది !

ప్రాహ్లాద కవిత్వములో సావిత్రీసత్యవంత
జీవితమున్నది !
ప్రాహ్లాద కవిత్వములోని గాయత్రి అందరికీ తల్లి !

ప్రాహ్లాద బ్రహ్మయే నవమి చిలుక ! నవమి
చిలుక పలుకులే ప్రాహ్లాద కవిత్వం! అమూల్య
మూల కవిత్వం !

జ్ఞాపకాలు

నాపేరు లీల !
ఆ ఊరిగోల పడలేక నేను పొరుగూరో

చ్చాను ! అందాలవాడే అడవిలో ముం
చాడు! అందరిని తలచుకొని అల్లాడు
చున్నాను.

ఏకాకినై నేను దూరాన ఉన్నాను. దారినే
పోయే అమ్మలక్కలుజేరి ముండ్ల చూపులు
చూచి అడుగుతూ పోతారు.
ఏకాకినై నేను నడిజాము వరకూ మేలుకొని
మృత్యువును బ్రతిమాలు కొన్నాను !

అమ్మమ్మ జ్ఞాపకం, అమ్మ జ్ఞాపకం, చెల్లెలు
జ్ఞాపకం, నాన్న జ్ఞాపకం, అన్నలే జ్ఞాపకం,
తమ్ములే జ్ఞాపకం, అందరిలో నువ్వే ఆఖరి
జ్ఞాపకం ! రావేల ! రావేల రాత్రి వచ్చింది !
మధురమూ మగవాడ నాప్రేమ నిజమోయి !

ప్రాభాతమావేళ జ్ఞాపకాలొచ్చాయి !
తలిచి తలిచీ నిన్ను జ్ఞాపకాలొచ్చాయి !
పవళింపుసమయాన జ్ఞాపకాలొచ్చాయి !
తలనొప్పి తీర్చుతూ తలగడగరావోయి !
చలికాల మొచ్చింది జ్ఞాపకాలొచ్చాయి !
చైత్రమాస మొచ్చింది జ్ఞాపకాలొచ్చాయి !
వర్షాకాల మొచ్చింది జ్ఞాపకాలొచ్చాయి !

పిలుపులకు పలకనందులకై ఈ ఘడియ

ఈక్షణము జ్ఞాపకాలొచ్చాయి ! రావేల
మగవాడ ! ఒడ్డు పొడుగూ వాడ !

ఏకాకినై నేను ఏదారి పోయినా పిలుపు
పిలుపుకు పలికే జ్ఞాపకాలొచ్చాయి ! ఏకా
కినై నే ఏమి పని జేసినా తలపు తలపుకు
ప్రతివ్వ జ్ఞాపకాలొచ్చాయి ! మరోపిల్లను
నీవు మరులు గొల్పావో, వేరో
పిల్లకు నీవు ఊరులు వేశావో, రావోయి
రావోయి త్వరత్వరగ రావోయి, నాకన్ను
చెదిరింది పురుషులను జూస్తూ !

బుల్ బులుల హాయికై కిలకిలల జోలకై
పరిత పించేమనస ! కన్నీళ్ళ హృదయమా !
బుల్ బుల్ములమన్నా కిలకిలలమన్నా
ముల్లెదు ముద్దుటుయ్యాలకే కద్దు !
బులుబులు బులాహాయీ యీ

హాయమ్మ నెవ్వరూ పురిగొల్పి నా వారు ?
పురిగొల్పినావాడు పురుషుడేకాడు ! మగ
పిల్ల వాడవో ఆడపిల్ల వో నీవు, మగవాడవై
నీవు మాయధారివవకుండ, ఆడపిల్లవై నీవు
ఆర్ధాన్నమవకుండ ఎన్నెమ్మయేవచ్చి
పురుషు పోసింది ! కొత్తెమ్మయేవచ్చి ఉగ్గు
కలిపింది ! పోతరాజేవచ్చి చేదవేశాడు !
కొత్తెమ్మయేవచ్చి చాటపరిచింది!

బులు బులు బులు బులా హాయీ ! యీ !
హాయమ్మ నెవ్వరో చంకెత్తి కెళ్ళారు ! నా
చన్నులో పాలు చేపుతున్నాయే ! ఉయ్యా
లలో పిల్ల ఉబుసులే లేవు ! నా చన్నులో
పాలు జున్నులెత్తాయే !

హాయమ్మ కెవ్వరూ హాయన్నవారూ !
నీలాల సంద్రములో నిప్పచ్చరమునేలపై
రాయినై యాహాల్యనై నాను శ్రీరామ
చంద్రమూర్తి ! రామ!రామ! నా పేరులీల !

— శిష్ట్లా

ఏమంది!

ఏమంది ?
కొమ్మలు తలలూపగ
కమ్మని కోకిల కూజితాలకు
వెన్నెల విహారములకు
కన్నెగాలి కౌగిళ్ళకు
ఆశించి ఆర్ద్రమైన్మ
ఆనందాశ్రులు నించే ఎడద
అరుణరాగ యాలాపన
కిదికాలం కాదంది !

ఏమంది ?
పాతాళమ్మున
పతితులు పలవించే
మాటల
జిలిబిలి తేటల
చీకటిగుండె క్రదిల్చే
జాలిపాట
పాడమంది
లోపలకే
చూడమంది !

ఏమంది ?
ముష్కరు లెవరో
తస్కరించిరి
ముండ్ల గులాబీ
పూలనన్నిటిని
మాయం చేసిన వారిని
గాయం చేసే
రక్త సిక్త గీతా
లేతామే
తోడమంది.
గాలి చెవుల
పోయమంది !

ఏమంది ?

విష భుజంగమట
జీవితము
జన్మ వాసనలే మరచి
నై జమ్మే విస్మరింప
నాగస్వర మూదమంది
త్యాగము చూపించమంది !
ఏమంది ?
శంఖగళమ్మున
దిగిపోయిన
తెగిపోయిన
మంగళసూత్రమ్మట తాను
దానిపై నిజాలువారు
కాటుక కన్నీటిని
నేనట
కలకాలం నిలిచిపోయి
విలయ వేళకూడ మరువ
గగనమ్మును భూమి
భూమిని గగనమ్ము
ఒకటే
గాఢ పరీరంభమ్మున
కలసిపోక పోరంది
కాలం
వియోగ కాలమ్మైనది
మనకొకనాడు

వెలవెల బోవక
పోదానాడు
ఘర్మబిందువులమై మనము
పెనచుకు పోదామంది
కలసి తిరుగుదామంది
తరచి చూచుకొమ్మంది !
ఏమంది ? ? ?

— నారాయణబాబు

కపాలమోక్షం

వేదసన్నిహితు ఆదిశంకరు
తపస్సమాధిని ఓంకారమ్మో
హుంకరించినది.

చలించినవి చీరాచరమ్ములు
భూతాలు క్రాకించినవి.
కాటుకపెట్టిన నయనేంద్రియమై
కర్మసాక్షియే చీకటులురిలాడు.

అభ్రగంగలో శుభ్రవీచికల
హలాహలమ్మో తలయెత్తింది.
శేషునిఫణాల మణులకాంతులు
వీసరవోయినవి.

పూదోటలు లేనేలేవు
వసంతములు రానేరావు
ముల్లోకంబుల తబిసి మిన్నులు
మురుస్మరించినారు
అనంతకోటి జీవరాసులు
హాహాకారం చేశాయి.
హరోంహరాయని పాహిపాహియని
ప్రణమిల్లాయి.

ఆర్ద్రమైనది ఆ మహామహుని
అంతఃకరణ.
అంతట అక్షులు విప్పి ఆకలిఆకలి అంటూ
భిక్షాపాత్రకు చేయి చాపినాడు.
ఉగ్రతపస్సున ప్రమగ్నినది
వేడికంటికి సూడిద పెట్టిన
బ్రహ్మకపాలం,
పటపట పళ్ళు కొరికినాడు
నటరాజు.

భూతపిశాచాల్ బొబ్బరిల్లినవి
వందిమాగధులు వణికారు
భయపడి బసవడు రంకె వేసినాడు.
భూలోకమ్మున తురకల గోరీలందు
క్రైస్తవుల సమాధులలోన హిందూ శ్మశానవాటుల
కపాలమ్ములువిక వికనవ్వినవి!

పునుకలు పులకరించినవి;
కంకాళమ్మలు ఘుల్లున్నమోగినవి;
శ్వేతపర్వతపు శిఖరాంచలముల
కనకభాండమే కదిలింది
స్వాహావల్లభు సువర్ణగర్భం
సళుపరించినది కళనళించినది.
గంగవట్టమే పాలపోటుతో
సింధుగర్భమున గంగకడుపులో
లవణసాగరపు లోతుల్లో
దాగినచైతాగ్ని
మానవరూపం దాల్చింది.
మన్నే వెలిగించింది, మిన్నే పొగచూరింది.
మంటల్లోనే పుట్టాడు మంటల్లోనే పెరిగాడు
మంటల్లోనే మడిశాడు
అగ్ని వీణయై భుగ్నకంఠయై
భగ్నగీతియై తారకమంత్రం
పరంజ్యోతిగా వీరశైవుడు

భారతవీరుని కపాలమొక్కటి
కపర్దిచేతికి రివ్వున వాలింది
కెవ్వున కేకేశాడు కంఠేకాలుసు!
ఫాలనేత్రమే స్పందించింది
అండపిండ బ్రహ్మాండమమ్మంతా

తాండవనృత్యం చేసింది.
ఆనందాశ్రుల నించింది.
శేషుని ఫణాల మెత్తనిశయ్య
పుడమి ఒత్తిగిలింది
ఎడారి పుష్పించింది

ఎందరు పుట్టలేదు ఇంకెందరు గిట్టలేదు
అందరికీ లభియిస్తుందా
హాలహాల మంటిన
హస్తస్పర్శ
పెదవుల చుంబనము.

కపాలమోక్షం!
కపాలమోక్షం!

— నారాయణబాబు

గీతం

తొలినాటి సంద్రాలు
తుహినగిరి శిఖరాలు
ఇంకి పోతున్నాయిలే!
క్రుంగి పోతున్నాయిలే!
తాతవేసిన పుంత
దైవమేలిన సంత

పల్లేరు ప్రాకిందిలే !
జిల్లేడు మొలిచిందిలే !
రాజు కట్టినకోట
రాణి మెట్టిన తోట
భూతాలు గెంతాయిలే !
బొమికలే నిండాయిలే !

నల్ల మందేగాని
గళ్ళిప్పనంటావు
రాతి గుళ్ళకెకాని
రాను పొమ్మంటావు
సుడిగాలి రేగిందిలే !
పిడుగు గర్జించిందిలే !

— పురిపండా

పులిపంజా

బుసజుమ్మాద బొల్లిగద్ద
బుసజుక్రింద కృకలాసం
డుల్లి పాము తలపాగా
ఊరినిండ పులిపంజా !
చీకటి చిందిన రక్తం
క్ష్వేడింగుల విష్కంభం
పాడలేని పాడుకోట
పణ్యాంగన పరిహాసం !

రణ రణ రణ
ఝణ ఝణ ఝణ
కనకదుర్గ కాలిఅందె
కపాల పాత్రికనిండా
అపార మీ పానీయం !
పగిలి పగిలి రగిలి రగిలి
ఇది విప్లవ సంకేతం
చిరవాంఛిత సంక్షోభం !
ఓహో సైనికులారా !
మీ హయహేషల చెదరిన
అరదమ్ములు నీరదాలు
గజ గజ గజ
గజ గజ గజ
వృద్ధ వసుంధర స్వాహా !
నాగేయం మీ కవచం
మీ ఖడ్గం నా గేయం
కుబుసం వదలిన సర్పం
నా గీతం పులిపంజా.

— పురిపండా

కిటికిలో దీపం !

జితేంద్రియుని బుద్ధిలాగు
జయగంట లాగు
కిటికిలో దీపం !

గోడివతల
గదిలోపల
పేరుకున్న కాంతి
గోడవతల చీకటి
హృదయంలో
ఒకటి రెండు
వెలుతురు గాయాలు

స్వర్గం నరకం
చావు బ్రతుకు
గొప్ప బీద
వ్యత్యాసం,
తెలిసితక్కువ
చదువెక్కువ
తారతమ్యం !
జీవహింస
చేయనని,
చూడనని
నా శపథం !

గోడమీద గదిలోపల
వెలుతురు కాసించి
చేరిన జీవుల
ఆకలితో

భక్షించే బల్లి !

... ...

పక్కలో పాలుతాగే
పసిపిల్లడు
ఉక్కిరి బిక్కిరి
యైనట్టు
గొప్పగాలి రేగింది.

గోడవతల
చీకటి నవ్వింది
కిటికిలో దీపం
కంపించే ఊపిరిలా
వెల్తి పీరిలా
ఊగి ఊగి సాగి సాగి
తెగిపోయిన
ఎట్టని రబ్బరు ముక్కే
తెగటారెను !

యిప్పుడో కిటికిలో
గోడివతల గోడవతల
ఒకటే చీకటి !
జీవరహస్యం ! ! !

— నారాయణబాబు

మహాలయ అమావాస్య!

ఇటు వెన్నెల అటు వెన్నెల
నడి శిరసుకు శ్రీ వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
చిరునవ్వుల కల వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
విరులల్లిన జడ వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
చెంగల్వల జిగి వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఈశ్వరునికి తల వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఆకాశము మొల వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
మనసుల్లో మరు వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఎటు చూచిన కను వెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
పిచ్చెత్తే వళ్ళంతా
వెర్రెత్తే దిక్కులకై

పరుగెత్తే నా మనసున
వెన్నెల్లో ప్రేయసి లేక
అమావాస్య! అమావాస్య! అమావాస్య!

మహాలయ అమావాస్య!

— శిష్టా

మైత్రణి

౧

అనాధబాలికల జీవాలు
అనాఘ్రాతకుసుమాలు రాలినరీతిగా నిరాధారాలెట్లో,
నిష్ప్రయోజక ప్రతిభావంతుల జీవితాలు ఆట్లే
నిహారాలుగా నా దేశజనులలో నిలిచిపోయినవి!
నాటి దేశజనులలో నిలిచిన నిష్టూరాలే,
నాజీవితాంతం వరకూ తరుముతున్న దయ్యాలు!
దీర్ఘాయు దీలుతో దీనవదనాలతో దూపిల్లుదయ్యాలు!
ఘో దోగాము దయ్యాల దీనాలాపాలు
పూదోట విహరించు
క్రూర సర్పాల బుసబుసలకుసుమ సువాసనలవలే
భయాన్ని భ్రాంతినీ పురిగొల్పుతున్నవి!
నిశీధ సౌందర్య మూర్తీ?
మైమరచి నీయధర చుంబనానందితుడనై నా
నిష్టూర సర్పాల నిశ్శ్వాస కుసుమవాసనలు

నన్నారాటపెట్టి కారాడి కారాడి
నా జీవాల రాపాడు చున్నవిగదే !

— శిష్లా

౨

ఓహో సౌందర్య సామ్రాజ్య నిశీథ మూర్తీ !
తరాలనుంచి వ్యాపించి వచ్చు విచార వ్యాధి గ్రస్తుడో
సామ్రాజ్యాధిపుని బోలుదును నేను;
తరాల విచారము నా హృదయాన ప్రవేశించి వ్యాపించి
సమాధిచేసె నాపుష్పాల శయ్యాను !
నిర్జీవ కార్యాలుగా నుండు మృతజీవి నా నే జేయునవి !
ఏమందువా ఓ నిశీథ సౌందర్య మూర్తీ !
నారక్తనాళములో పసరెక్కి పేరుకొన్నది విపరీత వైతరణి !

— శిష్లా

ప్రేమ

ప్రేమయనగా చూచుటగాదు, పలుకుటగాదు,
విహ్వల చిత్తముతో వాపోవుటగాదు !
ప్రేమయనగా మంత్రముగాదు, తంత్రముగాదు,
ఆత్మనిర్వాణముచే ఆరాధించుటయే !

అనగనంగా ప్రేమయనంగ అపూర్వగాధ !
పూర్వకర్మపరిపక్వ మహాగూఢ గాధ !
సీతయనగా చెంచీతయనగ
త్రేతాయుగపు పరాశక్తి ! ద్వాపరలక్ష్మి !
కలిలో నాలక్ష్మి !

జన్మతో జన్మించునోయీ జీవేచ్ఛలన్నీ
జన్మాంతము జీవించునోయి !

జనకుని గృహమున నున్న సీత, నా
కలలో, వెన్నెలజల్లారు భూమిపై నడువగా కాలి
గొలుసుల విలాస రాసకళ లీలలు
నన్ను నిలువున చెంగుటుయ్యాలల
ఊచి మేలొక్కల్పు !

ధరణిని వహించి మందగమనయా
జగశ్శక్తి, శ్రీశక్తి ! సీతను చూచి సహించలేను !
ఎంతభారమో కనుమూయక మోయి,
క్షేత్రవతి, సీత స్వేదవనము వైకుంఠము దహించు !

చెమట బిందువుల చెదిరించిరాల్చు
పయ్యట వీవగారాలు ముత్యాల తలంబ్రాలెన్నడో!
ఎన్నడో పడతి కోనీడ వెనుక
వెనుకగా, వెనుకగా, వెనుకగా వెన్నాడి
కవ్వించి నవ్వించి

సీతా ! మైథిలీ ! వై దేహీయని
పేర్లతో కూర్చి కాగిటజేర్చి వైకుంఠమును
భూమికి దెచ్చు చెప్పుడో !

చెమటలన్ చిమ్మచు ముత్యాలబిందు
వుల ఒడలు, భారమున క్రుంగిన
ఒడలు, నమువగా, నా
గుండె దడదడ యని జగద్భారమును
ధరించు ధరణిజయే తొట్రుపడిన జగతి యేమానంచు
మూడుకోట్ల కండ్లు గలవాడనై, ముజ్జగముల
వీక్షించుచూ
ఆర్తుతార్తి
హృదయుడనై
క్రుంగుచుంటి !

... ...

సర్వమానవ సమిష్టి బాధ్యతను
వెలలేని వెన్నెముకపై
మోయుచున్నది సీత ! — అమృతు
పడినపు డామేర ఆమేర
కూకటివేళ్ళతో పాతాళము కదిలినటుల
క్రుంగగా, క్రుంగగా, నా హృదయము
కూలుతూ కుప్పగ దొంత్రత దొంతరులగ కూలిపోయె!

— శిష్లా

యుగశక్తికి ఆహ్వానము

ఓ హో! సౌందర్యనిశీథ సామ్రాజ్యమూర్తి!
రక్తాక్షణప్రవాహ సమరకల్లోలములో ప్రజల
ప్రహ్లుల్ల సౌందర్యజీవితానందముగులం జేయుదువు!
అనంతముఖములుగల అందాల అనలమా!
నీ సయ్యాటపాటల యూరాటములతో కుందకిట
కుండలంబులకాంతి బ్రహ్మాండమునకు తేజశ్శక్తియూను!
జీరాడు ఓణీల నొయ్యారముగ నెత్తి వింజామరల్
వీవగానీవు; ఆశక్తి సర్వవ్యాపకత్వము జెందును.
కల్లోలమేఘూగ్నివై నడియెండలో మెరుపుతీగలపై
వసంతములాడు వివస్త్రమూర్తీ! నీశరీరముపైన
బంగారునూగారు విద్యున్మాలలయై వరిలుచున్నది!
అనలముల దళములతో వెలుగొందు నాభీలపద్మమై
నీముఖము నిత్యయూవనమై ప్రణయాగ్ని పవనమై
నాహృదయ అంబుధీ దావాగ్ని ధవళకోతున్నది!
ఒహో తేజమూ బీజమూఅభీల బీజమా! స్ఫూర్జితాక్రాంతమా!
నీజ్వాలలో సకలవర్ణములునూ నిలయమైయుండును.
పలకలతో వికసించు వజ్రముల ధవళతలు, అలలుపై జిమ్మ
సమ్మోదభరితలై విరుచుకుని వెదజల్లు అంబుధులమాణిక్య
హారాలవర్ణములు, అనంతచైత్రముల నిబిడమూ
కెంజాయ చిగురాకు పూతలో రకరకపు రీతులు,
ఉయ్యాలలూగు నీలధవళిమల మిళితమగు మంచు బిందువుల
జిలుగైన రంగులు, నీప్రేమజ్వాలలో నిబిడమై నీయకావుల దేలు!

ఓహోసౌందర్య సామ్రాజ్య మూర్తీ! విరాడ్విశ్వేశ్వ
రార్ధాంగపత్నీ! నక్షత్ర
స్ఫటికముల నవననలాడే వెలుగువై, తళుకువై, నిబిడాంధ
కారాంధ్ర దేశాకాశాన, వజ్రాయుధమువలె
ఏనాడు గన్పడెదవో దెల్పుము: త్రిపురాంతకుడనై
లేచెదను, ప్రళయకాలాభీల గరపరన్యములతో,
నిశీధ నిబిండాంధ కారాంతరాళాగ్నినగునేను..... !
ఉదయోదయాలనడుమ, ప్రాక్పశ్చిమ ప్రాకారములమధ్య,
జీవితానంతరపు నిశ్శబ్దరూపముగ, మొలకెత్తుమున్నె
చీకటిలో నిరీక్షించు చుండేటి విత్తనపు రూపుగా .
నీయాలయము నిర్మింపబడినది. ఉత్పత్తి లయములలో
జీవితపు హాహాకారాలు, సంతోషధ్వానాలు, నీయందు
నీవుచ్చరించే హ్రాం, హ్రీం, హ్రూం! హ్రాః! అనే
యుచ్చైస్వరాలు!
ఆద్యంతములు మిళితమై నగయు నిశ్శబ్దకాలచక్రం
బంగారు వడ్డాణరూపమై నీనాభికలంకారం.
నీ నరనలనాలించి జీవితము వికసించు–మృత్యువేధాన్వించు
ఆకుపై ఆకుతో వేరుపై వేరుతో పూవుపై పూవుతో
సంధిసంధులమధ్య వాసిల్లు రహస్యాల గర్భననేదాచి,
ఏమృత్యువునుండి జనించి యేమృత్యువుకై తాను
పెరుగునో యాజీవితానందపుకళలను వెన్నాడుచూ,
అంధకారాంతరాళాలనుండి, వర్ణాల విత్తనాల్వికసించు!

– శిష్లా

దేశ చరిత్రలు

ఏదేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.

నరజాతి చరిత్ర సమస్తం పరస్పరాహారణోద్యోగం :
నరజాతి చరిత్ర సమస్తం రణరక్త ప్రవాహ సిక్తం.

బీభత్సరస ప్రధానం, పిశాచగణ సమవాకారం!
నరజాతి చరిత్ర సమస్తం దరిద్రులను కాల్చుకుతినడం.

బలవంతులు దుర్బల జాతిని బానిసలను కావించారు :
నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి.

రణరంగం కాని చోటు భూస్థలమంతా వెదకిన దొరకదు :
గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళులతో.

చల్లారిన సంసారాలూ, మరణించిన జన సందోహం,
అసహాయుల హాహాకారం చరిత్రలో మూలుగుతున్నవి.

వైషమ్యం, స్వార్థపరత్వం, కౌటిల్యం, ఈర్ష్యలు, స్పర్ధలు,
మాయలతో మారు పేర్లతో చరిత్రగతి నిరూపించినవి.

జెంఘిజ్ ఖాన్, తామర్లేనూ, నాదిర్షా, ఘజ్నీ, ఘోరీ,
సికందరో ఎవడైతేనేం? ఒకొక్కడూ మహాహంతకుడు.

వైకింగులు, శ్వేతహూణులూ, సిథియన్లూ, పారశీకులూ,
పిండారులు, థగ్గులు కట్టిరి కాలానికి కత్తుల వంతెన.

అజ్ఞానపు టంధయుగంలో, ఆకలిలో, ఆవేశంలో-
తెలియని ఏ తీవ్రవశక్తులో నడిపిస్తే నడిచి మనుష్యులు-
అంతా తమ ప్రయోజకత్వం, తామే భువి కధినాథులమని,
స్థాపించిన సామ్రాజ్యాలూ, నిర్మించిన కృత్రిమ చట్టాల్-
ఇతరేతర శక్తులులేస్తే పడిపోయెను వేకమేడలై!
పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను.

చిరకాలం జరిగిన మోసం, బలవంతుల దౌర్జన్యాలూ,
ధనవంతుల పన్నాగాలూ ఇంకానా! ఇకపై చెల్లవు.
ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ, ఒక కాతిని వేరొక జాతీ,
పీడించే సాంఘిక ధర్మం ఇంకానా? ఇకపై సాగదు.

చీనాలో రిక్షావాలా, చెక్ దేశపు గనిపనిమనిషీ,
ఐర్లాండున ఓడకళాసీ, అణగారిన ఆర్తులందర్నూ-
హాటెన్‌టాట్, జూలూ, నీగ్రో, ఖండాంతర నానా జాతులు
చారిత్రిక యథార్థత్వం చాటిస్తా రొక గొంతుకతో.

ఏయుద్ధం ఎందుకు జరిగెనో? ఏరాజ్యం ఎన్నాళ్ళుందో?
తారీఖులు, దస్తావేజులు ఇవి కావోయ్ చరిత్ర కర్థం.

ఈ రాణీ ప్రేమపురాణం, ఆ ముట్టడికైన ఖర్చులూ,
మతలబులూ, కైఫీయతులూ ఇవి కావోయ్ చరిత్రసారం.

ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు ! దాచేస్తే దాగని సత్యం.

నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది ?
తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు ?
సామ్రాజ్యపు దండయాత్రలలో సామాన్యుల సాహసమెట్టిది ?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీలెవ్వరు?

తక్షశిలా, పాటలీపుత్రం,
మధ్యధరా సముద్రతీరం,
హరప్పా, మొహంజొదారో,
క్రో-మాన్యాన్ గుహాముఖాల్లో-
చారిత్రిక విభాతసంధ్యల మానవకథ వికాసమెట్టిది ?
ఏ దేశం ఏ కాలంలో సాధించిన దే పరమార్థం ?

ఏ శిల్పం ? ఏ సాహిత్యం ? ఏ శాస్త్రం ? ఏ గాంధర్వం ?
ఏ వెల్లుల కో ప్రస్థానం ? ఏ స్వప్నం ? ఏ దిగ్విజయం ?

— శ్రీ శ్రీ

దర్శనపరీక్ష

రుద్రనేత్రం తెరచిచూస్తే—
మృత్యుగానపుటలలూకాలు,
రక్తపానపుజలలూకాలు,
మర్మఘాతుకశిలలూకాలు,

గుండెకేకులు చీల్చివేస్తూ,
జీవసారం పీల్చివేస్తూ,
స్వప్నసౌధం కూల్చివేస్తూ
హృదయమును రణభూమి చేస్తాయి.

ధ్యాననేత్రం తెరచిచూస్తే—
ప్రేమకెత్తిన ధూపధూమం,
చిత్తరసబుషియజ్ఞహోమం,
సుప్తధాత్రీ స్వప్నధామం,

సకలభువనా లుద్గమిస్తూ
సోమకలశా లుద్భవిస్తూ
ఆత్మనయనా లుజ్వలిస్తూ
హృదయకర్ణికలో నటిస్తాయి.

— సంపత్

అస్తమయము

మునిమాపులో రక్తసిక్తాంశుకము లొరసె
చెలిచూపులో వ్యక్తమగు జేగురులు విరిసె
జరఠసంధ్యారోచి జాలకమ్ముల వంగె
పరితాప శిఖిలేచి పథిక హృదయముక్రుంగె.
పరివిచ్చి చీకటులు పుడమిపై దిగజారె.
మలుపచ్చి వేదనలు హృదయ రక్తము గోరె.

— సంపత్

చీకటి

చీకటి ఒక మహోద్యమంలా పాకింది !
పగలుపోని రేయిరాని సంధ్యాసందిగ్ధం మీద
అనంత కోటి ప్రాణుల పరిసర స్పర్శతగిలి
కుంచితమయి పోయిన అంతరాంతరం
రూపపరిమితి నశించిన అఖండ స్థలావకాశంలో
స్వేచ్ఛగా అణువణువూ విడి వ్యాపించింది
అనేక నక్షత్రాలయి.

కాలం కరిగి కరిగి
బిందువై అణువైనది
కణమై తరిగి తరిగి
నా చూపుల తళుకైనది.

వస్తు స్వరూపాలను బంధించా
రేఖలు ఆ చీకటిలో అస్పష్టమయి
మాయమయి, బహిరంతరాలను సంధించు
కేంద్రాన్ని దృష్టిలో నిల్పినాయి.
తరువు తరువులోని జీవనాళం
కలిసిన పుడమిలోని ప్రవాళం
ఆ గుప్త బిందువే—
జీవి జీవి జ్ఞప్తికీ వెనకవున్న భావం
రూపొందిన ఏకై కారాపం
ఆసుప్త బంధమే

ప్రాయని పద్యంమయింది
నాజాగృతిలో,
నేనప్పుడు విశ్వమంతా నేనయి
ఊహగా ఊపిరిగా వ్యాపించాను,
సర్వేంద్రియజ్ఞానాలూ నాలోఇమిడాయి
స్ఫటిక స్వచ్ఛమయిన ఒక కణంలో
నేనప్పుడు గోళగోళాల పరిభ్రమణం
నిర్దేశించిన ఏకైక ధర్మాన్ని
జనన మరణాల కొగిలింతని.

ఆ కణంలో సృష్టిలోని అనంతకోటి అవకాశాలూ
ప్రతి వస్తుతత్వంలోని వేరువేరు సత్యాల సమత్వం
ప్రతిగుండె కదలికనూ అనుసంధించు ఏకైక స్పందన
ఒకే ఒక సత్యంగా ప్రతి ఫలించాయి.

నేనప్పుడు నేనుగాను
నేనప్పుడు కరిగి మిగిలిన కణమే
ఇంత చీకటినీ ఆపరించింది
ఆకణమంత చిన్నది—అంత పెద్దది.

తారతారకూ వేరువేరుగా
నిర్ధరించిన యాత్రకు సూత్రం
ఆకాశమంతా ఆవరించి
నాలో ఇముడ్చు కున్నాను.

నాళ నాళాన్నీ తాకే సజీవమయిన చీకటి
నిశ్చలమయిన జ్ఞానసమాధి నాకు
ఇంక పగలులేని రేయిలేని
కాలవిహీనతలో నిలిచి పరిశీలిస్తాను జగాన్ని నేను.

రూపరేఖల బయటి మిలమిలలకు
నా చూపు ఏమరదు
ప్రతిప్రాణి ఆకృతిలోపలి
స్ఫటికీకృత ధర్మప్రతిబింబం
స్వచ్ఛంగా చూడగలుగుతాను నేను.

భౌతికనేత్రాల ప్రయోజనం హద్దుపరిచే చీకటి
రూపవిశిష్టత మోటుగా జ పిమ్మాద
విసిరే వెలుగును కప్పేచీకటి
లోపల స్ఫటిక స్వచ్ఛమయిన జీవకణాన్ని
ఏకాగ్రంగా వెలిగించే చీకటి
నాలో నాశమయి స్వభావమయి
నేనయి పోనీ
అదే నా సాధనకు పర్యవసానం
అదే నావేదనకు అమరగానం !

చీకటీ ! చీకటీ ! నీవు శూన్యమవుకావు
భౌతిక దృష్టికందని సూక్ష్మసూక్ష్మ
కాంతి కిరణాల సంచలనం నీవు,
కేవల నైశిత్యమే నీ అదృశ్యతకు అర్థం

వస్తువుల అంతరంగ వస్తుత్వాన్ని
బహిరంగ పరిచే సూక్ష్మ విద్యుత్తువలె
నీ దృష్టి నైశిత్యం విశ్వగర్భంలోని
మూల ప్రయోజనంమీద వెలుగుతుంది.

చీకటీ ! చీకటీ! అనంత వైశాల్యాన్ని
నీలో ఇముడ్చుకుని నాకంటి పాపవయిపో
కోటికోట్ల జీవుల ఆత్మలు
కేంద్రీకృతకాంతి బిందువులయి
ఇన్ని తారలయి నీలో ప్రతిఫలించాయి.

చీకటీ ! చీకటీ ! నీ చూపులో
రూపాలపై హద్దులు
కరిగి కరిగి ఆవిరిఅయి
లోని నిజాలు అనాచ్ఛాదంగా వేరుపడి పోతాయి

చీకటీ ! చీకటీ ! నీ వ్యాప్తి సర్వసృష్టినీ
ఒక్క కౌగిలింతలో బంధిస్తుంది.

భువనాలు పుట్టని తొలినాడుకల
సారాంశం నీవేనా ?
పరిమిత శక్తుల నలవరుచుకున్న
కాంతి తత్త్వాల సమ్యక్ స్వరూపం నీవేనా ?
పగటి వెలుగుల పరిమిత శక్తిలో
నీ సూక్ష్మత మాటు పడిపోతుంది

నీకలిమికి పగలులేదు, రేయిలేదు,
నిన్నలేదు రేపులేదు
నిత్యమూ వస్తువుల లోపలికంటా
అఖండంగా వ్యాపించి ఉంటావునీవు
చీకటీ ! చీకటీ ! నీ నిత్యాప్రత్యక్షమే
మనిషికి జ్ఞానం, బలం, సమత.
అపుడు మనిషి యోగి——పరమాత్మ.

— పా. ప.

పురిటిపాట

తడపలా ఆమె కడుపింతుండేమె అని అనుకోనిదాడు లేదు.
గుండెలుమట్టుకు చేత్తో పట్టుకు ఎవరికివారే నాడు
లోపలి బెదురు దాచుకున్నారు ఆరాత్రొక వల్లకాడు.

చీకటి చలిగా జీబురులాగ మెల్లిమెల్లిగా పాకింది
చుక్కలు రాలే చప్పుడుమల్లే నిశ్శబ్దం కారుతోంది.
గడియారంలో చక్రం పంట్లో కాలం చిక్కుపడింది.

గదిలో మూలుగు కదిలింది జీలుగు బూరాలా బరువుగ
ఎక్కడో అడుగుని లోకంలో ధ్వనిలా పొంగిందొక వగ.
అమ్మ కూర్చుంది "అమ్మా" యంది
"అమ్మా ! ఇపుడు ఎల్లాగ ?"
"కొంచెం ఓపిక తల్లీ ! ఇంక" అంటో నిమిరిందమ్మా

విఫలాసాగిన రథమొక లోతున కదిలినట్లుగా రిమ్మ.
పొంగేనూనెని మింగేవేని కునికే దీపపు శెమ్మా.
గోడల పాకిన నీడల చాటున ఆడిం దేదో బొమ్మ!
మంచం పక్కని ఆ మంత్రసాని గుర్రట్టిన పెద్దమ్మ.
అమ్మ కూర్చుంది అమ్మా యంది, "ఎల్లాగే మరి అమ్మా!"
"ఓపికతల్లీ! కదలకు మళ్ళీ తెల్లవారి పోతుందింక"
తూరుపుదాకా పాకిందపుడే వాలిన చంద్రుడి జింక.
ఎర్రని వేకువ చుక్కకి మెలకువ వచ్చింది రాక రాక.

కీచురాళ్ళింకా చీకటి పంకా కిర్రుని లాగుతున్నాయి.
"అమ్మా! ఏదే తెల్లవారిందే? గుళ్ళోనా ఆ సన్నాయి?"
అమ్మపడందీ "సన్నాయేదీ? ఎందుకు ఆబెదు రమ్మాయి?"
చీకటిలోపల ఏవో జీవుల మాటలు రాని జవాబు
మ్రింగిన గాలిని కక్కడం రాని పాములా రాత్రి తబ్బిబ్బు
ఆకాశంలో నిండు బుడగలా తాకితే పగిలే ఉబ్బు.
తూరుపు చీల్చుకు వచ్చేటందుకు కాలం ఎర్రగా కందింది.
ఊపిరి సలపని లోపలి లోతుని రేగిందేదో రంధి.
చెవిలో యేరులు పారే హోరులో అమ్మాయి, "అమ్మో" అంది

గింగురు మంటో గాలికికంటో ఏదో కప్పిన పిచ్చి
ఇంకా బారెడు అడుగుని సూర్యుడు చిందిన నెత్తురు పచ్చి
తూర్పుని నిగనిగ మెరసిందొకటిగ అమ్మాయంది "లచ్చీ!"
నిద్ర మేలుకుని ఆ మంత్రసాని కళ్ళు నులుపుకు పలికింది.
రగిలిన కుంపటి నిప్పులతంపటి వాసన గదిలో పాకింది
ఎరగని వేదన అల్లాడిన అమ్మాయి "అమ్మో" అంది.

ఎర్రని ముద్దలా తూరుపు గద్దెలో సూర్యుడు ఇవతల పడలేదు
ఊపిరి ఆపుకు మెదలని తోపుకు అవతల తీరని గోడు.
కీలుకీలునా లాగేవేదన అంది "ఎల్లాగిపుడు ?"

చటుకుని తోసుకు తూరుపు కొసకు
పండులా లేచాడు సూర్యుడు
తలుపు తెరుచుకుని పురిటి కబురిని అమ్మగారూదిందపుడు
పొరుగమ్మంది, "ఎట్లాకంది !" అడుగున్నరునాడు పిల్లాడు !
"అమ్మది చూపూ, నాన్నది రూపూ బతికి బాగుండాలి కాని
నాతల్లి తాపం తొలిచూలు పాపం కష్టం పడితే పోనీ
రాజానికంది నాతల్లికంది" నవ్వుతో ఆ మంత్రసాని.

అమ్మాయి మాత్రం శాంతిగా నేత్రం మూసుకు పడుకుంది.
అలిసిన నరాల మసకల్లోపల చైతన్యం ఒక బండీ
వెలిసిన తుపాను వెనక ధీమాను గుండెల్లోపల నిలిపింది.

మెల్లగా విచ్చినకంటో పచ్చని నవ్వులు కొద్దిగా మెరిశాయి
కదల్లేని శాంతిలో పదిలంగా ఒక చూపటు చూసిందమ్మాయి"
కష్టపుపర్వం గడిచిన గర్వం అడిగింది "ఏడే అబ్బాయి?

ఎర్రటి ముద్దని పక్కకి యిమ్మని అమ్మాయి చేతులు జాపింది.
అబ్బాయి మూసినకన్నులు చూసిన ఆనందంలో అడిగింది.
"ఏమే అమ్మా! వారికి రమ్మని రాసిన ఉత్తరమందిందా ?"

పలకా పుల్లలు పట్టుకు పిల్లలు బర్లోకేమో పోయాకు
నాన్నాఫీసు-అమ్మకి నిద్ర ఇంటో ఎవరూ లేరు.

టకటక గాలిలా-ఆమర్దాలా రైలుదిగి వచ్చారువారు.

మంచం పక్కని వంగిన వారిని అమ్మాయేమో చూసింది.
"వచ్చారా?...ఫొద్దున్న...చూడండి...నాన్న!"
అంటో చేతిని ఇచ్చింది.
భయంతో వారు ముడుచుకున్నారు అమ్మాయి మెల్లగా నవ్వింది.
"ఎందుకో నాకు ఎంతో చికాకు చంటిపిల్లల వాసన
ఎరటిముద్దా-ఇంతటిముద్దూ అబ్బ" అన్నారాయన.
గుండెకు హత్తుకు ఆమె వింతగా అంది "మనబ్బాయ"ని.

- పా. ప.

మైత్రవగీతి

పాపం, పుణ్యం, ప్రపంచమార్గం-
కష్టం, సౌఖ్యం, నైషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా!
అయిదారేపుల పాపల్లారా!

మెరుపు మెరిస్తే, వాన కురిస్తే,
ఆకసమున హరివిల్లు విరిస్తే
అవి మీకే అని ఆనందించే
కూనల్లారా!

అచ్చటి కిచ్చటి కనుకోకుండా.
ఎచ్చటెచటికో ఎగురుతుపోయే

ఈలలు వేస్తూ ఎగురుతుపోయే
పిట్టలారా ! పిల్లలారా !

గరికపచ్చ మైదానాల్లోనూ,
తామరపూవుల కోనేరులలో,
పంటచేలలో, బొమ్మరిళ్ళలో,
తండ్రిసందిటా, తల్లికౌగిటా,
దేహధూళితో, కచభారంతో,
నోళ్ళుల్రావేళులు, పాలబుగ్గలూ,
ఎక్కడ చూస్తే అక్కడ మీరై
విశ్వరూపమున విహరిస్తుండే
పరమాత్ములు ఓ చిరుతలారా !
మీదే, మీదే సమస్తవిశ్వం !
మీరే లోకపు భాగ్యవిధాతలు !
మీ హాసంలో మెరుగులుతీరును
వచ్చేనాళ్ళ విభాప్రభాతములు !
ఋతువుల రాణీ వసంతకాలం
మంతకవాటం తెరుచుకునీ,
కంచువృషభముల అగ్నిశ్వాసం
క్రక్కే గ్రీష్మం కదలాడీ,
పళ్ళు, బయళ్ళూ, ఊళ్ళూ, బీళ్ళూ
ఏకంచేసే వర్షాకాలం
స్వచ్ఛకౌముదుల శరన్నిశీథినులు
హిమానీ నిబిడ హేమంతములు,

చలివడకించే శైశిరకాలం
వస్తూ పోతూ దాగుమమూతల
క్రీడలామతవి మీ నిమిత్తమే!
ఇవాళలాగే ఎప్పటిమకూడా

ఇనబింబం పయనించు నింగిపై!
ఎప్పటిమకూడ ఇవాళలాగే
గాలులు వీచును, పూవులు పూచును!
నాకు కనంబమ నానాతారక,
లనేకవర్ణా, లనంతకోచులు,
దిక్కు-దిక్కులా దివ్యగీతములు
మీరూ వీటికి వారసులే! ఇవి
మీలోకూడా మిలమిలలామను!

నా గతశైశవ రాగమాలికల ప్రతిధ్వనులకై,
పోయిన బాల్యపు చెరిగిన పదముల చిహ్నాలకోసం,
ఒంటరిగా కూర్చుండి ఊరుపులు
కదలే గాలికి కబళమునిస్తూ!
ప్రమాదవీణలు కమాచిపాడగ
సెలయేళ్ళను, లేళ్లను లాలిస్తూ
పాతాళానికి పల్లికొట్టి
నై తరణీనది లోతులుచూస్తూ,
శాంతములే, కేకాంతముగా, ది
గ్భ్రాంతిలో మునిగి గుటకలువేస్తూ,
మెటిక విరుస్తూ ఇట కూర్చుండిన

ననుచూస్తూంటే నవ్వొస్తోందా ?
ఊపుతల్లారా ! బుడుతల్లారా !
ఇది నా గీతం, వింటారా ?

— శ్రీ శ్రీ

గడ్డిపరక

నడవండి ! నడవండి ! నామీంచి నడవండి
గడ్డిపరకను గడ్డిపరకను
పూజాసమయాల పూవును
దూర్వాంకురాన్ని అవసరం తీరాక
అవతల కనబడితే చుల్కనగ చూచేటి
గడ్డిపరకను ! గడ్డిపరకను !
నడవండి ! నడవండి ! నామీంచి నడవండి !

పల్లకీ దిగినట్టి పెళ్ళి కొడుకులుమీరు
పట్టు తివాసీని నేను
నడవండి ! నడవండి ! నామీంచి నడవండి !

పశువుల నోటికి పాయశాన్ని
మీసుకుమార పాదాల మకరికను
నడవండి ! నడవండి !

మీ పైడిపాదాల మృదురజోపేశాలె
నాహృత్ కుశేశయములో ఉల్కలాపాతాలు
నడవండి ! నడవండి ! నామీంచి నడవండి !

మాతృవర్గంవాడు, మాఅన్న పన్నగమ్ముల రసన
లు త్తరించినమిన్న నేటికి మీ పితృకార్యంనా
పారణమీద మీ చేతిమీద
మరకత యంగుళీకమ్ము !
గ్రతులు కల్పించేటి గడ్డి పరకలము !
నడవండి ! నడవండి ! నామీంచి నడవండి
గడ్డిపరకను ! గడ్డి పరకను !

మిన్నువిప్పిన రక్తపతాకం !
మన్ను సత్తువె తెలిపింది !
ప్రాభాత పశ్చిమానిలము పాడినపాట
కాకాసురుని కధ జ్ఞాపకం తెచ్చింది
నన్ను నే తెలుసుకున్నాను
ఆగండి ! ఆగండి !

— నారాయణబాబు

ఆ సుపత్రిలో కోకిల

నల్లనల్లని తారుచీకటి
తెల్లదూదిగ విచ్చుతూంచే,
నిద్రపోయిన ఊరుకాస్తా
కదులుతూ ఆవులిస్తూంచే,
దేవతల సిగపూల వాసన
తెల్లారగట్టూచ్చేటి గాలై

శ్రవణమును మనసులో రణమును
లాలనతో మాన్చేటి వేళల
కొమ్మలోంచీ రెమ్మలోంచీ
కుహూ కుహూ, కుకూ కూకూ
కూకు కూకూ కూహూ కూహూ
ఆపరేషన్ రోగి ఊర్పుల
బాధలా Stove మండుతూంటే,
రోగి Chart నవోలె నింగిని
జ్వరపు చుక్కలు తేలివాలగ,
నిస్సరాతిరి భూమి చూచిన
చిన్నికందులు,
పాలచేపుకు కన్నతల్లుల
రొమ్ము పక్కల వెతుకుతూంటే,
ఆముదంకై ఉంగా, ఉంగా, ఉంగాఉంగా
ఉంగా ఉంగా ఉంగా
నల్లమందును తాగినరములు, పుళ్ళుమానే పాతరోగులు
మృతులవలె నిద్దర్లోవుంటే—
రోగిబంధులు రాత్రివెళిపాయి
వేకువనె Coffee ని తెస్తే
రోగికళ్ళను తేలవేస్తే—
Brandy Oxygen అన్నీ ఐపోయి
Ice Room కు చేర్చు వేళల
సుఖం దుఃఖం తెలుసుకోకే
వాగులా, నదిలాగ, కడలిగ

కెమ్మలోంచీ కొమ్మలోంచీ
కోకిలొకటి కూతకూస్తోంది.
కూయబోకే, కోయబోకే, కొకైనింజక్షన్ కోయబోకే
Theatre లో ఖడ్గనీలిమమా!

— జలసూత్రం

బీదమందు

తూర్పు తెల్లారింది, వాన వెలిసింది! అమ్మ
పోయే మండెట్టుకురాయే!
కాండ్లబ్బినా లేదు, కాస్తైనాలేదు! కాత్తె
కూత్తెకే తే డాక్టేరురాడే!
సందేళ సలిజరం ఊర్కెపోదే! సందొచ్చిన
పిల్లోడు ఉలుకుతుండాడే!
ఏయ్‌కో తింటుంది గజ్జెట్టిన కుక్క! నేపాళం
మాత్రెయ్యే, లేత్తాడు పిల్లోడు!
పాతాళం బలిసెక్రవర్తి! సంకురాంతి పం
డకుక్క నేపాళం సెట్టెక్కిరా? జబ్బులన్నీ పోతాయి!

— శిష్లా

మృణాళిని

అప్పుడు:
మృణాళినీ! నీ చూడ్కులు చంద్రకి
రణాలనీ, నీతోనుండు గంటలు

క్షణాలనీ, నీ నవ్వులు తాపహా
రణాలనీ, నీ ప్రేమమయాంతర
వనాలనీడన్, కౌగిలి యందున
మనాలనీ, నాకోరిక నీ చెవి
ననాలనీ, ఊన్నాడను నే బహు
దినాలనుండి కూడ,
మృణాళిని !

ఇపుడు :
మృణాళినీ ! నా చిత్తము పావక
కణాలనే విరజిమ్ము, శోకభ
రణాలు నిద్రానిద్రలు, కోకిల
గణాల నిక్వాణాలు కఠోరము,
మనాల నేనుం గోరను మన్మథ
గుణాళినీ ఝుంకారము నింకను
వినాలనీ, కానీ విరహోక్షువు
తినాలనీ ఊన్నాను మృణాళినీ !

... ...

విధాత తప్పు గానుగలం
మనమే మనకు పీనుగలం
విషాద రసము నీడ్వగలం
కానీ-ఇంకేం చేయగలం
శక్తి లేని మనం;
మనం ఎలుకలము, కా దేనుగులం

విధాత తిప్పి గానుగలం
మనమే మనకు పీనుగులం

ప్రాణం బంతా హాస్యముగా
మరణము కోసేసస్యముగా
ప్రియల్ లేనీ గద్యముగా
సముద్రము పై సేద్యముగా
జ్ఞానం మనకు పూజ్యముగా
స్నూతం బర్థము, గాదుగా
ఇదియంతా రహస్యముగా
ప్రాణం బంతా హాస్యముగా
మరణము కోసే సస్యముగా

... ...

బతుకంతా నాటకమూ బూటకమూ
కాటకమున కీటకమూ
బతుకంతా నాటకమూ,
మన మంతామానిసులం బానిసలం
బానిసలకు బానిసలం
మనమంతా మానిసులం;
మన పుట్టుక పోరపాటూ నగుబాటూ
విధి బాటలు తెరజాట్టూ
మనపుట్టుక పోరపాటు;
మన కోరిక క్షీమగదా చీడగదా
నీడలన్తో మేడగదా
మన కోరిక కీమకదా;

ఇవి యస్నీ నా కేలా ? ప్రియురాలా !
ఈకేలాభర ఇవియస్నీ నా కేలా ?
జవరాలా !
కనుమూసీ, ననుదీసీ
నా వాసన నలిపేసీ
జవరాలా, కనుమూసి-అది చాలును
నాకు సుఖం, నాకసుఖం
అమితసుఖం, సుఖం సుఖం
అది చాలును నాకు సుఖం.

— పఠాభి

వైనశంఖం

[నారాయణబాబూ, నీమౌనశంఖం విని
(శ్రీశ్రీ చదవగా)

నీ పాదాభి వందనంచేసి,
నీగుండెల్లో నా తలదాచి,
నీమాటల్లో నావ్యథడించి,
నా ఆత్మ పక్కన నీ ఆత్మకలపి,
నీనా పతంగి తాళ్ళు తెంపి
రూపాయిలు మీదచల్లి
పోదామను కున్నానను
వేళకు లేకపోయావు.
ముంగం బాకంలో ఆమె పక్కలోనో

అవన ఆర్భాటం ఎదురు గుండానో,
పందికొక్కు డొక్క-లోనో
నీ అంతరాత్మ ఆలకించే ఉంటుంది.

— రుక్మిణీనాథ]

కాడ్ లీవరాయిల్లో "డీ" విటమినుంటుంది.
కోడిగుడ్లు ధాతుపుష్టి
కాకాతువ్వ తెలుపు; కోయిల నలుపు.
ఆకాశం పొడవు: భూమి వెడల్పు.
ఆకాశం ప్రవాళాధరం
అందుకొస్తే కదా?

నేపంపుకొంటె
శరీరమంతా మెలికలు మెలికలై
"ఎవరు నీవు?" అని అడుగుతుంది!

భూమంతా
మరకత పసిరికయ్యె నాకాలు గోకి
"నీవెవరు?" అని అడుగుతుంది!

గాలిభుజంతట్టి నీవెవరంటుంది!
పొద్దున్న, సాయంత్రం
ఆకాశం పలకమీద
ప్రకృతే వేస్తుంది
బ్రహ్మాండమైన

రెండు ప్రశ్నార్థకపు గుర్తులు
నీవెవరు ? నీవెవరని.
? ?

నీలగిరిలో పురుడు పోసుకొని
దాహం దాహం అంటూ మరణించిన
చూలాలి వక్షంలో గడ్డకట్టిన
చనుబాలజిప్పను !

తాగి చనిపోయిన ఒక పుండాకోరుని
డాక్టరు శవపరీక్ష చేసినప్పుడు
అతని కడుపులో అరగకుండా
పైకి ఒలికిన సారా చుక్కను !

చూలాలై మృత శిశువునికని
గుండెల్లోపాలే
పాముకాటులా బాధపెడితే,
ఒక యిల్లాలు
ఒక చీకటి రాత్రిలో వీధికాలువలో
కురిపించిన పాలవానను !

ఇంతకూ ఎవరై తేనేం ?
రుక్మిణీ కళ్యాణ తపస్సులో,
కుటుంబ చింతలో కలిశాం,
నీవూ నేనూ కత్తిపీటఖీూద కలిసిన

అరటిపండు, అరిసెలాగ.
ఎన్నిమార్లు నీవు లెక్కపెట్టినా
నన్ను మరిచినా నీవు
ఉన్నవాళ్ళం ఇద్దరం.
నీటికన్న రక్తం చిక్కన.
కవులమైనా, అన్నగమ్ములమైనా,
గర్భ శత్రువులమైనా
శ్రీ శ్రీ, నేనూ.

సిరాబుడ్డిలో కలం ముంచితే
సిరాకు బదులు పాళీకి తగిలి
ఒక సాలిపట్టు,
దానిమధ్యకు చచ్చిన సాలెపురుగు.
పట్టులో సజీవంగాఉన్న
రెండు మట్టికాలు సాష్టాత్కరిస్తే,
పక్కనున్న శ్రీ శ్రీని పిలిచి
"ఏమిట్రా తంబీ ?" అన్నా,
"సాలెపట్టులేదు అదంతా కవితావ్యూహం
మట్టికాలూ, నీవూనేనూ
పట్టులోచిక్కి చచ్చాంకామని
ఆకాశంచూరునుంచి సిరా బుడ్డిలోపడి
ఆత్మహత్య చేసుకొన్న కృష్ణాస్త్రి
రెక్కలు తెగాయికాబట్టి
డేకురు కుంటూ పోదాం పద వీధిలోకి.

వ్రాత అయిపోయింది.
సిరా మిగిలి పోయింది.

ఏం సాధన మన్నా.
ఉంచు; నామహాప్రస్థానంలోకి
వచ్చే మహారాజులకి
నీలిశాలువలల్లి కానుకలిస్తా,
కాకపోతే,
నీ నెత్తురు నల్లబడేదాకా నీవేత్రాగీ
అప్పుడు వెలిగించు దీపం.
ఈ మానవజాతికి నీవు ఎర్రదీపానివి.
ప్లేగు వ్యాధికి కనిస్టీపువి!

అంత,రోడ్డు అవలిస్తే
ముగ్గురు ఆడపిల్లలు పుట్టేరు.
తుమ్మితే మూడు ఎలెక్ట్రిక్ దీపాలు
వెలిగాయి.
లోపలికి ఒక దీర్ఘనిశ్వాసంతీస్తే
అన్నీమాయ మయాయి.
కాశ్మీర సరస్సులలో పడవల్లాగు
కాల ప్రవాహంలో కలరా శవాలుకొన్ని.

"వీధులు ప్రమాదం, పరిగెడదాం పద.
ఆబయలులోకి" అన్నాడు.

పరిగెట్టం ఇద్దరం.

అక్కడ గాలిలేదు వెలుతురు లేదు.
శూన్యం లేదు.
సప్తసముద్రాలు జట్టు కట్టుకొని
జలతరంగిణి వాయిస్తున్నాయి.
ఆకాశం చిరిగిపోయిన అరటి దొప్పలా
ఒకమూల పడి ఉంది.
భూగోళపటంమీద
ఉల్లిపొరకాయితంలా
మృతించిన శేషుడు
భూమిని చుట్టుకొని ఉన్నాడు,
వెలిసిన రంగుగుడ్డలు మంచీ చెడ్డా,
జెండాలై ఎగురుతున్నాయి!
కులపర్వతాలు
గాలిలో విమానాల్లా
ఎగురు తున్నాయి.
కుష్టురోగంతో కాళ్ళు చేతులు పడిపోతే
కిందపడి దొర్లుతూ ఏడుస్తున్న దేవేంద్రుడు,
ఇంకిపోయిన అమృత భాండంలో
తడైనా తగుల్తుందేమోనని
వేళ్ళతో స్పృశిస్తున్న శచీదేవి
దేవేంద్రుని సింహాసనంమీద
కూర్చుని వజ్రాయుధం
తానొకప్పుడు కొండలను ఖండించిన

రెక్కలన్నింటిని పోగుచేసి
మరల పర్వత భుజాలకు
అంటిస్తున్నాది పేస్టుతో
గండభేరుండ పక్షులు కలరవాలు చేస్తుంటే
శ్రీ శ్రీ పాడుదామన్నాడు.
అటుపక్కనుంచి
మాసిన బట్టలు మాటల మూటలు
రేవులో తగులబెట్టుకొని ఏడుస్తూ
ఎదురుగుండా తోచిన
చాకలి సరస్వతినిచూసి
కోపంతో శ్రీ శ్రీ తన్నేందుకు కాలుఎత్తి
మూగవాడై నిల్చున్నాడు.
అయితేనేం పోతేనేం అన్నా.
ఎంతో సరదాపడి
పరీబజారులో కొన్న పాతతుంబురను
జన్మను సాహిత్య కోమటిని
ప్రాధేయపడితెచ్చిన వాల్‌ఖలేడ్,
గురజాడ ప్రసాదించిన ముత్యాల సరం,
హాపిక్‌న్సును అర్థించి తెచ్చిన స్ప్రింగ్‌బెడిమ్
అన్నీ పోయాయన్నాడు నత్తిగ.
ఇక పాట ఎలాగు?
పక్కను పడియున్న జేషు నికోరపెరికి
ఆడ గండ భేరుండపక్షి రెక్కమీద

డాలి, శ్రీ శ్రీ రచించిన చిత్ర పఠానికి
మాత్రమే నారాయణబాబు తీసిన ఛాయాచిత్రం.

పఠం ! రెండు అస్థిపంజరాలు.
అస్థి పంజరాలకు
అందం, లింగభేదం అనవసరం.
అయినా వకటి స్త్రీ అస్థిపంజరం.
రెండవది మగవానిది.
స్త్రీ అస్థిపంజరం చేతిలో ఒక గులాబి అత్తరువుబుడ్డి
మెడలో మెరిసిపోతున్న కోహినూరు వజ్రం!
పక్కను నిలబడిన మొగ అస్థి పంజరం ఏమన్నా
నల్లబడిన ఎముకలతో వేడెక్కిన ఎముకలతో
చేతిలో
వజ్ర వైడూర్యాలు పొదివిన
బంగారపు గునపంతో
తాజమహల్ తవ్వేస్తూ !

ఇంత ఒక ఆడగంత భేషుండపక్షి
దగ్గరకువచ్చి
శ్రీ శ్రీని ముక్కుతో అంకించుకొని
విమానంలా లేచి పోతూవుంటే
నేను ఎక్కడికి అన్నా,
మాటలురాని మూగ శ్రీ శ్రీ
ఒక హస్త విన్యాసంపట్టి

గరుడలోకానికని చూపించాడు.
నాలో మాటల మరపు ప్రారంభించింది.
మరచి పొకండా
మననం చేసుకొంటున్నా.

ఇంతలో,
తొలినిశనుండి నేటివరకు
మానవ జాతికన్న కలలసిమెంటుతో
కట్టిన గోడలతాకి
కాలప్రవాహం ఘూర్ణిస్తున్నాది.
కొంతసేపు కాలాంతంలోకి
కాళ్ళు చాపుకొని కూచున్నా.
ఎల్లలు కలిసి పోతున్నాయి.
దిక్ భిత్తికల పెల్లలు రాలిపోతున్నాయి.
లేచా!
రజతాచలం కనబడితే
ఎక్కా!

కొండ లోయలో పూటతోట,
చెట్లులేవు! అన్నీ పూవులె!
ఉపనిషత్తులు తుమ్మెదలై
ఝంకారం చేస్తున్నాయి.
పార్వతి నగ్నంగా నిలబడి
పూలుకోస్తున్నాది

ఈశ్వరుడు నిద్రపోతున్నాడు
పార్వతీ దర్శనమయ్యేసరికి
నాబట్ట అంటుకున్నాది!
నేకాలి పోతున్నాను.
మూగనై నిలుచున్నా
దగ్గరగా ఒక మహానశంఖం తోచింది.
మహానశంఖం ! స్పృశించా !
నాగుండె అంతా హంసయై
సోహం అని అరిచింది !
నాచైతన్యమంతా
సప్తసముద్రాల సహస్రకోటి బాహువుల
మెరిసే నురగై ఘుయ్యామంది !
నా ఎముకల మూలుగులో
చంద్రోదయమైంది !
నా శరీరం
కాస్యపభస్మరాసియై తరళించింది
నా ప్రాణం భగీరథుడైంది.
నా నెన్నెముకమీద
ఆకాశగంగా జలపాతం వర్షించింది !
నా పొత్తికడుపు
హిమాచల తనయ
తన చల్లని మంచు హస్తాలతో నిమిరింది !
రవం, నీరవానికి Diminutive !!!

— నారాయణబాబు

'Vibgyor'

మీ చేలకు, మీ చెరువులకూ
మీ నదులకు మీ బ్రతుకులకూ
జలదానం చేసూందని, వలాహకాన్ని
పూజించి, అర్థించి, ప్రార్థించి,
బ్రహ్మరథం పట్టించి
జగన్నాథరథం ఎక్కించి
శ్వేతరథం పంపించారంటే-
అది-అప్పటి కప్పుడు
అకటా వికటమై ఉక్కిరి బిక్కిరై
అటు పరుగెత్తి, ఇటు పరుగెత్తి
ఏడ్చి, ఏలక్కాయలు తిని
నీళ్లుగారి, పిండి పిండై
పిండి మంచై, మంచు పిండై
నశించి, కృశించి, చచ్చి,
చేయంగల విన్నాపాలని మళ్ళీవచ్చి
మళ్ళీ ! మళ్ళీ !! మళ్ళీ !!!

అయిందేమోనండోయ్ !

కొంపదీసి, తంపతెచ్చి
జాగ్రత్త ! - జాగ్రత్త !
జా...గ్...ర్త ! బాబూ !
వయసొచ్చిన పైడి కన్నెలా
యెదిగిన దోరావు పెయ్యలా

౭

ఎరయెర్రని తలిరాకులతో,
తొలి పూతల బంగరు సొమ్ముల
తో కులికే మామిడి గున్నలు
నల నల్లని నీలాకాశపు
Back-ground లో అందం చందం !
వళ్ళి యెరుపు సంధ్యాకాశపు
Back-ground లో వెలవెల పోవూ !
నా Sweet-Heart నల్లని రూపుకి
తెల్లపట్టు Saree సొగసు !
ఆ గుండ్రని నల్లకలువ Face
ఆ Face లో తెల్లకలువ Eyes !

అలాఅలా వస్తూవస్తూ
కల కల కల నవ్వీందంటే-
నా ముద్దుకి ముత్యాల్ హారాలో
నా Mystic beauty muse కి
నా కవితకు చక్కిలిగింత !
నా అందం తెలిసిన కళ్ళకి
Color-effect తెలిసిన కళ్ళకి
అసలు తనే నల్లనిదిగదా-
'ఆ Nasty నల్ల Saree ని
అసలెవ్వరికైనా ఇచ్చెయ్'
అంటే-మా ఆవిడ వినదే !

ఆ మాసిన నల్లమనిష్టం
లోలానే కనబడకుండా
తియ్యాగై వచ్చి మెల్లిగా
గదిలో Light ను తగ్గిస్తే
ఎల్లా గుంటుందో 'బోలి'
ఈ Beauty worshipper

— సింగరాచార్య

హద్దులు

శాంతి దుఃఖముల సరిహద్దులలో
మానవరాజ్యము ఓడిపోయినది,
అరాజకంబయి లౌకికలోకపు
హద్దులు మారగ ఘోష పెట్టినవి
హృదయ తంత్రిపై విమల భావములు !

తూర్పు పడమరల తొలి హద్దులలో
సూర్యచంద్రులను చుట్టిన దారిలో
తిరుగుచుండె నొక సరుగుడు రాట్నం
వెలుగుచుండె నొక విద్యుత్తేజం
జ్ఞానమార్గములు, కర్మ సూత్రములు
వేద బోధలకు వెరచెడి రోజులు

జారిపోయెనని రాట్నము తిరుగదు

ఆరిపోయినది విద్యుత్తేజం !

తూర్పు పడమరల హద్దులు మారగ
మానవలోకపు మర్యాదాంచల
పొలిమేరలలో పొగులుచున్న దొక
సంఘాదర్శం, ఆశ్రమధర్మం, శాశ్వతనియమం.
ఊరిచివరగా ఉత్తర దిక్కున
పేరులేని ఒక పెద్ద వృక్షమట
పెద్ద వృక్షమున తూరుపు కొమ్మకు
చిట్టచివరగా చివురుటాకుపై
నిలిచిపోయె నొక రహస్య సూత్రం !
సూక్ష్మ మార్గమున జీవిత ధర్మం
సూలలోకమున నాగరికత్వం
వరద పారగా తడిసిపోయినది
దివిజ భావములు హృదయ రాజ్యమున,
మోదు బారినది ప్రేమలోకం !
బీటలు వారిన వెర్రి మొఖముతో
కన్నులు తేలగ కాంతి హీనమయి
దృశ్య ప్రపంచం చారి తప్పినది
జీవధోలలో జీవచ్ఛవములు
జారిపోవుతూ ఊగుతున్న విట !

... ...

గ్రీష్మోష్ణతలో ఉష్ణాధిక్యం
వర్షోష్ణతలో స్నేహోష్ణాధిక్యం
న్యాయధర్మములు బీదలు కాగా

ఎండాకాలం ఎగసి మండినది
మూలసూత్రములు బీటలు వారగా
ధర్మమూర్తి కని శ్లేష్మ మెక్కువయి
మోక్షగామికిని గొంతు వాచెనట ! — దేశిరాజు

అవతలిగట్టు

—ఇవేమిటీ వింత భయాలు ?
—ఇంట్లో చీకటి !
—ఇవేమిటీ అపస్వరాలు ?
—తెగింది తీగ !
—అవేమిటా రంగుల నీడలు ?
—చావూ, బ్రతుకూ !
—ఎచటికి పోతా వీ రాత్రి ?
—అవతలి గట్టుకు !

పరాజితులు

అలసిన కన్నులు కాంచేదేమిటి ?
తొణికిన స్వప్నం,
తొలగిన స్వర్గం !
చెదిరిన గుండెల నదిమేదేమిటి ?
అవతల ఇవతల

అమ్మలె ఇమ్ములే !
విసిగిన ప్రాణుల పిలిచే దెవ్వరు ?
దుర్మతి, దుర్గతి,
దుర్మతి, దుర్మృతి !

ఆఁ!

నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నే నెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు-
నెత్తురు క్రక్కుకుంటూ
నేలకు నే రాలిపోతే,
నిర్దాక్షిణ్యంగా వీరె...

— శ్రీ శ్రీ

నాగీతం

మానవ మేధస్సుకు
సంకెళ్ళను తగిలించిన
గత సాంఘిక శిలా శాసనం
పడ గొట్టను
పగిలిన నా నిప్పుల కంఠం
పలికిన విప్లవగీతం !

ప్రపంచాన్ని పసిఫిక్ రంగరంగా
పగిలించిన నాగీతం,
జగత్తు నొక నయాగరా
జల ధారనుగా
వరించిన నాగీతం,
లోకంలో స్వేచ్ఛా విద్యుచ్ఛక్తులు
ప్రవహించిన నాగీతం,

కదలని సమాజ హిమాలయంలో
కదిలే నవ్రకాంతి బాడబాగ్ని
మండించిన నాగీతం,
అనార్కలీ సమాధిలో అశ్రుదీపికలు
వెలిగించిన నాగీతం,
అక్బర్లను కండలుగా
ఖండించిన నాగీతం,

యుగాలనుంచీ నడిచే
నియమపు రైళ్ళకు పట్టాలను
పీకేసిన నాగీతం,
చీకటిలో పడి ప్రమగ్గిన లోకానికి
దూరపు తీరాల్లో
మండే కాగడాలు
చూపించిన నాగీతం,
గత సాంఘిక నరబలి నగరంపై

బాంబులు దూకించిన నాగీతం,
సంకెళ్ళను బంధాలను ద్రెంచెయ్యను
నిప్పుల కత్తెరలను
సృష్టించిన నాగీతం!
జగత్తులో జలప్రళయం తెచ్చిందట,
ప్రపంచాన్ని మార్చిందట,
స్వేచ్ఛామహోగ్ని పర్వత
శిఖరాంచల రక్త జ్వాలికగా
మండిందట, సమ్రాట్టులు చాచిన
నెత్తుటి నాలుకలే నరికిందట,
హిట్లర్ కు చాణక్యులకు
గోరీ కట్టిందట,
కాలపు దాసుల్లో చీకటి ముళ్ళను
తొలగించిందట,
వెన్నెల పూవులు చల్లిందట,
శ్రామిక జనఫాలంపై ఎండని ఘుర్మజలం
చల్లని చేతులతో తుడిచిందట,
వర్గరహిత సంఘ స్వర్గానికి
పూలనిచ్చెనలు వేసిందట,
నరహంతలకు, చెరసాలలకు
ఉరి తీగ్నలకు
నిరంకుశ నియంతలకు
తలకొరువులు పెట్టిందట,
గతలోకం గాల్చిందట

నవలోకం చూపిందట
నడవండని చెప్పిందట
నరాలు వణికించిందట!
కండలు కదిలించిందట
గుండెలు మండించిందట
మేధస్సును
రెక్కలు కట్టిందట!
జీవితాన్ని విహంగం చేసిందట!

— రామదాసు

ఈ రోజున

చరిత్రలో తిరిగిన మరణపు తిరగట్లో
బియ్యపు గింజల్లా
నలిగి నలిగి మండిన గుండెల్లో కండలు
ఎర్రని జండాలై ఎగిరిన వీరోజున!

బాడుగ బండికి కట్టిన ఎద్దుల మెడపట్టుడ
గంటల గణగణలో నినదించిన కంఠాలే
నిప్పుల రణశంఖాలై పగిలిన వీరోజున!

పాతాళం బ్రద్దలుగా పగిలింది రోజున!
పడగలు విప్పింది గోజున!
జగత్తు ఒక సోల్జర్ అయ్యై,

కదనానికే కదిలిందీ రోజున !
పాతాళపు చీకటిమంట్లో
ఆకలి ఎండల్లో పడి మ్రగ్గిన
దీన హీన మానవ హృదయంలో
ఆకాశం పగిలిం దీ రోజున !
గానుగలో సున్నంలాగా
రైలుకింద పట్టాలాగా
చెప్పకింద చీమల్లాగా
నలిగిన మానవులారా !
పగిలిన గుండెల్లారా !
తెగిన కండల్లారా !
మీకోసం నడిచే సోల్జర్, ఎగిరే పైలెట్లో
కదిలే టాంక్ డ్రైవర్ !
మీకోసం ఫైటర్ మంటలు !
మీకోసం టాంకుల చప్పుడు
మీకోసం విసరిన బాంబులు
మీకోసం కదిలే స్టీమర్ !
ఫసిఫిక్ రంగంల్లో, బర్మా అడవుల్లో
మాస్కో గేట్లల్లో, పారిస్ వీధుల్లో
లండన్‌లో, వాషింగటన్‌లో
ఇటలీలో, బెర్లిన్‌లో
చైనా లోయల్లో, పృథ్వీగర్భంలో

ప్రతి అణువూ ప్రసవించిన యుద్ధాగ్నులు
మీకోసం ! మీకోసం !

మీకోసం నిలిచిన మాస్కో--
మీకోసం కూలే బెర్లిన్ !
వీరులదే మా రేలోకం
వీరులకే బీర్ బాటిల్ !

గట్టర్లలో అట్టడుగున శోషిల్లిన దీనులార !
మరచక్రం తిప్పితిప్పి అరిగిన చేతులార !
మీ ఘర్మజలం అఖండ గోదావరిగా
పొంగిందీరోజున !
ఆనకట్ట తెంచిందీరోజున
ప్రరోగమించిన మీరే
తిరోగమించును బెర్లిన్ !
భవిష్యత్తు మిమ్మల్నే స్వయంవరం చేస్తున్నది !
మీ మెళ్ళో పూలమాల వేస్తున్నది !
మీ కల్యాణానికి
రణధనుస్సు విరిగిందీరోజున ! !

— రామదాసు

ప్రజాశక్తి

సకల ప్రజా సముద్ధర
సుప్తోద్ధృత జీవశక్తి
మహాశక్తి ప్రజాశక్తి
వొస్తున్నది వొస్తున్నది!

రూక్షోజ్వల రుధిరదీప్తి శ్మశానాధుల తలలు తరిగి
కండకరుగు కూలీలకు, రక్తమోడ్చు రైతులకూ
వొస్తున్నది ప్రజాశక్తి!

గగనంలో వేగుచుక్క జగమంతా జగచ్ఛక్తి
తమస గర్భ దళనహేతి బానిసత్వ విచ్ఛేదక
ప్రబలవిజయ ప్రజాశక్తి, వొస్తున్నది మహాశక్తి!

ఆకటితో ఆకటితో అటమటించు జీవులార!
అన్నపూర్ణ స్వర్ణపాత్ర, వొస్తున్నది ప్రజాశక్తి!

బంధీకృత ధనికశక్తి పొగగొట్టపు భుగభుగలో
తెలతెలలై వెలవెలలై పోతున్నది; వొస్తున్నది
మహాశక్తి ప్రజాశక్తి!

కట్టుచాళ్ళ తొలకరి చిలికిన చిన్నెల వన్నెల
చంద్రవంకలై శాంతమూర్తియై కాంతిదేహియై వొస్తున్నది
మహాశక్తి ప్రజాశక్తి!

పస్తులతో పన్నులతో స్వేచ్ఛలేక కుళ్ళిన

కుమిలిన విరిగిన సొరిగిన జీవులకొక
మహోశక్తి వొస్తున్నది !
పరప్రాణం బలిగొంటూ తమబేరం సాగించే
రాజనీతి, సాగబోదు జగతి గతికి శాంతి నీతి !
మృత్యువు కోరలపెంచే, హత్యకు హారతులిచ్చే
అగ్నికి దాహంపెంచే, చీకటికాటుక దిద్దినయుద్ధం
వక్రగామియై చరిత్రలన్నిట తిరిగిన చక్రం
ప్రజాపథానికి పయినిస్తున్నది నినదిస్తున్నది విజయనినాదం !

ఎగిరే ఎగిరే ఎర్రటి జెండా! కరకరలాడే కొడవలి పదునూ!
లోహంవంచిన సమ్మెటపెట్టూ ! వైప్లవ్యపు వైతాళికులై
నినదించెను నిప్పుల గొంతుక !

'జనమయమ్మగు జగత్తుసర్వం దేశాలుగ విభజించుట
పాలించుటకేనా ? కాలికి చేతికి కడియం తగిలించుట
వికసించే సంస్కారానికి ఉరివుచ్చుల పోయుటకాదా ?
కదలకుండ మేడలపై నీడలలో ఆపుకోను హక్కుండాలీ ?
ప్రకృతి కుసుమించిన సర్వం ప్రతివ్యక్తి సుఖియించను కాదా?
ఎండలలో కండకరిగి వెన్నిరిచిన డొక్కమాడి
మానానికి గుడ్డలేక కరువులాగ కాళ్ళుచాచి
శోషిల్లాలీ ?'

అదృష్టపు యవనికలోపల జరిగే ఈ విషాద ఘటనల
కంతమ్మ విప్లవమని చాటుటకై వొస్తున్నది
ప్రశ్నించిన ప్రజాశక్తి !

ఖైదులలో, కోటలలో, పేటలలో, బాధామయహృదయాలలో
పోషెత్తిన ప్రళయజ్వాల, చావని చావు లేని జగజ్వాల
యువజ్వాల నవజ్వాల జ్వాలనశీల
ప్రజాశక్తి! మహాశక్తి వొస్తున్నది

మతమునకూ, గతమునకూ, మనసులేని మనుషులకూ
పటిల క్రౌర్య కల్పనకూ శత్రుచిహ్న జనశక్తి
వొస్తున్నది ప్రజాశక్తి!

ఉరికొయ్యల స్వతంత్రగానం, ఆరక రగిలే వీరుల చితులు
హోరుమనే శ్మశానఖిలనాదం అగ్నిగోళమై కాలవ్యాళమై
కనలే కుమిలే క్షుభితావని పిలిచిన వలచిన మహాశక్తి
ప్రజాశక్తి వొస్తున్నది!

అరిభయంకర ఆవహాశక్తి నవజీవన ప్రభాతభేరీ
అభిగామినియై శుభదాయకమై
సౌదామిని నిగనిగలై ధగధగలై వొస్తున్నది
మహాశక్తి ప్రజాశక్తి!

సోమరులను పామరులను నరనరము కదిలించే
నరులందరి నడిపించే విప్లవకర మంగళకర
మహాశక్తి, వొస్తున్నది, జీవశక్తి ప్రజాశక్తి!

— — వేల్చూరి

వ్యాస సంతతివాణ్ణి

వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి!
వెళ్ళిపోయిన కోటికోట్ల జీవులు విడిచి
కుళ్ళిపోయే నేటి కోట్ల జీవులకొరకు
పొర్లివచ్చే కోటికోట్ల జీవులకొరకు,
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి!

కలగుండు వడియు నిశ్చలమైన గుండెవలె
నిద్రించు నీటిలో విడుచు పొడి రాయివలె
అడవులూ, పడవలూ 'అహుపు'కెల్లలు దాటి,
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి!

పగిలించి రణభేరి, పద్మవ్యూహము త్రెంచి
శివమెత్తి విస్ఫులింగములు చిమ్ముతు లేచి
ఈ జగతిలో నూత్నజగతి కల్పిస్తాను,
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి!

తలలొగ్గి బానిససలాము చెయ్యరు మీరు
ధన మదాంధత బలిసి తారసిల్లరు మీరు,
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి!

రాళ్ళు రప్పలు ప్రాణమొలికి పులకింపగా
పరాకోటి నందు ప్రాణుల కళాసృష్టి,

ఎగసి ప్రవహిస్తుంది ఇక వెలుగు బావుటా!
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి!

ప్రేమమూర్తుల నిత్య నృత్యమై, సత్యమై
భువనముల్ సకలముల్ పొంగి ఆడంగా,
నిర్భరానంద మావిర్భ వించంగా,
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి!

— అనిసెట్టి

ప్రాణోత్సవం

నిజంకాదు! నిజంకాదు!
నాదేశం-తొలిపూవై విచ్చిందని,
నవవసంత మొచ్చిందని:
ఆకలితో నాల్గు చెరగు
లంటుకుంది, దహిస్తోంది!

నిజంకాదు! నిజంకాదు!
నాదేశం-నలుగురిలో తలెత్తి
స్వేచ్ఛానృత్యం చేస్తోందని:
మరతుపాకి మడమ క్రింద
పడి రక్తం కక్కుతోంది!

నిజంకాదు! నిజంకాదు!
నాదేశం-చీలి ఛిద్రమౌతుందని:

నిప్పుకణికలై అస్తులు నిలిచి ఎదుర్కొంటాయి,
ప్రగతినక్తులై ప్రాణాల్ పగతుర వేటాడుతాయి!
ఆనాడు వసంతనృత్య
మనంత ప్రాణోత్సవము!

— అనిసెట్టి

మన్య విప్లవం

సమిష్టి సత్యాగహం దేశాన్ని
సకలం ముంచెత్తిన రోజులు!
మన్యంలో తిరుగుబాటు!
ప్రభుత్వం విరగబాటు అణిచేసిన
గొడలి పెట్టు!

రాచరికపు బాటల్లో రాజుకున్న కారుచిచ్చు
మన్నుతిన్న పాముల్లాంటి మన్యం వీరుల గుండెల్లో
రేగినై ప్రళయ ప్రళయంగా తుపాను సహస్రాలు
అమాయక హృదయాల్లో రగిలి విప్లవ జ్యోతులు
మన్యసముద్రంలో చెలరేగిన
అవమాన బడబాగ్ని జ్వాలకు
రాజుకున్నవి ప్రభుత్వ భవనాల్
రాజధాని నగరంలో!

మాచేసిన మన్య విప్లవం
దేశానికి మార్గదర్శి!

దిగివచ్చిన వెలుగుబాట!
సెంటుజార్జి కోటచెవుల్ చెదిరించిన
విప్లవ దుందుభి!

'మిరపకాయ తపాలా'కు
మిలిటరీ తుపాకి బారులు
సమాధానం చెప్పలేక సగం చచ్చి కూచుంటే
తెనుగురాజు కరకుదనం తెలిసింది ప్రభుత్వానికి!
న్యాయం బురఖా తగిలించిన
ప్రభుత్వానికి పట్టు గొమ్మలు
విప్లవాన్ని విరిచెయ్యను
ముతాదార్ల శపథం!
ముతాదారీ ముసుగుల్లో జరిగే అక్రమాలకు
విసుగుదు మన్యవిప్లవం!

మన్యంలో ప్రభుత్వానికి
మలేరియాజ్వరం పట్టుకొని బాధిస్తే
విజృంభించి నిప్పుల కంఠం
వినిపించిన విప్లవగీతం,
వినేసరికి బెదిరిపోయి
ప్రభుత్వానికి తెల్లగుడ్లు పడినై-
మదరాసునుండి, మలబారునుండి
తోలుకవచ్చిన సైన్యంలో
కమాండరన్ చీఫ్లులు
శివాలయం గోడమీద చెక్కించిన విగ్రహాలు!

మన్యంలో పేరుకున్న మత్తంతా విదిలించిన,
మా హృదయాలను కదిలించిన,
దిగంతాలు మండించిన దీపికలై శౌర్యాగ్నులు
ప్రచండమైన మన్యవిప్లవం
అనామకంగా వీచిన ఒక చిరుగాలి తరంగంగా
చేసింది ప్రభుత్వం ! వ్రాసింది రికార్డుల్లో
మూసేద్దామని లోకంకండ్లు !
రాజద్రోహంగా, నేరంగా, దోపిడిగా, దొమ్మీగా
చరిత్రలో వ్రాసుకున్న
చాదస్తపు వ్రాతలకేం-
మన్యవిప్లవం మా చరిత్రలో
వీచిన ఝుంఝూనిలవీచిక!
విదళించిన వీరునిఖడ్గం
పసి పట్టిన పాముబుసా
చూపించిన విప్లవ మార్గం
స్వామాజ్యపు కత్తుల వానకు
పట్టించిన స్వర్ణ చ్ఛత్రం
అధికారపు అన్యాయమ్ములు
అడ్డుకున్నది రక్షా కవచం !
మన్యవిప్లవం మా చరిత్రలో
వీచిన ఝుంఝూనిల వీచిక !
బంధించిన బానిసత్వ విచ్ఛేదక వీరమూర్తి !
విప్లవ శరదాకాశం వెలిగించిన విద్యుద్దీపం !

రామరాజు హృదయంలో
రగిలిన స్వాతంత్ర్యేచ్ఛ !
మన్యవిప్లవం మా చరిత్రలో
వీచిన ఝుంఝూనిల వీచిక !

— కుందుర్తి

ఆకలియాత్ర

౧

కదిలిందొక మహాయాత్ర
కలవారిపై దండయాత్ర
సగంతిండి తినిబతికే
శ్రమజీవుల క్షుధాయాత్ర !
ఆకలి ! ఆకలి ! లోకం చీకటితిని బ్రతుకుతోంది,
ఆకలియాత్రలతో లోకంలో కలవర మెక్కువైంది
రిక్షాలూ, లాగుడుబండ్లూ నడిచెయెండకు నిలబడినై,
హైలుయింజన్ అరుస్తోంది ఆకలితో కదల్లేక !
ఆకలి ఆవేదనతో గాలి వీచలేక కూచున్నది,
హలం చాలులో క్షుధతో పొలం మెలికలై తిరిగింది.
కదిలిందొక మహాయాత్ర కలవారిపై దండయాత్ర
కూటికి గుడ్డకు వాచిన కోటినరుల కోపయాత్ర !

౨

పొలాలలో దున్నేవారిని
బొగ్గుగనుల్లో పనివారిని

పగలురాత్రి ఫ్యాక్టరీల
పొగలో బ్రతికేవారిని,

తమశ్రమ వృథాగా, యజమానికి ధనంకూర్చి వెట్టివారిని
తమకు హక్కుగల ఈ సకలం తమదని తెలియనివారిని,
గాలివాన గర్జిస్తోంది కారుతోంది పూరిగుడిసె,
పూరిగుడిసెలో దీపం పోయి దిగుల్ పడేవారిని,
అర్ధాకలితో కడుపులు మలమలమాడే వారిని,
కలుపుకోండి! పస్తులతో కాలం గడిపేవారిని.

3

అందరు మనలో కలిశారా!
అంబుధి పొంగింది పదండి!
పదండి! పదండి అడుగుదాం
పరిపాలించే వారిని!

కడుపుకాల్చుకుని చాకిరి కాదిక మావల్లకాదు,
పదండి! పదండి అడుగుదాం పరిపాలించే వారిని!
నిల్వాలున్న కలవాళ్ళను నిలేసి అడిగేద్దాం,
వరిపాతర కలవాళ్ళను నలుగురిలోకీ పిలిపిద్దాం!
అందరికీ తిండిగుడ్డా అందిసారా లేదా!
పదండి పదండి అడుగుదాం పరిపాలించేవారిని!

౪

భూమితల్లి పండుతుంది, మన
బువ్వకు కొరతేమిలేదు.

పాతరలోతుల ఖైదుల్లోని
పంటతల్లిని విడిపిద్దాం!

జమీందార్లు దున్నలేని వేలవేల యకరాలు
సమస్తబంజర్లూ, బీళ్ళూ సాగుకు మాకివ్వండి!
నాల్గునెలల కాలంలో నలభైకోట్ల ప్రజలకు
బంగారం పండిస్తాం, తిండికొరత తీరుస్తాం!
ఒకటేమాకు నినాదం తిండికలేంది ఊరుకోం!

జగత్తు ఒక నిమిషంలో జడమయమైపోతుంది!
పదిమంది స్వార్థవ్యక్తులు పాలిస్తున్నారు మనల్ని,
ఓటులేదుగాని మనం నూటికి తొంభై మందిమి!
వారిచేత కాకుంటే మనమే ప్రభుత్వాన్ని నడుపుకుందాం!
పదండి! పదండి! అమగుదాం పరిపాలించే వారిని!

— కుందుర్తి

మా గ్నా కా ర్టా

మేం మనుష్యులం!
మేం మహాస్నులం!
గుండెలోపలి గుండె కదిలించి
తీగలోపలి తీగసవరించి
పాటపాటకు లేచు కెరటంలాగ
మాటుమాటకి ప్రోగు కిన్నెరలాగ
మేం అడుతాం!
మేం పాడుతాం!

మేం ఉపాసకులం !
మేం పిపాసువులం !
తారలగతి కొక్కరొతి పెట్టి
భూమిఅంచుల వెలుగు తెరకట్టి
పాటపాటకి వెండి దారంలాగ
మాటమాటకి మండు దూరంలాగ
మేం సాగుతాం !
మేం రేగుతాం !

మేం నవీనులం !
మేం భావకులం !
పాతకలోకపు గుండెలో శతఘ్నిపగిలించి
భావికాలం చంద్రశిలలు కరగించి
పాటపాటకి సోకు స్వర్గంలాగ
మాటమాటకి దూకు సింహంలాగ
మేం నిలుస్తాం !
మేం పిలుస్తాం !

మేం మనుష్యులం !
మేం మహాస్నులం !
మాకు శాస్త్రంలేదు
మాకు దాస్యంలేదు
మాకు లోకం ఒకగీటురాయి.
మాకు కరుణ చిగురుతురాయి.

మేం దివ్యత్వాం నటించం !
మేం పరపీడన సహించం !

గాలిగుర్రపుజూలు విదలించి
పూలవర్ష ంభువిని కురిపించి
పాటపాటకి పొంగు మున్నీరులా
మాటమాటకి జారు కన్నీరులా
మేం ఆడుతాం !
మేం పాడుతాం !

— తిలక్

గుండెకిందనవ్వు

చేతిలో కలం అలాగే నిలిచి పోయింది
చివరలేని ఆలోచన సాగిపోయింది
ఏదో రహస్యం నన్నావరించుకుంది
అప్పుడే నీనవ్వు నాగుండె కింద వినబడింది.

పడుతూ లేస్తూ పరుగులిడే మహాప్రజ
పిలుస్తూ ఎదురుతూపోయే కన్నుగవ
కాలిసంకెలల ఘలం ఘల వినబడేదొక
ఏమిూత్రోచక భయంలో కళ్ళు మూశాను
అప్పుడే నీనవ్వు నాగుండెకింద వినబడింది.

ఆకు ఆకునీ రాల్చింది కడిమిచెట్టు
రేకు రేకునీ తొడిగింది మొగలిపొండె!
రెప్ప రెప్పనీ తడిపింది కన్నీటిచుక్క
ఎందుకో యీ ప్రాణి ప్రాణికీ విభేదం
ఎరగని నామనస్సు నాలోనే బెదిరింది
అపుడే నీనవ్వు నాగుండెకింద వినబడింది!

వెళ్ళిపోయే చీకటిని వదలలేక వదలలేక వదలేతార
వడలిపోయే జీవితాన్ని విడలేక విడలేక విడిపోయేలోకం
కాలుజారిపడిన కాలపుపాదమునుయ్యాలో కనపడిన శూన్యం
కాలు కదపిన చలువరాతిసౌధంలో. వినపడిన గానం
ఏమిటని ప్రశ్నిస్తే "ఏమో" అని పలికిన నిశ్శబ్దం
అపుడే నీ నవ్వు నా గుండెకింద వినబడింది.

ఆకాశపు వంపులో ఆర్ద్రవెనుక నీనవ్వు
పాతాళం లోతులలో ప్రతిధ్వనించి సాగింది,
అంధకారపు సముద్రానికి అవతల ఒడ్డున నీ రూపం
అందుకోలేని నాచూపుకి ఆశఆశగా సోకింది.

రా! ప్రశ్నించే నామనస్సులో
నీ చల్లని చేతితో నిమురుకో!
రా! నాకను రెప్పమాటుగా
నీమెరపు వీణమెల్లగా మీటుకో!

క్రమ్ముకుంది నాలో భయంతో కలసిన ధైర్యం
ప్రవహించింది నాలో తీరంలేని రజతనదం

ఇపుడే, ఇప్పుడే, నీనవ్వు
నా గుండెకింద వినబడింది !

— తిలక్

కదలండి!

అది హృదయం తుపానుగా
కదలిన విప్లవ దేశం...
అది బానిస కంటి మంట లెగసి తుపాకుల నెదిర్చి
ప్రళయానికీ, విలయానికి మరో కొత్తలోకానికి
రాచబాట, భరతావని పీడితుల 'నగారా' మ్రోత !

తమ తాతలు, తమ తండ్రులు తారకలై కనిపిస్తే,
తమ పొలాల వరి కంకులు తలలువంచి దుఃఖిస్తే,
తమ పశువుల కట్లు త్రెంచి తలొక దారి పట్టిస్తే,
తమ యువతుల కన్నీళ్ళే దక్షయజ్ఞములు చేస్తే,
భరతావని గడ్డమీద చలిపిడుగులు గర్జించెను...!

భరతావని గడ్డమీద మరతుపాకి వెనుదిరిగెను,
ఇక దోపిడీ, ఇక పీడన ఇక చాకిరి సాగవని,
సంఘాలుగ డైనమైట్లు సాగె ప్రజా వెల్లువలై ...
ప్రతిరోజూ బిగించినది ప్రతిఘటించి తన పిడికిలి...
ఇక లేవండిక లేవండిక జగత్తు ప్రసవించెను...
ఇక పీడిత తాడితులకు ఉరిఉచ్చులు తెగిపోయెను...
ఇక కార్మిక కర్షకులకు వేగుచుక్క కనిపించెను !

ముట్టడించి ప్రతి గ్రామం పట్టుకోను నాయకులను...
నిలువుగుడ్లు పడిపోయెను...మిలిటరీల 'ట్రిగ్గరకు'...
నాయకులను చూపమనీ...మరుగులేమో చెప్పమనీ...
మానవతుల సౌశీల్యం కీచకులకు పాచికలా!
పసిబిడ్డల చిరుబుగ్గలు బాయొనెట్ల కొఱికిడియా!
నీచులార! కేచులార!
రాచరికపు సుడిగుండం సుడులలోన పరిగెత్తే
మరోరోజులిక రావోయ్!
ఇక రావిక, ఇక రావిక
నరరక్తం పారించే, యువరక్తం చిందించే
స్వర్లోకం పడగొట్టే, మహోదయం అరికట్టే
మధుకలశం ఛేదించే, నందనవని పెకలించే
హిరణ్యాక్షు కోరల్లో పడి నలిగిన నెత్తుటి రోజులు...

ఓ స్వతంత్ర యోధులార!
నా కన్నుల పాపలార!

మీకండలు హిమాలయం తుదిశిఖరం కదిలించెను
మీస్వేదం మహానదికి ఉప్పొంగులు కల్పించెను
కదలండిక! ప్రజాశత్రువుల పదునుకత్తి లెదిరించెను...
కదలండిక! మరతుపాకి కెదురొమ్ము చూపించను
కదలండిక ధనంజయుని గాండీవం సంధించను!

మీసమాధి మృత్తికకై నాశిరస్సు బలియిస్తా!
మీ స్వతంత్ర గీతానికి నాకంఠం కృతియిస్తా!

— పొలూరి

అరుణరేఖ

తరుణారుణ ప్రభా తరళ రేఖను నేను
తొలిసంజప్రొద్దులో వెలుగు లందించాను,
అంధకారము చీరి అవతరించాను,
శిఖిరేఖ నై దిశల జేవురించాను !

చిమ్మచీకటి దొరల చీల్చివేశాను,
దండులేకే వెడలి దాడిచేశాను,
మృతజీవు లెల్లారి బ్రతుకజేశాను
చైతన్య మూర్తినై జీవమిచ్చాను !

విప్లవోజ్వాల తరళ వీరగీతికను
విశ్వకార్మికుల ప్రాణోచ్ఛ్వాసమేను,
ప్రాణితతి విప్లవ ప్రభలు రేకెత్తించి,
అండనై చండగతి ముందడుగు వేశాను !

విచ్చుకలమూని, నే వీరసేనానినై,
అరులపై దూకించి శిరసుల్లు కోశాను,
మానవ స్వాతంత్ర్య 'మాగ్నకార్టా' నైన
రక్తాక్షరములత్రో ప్రాలు చేసేశాను !

వి ప్ల వం

భరతోర్వీలో నేడు నిరుపేదలూ, క్రౌమ
పరితప్తులూ, దాస్యబాధితులు, బంధితులు
గొలుసులను తెంచుకొన, అలుగులను తీర్చుకొన
నిలిచి యున్నారరుగొరా, దేశాన్ని
పిలుచు చున్నారరుగొరా!

కడుదీక్షతో కర్షకుడు లేచెరా, కార్మి
కుడుదూకెరా, దూకి పరవాని పగవాని
తరుముతూ తగులుతూ గిరిగీసి తన్నుతూ
నురుమాడు తున్నారిదే, గర్జించి
పరిమార్చు తున్నారదే!

కనవేమిరా బొగ్గుగని వానిలో, చేతి
పనివానిలో చిచ్చుగసగనా కణకణా
రగులుతూ, రాజుతూ, పొగలనెగజిమ్ముతూ
భగభగా మండిందిరా, గగనాని
కెగబాకి యెరిసిందిరా!

నడిసీటిలో నావికుడు లేచెరా, సైని
కుడు లేచెరా, శత్రువడలంగ సడలంగ
బెదరి తారాడగా చెదరి పరుగెత్తగా
రణరంగమున దూకిరీ, కను నిప్పు
కణములను కురిపించిరీ!

రగిలిందిరా హైదరాబాదునన్, చూడ
ర్వాజాలలన్ నాలుకలు జాచిమెలివేసి
వినువీధి కానుతూ విప్లవం లేపుతూ
చనెను, తిరువాన్కూరదే, కాశ్మీర
ప్రజలు తెచ్చిన వుప్పిదే!

ఎటుచూచినా మంట లటుచూచినా మంట
లిటువాలెరా, జ్వాలలలము కొని యల్లుకొని
నలుదిశల పాకుతూ ఫెళఫెళార్భటులతో
పొంగు లెగసెర విప్లవం, శంఖాన్ని
పూరించెరా విప్లవం!

జల విప్లవం దవానల విప్లవం, హిమా
చల విప్లవం ఇలా తలమవర కనుచెవర
జయగీతములతోడ జయధ్వానములతోడ
విప్లవం లేచిందిరా, చెయిగలిపి
విజయ మందగ రమ్మురా!

— సుంకర .

ఉ గా ది

ఉగాదు లెన్నో ఉపాధులెన్నో
ఊరిస్తూ తెర మరుగైనై;
మంచుతుంపరలు విరిసిన పూలై
మళ్ళీ ఉగాది మల్లెలు కొల్లలు!

* * *

తెరలోపలి మరతుపాకి కొరకొర లో,
తెర వెలుపలి పావురాయి కువ కువ లో
నందనాన బృందావని నవ నందన మైనదో?
ఏ ఉగాదికా ఉగాది ఎప్పటి అరుణోదయమే!
ప్రజ కుత్తుక ఇరుసై ఒరసే రాజకీయ 'రంగులరాట్నం'
కల్పించిన స్వచ్ఛభ్రమలో
కలుకు మను గుండెలు కొండలు!

* * *

నిరాశతో పెనగే ఆశలు పరాక్రమిస్తూ ప్రయోగమిస్తే;
మరుభూముల విరిసే సుమములు
పరీమళిస్తూ పరిస్ఫుటిస్తే!
కోటి గొంతులొక గొంతుగా శాంతికై
కోటి గుండెలొక గుండెగా ఆంధ్రకై
వెలుగు వెన్నెల బావుటాలు విప్పారగా
తెలుగుజాతి పతాక కళకళలు తేరగా
ఆకసపు బాకాలు విప్పండిరా!
అవని అంతా నిండి నడవండిరా!

— ప్రయాగ

విరిగినహరివిల్లు

పర్వత శిఖరాల వెనకాతలా,
మేఘ శలాకాల మున్మందలా,
వొరిగింది హరివిలు వొయ్యారంగా
కాలం పరిగెడుతుంటే ఆకాశంలో !

అల్లుడిగారారాభటం మేడింటిలో,
పిల్లల గగ్గోలు గుడిసింటిలో,
అల్లాహో అక్బర్ మశీదులో
నక్కెనక నక్క చుక్కెనక చుక్కతో !

కుంకుమతిలకాల సాంగత్యం సానింటిలో.
పాం గుడ్లు పెట్టింది వల్మీకంలో,
మృత్యువుతో పోరాటం ఆస్పత్రిలో,
దేముడు తిరిగాడు దివిటీలతో !

గాలితిరిగి చస్తోంది గుడుగుడు లింగం,
కాలు కొండల్ని కదుపులో పెట్టుకుని
ఎక్కడికో పోతూంది ఏడుస్తూ ఏరు,
కాలం పరిగెడుతూంది ఆకాశంతో !

— చాగంటి

నాన్న కోసం

[అర్ధరాత్రి అంధకారంలో శ్రీమతినీ చిరంజీవినీ విడిచి శోకమయ మైన లోకాన్ని సముద్ధరించడం కోసం కరుణామూర్తి గౌతముడు కనిలిపోతాడు. కన్నకొడుకును ఎన్నో మాయమాటలు చెప్పి మగ్గింప జూచింది కరుణామయి యశోధరాదేవి. అందరబ్బాయిల నాన్నల్నీ చూచి కుమార రాహులుడి హృదయంకూడా తండ్రి దర్శనంకోసం తహతహలాడుతుంది. ఆ పసికంఠంలోనుంచి ప్రసరించిన భావకిరణాలే యివి.]

ఎక్కడికి పోయినాడె- యెన్నాళ్ళకొస్తాడె
వస్తువస్తూ ఏమి వస్తువులు తెస్తాడె-
నాన్న యేడే-అమ్మ, నాన్న యేడే!

గోలచేస్తానని కోప మొచ్చిందికే-
అలరబ్బాయినని అలిగిపోయినాడుకే-
నాన్న యేడే- అమ్మ, నాన్న యేడే!

రేపువస్తాడంటు - మాపువస్తాడంటు-
చూచిచూచీ కళ్లు వాచిపోతున్నాయి-
నాన్న యేడే-అమ్మ, నాన్న యేడే!

ఆకొండ మీదుగా ఆమబ్బులోనుంచి
నాన్నమనయింట్లోకి నడిచివస్తాడుకే-?
నాన్న యేడే-అమ్మ, నాన్న యేడే!

పట్టాభిషేకమది వట్టిదై తేమానె-
పట్టుచొక్కా, లాగు కుట్టించవద్దులే-
నాన్నయేడే- అమ్మ, నాన్నయేడే!

అందరబ్బాయిలతో ఆడుకోబోతేను
జనమంత నావైపు జాలిగా చూస్తారె-
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

అదుగదుగో - మబ్బుల్లో అందాల జాబిల్లి -
పంచకల్యాణిపై బాబయ్య రాడేమె?
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

నాన్నలేకేడ్చిటి నావంటి పసివాళ్ళ
కన్నీళ్ళు తుడిచి-ఓదార్చి వస్తాడులే-
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

నిన్న నీ ఒళ్లోను- నిదురపోతుంటేను-
నాన్నకల్లోకొచ్చి నన్నెత్తుకున్నాడె!!
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

చల్లగా-మెల్లగా- ఒళ్ళంత నిమిరాడె-
మానాన్న చేతుల్లో మైమరచి పోయినాను!
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

నాన్న చల్లనిచెయ్యి- నాన్న తియ్యనిముద్ద-
మరిచిపోదామన్న మరపురాకున్నాయె-
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

తనతోడ ననుగూడ గొనిపోదు నన్నాడె-
కన్నులె త్తైసరికి కనుపించనేలేదె-
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే !

నీకళ్ళలో యిన్ని నీటిముత్యాలేమె ?
గుండె టకటక యిటు కొట్టుకుంటుందేమె ?
నాన్నయేడే-అమ్మ. నాన్నయేడే !

ఎక్కెక్కి యేడుస్తు యేమిలేదంటావు-
చేతులివి చూడవే చిక్కిపోయినాయెంతో-
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

నన్నైన పంపవే, నాన్నదగ్గిర కెళ్ళి
'అమ్మయేడుస్తున్న' దని పిల్చుకొస్తాను !
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

రేపులెనొన్నపోయె - బాపుజీరాడాయె -
మాయమాటలు చెప్పి మరిపించుతున్నావు !
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

ఎక్కడికి పోయినాడె ? యెన్నాళ్ళకొస్తాడె ?
వస్తువస్తూయేమి వస్తువులు తెస్తాడె ?
నాన్నయేడే-అమ్మ, నాన్నయేడే!

— కరుణశ్రీ

తప్పులేని తమ్ముడు

[ఆస్తంతా ఆక్రమించుకున్నారు విరోధులు. ప్రస్తుతం ఆమె నిరుపేద యిల్లాలు. ఆ యమ్మకు ఐదుగురు సంతానం. పెద్దవాళ్ళ నలుగురూ చిచింద్రీలు. అయిదోవాడు అమాయికుడు. అన్నలంతా ఒక్కటై తమ్ముణ్ణి విడదీసుకొన్నారు. దూరంగా వుండమన్నారు. ముట్టుకుంటే తంతా మన్నారు. పాపమా పసిబిడ్డ తల్లిని కాగిలించుకుని బావురుమన్నాడు. చిక్కి శల్యమైవున్న చిన్న కొడుకును చూడంగానే తల్లి కడుపు తరుక్కుపోయింది. వొళ్ళోకి తీసికొని బుజ్జగించింది. కొడుకుల్ని కూకలేద్దామనుకుంది. అంతలోకే వచ్చారు అసహాయశూరులు. విషాదవీణ మోగింది కన్నతల్లి కంఠంలో.]

అందకుండా మీరు ముందు పరుగేసుంటె
విడలేక తమ్ముడూ వెనకాలె వస్తుంటె
ధుమధుమా లాడారుటే! బిడ్డపయి
దుమ్మెత్తి పోశారుటే!!

వడగాడ్పులో శోష వచ్చి నాలుకయెండి
చెర్లోని దేవు డిచ్చిన నీళ్ళు త్రాగబోతే
కళ్ళెర్ర జేశారుటే! తండ్రిపై
రాళ్ళన్ని రువ్వారుటే!!

ధ్వజస్తంభముకాడ దణ్ణాలు పెడుతుంటె
మడిగట్టి కూర్చున్న గుడిలోని జేజాయి
మైలబడు ననన్నారుటే! నాయన్ని
మాలవాడనన్నారుటే!!

అన్నలంతా గూడి నన్ను కేటాజేసి
శివుడి గుళ్ళోకెళ్ళి చిందు లేశారంటు
వెక్కి వెక్కేడ్చాడురా ! నా తండ్రి
చిక్కి సగమైనాడురా !!

జట్టులో రానీక నెట్టి వేశారంచు
మరగిపోయెను మనసు తిరిగిపోయెను బుద్ధి
కరగి పోతున్నాడురా ! నావాడు
తరిగి పోతున్నాడురా !!

కడగొట్టు తమ్ముడని గారాబు తమ్ముడని
కనికారమేలేని కటిక రక్కసులార
ఏతప్పు చేశాడురా ! మీ సొమ్మ
ఏమి కాజేశాడురా !!

— కరుణశ్రీ

చెల్లీ!

చెల్లీ కన్నీరదేల ?
తల్లో గద్గదమదేల ?

నీ మధుర ప్రేమ పాత్రలో నీచులు విసమోసినార ?
నీ హృది విపంచితీగ నిలువున తెగగొట్టినార ?
చిగురించిన భవదాశాలత చింగర వందరయై పోయెన ?
కుసుమించిన నీ హృదయంలో కురిపించిరె నిప్పుల కుప్పలు ?
హసియించిన నీ అధరమునే వరియించెనె విషాదశ్రేణి ?

చెల్లీ! నీ నెచ్చెలి నా మిత్రుడు
నీ హృదయాధి నాథు గుండె
నెత్తురొలికిన భువిపై తల్లీ!
పెరిగి పోయెనో నీగళ సుమదామం?
చెల్లీ రాలిపోయెనో నీ నొసటి కుంకుమ!

నీ నెచ్చెలి గుండెనుండి దూసుకొన్న తుపాకి గుండ్ల
కఠిన కర్కశ విలయ ధ్వనిలో
నీ గాజుల మంజుల రావం, నీ కంకణ నిక్వాణం
నీ నవ్వుల చిరుమువ్వలు వినరావో ఇక తల్లీ?
వినబడవో ఇక చెల్లీ?

వగపేటికి చెల్లీ!
పగ బూనుము!
కలకాలం ఈ రాక్షస కలికాలం నిల్వబోదు.
కలకాలం ఈదానవ పరిపాలన సాగబోదు.
ప్రేయసి ప్రియు వియోగ బాధ, కన్నతల్లి కడుపుకోత
పసిగందుల దిక్కులేమి కల్పించిన రాకాసులు
మానవ మారణ హోమానికిచేసే దారుణ రణ సన్నాహం
ఫలియించదు! ఫలియించదు!

నీ రోషకషాయిత నేత్రం కురుపించిన అగ్నిధార
ఆ నీచులు, ఆ పాపులు హతమౌదురు,
వగపేటికి చెల్లీ
పగ బూనుము!

నును వెచ్చని గుండె నెత్తురడుగడుగున అర్పించిన
నీ నాథుని, నా యోధుని నిస్వార్థపు త్యాగశక్తి
నిరర్థకం కాదు తల్లీ!
ఈ శోకపు తెర వీడిపోయి, ఈ శోకపు వ్యథ తీరిపోయి
నవలోకం ప్రభవించునులే
దానవలోకం సమయునులే
మానవలోకం వెలయునులే,
వగపేటికి తల్లీ
పగ బూనుము!

నీ పగ తీరునులే చెల్లీ! నీ వగ తీరునులే తల్లీ!
నవలోకం ప్రభవించునులే, నవజీవం కుసుమించునులే
వగపేటికి చెల్లీ
పగ బూనుము!

— తుమ్మల

కత్తెరలోకంతం

ఇంతలోనే బెదురు
అంతలోనే అదురు
జనియించెనా!
ఊర్కి తాటిలో కంత మొకసారి కనిపింప
అంతలోనే అదురు ఇంతలోనే బెదురు
జనియించెనా!

ఏడవకే, ఏడవకే, ఏడవకే అమ్మా !
అదేమిటా వేనలి ? వేసుకోముడి తల్లి !
కాదుసుమ్మిది మరణం, నిజం నమ్మిదే జననం!

ఇది యుద్ధభూమి మానవుడా !
యుద్ధభూమి వీరుడా, ధీరుడా !
ఇచటనే ఇచటనే తిన్నగా తీపిగా
సెలయేరు గళమెత్తి పల్లవులు పాడగా
అచటనే అచటనే బలముగా
ఉద్యమం, కలల అలల ఉద్యమం లేవగా,
మోయలేని బరువు దింపుకుందుకు బ్రతుకు...

....

నేనెక్కిన ఉరిపీఠం
టాన్యా కూర్చున్న పెండ్లిపీట !
అహో! మూగినమూక మూగస్వరాల గానం...
కాదా ? ఇది గీతం, సంగీతం !
మాధవరెడ్డి, గేబ్రియల్ పెరీ, భగత్సింగ్, ఫ్యూజిక్‌లు
హాయిగా సన్నగా వాయించుసన్నాయి !

నాపై కప్పిన యీ వస్త్రం
పెళ్ళినాటి మధుపర్కం !
అదే అదే ఊరేగుపల్లకీ ! ఇవేఇవే ఇవేఇవే
కయ్యార్ కామేడ్‌ల కంటినీటి తల్రాలు !

ప్రతియింటి పిదప మనయింటి గడప
పూయవే పసుప్ప, పెట్టవే బొట్టు !

ఏవాకిలి లేదాకలి
ప్రతి గొంతూ పాడుకొనును !
చివురాకు సందులో పూసేటి మంకెన్న,
లేతాకు ముంగురుల నూగాడు మందార,
నాహృదయమున పరచు ఎర్రన్ని ముఖమల్లు
పూసిన సెంటుఆశల వాసనల జేబురుమాలు
జండా, జండా, నా ఎర్రజెండా !
కూలీలకండా నా సిల్కు-జండా !!

కూలిపేటలు కదల కాకిచే కబురంపు
గగనమంతా నిండ ఎర్రజెండా లెగురు !
చిటివలస పొగగొట్టం, పందలపాక నూలుపోగు
కాకినాడ ఉప్పుగల్లు, బెజవాడ రైలింజను
చల్లపల్లి రెల్లుగడ్డి, విశాఖపట్నం ఓడరేవు
తెలంగాణ పాలికాపు, కరవలేని మేకకూడ
గోదావరి ఎర్రనీరు, కృష్ణానది జడపాయ
తూటాలేని తుపాకీ, ఊరూరూ ప్రతి ఊరూ
వాడవాడ ప్రతి వాడా, ప్రతి ఓడా, ప్రతి వాడా
ఎందరో మనవెంట మన బాట,
ఎందరో అందరూ మనబాట ! మనపాట !
ఎందరో అందరూ అందరూ అందరూ
ముందుకే! ముక్తికే! ఎందరో అందరూ !

— అవసరాల

కాటువారు, యులమర్రు, కడలూరు...

ఎర్రజెండా ఎగరేస్తూ, కొడవలి ఝళిపిస్తూ
సందులను గొందులను చవిటి సంస్థలను
అవిటి గోడలను, అనేకం
శతఘ్నితో ప్రేలుస్తూ, రాలుస్తూ
వక్రరేఖ ప్రతుకులను
వంకర టింకర జగతిని
రూపుదిద్ద కరిగిస్తూ,
చిందించిన నెత్తురుకో
ఊరికంబాలకు బలి అవుతూ,
ఉషస్సు నాహ్వానించే, హవిస్సు ప్రేలుస్తూ
చరిత కెపుడూ మూడు యోజనాల
ముందుచూపు మానవుడా!
నవమానవుడా!

వానలక ఎండలక మెరుపులక ఉరుములక
పిడుగు మీద పడుతుందనక
కష్టాన్ని నష్టాన్ని కాదనక,
శని శని మహాశని ఏలినాటి మహాశని
ఏలే నేటి మహాశని
శని విరగడవుతుందని, ధాత్రి పరమళిస్తుందని
సతులను సుతులను సంపదలను లెక్కించక
తమస్సును తరిమే తపస్సు!

ఒక ఊరు, ఒక యింట నివసించక
గనులలో, వనాలలో, గట్టులచెంత
పట్టలలో, కొండలలో, కొండచిలువ
కడగిళ్ళలో, లోయలలో, లోయల
లోతులలో, పాతాళాలలో,
కంటకావృత పథాల, వృత్తపరిధుల
చలి, గాలి, నిశీరాత్రి
నిర్మించిన ఉద్యమం
కవచం, ఖడ్గం, బాణం
శిరోధార్యం, శిరస్త్రాణం!!

మా గుండెలు మండే నిప్పులుగా, ఒక కుంపటి !
మా కెంతో దూరంగా, భారంగా, ప్రవాసం !
ఊరు కాని ఊరు కడలూరు
కలకత్తా ఆలిపూర్, నాసిక్
సేలం, మధుర, తంజావూర్
జైలు లోపల, జైలు బయట
గాయాల ఎర్రని చూపులు !
మరణాల గుసగుసలు !
అది అంధ్రావని
గ్రామం ఎలమర్రు
పగిలిన జాడీలు, విరిగిన పెట్టెలు
కూలివాళ్ళ కూటి కుండలు, ఒలికిన పాలు
నేలకలిసిన పెరుగు వీధిబడిన సంసారం!

ప్రస్తాలు తెగగా రాలిన, నల్లపూసలు !
రొమ్ములు బాదుకు, రోదించే తల్లులు !
ఇది తెలుగు దేశం, ప్రతిలింగ దేశం !
ప్రతికలింగ దేశం !

ప్రాతాళరాశం, కాళహస్తి, శ్రీశైల మధ్యస్థ
ప్రదేశం ?

అది కృష్ణా జిల్లా, గ్రామం కాటూరు
భార్యయెదుట భర్త, కూతురెదుట తండ్రి
మగవాని ఎదుట మగువ
కట్టు బట్టలు బెరడులా ఒలిపిస్తే
అడగండయ్య అడగండీ !
ఇదా రామరాజ్యం
ఇదా ప్రజల స్వరాజ్యం ?
తనుజులు అనుజులు, ఇరుగు పొరుగు జనులు
అనేకులోయ్, అభాగ్యులోయ్!
అంతా సహోదరులోయ్ !!
అడగండయ్యా అడగండీ !
ఓ దుర్యోధన దుశ్శాసన
ధృతరాష్ట్ర చెన్నరాష్ట్ర అసెంబ్లీ !
మీలో లేడేమి, అడగడేమి ?
అలగడేమి ? ఒక విదురుడైన !

అది ఆంధ్రుల దేశం !
ఊరు ఎలమర్రు !
ఆమె.... ....ఒక యింటి ఆడపడుచు
మరొక యింటి కోడలు !
అత్తవారొక చేతికి
గాజులు వేయిస్తే
చిన్నారి చిట్టి తల్లికి
పుట్టింటి వారొక చేతికి
గాజులు తొడిగిస్తే.... ....
ఆమె.... ....సిగ్గు.... ....దొంతరల
సీమంతపు పెండ్లికూతురు !
ఆ అన్నపూర్ణ బులపాటాల
కలల గలగలల అమృత హస్తాల
నిండిన గాజులు చిటపట చికాకులో
ఒక తృటిలో చిక్కెను
పగిలెను పడెను గుట్టలుగా !
అమె.... ....ఒక యింటి ఆడపడుచు
మరొకయింటి కోడలు !
పురిటికి పుట్టింటికి వస్తే
ఆచ్చుబోసి విడిచిన
ఆబోతుల తాపులకు
ఆపుకోలేని.... ....అమానుషం,
పాపం, గర్భస్రావం !!
అధికారాతిశయం, కైపెక్కిన కర్కశుడా

గత చరిత్ర తెలిసిన గోరింగ్
గొబెల్సు 'హిట్లర్' హిమ్లర్
పోనీ, ముసులోనీ నడుగు !

అది తమిళదేశం ! జైలు కడలూరు
నేలకు కరుచుకు, నుసుగులు కక్కుతు
గిలగిల కొట్టుకు, కాళ్లూ చేతులు
ఊడినవాళ్లూ, పెదవుల నెత్తురు
చిందినవాళ్ళూ
తలలు పగిలిన తమ్ము లనేకులు !
నిముషం, ప్రతినిముషం
నిత్యం అనునిత్యం
సైఫిల్ ప్రమోతల గింగిరులు
బాంబుల మబ్బుల, సందుల చాటున
ఇంద్రజిత్తు ఎత్తుగడలు !
హాస్పటలని, అసలేలేదు
లేదు రోగులనే, విచక్షణ
శూన్యం నిరాహారవ్రతులనే నియమం
వినరు డాక్టరరచినా !
కడలూరు జైలు గోడల, కటకటాల
కత్తెర బోనుల, కలకత్తా నాసిక్
సబర్మతీ వెల్లూరుల జైళ్ళ వలల
చిక్కుదారాల, విద్యుత్ తీగల ముళ్ళ
కంచెల నడుమ

గదుల చీకటి గుహాల
కౌరవులు పన్నిన పన్నాగం !
లాక్షా గృహదహనం !!
అడగండయ్యా, అడగండీ !
అడుగుతున్నాం. కావాలి సమాధానం !
ఎవరికోసం, చెబుతావు
సమాధానం, !
తేలాలి నిజా నిజం !!

— అవసరాల

తెలుగోడా !

చేయెత్తి జైకొట్టు తెలుగోడా !
గతమెంతో ఘనకీర్తి గలవోడా !

సాటిలేని జాతి – ఓటమెరుగనికోట
నివురుగప్పి నేడు – నిదురపోతుండాది

జైకొట్టి మేలొక్కులుపు తెలుగోడా !
గతమెంతో ఘనకీర్తి గలవోడా !

వీర రక్తపు ధార – వారబోసినసీమ
పలనాడు నీదెరా – వెలనాడు నీదెరా

బాలచంద్రుడు చూడ ఎవరోడ్తోయ్ !
తాండ్ర పాపయగూడ నీవోడవా !

నాయకీ నాగమ్మ - మల్లమాంబ, మొల్ల
మగువ మాంచాల నీ - తోడబుట్టిన వాళ్ళే
వీరవనితల గన్న తల్లేరా
ధీరమాతల జన్మ భూమేరా
గతములో నీకీర్తి - కతలల్లి చెప్పారు
పసయేడ దాచావూ - వుసిలేకపోయెరా
బ్రతుకే బరువై యుంటి వీనాడూ
శతపోరి సాధించు తొలిపేరు
నాగార్జునుడి కొండ - అమరావతీ స్తూప
భాజాల పుట్టిలో - జీవకళ పొదిగావు
అల్లూడను కానంచు తెల్పావూ
శిల్పినంటివి దేశదేశాల
దేశమంటే వట్టి - మట్టి కాదన్నాడు
మనుషులన్నా మాట - మరువబోకన్నాడు
అమరకవి గురజాడ నీవోడు
ప్రజల కవితను చాటి చూపాడోయ్
రాయలేనిన సీమ - రతనాల సీమరా
దాయగట్టే పరులు - దారితీస్తుండారు
నోరెత్తి యడుగరా దానోడా
వారసుడ వీవెరా తెలుగోడా
కల్లోల గౌతమీ - వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్రా తల్లి - పొంగి పారిన చాలు
ధాన్యరాసులే పండు దేశాన
కూడుగుడ్డకు కొదువలేదోయ్

పసిడి పాతర నీది - పరుల నోరూరెనోయ్
నీలో నీకేపెట్టి - నెత్తిచే యెట్టారు
దేశాన్ని దిగమింగి పోయినాదోయ్
మోసాన్ని గుర్తెరిగి కాపాడోయ్

ఉత్తరాదీ మొదలు దత్తమండలమంత
తెలగాణ ప్రాంతములో - చెలిమి గలిగించాలి
కలిసి మెలసీ నేము పోవాలోయ్
కలిమి బలిమీ కూర్చుకోవాలి

ముక్కోటి బలగమోయ్ !-ఒక్కటై మనముంటె
యిరుగు పొరుగులోన - చూపు పేరుంటాది
తల్లి వొక్కతె నీకు తెలుగోడా
సవతి బిడ్డలపోరు మనకేలా

పెనుగాలి వీచింది - అణగారి పోయింది
నట్టనడి సంద్రాన - నావ నిలుచుండాది
చుక్కాని బట్టరా తెలుగోడా
నావ దరి జేర్చరా మొనగాడా

స్వాతంత్ర్య భారతిలో - స్వేచ్ఛతో మన జాతి
లాయలాస లేని యా - కే లాసమాతాది
చెయి గలిపి సాధించు స్వారాజ్యం
జయమంది భోగించు నీరాజ్యం

- శ్రీకృష్ణ

ధిక్కారం

దంతాలమేడలో మంతనాలాడేటి
గొంతులో అమృతమూ, గుండెలో గరళమూ
మండేటి మనుషులకు, గుండ్రాతి బతుకులకు
కండలో నెత్తురే కళపెళా ఉడికింది.

... ...

లోకమొక్కిక అగ్నికుండమై లోకాలోకముదాకా
చీకటి కాటుకకొండై వేసారిం దీ శాంతికి.
అలసటెరుగని శాంతి ఆ కలతెరుగని శాంతి
అన్నినోళ్ళను గొట్టి ఆవలించిన శాంతి.

అగ్గినిబడిపొరలాడే తగ్గుల సందుల కొందరు
అగ్గలకెగసిన మిద్దెల రగ్గులమడతల కొందరు
లేనిశాంతి పోనిశాంతి; కానిపోని మాటలలో
కనిపించక ఉన్నశాంతి; పరుగుల పొరలని శాంతీ
మరుగుల దాగని శాంతీ;

మానవ్రజ కోరుశాంతి బానిసకూలీ శాంతీ
నాకుశాంతి నీకుశాంతి సర్వశాంతి కోరిందీ,
ఆకటితో చీకటితో రోకటిపాటుల రొదతో
చాకిరీల బరువులతో వేకువకై వేచిందీ...

... ...

సాకార స్వార్థరాశి భీకర రాక్షసరూపపు
కేకలతో గుండెల్లో బాకులు మొలకెత్తినవే.

... ...

ఆగడంక సాగదింక, నాగుబాము నాణ్యాలని
ఊగులాడు సంకెళ్ళను లాగి విరగ్గొడుతోంది.
అదిగదిగో కదం తొక్కి-
పదంపాడి నడంపోల్కి- వస్తుంది
వేడెక్కిన మాలోకం.

... ...

గాండ్రించిన బెబ్బులిగొంతై,
తీండ్రించిన బలిపొలికేకై, విడదీసిన పిడికిలిబాకై,
విదిలించిన సింహపుజూలై, అదిలించిన వీరగర్జయై
పగిలించిన ప్రళయంబాంబై, రగిలించిన అగ్నిగోళమై
నగారాను వేసిందీ-ధీరతతో శూరతతో
ధిక్ ధిక్కని అధర్మాన్ని ధిక్కరించి, రణస్థలిని,
ఘీంకారం చేస్తోందీ!

— విశ్వం

పృథ్వీగీతం

ఓహోహో ! ఓహో ! పృథ్వీ !
ముద్దరాలి వపుడూ ఎపుడూ
పుణ్యానదీజలాలతులము పూజించితిమమ్మా పృథ్వీ !

నీ శీతల జలకరాల మిన్నుల కభిషేకమిచ్చి
నెమలి పింఛముల మనసులు, నీలి కళ్ళపూలు తెచ్చి
విశ్వోధృత గతిలో పీఠమమర్చి -
వెన్నెల వన్నెల వలువ ధరింపించామే,
పాలగుండ్లలై మేమే, పండ నవతరించామే !
ఒహ్హో ! నీలో మృత్యువు విషవృక్షం
పెరిగి. నేడు ఫలములు మాకా ?
నేటికి నీవా మాతవు ?
రుధిజ్వాలలు కక్కే- చీకటిగుహ నీగర్భమో !
అమ్మా పృథ్వీ !
చల్లని నీ గర్భముపై మా అవ్యక్తపు
కొనగోళ్ళులు ప్రాకి లిఖించిన వేమో
శాశ్వత శాసనాలో, స్మృతులో
చిలిపి చక్కిలిగింతలు విశ్వాలతలు కేపాయో !

పసిలేచే నీ పాపలె రాలిన నక్షత్రాలా,
పకపక నవ్వే పాపలె ఆరిన నక్షత్రాలా,
గర్భవ్యధ కోర్వలేని బాలింతవో ఓ పృథ్వీ !
సుకుమార కుసుమప్రాణుల, మానవులను
కుంసటిలోనే పూడ్చావా !

పృథ్వీ ! పృథ్వీ !
ఊహ తెగిన ఏ లోకంనుంచో నవ్వుతు కేకుతు
యుగయుగాలుగా ప్రవహించిన ప్రాణికిరణమై

వచ్చిన మాకై,
నీ సర్వం బూజర చీకటిమానై మింగావా!
నీ సర్వం గ్రహాంతరిత నిశ్శబ్దంగా తాగావా!

మహాపాపి భూమీ!
బ్రతుకే వ్యర్థగా బిడ్డలు గతులాగి నశిస్తున్నారే
మానవులే!
జననమరణ పర్వతాల కనుమలలో పడి
నడిచే నీడలమే,
పెద్దపులుల పంజలెవో, కొండచిలువ నాల్కలెవో
ఊపిరి బిగబట్టిలేచు!
సుళ్ళుతిరుగు విష ఝుంఝులు గిరగిరగిర
యోజనాల కెత్తినవీ,
ఆకలి పొగలేని మంట ఆవరించి మిన్నంటును,
పడగ విసురు మూగమంట నాల్కల కత్తులై
ఝళితములై లేబ్రాణుల గళములు ముట్టినవో!

ఓహో! ప్రాక్పశ్చిమ దిగ్భాగాలే
కాలిన గ్రంథపు పుటలో-
ప్రాణిప్రాణి కమలిన నల్లని మసిలో
అణువులుగా విడిపోయిన పదమో!
జీసస్ గౌరీ కప్పిన గాయై పడినదోహో చీకటి!
గౌరీలోపలి వెచ్చని ఆవిరులై, ఘాటౌ వాసనలై
ఎగయలేని జ్ఞానుల జాగృతి!

కాలవస్తు పరిణామాలేకమైన విశ్వగతిలో
భగదగితమై వెల్గిన కాలిబూడిదై రాలిన
త్రోక్కచుక్కలా దర్శాలో!
చేతులు విప్పి నటించే చీకటి తొడ్డపై
కాలిన హింసాచక్రపుటిరుసు అరుణ బింబమో!

* * *

ఊహా తెగిన ఏ లోకంనుంచో
ఉవ్విళ్ళూరుతు వచ్చానే!
నిలి గుడారంకింద క్షణాలు
మధుకోహాలనుచు వచ్చానే!

తెరచిన భూవదనపు పెదవులలో దిగిపోయే
నేనహో! మానవుణ్ణి!
కాలికింద అహో!
నోరు తెరిచి మృత్యువు కోరలు,
పంజ తెరిచి మృత్యువు గోళ్ళూ;
పడగలూది మృత్యువు కోరలు,
పడగలెత్తి మృత్యువు బుసలూ;
పట్టి గుంజి పృథ్వీ గర్భపుటడవుల చీకటిలోతో,
లోలోపలి సంద్రపు టట్టడుగులకో!

నేనే! నేనే! మానవుణ్ణి!
మరిచిత్తికో స్మృతి ప్రవాహమున
గడపేసిన బాటలు,

పసుపు తెలుపు లోహాలకు పేరాశలు లేనివాణ్ణి
మానవుణ్ణి !
మినుకు మినుకు అంగారకులో విప్పిన
మానవ నేత్రం
తెలుపు నీలి తళుకు లింకి
రుధిరార్ణవదీప్తి పొంగు !
నా మానవ హృదయగోళమున కాంక్షా జ్వాల లేదు !

పృథ్వీనోట పడిపోయే నాలో
నరాలలో భయో ధృతాలవేలో ?
జీవం విహ్వలించి దహించేనో ?
కన్నెత్తనో కరుణాలవాలు గోళాలు !
మిన్నెత్తదో నేనద్దిన రక్తపతాక !

ఆరిన కొడిగట్టిన దీపశిఖల చేతులెత్తి
ఎత్తి ఊపి పిలిచానో
దిగిదిగి పోతూ వొణికి తెగే వేళ్ళులు,
వ్రేళ్ళుల చివరలు కనబడవో !
నా కేకలు ప్రాణశక్తులు జ్వలించు
గోళాలకు వినబడవో !

వేళ్ళుల కొనగోళ్ళుల తళుకులె
పిలువవొహో !
నా కేకలు కంపించిన బ్రహ్మాండపు
హాహా ఘోషలొ మునిగినవో !

ఇదికాదా ఘక్కున బ్రద్దలైన శంఖం
కపుపు వెడలి
విస్మృతిలో రోదించే నాదమూర్తి!
ఇదికాదా స్వచ్ఛందుని తలలో జనించి లయచెడి
రూపు నశించే సత్యశక్తి!
ఓహోహో! ఓహో! పృథ్వీ
శెల్లని చల్లని సూర్యుడు కాలిడు ఇల్లా ఇది?

(నౌఖలి, తిప్పేరా, పాట్నాలలో దగ్ధమైన అమాయకుల, అనామకుల ఆక్రందన.)

— అనిసెట్టి

సమధర్మం

తన చరిత్ర తనె పఠించి,
ఘక్కున నవ్వింది ధరణి:
తన గాథను తనె స్మరించి,
భోరున ఏడ్చింది ధరణి.

నృపజగతి సమాధిపై సమధర్మం ప్రభవించును:
నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళుకువ పుట్టును.

ధరణీచక్రం గిర గిర పరిభ్రమిస్తోం దదిగో!
నిమ్నోన్నతముల జగతికి ఉద్వాసన చదువుతోంది.

'పరాధీన పురాలోక వక్రగతీ కృతకత్వం,
నిరాశాసలమ్మై దీనుల ప్రేల్చిన కుటిలత్వం!'

దరిద్ర ధరణీ గీతికి ఆకాశం ద్రవించింది !
దరిద్ర ధరణీశోకం దిక్కులలో ధ్వనించింది.

నిద్దుర కనురెప్పలలో నిలచిన నీడలె పడగల ?
హద్దుల అవకాశాలే బలిపశువుకు పాశాలా ?

ప్రజల పుత్రకామేష్టికి భూదేవత ప్రసవించెను !
పురిటిబిడ్డ, క్రాంతి శక్తి, భువి క్షీరం గ్రోలుతోంది,

నిన్నా నేడుల కృషియే రేపై జన్మించుతుంది !
ఓహోహో ! మానవుడా ! సంధించుము, ధనుష్కోటి !

నిరంకుశుల ఆక్రమణకు శరణాగతుడే నరుడా ?
నరకాసుర చెరసాలల పుడమితల్లి పసిగందులె బందీలా?

ధరణి తనూజులు నేటికి-దనుజులకే బానిసలట !
తరుణ జీవన జ్యోతులు నిశాచరుల బాటలకే దీపాలట !

కృపాణముల ధగద్ధగలు దిక్కులలో ప్రతిబింబించెను,
ప్రతీకార రణదుందుభి దిక్కులలో ప్రతిధ్వనించెను.

పగిలిన నిశ్శబ్దంవలె పగ్రతాపులు లేచినవో !
రగిలిన ప్రళయజ్వాలా తాండవ కోలాహలమో !

నిరాభగ్యుల గుండె చీల్చి, ధనికుల ప్రతావిన రక్తం,
నరభక్కుకుడగు దుందుభి కట్టిన ఎముకల దుర్గం,

వర్తమాన లోకంలో వ్యర్థగాధలై తీరును,
భవిష్యత్తు వెలుగుల్లో చెరిగిన వెతలై పోవును.

తన గాధను తనె పఠించి పక్కున నవ్వింది ధరణి,
తన చరిత్ర తనె స్మరించి భోరున ఏడ్చింది ధరణి.

వృద్ధజగత్సమాధిపై సమధర్మం ప్రభవించును,
నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళుకువ పుట్టును.

ధరణీచక్రం గిర గిర పరిభ్రమిస్తోం దదిగో!
నిమ్నోన్నతముల జగతికి ఊర్ధ్వాసన చదువుతోంది.

భువి తనయుల ప్రాంతిశ క్తి ఎత్తిన రక్తధ్వజం!
దద్దరిల్ల దశదిశలను, సోకిన విప్లవకంఠం!!

భువి యొక విప్లవ మూర్తై, నిలువుకాళ్ళ నిలుస్తోంది!
అరుణారుణ పతాకమై ఆకాశం మెరుస్తోంది.

యుగధర్మం: చైతన్యం-జనహృదయం! పోరాటం.
తిరుగుబాటు! తిరుగుబాటు! తిరుగుబాటు-బావుటా!!!

తిరుగుబాటు బావుటాలు జగమంతా నిండినయ్,
శత సహస్ర కంఠమ్ములు ప్రతిచోటా కలిసినయ్.

ఇదిగో! విప్లవ దుందుభి వినిపించిన సందేశం!
'భువి సమస్త సుపదలకు అధినాథులు మానవుల'ట!

ధరణీ గీతం లోపల నవ్రశుతులే పలికినవట!
ధరణీ హృదయంలో నవ సమాజమే వెలిసినదట!

వృద్ధజగతి సమాధిపై సమధర్మం ప్రభవించును!
నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళుకువ పుట్టును.

ధరణీచక్రం గిర గిర
పరిభ్రమిస్తోందదిగో!
నిమ్నోన్నతముల జగతికి
ఉదాసన చదువుకోంది.

— సోమసుందర్

ఆకలి నోలు కలనీ....

కాలం బ్రతుకు తెరువు ప్రక్కన
విరిసిన దిరిసెన చెట్టుక్రింద
మసకమసక నీడల్లో కూర్చుని,
పాపం!-ముదుసలి చరిత్ర— పూర్వగాథ స్మరిస్తోంది!
గతానుభూతుల పచ్చని, నులివెచ్చని జ్ఞాపకాలు
నెమరేస్తోంది!!

పేదజనుల లోకం దాఖలు చేసుకున్న
ఆకలి దరఖాస్తులు అందుకోనని కర్కశ పరిపాలన
ఈకుచేల అన్నార్తులలోకం,
ఆకలికంటుకు పోయిన పొట్టల...
ఆకలి ఆరాటంతో కనలికనలి,
అలమటించి జీరపడిన గొంతుల...
ప్రదర్శనం చేస్తుంటే చూడని వినిపించుకోనని
దుర్మదాంధ - దుశ్శాసన కర్కశ పరిపాలన!

ఆకలి నాలుకలెన్నో
ఏకమౌచు ద్వారంకడ అరుస్తూంటె,
'అరచి అరచి అరచి అవే అలసి తిరిగిపోతవిలే !'
అని తలపోస్తూ, ఆయాసంతో ఒగురుస్తూ,
విలాసాల కైలాసం కట్టుకున్న
కుబేర లాభార్థులలోకపు
కర్కశ పరిపాలన !
పాపం, చరిత్ర ముదుసలి, నివ్వెర పోతోంది !
ధనస్వామ్య లోకపుకోపం పేదజనుల లోకంపై విసరిన
పగనాగుల శాపానికి బెదిరింది పాపం ముదుసలి !

ఆకలి నాలుకలన్నీ ఏకమైనరోజున...
ఆకలి నాలుకలన్నీ ఏకంగా ముందుకు సాగినరోజున...
——సంశయ మెందుకు ? ఆరోజున విజయం ఎవరిది ??
ఆకలి నాలుకలన్నీ అరచి అరచి,
ప్రళయంవలె గర్జిస్తాయి !
శ్రమనెరుగని శ్రీమంతుల కర్కశ పరిపాలనను
ఆజేయమై ఎదిరిస్తాయి !!
పేదల కష్టాలను, శ్రమజీవుల స్వేద బిందువులను,
నాణెములుగ మార్చుకొనే కలవారల,
కర్కశ పరిపాలనను
పగతీరా బ్రద్దలు చేస్తాయి !
విరామ మెరుగని ప్రగతీరావంతో
ఆకలి నాలుకలన్నీ నినదిస్తాయి !!

పాపం ! చరిత్ర ముదుసలి ఏదో తలపోస్తోంది !
కాలగతిని పరిశీలిస్తూ! క్రాంతి తరంగాలను చూస్తూ
పాపం ! చరిత్ర ముదుసలి
పిచికి గుండెవలె బేజారయింది !

ఆకలి నాలుకలన్నీ
ఏకంగా ఉప్పెనలా ఉప్పొంగుచు
దుశ్శాసన రాజ్యంలో...
ధనస్వామ్య కఠోరపరిపాలనలో,
కుబేర దుర్గాలను గుభిల్లు గుభిల్లుమని కూలుస్తున్నవి !
కుబేరలోకం సమాధిపై పేదజనుల కుచేల లోకం...
కోటికోట గొంతులె త్తి
స్వామ్యజగతి స్వాగత సంగీతం
ఆలాపిస్తున్నది ! !
కల్లోలిత జనసందోహం చూస్తూ
గజగజ వణికెను భీతికి,
చరిత్ర ముదుసలి పాపం ! కోలాహల స్వాగత గీతికి
కొత్తగాలి పీల్చుతోంది ! !
జీరపడిన ముసలిగొంతు లోలోపల సణుగుతోంది.
"ఓహోహో స్వప్నంకాదుకదా
ఎంతలోనె ఎంతమాట్పు ! "

ఆకలి నాలుకలన్నీ
ఏకమైన రోజున...

ఆకలి నాలుకలన్నీ
ఏకంగా ఉవ్వెనలా ఉప్పొంగిన ఈరోజున...
ధనస్వామ్య కఠోరపరిపాలన,
ఛిన్నాభిన్నంగా నుసినుసిగా నశించి పోతున్నది !
వేదజనుల కుచేలలోకపు ప్రతీకార జ్వాలల్లో...
దుశ్శాసన కర్కశ పరిపాలన
పటాపంచలై భస్మీపటలమ్మై
నశించి పోతున్నది !
మంత్రసాని చరిత్ర ముదుసలి
'కాలగతి'కి - గర్భవతికి,
పురిటినీళ్ళు పోస్తోంది !
ప్రభవించే నూతన జగతికి
—పురిటి బిడ్డ - 'సమధర్మ'నికి
పురిటినీళ్ళు పోస్తున్నది,
'చరిత్ర' మంత్రసాని ముదుసలి !

— సోమసుందర్

కలకత్తా కాళి ముందు

కలకత్తా వీధులలో
వీధులలో సందులలో
కలకత్తా కాళిముందు
ఆకలిత్తో పోరలేక
బలి అవ్వతూ, చనిపోయారా ?

ఈలోకపు తలుపు తెరిచి
వెళ్ళిపోయారా!!

మీరు పుట్టిన మనదేశం
మీరు మెట్టిన భూఖండం
రతనాలను పండుతుంది
ముత్యాలను నవ్వుతుంది!

ఈ తల్లిని మీ మాతను మిమ్ముకన్న
ఈ నేలను, జాలిలేక వొంటరిగ
వొదిలేసీ, విడిచిపుచ్చి
వెళ్ళిపోయారా!

గిలు గిలితే పాలొసాయ్
నవ్వితే నవ్వుతారు!
ఏమెరుగని పసి కందులు

మీ పిల్లలు మీ బిడ్డలు!!
"మా బిడ్డలు, మా పిల్లలు
ఇన్ని పాలు పోయండని
జీవాలను నిలపండని
ఆక లాకలాకలంటు"
ఆకలిత్తో ఏడలేక
అది కరిచే, కరుపులకు
గాయాలకు తాళలేక
కురుపులతో వేగలేక

పొత్తిళ్లలో పిల్లల్ని
పక్కవిడిచి వీధి వదలి
వీధి వదలి, రోతజెంది
వెళ్లిపోయారా, మీరంతా
వెళ్లిపోయారా !
ఆకలాకలాక లంటు
అలమటించి కొట్టుకుంటు
అంబులెన్సు కారులలో
ఆస్పత్రికి మోసుకెళితె
ఇదిరోగం ఇది జాడ్యం
కాదుకాదంటు
అవతలకే కొట్టేశారా ?
మిమ్మల్నీ అవతలకీ నెట్టేశారా ?

కలకత్తా వీధులలో
వీధులలో సందులలో
మీ బిడ్డల్నాదిలేసె
ఏలోకం రమ్మందని
ఏ అన్నలు పిలిచారని
ఈ లోకం వదిలేశారు ?
మీరంతా కన్నీళ్ళతో
దారివెదికి వెళిపోయారు !!

— అవసరాల

పంటచేను పిలుపు

పచ్చపచ్చగ పైరిగి
పండి ఒరిగున్నాను
ప్రజకు నన్నందించరావా నారైతా,
ప్రళయమా కరువాపలేవా?

కార్తీక మాసాన
కరువంత భరియించి
కళ్ళల్లోపిరి నిలిపియున్నా, నారైతా
కష్టజీవుల గావలేవా?

కొత్త పంటొస్తేను
కూటి కరువేమిటని
కొండంత యాశతోనున్నా, నారైతా
కూలీల బ్రతికించ లేవా?

నే పండి నాపనిని
నెరవేర్చి కొన్నాను
నీదు కర్తవ్యమును నీవూ, నారైతా
నిలుపుకొన ముందునకు రావా?

— సుంకర

సైనికునివుత్తరం

ఇక్కడనేను క్షేమం, అక్కడ నువ్వుకూడా,
ముసలి అమ్మా, పాతమంచం కోడూ,
మనచిన్న బ్బాబయూ, చెరువులోకొంగ...

ఇపుడు రాత్రి: అర్ధరాత్రి.
నాకేం తోచదు, నాలో ఒక భయం!
తెల్లని దళసరిమంచు రాత్రి చీకటికి అంచు;
దూరంగా పక్క-డేరాలో కాగ్పొరల్ బూట్సుచప్పుడు
ఎవరో గడ్డిమేటినుంచి పడ్డటు-డుటు

నిశ్శబ్దంలో నిద్రించిన సైనికుల గురక
చచ్చిన జీవుల మొరలావుంది.
అబ్బ చలి; నెత్తురు చల్లపడే నల్లపడేచలి!
పొడుగాటి చుట్టకాల్చినా, 'లిండెల్'
(రూపాయి దాని పాపం ఖరీదు)
లిండెల్ గుండెల్ హత్తుకొన్నా,
దాని సారానోరు నీరుతాగినా ఈచలి పోదు!

పోదు నాలో భయం, మళ్ళీ రేపు వుదయం
ఎడార్లూ, నదులూ, అరణ్యాలు
దాటాలి: బ్రౌంచెస్‌లో దాగాలి;
పైన ఏరోప్లేన్, చేతిలో స్టెన్‌గన్
'కీ'యిస్తే తిరిగే అట్టముక్క సైనికులం

మార్చ్ !
వన్, టూ, త్రీ, షూట్ డెడ్ ! ఎవడ్ !
నువ్వా నేనా !
కేబుల్ గ్రామ్ యిప్పించండి కేరాఫ్ సో అండ్ సో
'మీవాడు డెడ్ !'

స్పృహతప్పిన ఎనేస్తేషియాలో
వెన్నెముక క్రిరలా బిగిసింది.
యుద్ధం, యుద్ధం, లిబియాలో, బెర్లిన్‌లో
స్టాలిన్‌గ్రాడ్‌లో స్వార్థం పిచ్చికుక్కలా పరుగెత్తింది.

అబ్బ; వణకించే చలి.
అందరూ నిద్రపోతున్నారు,
అందరూ చచ్చిపోతున్నారు
అర్ధరాత్రి దాటిందని గ్రామోగిన ఒంటిగంట
మంటలూ మొహాన్ని కొట్టింది.
నేను ఇదివరకటి నేనుకాను,
నాకు విలువలులేవు, నాకను భూతుల్లేవు
ంపడం, చావడం,
దువ్వడంలాంటి అలవాటయింది !
మూ యూనిఫారమ్ కింద
ఒక పెద నిరాశ ఒక అనాగరికత
బిడ్డికింద నదిలాగ రహస్యంగా ఉంది.
వదలలేని మోసపు ఊబిలాగఉంది
నేనంటే నాకే అసహ్యం,

అంటుకే మరీమరీ చంపుతాను, మరీమరీ తాగుతాను.
ఇంకేంచేసినా ఎవరూ ఒప్పుకోరు,
ఇంక తెలవారుతోంది
దూరంగా ఆల్ప్సనుమీద మంచు
దుఃఖంలా కరుగుతుంది.
ప్రభాతం సముద్రంమీద వెండి నౌకలా ఊగుతూంది.
తిరిగి ఎప్పుడు మనవూరు వస్తానో, నిన్ను చూస్తానో,
అందమైన తెల్లని నవ్వు నీ మెడలో
గొలుసు గొలుసులుగా కదిలినప్పుడు
అదో విధమైన చెమ్మగలిగిన నీచూపు...
నెమలికేక్‌లా విప్పుకొన్నప్పుడు
ఎన్నాళ్ళకి, ఎన్నాళ్ళకి!
కొన్నివేల మైళ్ళదూరం మనమధ్య
ఒకయుగంలా అడ్డపడింది.
ఇంక సెలవు మైడియర్,
నిద్రవస్తోంది మత్తుగా, నల్లగా,
అదుగో సెంట్రీ! డేరాముందు గోర్ఖాల్లా
అదిగో, ఇంకా కార్పొరల్ బూట్లు
కదుపులోనీళ్లు కదలుతూన్నట్లు;
జాగ్రతసుమీ! జాగ్రత!
నువ్వూ పిల్లలూ, బల్లులూ-అందరూ!
మళ్ళీజవాబు వ్రాయిసుమీ, ఎన్నాళ్ళకో మరి!

సెలవ్, అబ్బ చలి,
చలిగాలి గుండెలమీద కత్తిలా తోగింది.
నీరూపం నా దేహానికి వెచ్చగా తగిలింది!

— తిలక్

స్వాగత వచనం

మా కోసం మా రక్షణకోసం.
మందుగుళ్ళ దాహానికి ప్రాణాలందించే సవనశాలలో 'ఇక
సమిధలు చాల'ని చల్లనిగాలి కబురొకటిని వచ్చింది;
విజయవార్త తెచ్చింది, శాంతిస్థాపనకై నిను
సమదావని కర్పించి, నెత్తురు కూడినాళ్ళా
తిన్నాం.
మాన, శతఘ్నికా రణనంలో.
నిక భైరవ గర్జారభటీ
నరబలిలో శాంతికై
సమరచ్ఛాయలలోనే
రాసనసభ చర్చలలో,

సాహసిస్తావా నీవక్కడ సాధించిన శాంతిసుధలు
పటిమలేని మా అంజలి పటుసడిలి, జల జల జల,
పసుగులతో, నుసుగులతో, రణరంగస్థలి వంకే
ప్రవాహాలు కడుతున్నై ?
అరికడతావో ? బల్మిని ఆనకట్టలేస్తావో ?

రా తండ్రీ—రా యింటికే—
దేశమాత కవ్వగింటికె ! నిన్ను గూర్చి నిట్టూర్చి.
ఆశవదలుకొన్న గృహిణి, ఆశలు విడలేని జనని -
నాన్నేడని వేధించే నలుసులు ; కసుగాయలు, పసిపాపలు
వాకిళ్ళకడ నిరీక్షిస్తూ, కళ్ళే కప్పురపుటారతి
పళ్ళెరములుగా నిల్చి, పలవిస్తున్నారు.

ముసిగే నోకల తేలి, ప్రేలే బాంబర్లరాలి,
ఎడారిసీమలనెండి, నెత్తుటిరొంపిని పండి,
అలసి సొలసి, డస్సిపోయి, అయాసంతో
కాటకాలు విడిసిన మా కంచంలో నీకా
పరమాన్నం పంచగలా ? అమృతా

పీరుడవు : ప్రపంచ విద్రావణులని,

భారత శౌర్యజ్వాలా, తాండవించి నిలిచిందా ?
చూపర కనుగోనలలో తళుక్కు–మని మెరిసిందా ?

ని పౌరుష మురలించిన నెత్తుమ మున్నీటి కనల
బానిస భారతదేశపు భావిస్వప్నలోకంలో
వేకువ తెలి వెలుగురేఖ వెలిగిందా కనువిందై ?

ఇన్నాళ్ళుగ శ్రమించి నీ విలాతలికి పట్టించిన
అమరగంగ, అమృతగంగ పెటిలిన నరజాతి బ్రతుకు
బీటలలో, బాటలలో లాలిపాట పాడాలని,
పూలతోట లెత్తాలని ప్రపంచాలు పలవిస్తున్నాయి.

ఓ సమరనేత ?
శాంతిదాత !! రా. రా. రా!

— కొనకళ్ళ

[యుద్ధరంగంనుంచి తిరిగివస్తూ మదరాసులో కద్దుకున్నాడు; ముద్దుగొన్నాడు.]

పోరిపోరీ ఆశ పొద్దు పొడిచేవేళ
మళ్ళీ నీ ఒడిలోకి మరలి వచ్చానమ్మా,
గనగనా మంచేటి కాను చిచ్చుల్లోన
పెటపెటా పగిలేటి పెను నెదుళ్ళల్లోన
నీ పేరిహీమగిరుల చలువ గాపాడానె
నీ తలపు మేఘవ్రుల నిలచి పోరాడాను!

చిచ్చు కొండలు పగిలి వచ్చు 'లావా' లాంటి
టాంకు సివ్వాలవరవ తగిలినా నా మేను,
స్టైటు చెరగులో నీడనే గోరెనే
చెరగు వీచే చలువ చిరుగాలి గోరెనే!

నీ శక్తి పెంచినా నా మహావేశముతో
నీ ప్రేమ పెంచినా నాలేత హృదయముతో
నీ కండ పెంచినా నా కండ దేహాన్ని
పవిత్ర లోకముకొరకు ప్రేల్చి వచ్చాను

ఈ భూమి నన్నంటి, ఈ గాలి నన్
ఈ నీరు ననుజొచ్చి ఎసిమి దేశ
పాయివ్వవే అమ్మ!

ఉదికే పచ్చినదమ్మ,
చల్లన్ని నా కన్నతల్లీ !
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకే !

— శివయ్య

అణుసంగీతం!

మానవ మేధస్సున ఒక మహాశక్తి మేల్కొన్నది!

జీవన సంఘర్షణలో శాస్త్ర మొక మహాయుధమై
అరుణోదయకాంతి కొరకు, తరుణ జీవ శాంతికొరకు
అజ్ఞానాంధ పర్వతాలు ఛేదిస్తోందనాదిగా!

దుస్సహ మీ యాత్రలోన తూలిన త్యాగులనేకులు,
దుర్భర మీ తపస్సులో దొరికిన శక్తులనేకము!
కత్తి, టాంకు లొకచేపను; స్టాంపు, రైలు, విద్యుత్తు
రేడియో మరొకచేతను-దినదిన గండముగ యాత్ర
నవోదయ జగత్తులోకి పురోగమించెను చరిత్ర!

నాటి చేపల బాల్యంలో, కల్పించిన దేవుళ్లను
కట్టిన సామ్రాజ్యాలను కత్తియెత్తి రక్షించాం!
ఇపుడా దేవుళ్లంతా ఎత్తిన గాలిపటాలై
ఇపుడా సామ్రాజ్యాలే ఇసుకగూళ్ళవలె కూలెను!

నాటి గుడ్డి విశ్వాసం
ఉత్తమ జీవుల రక్తంతో చరిత్ర లిఖించింది!

నాటి వైరి ఆవేశమె
జీవన సౌభాగ్య విలసనోన్ముఖమై గమించింది !

మానవ మేధస్సున ఒక మహాశక్తి మేల్కొన్నది !
వచ్చేస్తోందణువు బాంబు !
వినండి అణు సంగీతం !
మానవ విధ్వంస శాస్త్ర గోప్రళయకలశం ఇదే !
క్రుద్ధ సర్పం పడగలాగ,
రాక్షసు హృదయంలాగా
కపటపటి దుముకుతోంది !

దుమికిందీ దుమికిందీ...
ప్రళయరుద్ర ఫాలనేత్రమే విషి పడి దహిస్తోందో,
జీవశూన్య విశ్వంలో అనాదిగా కదులుతున్న
రెండు భయంకర మహాగ్నిగోళాల్ ఢీకొన్నవో !
ఇది యుగాంతమో...!
భూమ్యాకాశాల నొక్క తృటిలో ధ్వంసంచేస్తే
చేదిల్లిన జీవాణువు సహస్రాల మరణఘోష
లాశాశల ఘూర్ణిల్లగ ప్రభవించి అణువు బాంబు !

మారణ హోమం ఇదే ! మంగళగీత ఇదే !
మానవుడా !
నీకు హక్కు లేదుసుమా !

స్వేచ్ఛాజీవుల దేహం చీల్చిచెండి ఎనిమిదేళ్ళు
నెత్తురు టేరులలోనో, ఎముకల గుట్టలలోనో
దిగంతాలు ముంచెత్తిన రాక్షస నాట్యంలో ఇది
చరమాంకం ముగించింది !

హిరోషిమా, నాగసాకి తరతరాల కుటుంబాల
తీరని తీయని బ్రతుకులు ఉప్పున ధూళై లేచెను !

అణువుబాంబు దూకిన మరుక్షణంలేచి ఆగిన
ఆ అమాయకుల నిర్భాగ్యుల మరణాక్రందనలన్నీ
నేటికి నాచెవుల నిండ హోరున మార్మోగునోయ్
దేహం కంపిస్తోందోయ్ !

మానవుడా !
నీకు హక్కులేదు సుమా !
మానవాభ్యుదయ చరిత్ర కళంకితం చెయ్యబోకు !

అణువు బాంబు ! ?

చావు బ్రతుకు సంధ్యలోన పొడచూపిన తోకచుక్క
స్నిగ్ధకుసుమ గుచ్ఛములై పరిమళించు మన సంస్కృతి
దివ్యకాంతి దిక్కులలమ తేజరిల్లు విజ్ఞానం,
యుగయుగాల నాగరికత పొగయై లిపలో హరించు!
గుప్పిట యిమిడే బాంబుతో గుప్పెడు బూడిదచెయ్యకు
మానవాభ్యుదయ చరిత్ర కళంకితం చెయ్యబోకు!
భావిసౌఖ్య శాంతులకై పోరు ప్రజా సమరంలో

ఆజ్యమైన అనాథలు, సమిధలైన సైనికులు
పెట్టిన ఘోషలు దిక్కులు పిక్కటిల్లుతున్నవిపుడు,
శిశువుల కేరింతల్లో, వృద్ధుల నిట్టూర్పుల్లో
పల్లెలలో రాళ్ళుగూడ ప్రతిధ్వనిస్తున్నవిపుడు !

... ...

అణువులతో ప్రకృతి జీవనావ నడుపుతోంది !
ఎర్రదుమ్ము గులాబిగా ఎగసి పరిమళిస్తోంది,
కాయశిలల పర్వతాలు కరిగి గంగ ప్రవిస్తోంది
రేగడి వరి వెన్నులుగాసాగి: నవప్రాణధార
నర్మదా, వర్షా, వలపుల ప్రకృతి శోభానృత్యం
అనంత మానవకోటికి ఆదర్శం చూపుతోంది !

అణుఘోరాహవశక్తితో జీవనావ దహిస్తోంది !
గిరిస్తూ, నిరిస్తూ భూమియె పులితలగా, మన
భవిష్యత్తు చీల్చాలని, నెత్తురులో తేల్చాలని
తుపాను నిశ్వాసంతో భూవదనం మీదినుంచి
పుత్రుల కోటాను కోట్ల ఉప్పున ఊదేస్తోంది !
భూనదనం నోరువిచ్చి పుత్రుల కబళిస్తోంది !

ఆశ్చర్యం ! అణువులతో – అంతస్సుతో అకృత్రిమ
ప్రసవించిన మానవుణ్ణి భస్మం ధ్వంసంచేస్తూ
మన ఉనికికి భరతగీతి పాడుతోంది ఘోర ప్రకృతి !

ప్రళయాద్భుత భయంకరాట్ట హాసంగా లేచినప్రళ
ప్రతిహతశక్తి స్వరూపులైన మనం ! మానవులం !

ప్రతిఘటించి తీరుతాం ! పరిహరించ గలుగుతాం !
కాని, ప్రసన్నాత్మలమోయ్
దుమికే, మెరిసే, మోగే
వివిధరాక్షసాయుధాలు మానవుడు సహించడింక !

కాలే అడవులలోనో, పొంగే వరదలలోనో
టూంకుదళం నడుస్తుంది !
మోహమొదలు నరికేందుకు
మంచుగడ్డ తరిగేందుకు
పదునుకత్తి ప్రయోగించి,
గనుల లోతుతవ్వేందుకు గంటలు తెలిపేటందుకు,
శతఘ్నుల్ని మోగిస్తాం !
గతచరిత్ర వింతలుగా ప్రదర్శించి నవ్వుతాం !

మానవమేధస్సున ఒక మహోశక్తి మేల్కొన్నది !
మానవుడా !
నీకు హక్కు లేదుసుమా !
మానవాభ్యుదయ చరిత్ర కళంకితం చెయ్యబోకు !

ఆవిరి మేఘాలు పంపి ఎడారి పండిస్తావో,
సముద్రమథనగున చించి నవసంపద తెస్తావో,
భూగర్భం తొలుస్తావో, విశ్వం శోధిస్తావో
బూజుపట్టి కూలుతున్న సామ్రాజ్య ప్రభుత్వాలను
ప్రబ్దలుకొట్టే మాకై నీశాస్త్రం మహాస్త్రమై
భావి మహోజ్వల భాగ్యానికి నవకాంతిగ నవశక్తిగ

నిశాస్త్రజ్ఞానపీఠ మైనవాడు :
మానవుడా !
మానవాభ్యుదయ చరిత్ర నిన్ను మరచిపోదుసుమా !

— అనిసెట్టి

వాహనం

ఆ కనబడేది మేము కొన్నట్టి కారు,
కాస్త పిట్రోలు అందితే కదలిపోవు
కడమ కొంగ్రొత్తకార్ల వేగాల మించి,
కాని స్టార్టనన్ ఒక్కరగంట పట్టు !

కారు నాల్గు చెక్రాల్కి మడ్గార్డు గలవు
వెనక రెండైటు గలద దీ వెలగగలదు,
నడువనేర్చె మాకారు వెనక్కు కూడ
కాని, నడిచేప్పు డొక మూమిగాన్నె తిరుగు !

మాకదేచాస, కాంపాక్టు మాకదేను
మా కదే కుక్కి, పుష్పవిమాన మదియె
అదియె మా కదిలేటి మహానసమ్మ్రి,
కాని దానిలో మా అవిడొక్కర్తెపట్టు !

— మాచిరాజు

నేర్చుకోండి!

[బ్లాక్ మార్కెట్ల నిర్మూలనానికై స్థాపించిన ప్రత్యేక సి. ఐ. డి. శాఖలో ఒక మార్గదర్శకుడు ఆ లక్ష్యాన్ని సాధించిన వినూత్న పంథా]

వ్యాపారము చేయాలని
ప్రాపర్టీ మొత్తమెల్ల భార్యకు ప్రాసీ
పాపాకట్టి, ఏపెకట్ట
ఓపెన్ జేసెన్ జనాళి ఓహో యనగా.

ఓపెన్ జేసిన పాపది
ప్రాపంచిక సర్వబ్లాకు ప్రాభవ యోగ్యం
బై, పరిపూర్ణతమఃశో
భా పరిపూతంబై పొలుపారెను యిట్లు!

ఆచాయల సీలింగ్ దో
బూచులవి అగస్త్యుని అవఘోసనలై, మా
మాచయ్య అత్తకేమిటి
వాచస్పతి అబ్బకైన బ్లాకేసుండీ!

గళ్ళా పెట్టెలు నిండెను
యిళ్ళం తస్తులుగ మూసు యిట్టు లేచెన్,
రూళ్ళొస్తాయని యిళ్ళవి
'పెళ్లాం' మణిగారి ముద్దుపేరున జేరెన్!

విచ్చెన్ కాంగ్రెస్ కమలం
వచ్చె సి. ఐ. డీ ప్రభాత వాతూలంలా,
వచ్చా ప్పెళ్లాంగారిని
సచ్చరితుమ తగులుకోని చక్కా బోయెన్:

— మాచిరాజు

* సంక్రాంతి కానుకలు

అసలు నాకు కించిత్పర ధ్యానమేను
నాకు ప్యూను పేరుండదు జ్ఞాపకమ్మ్ర,
అంతియేకాని - నాదు కాంప్లక్కు కేమొ
ప్యూను ఉన్నట్టె జ్ఞాపక ముండబోదు !

నాదు సాయంతనాన చైనాబజాకు
లోన, సంక్రాంతి మూడో దినాన యనగ
కానుకల్ కొన్ని విలిచి కొచ్చాను, వచ్చి
వీనికిచ్చితి వ టిన్ని పంపించటానిక్ !

* * *

అద్వితీయుండు ఆ పరధ్యాన్న విశ్వ
పరమ సృష్టి కళాపర బ్రహ్మగాడు,
ఏది దేనికి పంపెనో—
ఆ మహానస వీథి విహాయసాన
కార్తీకేవక్ర శీతాంశు ఖండమనగ

కూర్చి పరిధవిల్లు వితంతుమూర్తికండె
కెంపురాకట్టు వెండి కుంకంపుభరిణ.

సేతుబంధన వైఫల్య సిద్ధియందు
ధంచిలాగిన రాము కోదండ దండ
మట్టు వంగియున్నట్టి తాతయ్యకండె
నీలపుంజరీల పరికిణీల జంట.

కూను మేరీ కళాశాల 'కేకి' ననగ
పెరుగొన్న నా లక్ష్మీ కుమారికండె
పరిసర సఖీజనాళి విభ్రాంతి దనర
విమల కువరంపు కత్తి మేనింగు బ్రష్షు!

— మాచిరాజు

భూస్వర్గం రావాలి!

ముక్కోటి తెనుంగుజాతి ముక్కలుగా చెక్కలుగా
చీలదీసి చెదరగొట్టి, పాలించే తెల్లి తెగులు

మరతుపాకి కొరకొరలో, పరిపాలన సాగిస్తూ
'ప్రజలే చెలరేగా'రని, నైజాములు, సీ. పీ. లు

మా యిళ్ళను కొల్లగొట్టి, చెల్లెళ్ళను చెరబట్టీ
ప్రజలపైన ధ్వజమెత్తీ కవాతు చేస్తున్నారా

దండులుగా ఎత్తివచ్చి. ఊళ్ళకూళ్లు చుట్టుముట్టి
నడువీధిని పట్టపగలు, నరహంతలు చెలరేగారా?

పరదాలే లేవుగాని, పరువున్నది నాయింటికి,
ధనగర్వం లేదుగాని హృదయముంది నా చెల్లికి
నా యిల్లే నందనమూ, నా చెల్లి గులాబిమొగ్గ:
ఎవడీ, రాక్షసు డాత్మను అందాన్నీ చంపుతాడు?

అధికారం పెచ్చు పెరిగి హృదయం చచ్చిన వీడికి
ప్రత్యక్షపు పోరాటం పసిపాపల గొంతులపై -

ఆ మసీదు మూలల్లో మురికి బూజు పరదాల్లో
ఈ రాక్షస కృత్యాలకు ఏడుస్తున్నవి 'పీర్లు'!
తరాలుగా చీకట్లో పరదా ముసుగుల్లో
కళ్ళకు కట్టిన గంతల్లో కుమిలి కుమిలి పోగిలి

పోగిలి నా 'ముస్లిం సోదరి' కన్నీళ్ళే కారుస్తున్నది!
ఈ కార్చిన కన్నీళ్ళే నైజాం పిండిన సారం.

ఈ కుళ్ళిన గుడెకాయ నైజా మిచ్చిన పండు!
నేటికి తొంభై మందిగ కూటికి గుడ్డకు లేక
గంపెడు సంసారాలతో, చెట్టుసీడ నంటుకొన్న
కార్మిక ప్రజాళి పైన, కత్తిగట్టి దూకింది!

వలపట నొకబొల్లిదున్న దాపట నొక ముసలిగేదె
అరక సాగ కగ్గిలోన, కుంటగట్టు తుమ్మచెట్టు

నాశయించి సామ్మసిలిన. శైతులపై పగబట్టి
నైజాం విషనాగు పడగ. లెత్తి వ్యాపి బుసకొడ్తున్నది!
శతాబ్దాల చీకట్లో. దారి కొరకు తడువుకొంటు
పసితు లేస్తు పెలుగులోకి, నడుస్తున్న తల్లి తలను
చితకగొట్టివేయాలని తెల్లవాళ్ళ తొత్తు నిజాం
అణువు బొంబు తెస్తున్నది!

అడవిజాతి శైజాము, నాగరికం కావాలని
స్త్రీలను చెరబడుతున్నది, ఇళ్ళు కొల్లగొడుతున్నది!
పటుపగలు పిశాచాలు తాండవించు
శ్మశానాలు నడువీధులు!
ఆ సైనిక శాసనాలు పరచుకొన్న చీకటి తెర
లోకానికి కళ్ళుగప్పి లోకాన్నె చెరుస్తున్నది!

ధర్మం పడి చెడి బేలై, తెల్లవాళ్ళ కాలిక్రింద
నోరుపడీ, నెత్తిపగిలి, మూల్గలేక మూల్గుతోంది!
తిండికై తుపాకిగుండు, గాలికొరకు విషవాయువు
ఆరగించలేక ప్రజలు, అల్లాడుతు వున్నారు!
ఉక్కు తెరలు క్రిక్కిరిసిన, దిక్కులేని తెలంగాణా
తెగించి లంఘిస్తున్నది, మగటిమి చూపిస్తున్నది!

"చస్తూ బ్రతికేది లేదు బ్రతుకుతు చచ్చేది లేదు
చావో బ్రతుకో" అంటూ, కష్టజీవి శైతు కూలి
కన్నుగుడ్లలో పాపై, కాళరాత్రి చీకట్లో

తళుకుమన్న తారకయై ప్రతాపాగ్ని అప్పుడప్పుడు
పరవళ్ళే చేస్తున్నది పైకి పైకి లేస్తున్నది !

ముసల్మాను లొకటంటూ, ముసల్మాను రాజ్యమంటు
హిందూ ముస్లిం రక్తం, ప్రతాగి బలిసి క్రొవ్వెక్కిన
నైజాం ప్రభు రాజనీతి తెల్లవాళ్ళ ఎంగిలాకు !
ప్రజల కొరకు ప్రాణమిచ్చు 'బందగీ' లె ముసల్మాన్లు,
నరహత్యలు సాగించే, నైజామే సైతాను !
నిరుపేదే ముసల్మాను, నిరుపేదే హైందవుడు,
ఇరుగు పొరుగు వాళ్ళు వీళ్ళు పొరుపు లేదు ఇద్దరికీ !
ఈ యిరువురి చీలదీసి, పాలించాలని చూసే
నైజాం నరహంతకుడికి, కాలం చేరువైంది !

నా యింటిని కొల్లగొట్టి, నా చెల్లిని చేరబట్టిన
వాడు కిరాతకుడు నరపశువు
హృదయం చచ్చిన రాక్షసి
వాడి కాత్మ చచ్చిపోయి
కళేబరం మిగిలింది !

ఈ గచ్చపొదకు లోకంలో, పెచ్చరిలే చోటులేదు !
మన గులాబి తోటలోన నిలిచే అస్కారంలేదు !
తెగనరకండీ ! తెగనరకండీ !
కూకటి ప్రవేళ్ళతో కుళ్ళగించి
ముళ్ళపొదను నిర్మూలం చేయండీ !!!
మన ఇక్బాల్ టూగూరులు, కట్టుకున్న స్వర్గంలో

రాక్షసులకు చోటులేదు !
హతమార్చండీ ! హతమార్చండీ ! !
మళ్ళి తలచూపకుండ
హతమార్చండీ ! ! !
మరతుపాకి కొరకొరలో పరిపాలన సాగించే
నైజాములు సీపీలు నేలకొరిగి పోవాలి !
ప్రజలే ప్రభువులుగా భూస్వర్గం రావాలి ! !

— ప్రయాగ

రక్తారుణ వైజయంతి

"అర్ధరాత్రి ! అమగుజాడ లగుపించని అరణ్యాన
నల్లరంగు పూసుకున్న కళ్ళులేని గాడుపులో
చెవులు చిటిలి చిల్లులుపడు నిశ్శబ్ద నినాదములో
పిశాచాలు విహరించు పర్వతాల లోయలలో
ఎటుపోతుందీ సైన్యం ? ఎటుపోతుంది ?"

"అరుణారుణ తరణికొరకు చెలరేగిన ప్రబలవాంఛ
పురికొలిపిన పొంగులతో పోతున్నాం – యుద్ధానికి.
రణరంగపు విపణివీధి లక్షలాది ప్రాణాలను
పైసలుగా పారబోసి స్వాతంత్ర్యం కొనితెస్తాం–
జాపనీల కల్లలలో సామ్రాట్టుల సాకులలో
మాధ్యేయం మటుమాయం; మాకిక మేమే సాయం–

బానిసలుగ బ్రతుకలేము – స్వతంత్రముగ పోరాడి
మా దేశపు మృత్తికలో మృత్తికగా నిదురిస్తాం–
ఇనుపగొలుసు లూడబెరికి నిప్పువాగు లీదియేది
మా శౌర్యపు త్రుప్పడిగి నిర్భయముగ పోతున్నాం–

కవితామధువాహినులను, మా దిగంత మోహినులను
సౌఖ్యాలను, సఖ్యాలను విడిచిపెట్టి పోతున్నాం—
దాస్యపు చీకటిమేడలు పగులగొట్టి తగులబెట్టి
రక్తాయణ వై జయంతి రమ్మన్నది ! పోతున్నాం—"

— భాశరథి

నిజంగా, బలంగా!

నిజంగా బలంగా, తెలంగాణ
తేనెలొలుకు తెలుగు పలుకు
వీరాంగన తెలంగాణ !

అంధకార బంధురాల
జీవితాల వెలుగుబాట
తెలుగుతోట, ప్రూలపాట
తెలంగాణ ! తెలంగాణ

కాటుకాల కంటుకాల
కంటుకాల కందకాల

దారిలోన తూలిపడిన
త్రుళ్ళిపడిన బాటసారి !

కూటికుండ కూడ ఎరువు తెచ్చుకునే
వాడ ! కూలివాడ ! సాటివాడ
గొప్పవారి యింటిబిడ్డ పోసుకునే భోగిపళ్ళ
ఏరుకునే చిరుతలార !
ఉడతలార ! చిన్నలార, తమ్ములార !
నిజంగా బలంగా
బలంగా నిజంగా !

యుగయుగాల పరపాలన
తరతరాల పరపీడన
పోతున్నది పోతున్నది
ఏడ్చి ఏడ్చి పోతున్నది ! !
ఓడి ఓడి పోతున్నది ! !
లారీలు, మెడ బండలు,
చెరసాలలు ఉరి కొయ్యలు
దారిలోన మైలురాళ్ళు !

దాటి మనం పయనిద్దాం
ఎర్ర జండా ఎగరేద్దాం
మనకిలాగె, ఆకాశం
వొంటిమీద పులి రక్కిన
నెత్తుటిచార ! ఇంద్ర ధనువు !

కాని మనం జయిస్తాం
అంతదనుక శయనించం !

భగవత్సింగ్, సుఖదేవులు
కర్తార్‌సింగ్, గురుదేవులు
కలానీ, కయ్యూర్‌లు
ఏ సుఖం ఆశించిరి ?
ఏ స్వర్గం కాంక్షించిరి !

నిజంగా, బలంగా, బలంగా నిజంగా
తెలుగుతోట, పూలపాట !
స్వర్ణస్వప్న స్వర్గరేఖ
తెలంగాణ ! తెలంగాణ !

పరుగెత్తే రైలుకూడ, పయనించే పైరుభూమి
కెలిగ్రాఫ్ వైరులన్ని, ఊరిఊరి రహదారులు
గిరులు తరులు మహానదులు
"మావేనని; మావేనని"
కాలం కలందీసి, చేవ్రాలును చేసిందట !

సముద్రాల తడిగాలులు గరిక పచ్చ మైదానాలు
తలవంచిన పండ్లచెట్లు, పూలతోట పరిమళాలు
మనదేశపు భూగర్భపు ఖనిజాలు, గాలులతో
వినవచ్చే వెదురుపొదల సంగీతం !

చేయ లెండి ! ప్రజా పరం !
చేయురండి ! జాతిపరం !

నిజంగా బలంగా, బలంగా నిజంగా
కనులముందు కదలు కలలు
నిజం చేయ రండి !
నిజం చేయ లెండి ! !

— ఆవసరాల

ఖబడ్దార్ !

ఖబడ్దార్ ఖబడ్దార్
సైజాం పాదుషా హే;

బానిసత్వ విముక్తికై రాక్షసత్వ నాశముకై
హిందూ ముస్లిం పీడిత శ్రమజీవులు ఏకమైరి
తమపై స్వారీచేసే. దెశముఖుల ప్రతిఘటించి
ప్రజాకోటి పోరుతోంది, ఖబడ్దార్ ! ఖబడ్దార్ ! !

సూర్యపేట, బాలేముల వీరుల కాలే హృదయపు
ఆశలు కాంతించుతాయ్,
అమరుడు మా కొమరయ్య అనంతయ్య అనంతుడే
అజేయులై, ప్రకీర్తులై చిరస్థాయి నిలుస్తారు;
చరిత్రలో చరిత్రలో చిరస్థాయి వసిస్తారు.

ఒకవీరుడు మరణిస్తే, వేలకొలది ప్రభవింతురు !
ఒక నెత్తుటి బొట్టులోనె, ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు;
ఖబడ్దార్ ! ఖబడ్దార్ !!

నైజాం కీచకుడా ! నీ పీచమణచ ప్రజలంతా
ఒక పిడికిట, ఒక గొంతుక,
ఒక ప్రాణమై, ధ్వనిస్తారు;
మృతవీరుల స్మరిస్తారు; నవయోధుల సృజిస్తారు;
ఖబడ్దార్ ! ఖబడ్దార్ !!

బానిస జన శల్యములను, ఏర్చి కూర్చి నిర్మించిన
నీ రాక్షస సింహాసన మదిగదిగో కదులుతోంది !

మెషిన్‌గను, మరఫిరంగి,
తుపాకులూ, విషవాయువు,
ప్రజాశక్తి నాపలేవు; ఖబడ్దార్ ! ఖబడ్దార్ !!

నిరవధికం నిరంకుశం, సహింపనీ భరింపనీ
ధీర ప్రజాకోటికొరకు ప్రవ్వించే గోరీల్లో,
నీ అమానుషత్వాన్నే, నీ నిరంకుశత్వాన్నే
పాతేస్తాం ! పాతేస్తాం ! పాతేస్తాం ఖబడ్దార్ !

విశాలాంధ్ర ప్రజాస్వామ్య
మమరుస్తాం ఖబడ్దార్ !

— సోమసుందర్

భగత్సింగు

ఒక తారక మేల్కాంచెను;
ఒక వీరుని కను విచ్చెను.

ఒక మెఱుకువ !
ఒక్క వెలుగు !!

* * *

ఆ తారను పీకనులిమి చంపిందేదో చీకటి !
ఆ వీరుని పీకనులిమి చంపిందేదో పిశాచి !!

* * *

కోటికోట్ల తారకలు ! బారులు తీరిన తారలు...!!

మహా కాంతి !
మహా కాంతి !!

చీకటి కడుపున చిల్లులు; చీకటి గుండెకు తూటులు.
నవ జగతీ యువ వీరులు; భవిష్యత్తు కధినేతలు.

మహా క్రాంతి !
మహా క్రాంతి !!

చీకటి పిశాచి చచ్చెను; తాటకివలె, పూతనవలె.
మేనువుగా శవం పడెను.

* * *

తొలి తారక తేజం., యువ వీరుని తేజం.
క్రాంతికాల జాగృతియై లోకం ముంచెత్తివెచ్చె;

* * *

అంచాతనె ఆకాశం అరుణోదయమై వెలిగెను;
అంచాతనె భూలోకం తిరుగుబాటు-ఎరుపెక్కెను ! !

*　　*　　*

అరుణ పతాకచ్ఛాయల ఆయుధాల ప్రవాహమై,
అక్షయ తూణీరం వలె... అక్షీణ పరాక్రమం వలె...
బారులు తీరిన వీరులు ! భారత విప్లవ యోధులు !

*　　*　　*

ఒక వీరుడు...
ఒక తారక...

ఒకటే ఒక కాంతిరేఖ !
లోకం తొణికిసలాడిన –

మహా కాంతి !
మహా క్రాంతి ! !

– సోమసుందర్

పర్వత దశ

బ్రెయిన్‌లో బ్రెస్ గన్
రెయిన్‌లా ఆలోచనల ట్రెయిన్
స్పయినల్ కార్డులో స్ప్రెయిన్
గ్లూమీ తిమిరాలు చెరిపించి
సైతాన్ మనల్ని పరిషించునప్పుడు
నిర్వేదనా పవనాలు వర్షించు

సింతటికె చింతను ధరించు కవి
అంతట ఖెయాసు పెరిషించు
ఖెయాసు ఎడారి లోపల ఒయాసిస్సు పొయిట్రీ
కవిత్వపు ఖెయాసులో ఖెయాసుకి ఉరికొయ్య

బ్రెయిన్‌లో సైన్‌గన్‌లా చెట్లు చిట్టెలుకలు
చెయిన్సులో మగాళ్ళు, చెరచబడ్డ ఆడవాళ్ళు
చెద పురుగులు, మద మెక్కిన సోల్జర్లు
సోల్జర్లు, చెదపట్టిన బొంకులు
చెల్లని డిమాండు డ్రాఫ్టులు, చెట్లు చిట్టెలుకలు
కాకి మెడ నుసి రంగు, సోన తెలుపు డ్యూ తెలుపు
చెట్లు, చిట్టెలుకలు.
చిన్న చిన్న చీమలు బలవంతమైన సర్పం
భయంకరమైన స్వప్నం, అడ్డమైన అందానికి
నిజానికి స్వర్గానికి అడ్డమైన పెద్దకొండ
చెరచబడ్డ ఆడవాళ్ళు, మందు
చెయిన్సులో మగాళ్ళు, జానకి తాడు

ఆలోచనల బ్రెయిన్లో బ్రెయిన్లో
పురుషుల III క్లాస్ బోగీలో, చెట్ల గురించి
చిట్టెలుకల గురించి, చెద పురుగుల గురించి
చిన్న చిన్న చీమల గురించి
సంభాషణ రెయిన్లో, రెయిల్లో
చెయిన్సు లేని మగాళ్ళ ముందు

చెప పురుగులు కాని మగాళ్ళ ముందు
నిటారుగా నించోని,
తన బట్టలు నింపాదిగా తాపీగా ఒలచుకొనే
నిటారుగా నిస్సిగ్గుగా
నించొనే నీతి మంతురాలు :

"పట్టణం మీద కోడెంచే
ఇన్వేడించే కెరటాల పాలిటి వేవ్ బ్రేకర్లగా
ప్రస్తుతానికి అక్కడక్కడ
అక్కడా, ఇక్కడా
సైంటిఫిగ్గా, సిస్టమేటిగ్గా
నించుందాం పొంచుదాం
పత్తనం రేపటి విత్తనం
పత్తనం పెత్తనం వహిద్దాం ప్రవహిద్దాం"
బలవంతమైన జీనీలా లేచే విరుచుకుపడే
ఘోష్నగా వచ్చే కెరటాలకి కరిగిపోయే
వేవ్ బ్రేకర్లు, చిన్న చిన్న చీమలు
బ్రెయిస్‌లో పెయిన్
ప్రతీ వెయిన్‌లో మెషిన్‌గన్ రెయిన్

— ఆరుద్ర

చిరంజీవి మానవునకు మృత్యువు

నిర్దేశించిన భావాలను
పాఠ్యాలు బట్వాడా చెయ్యవు
పదేపదే వాగిన గ్రామఫోను రికార్డులమాదిరి
మాటలు అర్థప్రేరణ చెయ్యవు
విశాలలోకం సర్కసులోపల
విద్య ప్రభుత్వోద్యోగాల ప్రాటిమీద
పిల్లి మొగ్గలు వెయ్యదు
అధికారపు అయస్కాంత క్షేత్రంలో
విజ్ఞానం గడియారంలా తిరగదు
సైన్సు సమస్యాపరిష్కారం చెయ్యదు
గణితం అధికాహారోత్పత్తి చెయ్యదు
ఎర్రటేపుల చవిటినేలలో
స్వాతంత్ర్యం మొలకెత్తదు
కోర్టువేళకి పిల్లడుగుమస్తా ఇంట్లో
రొట్టో పచ్చడి నలగదు
కిరాణాకొట్లో పాపులకాగు అరువియ్యదు
చిరంజీవి మానవుడా!

ఇది విష్కంభం
ఆది మానవుడిలో ప్రవించిన భయం
ప్రవహిస్తున్నాది నీలో
ఆతడి మస్తిష్కంలో, హస్తంలో, అరుపులో

ప్రభవించిన తమం
భ్రమ పెడుతున్నాది నిన్ను
ఏది నిజంగా కనబడుతూందో దాన్ని గ్రహించలేవు
ఆకార రహితాలను చూడలేవు
'నిన్న'ని గుర్తించలేవు నిన్నే పోల్చుకోలేవు
నీ కనుపాప అయిదేళ్ళ చిటిపాప

ఉద్దేశించిన భావాల ఆడబొమ్మలకి
వాక్యాలు గడ్డాలూ మీసాలూ పెడతాయి
తుపాకులు బహిరంగంగా
మనుష్యులను వెక్కిరిస్తాయి
విశాలలోకం సర్కస్‌లోపల
నియంతల నోట్లో ప్రజాజీవితం తెగుతుంది
సైన్సు గడుసమస్యలను
రెండుచేతులా పుంఖానుపుంఖాలుగా తయారుచేస్తుంది
గణితం మానవుడి అవసరాల బడి ఎగేసేస్తుంది
విద్య జీతం నష్టంమీద
అనారోగ్య కారణాలవల్ల సెలవు పెడుతుంది
విజ్ఞానం నల్లమందూ నూనే రంగరించి గుటకేస్తుంది
కళ్ళాపాల కకూకాసుల్లో కొకోకకప్పాతాలు
ప్లేటు గుమస్తాకి లంచం రెట్టింపవుతుంది
కిరాణాకొట్లో ధరలు
రెచ్చి తమ్ముడ్ని హెచ్చరించేసుకొంటాయి
చిరంజివి మానవుడా!

ఇది ప్రళయం
అది మూర్తి లిబిడోలో
గడ్డకట్టిన కామం కరుగుతున్నాది నీలో
ఆతడి కన్నులలో కౌగిలిలో పొలికేకలలో
శిష్టవేసిన ఆకలి ఆశ్చర్యపెడుతున్నాది నిన్ను
ఏది నిజంగా జరుగుతున్నాదో దాన్ని చూడలేవు
ఆధార రహితాలను పేర్చలేవు,
'నేటి'ని మార్చలేవు, నిన్నే పోల్చుకోలేవు
నీ అవ్యక్తం అలతొలిప్రొద్దుల దండకారణ్యం

ఒక పదంలో ఇముడవలసిన అర్థం
కొన్నివాక్యాల విస్తీర్ణతని.
దురాక్రమణ చేస్తుంది
పేకముక్కలు భవిష్యత్తుని
పొదిగిందికి ప్రయత్నిస్తాయి
గుర్రాలు కార్మికుల పూటబత్తెం మీద బలుస్తాయి
విశాలలోకం సర్కస్‌లోపల పొడిచిన ప్రతిక్షి
పెట్టోడున్న నీ ఆశయాల జవరాలి
జవనాల గుచ్చుకొంటుంది
ఎవరెస్టు శిఖరానికి బదులు
ప్రఖ్యాత సినీమాతార జీతాన్ని
కొలిచిందికి ప్రత్యేకదళాలు ప్రస్థానిస్తాయి
పింఛనుపుచ్చుకొన్న కోర్కెలన్నీ
మళ్ళీ ఉద్యోగాలకి అర్జీలు పెడతాయి

విద్యార్థుల మనియూరగులు
మెరకవీధికి ప్రవహిస్తాయి
ఎర్రటెపు అవిచ్ఛిన్నంగా
పరిపాలిస్తుంది
ఎర్రజెండా పశ్చిమాద్రి వెనుక
దాంగొని చదన్రివేషరచనకి
ఉపక్రమిస్తుంది
నాగేటి చాలులో
కార్మిక నాయకుల ప్రేరెలు దొరుకుతాయి
పన్నెండు పెగ్గులతర్వాత
అభిజ్ఞవర్గాలు ప్రమాదాన్ని పసికడతాయి
విదేశ వ్యవహారాలశాఖ
పాత్రికేయుల ప్రశ్నాపరంపరలనుంచి
సురక్షితంగా తప్పించుకొని
తనలోతాను తర్జనభర్జనలు చేస్తుంది
ప్రకారుల భారీ పరిశ్రమమీద
అధికలాభాలపన్ను అక్రమమనే
వాణిజ్యసంస్థల రాయబారం విజయవంతమవుతుంది
అబద్దాల అమ్మకాన్ని ప్రభుత్వాలు
జాతిపరం చేస్తాయి
పిడరుగుమన్తాకి ఏడో ఆడపిల్ల పుడుతుంది
కిరాణాకొట్లో సామానులు
చీకటిలోకి నిష్క్రమిస్తాయి
సాఫీ జీవితమ్మాద తెర తెగుతుంది

చిరంజీవి మానవుడా !
ఇది నరకం

ఆది మానవుడి ఆకలిలో
ఆతడి ఆలోచన నైపుణిలో
అప్పుడే సాక్షాత్కరించిన కీలకం
వరమిస్తున్నాది నీకు
నీ చైతన్యం ఆరముగ్గిన అవకాశం
చిరంజీవి మానవుడా !
తంమేవాఽహం.

— ఆరుద్ర

భయపడినవాడు

ఊర్కిక్కాళ్ళ నా ఊహలు
సంకెళ్లు నా మాటలు
నాపై రువ్వినరాళ్ళు నా అక్షరాలు
నాకు లోకం లేదు

నా గీతం నా నిలయం
నా గీతం నా విలయం
కాంతిని వధిస్తాను
అశాంతిని ఆరాధిస్తాను
అడవిలో వెన్నెలను దుస్తులుగా ధరిస్తాను
అర్ధరాత్రి భీభత్సం మేలుకునేటప్పుడు

ప్రపంచాన్ని రాక్షసులు రక్కితినేటప్పుడు
మృత్యువు గవాక్షంలాగ తెరుచుకునేటప్పుడు
శూన్యంమీద శూన్యంగా కూర్చుని
రాలుతూన్న నక్షత్రాలమీద నా గీతం రచిస్తాను

ఆకాశం కనపడనిచోట
చీకటి ఉరికంబంలా నిలబడినచోట
కాలం శవంలాగ వేలాడినచోట
నిశ్శబ్దంమీద నిశ్శబ్దంగా కూర్చుని
గాలిలో దీపాలమీద నా గీతం రచిస్తాను

నాకు రూపంలేదు
మృత్యువు నా నిలయం
మృత్యువు నా విలయం
అరచేతిలో వృద్ధుని లలాటంలాగ
అద్దంలో విషకన్య సోయగంలాగ
చంద్రుని ముఖంలోని స్ఫోటకం మచ్చలాగ
కలకాలం బ్రతుకుతాను

నాకు నిలయంలేదు
నాకు విలయం లేదు
నా రూపం నా గీతం
నా లోకం నా సంగీతం

— అజంతా

పరిత్యాగి పరివేదన

తమ్ముడూ కులాసాగా ఉన్నావా ?
పోనీ నువ్వేనా పుస్తకాల పూజ చేస్తున్నావా ?
అమ్మనీ, నాన్ననీ హింస పెట్టకుండా
వాళ్లు కన్నీరై ప్రవహించకుండా
పోనీ నువ్వే నా కుటుంబానికి పేరు తెస్తున్నావా ?
అప్పుడే నాల్గు ఉగాదులు గడిచాయి
నాగు నాల్గు సర్పగండాలు దాటాయి.

కానీ ఎప్పుడు ఏక్షణం ఆకాశం నామీద విరుచుకు పడుతుందో
ఎప్పుడు ఏకోజు ఎలక్ట్రిక్ స్తంభం నన్ను నేలమట్టం చేస్తుందో
కాని ప్రస్తుతం ఈ చిన్ని సైజు నరకంలో కులాసాగానే ఉన్నాను
నీకు ఎంతో దూరంగా ఎక్కడో సమాంతరేఖ

మీద నిలబడ్డ నేను,
నన్ను నేనే పోల్చుకోలేక నాకు నేనే సహస్ర
యోజనాల దూరంలో నిలబడ్డాను.
నా వాతావరణంమీద నేనే పొగలాగ వ్యాపించుకు పోయాను
రాత్రివేళ స్వప్న కన్యకలని భూస్థాపితం చేయటం
ఒక్కటే ఇటీవలన నా కార్య క్రమం.
ఐనా ఈ అడుగుజాడ ఏ సారవంతమైన
స్మశానంమీద పడుతుందో ఇంకా నిర్ధారణగా చెప్పలేను.

కానీ ఈ విపరీతాలు మాత్రం నువ్వు వినక తప్పదు.
నిత్యం నన్ను వెంటాడుతూన్న భయాలవి చెప్తేనేగాని
భయం తగ్గదు.
అద్దంలో నా ముఖం చూడటానికే నాకు భయం.
నా సంతకంలోని అక్షరాలను చూస్తేనే నాకు చెప్పలేనంత భయం.
ఒక్కమాటలో చెప్పాలంటే నా చూపుడువేలు నిత్యం
భయాలవైపే అనక తప్పదు.
ఇంకా ఇలాంటివే మరికొన్ని, రోడ్డుమీద నడుస్తూంటూ
ననుకో.
ఎవడో హఠాత్తుగా ఘోర ప్రమాదంలో చిక్కుకుంటాడనుకో.
చుట్టూ పోగైన జనం ఒక్కదఫా నా ముఖంవేపు చూస్తారు.
"ఇదేం విచిత్రం వీడూవాడూ ఒకే పోలికే" అని
ఆశ్చర్యపోతారు.
అంతదాకా ఎందుకూ రోడ్డుమీద నా మృతకళేబరాలని
నేనే లక్షసార్లు చూశానను.
నమ్మకపోవో నమ్మవో గానీ తమ్ముడూ నిజం చెప్తున్నాను.
ఈ నగరంలో అడుగు పెట్టిన రోజున పట్టపగలు నక్షత్రాలు
చూశానను.
అంతటా విషవాయువులు, ఎటుచూచినా పద్మవ్యూహాలు
కళ్ళలో దుమ్మురేపే రోడ్లు, చూస్తూ చూస్తూండగానే
నిన్ను మటుమాయం చేసే మనుషులు.

ఆ రోజున నగరంలో సూర్యుడు తూర్పున అస్తమించటం
కళ్ళారా చూశాను.

ఐనా ఇప్పుడు యెంత అనుకుంటే ఏం లాభం?
చేసుకున్న నిశ్చయాలకు రంగు మార్చటం దుస్సాధ్యం.
కష్టసుఖాల తిన్నెమీద దీపం పెడుతూ అప్పుడు అమ్మ
చెప్పిన మాట విన్నానుకాదు.

దీపం కింద క్రీనీడలో కీడు చూచాను కాదు.
స్వహస్తాలతో నిర్మించుకున్న కంటక చతురస్రాన్ని
పడగొట్టటం సర్వ కల్ల-ఇక జీవితం నిండా శూన్యం.

బహుశా ఇప్పుడు గుర్తుకురాదు నీకు
ఒకరోజు సాయంత్రం అమ్మనీ నాన్ననీ కన్నీళ్ళ
పర్యంతం చేశాను. అప్పుడు పదేళ్ళేనా లేవు నీకు.
క్రమ్మకు వస్తున్న చీకట్లలో కన్నీళ్ళు రాలుస్తూ చెప్పారు.
నువ్వే మా కష్టాలకు వంతెన అన్నారు.
అదే నిన్ను చూడటం అఖరురోజు నాకు

కానీ వాళ్ళ అశని మొక్కగా ఉన్నప్పుడే వంచేశాను.
వాళ్ళని అక్షరాల కన్నీరుగా మార్చేశాను.
ఇంద్రధనస్సుల సౌందర్యాన్ని ఆనందిస్తూ నమస్తూ అసత్యాల
అరణ్యంలో చిక్కుకుపోయాను.

గగనకుసుమ సౌరభం క్రింద స్పృహతప్పి పడిపోయాను.
వినాశనం యొక్క గవాక్షాలని స్వహస్తాలతోనే తెరుచు
కున్నాను.

ఇలా యెంతసేపేనా బాధ జాజ్వల్యమానంగా వెలగవచ్చు.
ఇలా నా కథ సహ్రసాటురాల దూరంగా సాగవచ్చు.
కానీ ఇసుక వేసినా రాలని హస్తాల మధ్య నా కంఠం
పూరాగా వినపడదు నీకు.
నా సర్వనాశనంయొక్క వదనం సాంతంగా కనపడదు నీకు.
ఇక మిగతా వివరాలకు ఊహనే నువ్వు ఆశ్రయించవచ్చు.

కానీ ఏదో ఆశ !
ఒకప్పుడేనా తప్పుకోదా అని ఈ నిశ !
ఇన్నాళ్ళూ ఈ కారణంగానే ఆకాశంయొక్క భగ్న
హృదయంలో ఈ ఉనికి.
అంచేతనే మృత్యువును రానివ్వటం లేదు నా దరికి.
ప్రస్తుతం నేను ఉంటున్నది ఇదే ఆశ.
ఈ అశనే వాళ్ళకు చూపించు.
నాపేర ఇంట్లో ఒక క్షణం శాంతిని ప్రతిష్టించు.
అమ్మనీ, నాన్ననీ ఒక్కమాటు చల్లని హస్తాలతో నన్ను
దీవించమను.

చల్లనివేళ నాకోసం భగవంతుని ప్రార్థించమను.
తమ్ముడూ ఈ అశనే నా పేర కనపడ్డ వాళ్ళకల్లా చూపించు.

— అజంతా

కాలరథం

మంచు వంటిది గతం
మళ్ళీ కనిపించదు
వెనక్కు చూడకు మరి
వెళ్ళి పోయిందెప్పుడో...
నీలో కుసుమించిన
పూలను చిదిమేస్తూ
గతం వెళిపోయింది
స్మృతి గర్భంలోనికి !...

కత్తివంటి కాలాన్ని
గతం ప్రసవించింది
చిరిగిన జీవితాలు
చివురిస్తాయి సుమా...
చిరస్మృతుల ముట్టడి
చెర బెడుతోంది నిన్ను
మళ్ళించు రథాన్ని
మనుషులున్న చోటికి...

పాదరసం వంటిది
వచ్చే భవిష్యత్తు
నిశీథాలు పగిలిన
విశాల కాంతి రేఖ...

కాలం విలువైనది
విలువైనది బ్రతుకు
కనిపించే దంతా
మనదే, అది మనదే...

— చిరంజీవి

ఒకే జ్యోతి

ఒకే జ్యోతి!
అచల దీక్షతో వెలిగే
జాగరూకమై మెలిగే ఒక జ్యోతి!

నిరతాందోళిత మానవ హృదయంలో
పిరికివాని భీతిలోన, వీరుని అభయంలో
ఆశలో, నిరాశలోన తృప్తిలో దురాశలోన
విరిసిన పుష్పాల సువాసనలో
కవి గాయక ప్రేమికజన సకలశిల్పి సౌందర్యోపాసనలో
నాట్యాంగనవిన్యాసములో, యోగిజనులసన్యాసములో
ఉరికెక్కే విప్లవకారుని అంతిమ దరహాసములో
అనేక స్వరూపాల శతజీవిత తరంగాల
నురుగునవ్వుదివ్వెల్లో వెలుగుతుంది ఒకే జ్యోతి!

దుర్గమతర హిమవన్నగ శిఖరంపై
బాలారుణ కిరణాంకురమై

దుస్తరసాగర రహస్యగర్భంలో ఆరని బడబానలమై
విప్లవాల సుడిగాడ్పులు కాటకాల వడగాడ్పులు
దారుణమారణ సంగ్రామపు పెనుతుపాను హోరులోన
జడివానల జోరులోన ఆరక సతతము వెలిగే
జాగరూకమై మెలిగే దివ్యజ్యోతి ! ఒకే జ్యోతి !

బరువుతోచిన మన తెరువులేని జీవితాల
కరాళ కాలరాత్రిలో అడుగడుగున కరపదముల
నిగళ యుగము గ్రమ్మోగుచున్న
బానిస బ్రతుకుల చిరమృతక యాత్రలో
తన కరుణా కిరణమ్ముల నవకటాక్ష వీక్షణముల
నై రాశ్యము రూపుమాపిమునుముందుకు త్రోవచూపు
మహాజ్యోతి ! ఒకే జ్యోతి !

ఏ జ్యోతిని వెదకివెదకి తెలియని సృష్ట్యాదినుండి
తెలిసిన మన యుగమువరకు ఎందరో మహానుభావులు
అనేక విప్లవకారులు సత్యాన్వేషణ మిషతో
త్రోవ తప్పిన మత ప్రవక్తలు
పేరులేని తిరుగుబాటులో కూలిన జనశత్రులు
కాలాన్నెదిరించిన మేధావంతులు
తమనెత్తురు చమురుపోసి ప్రాణాన్నే దివ్వెచేసి
నేటివరకు దేనికొరకు వెదకివెదకి విసిగారో
అదే జ్యోతి ! ఒకే జ్యోతి !

కన్నుమిన్ను కానరాని చీకటిలో నడిరేయిని
గృహమువీడి ధనమువీడి రాజ్య ప్రలోభనమువీడి
వీతరాగుడై వెడలిన గౌతమబుద్ధుని హృదిలో
అదే జ్యోతి వెలిగిందట!

ప్రభుశక్తిని ధిక్కరించి చావును తానై వరించి
మూఢజనుల అవహేళన అవమానపు వెత భరించి
తన కంటక కిరీటాన్ని తానై యూదల ధరించి
శిలువెక్కిన ఏసుక్రీస్తు హృదయంలో
అదే చిచ్చు రగిలిందట!

కునికిపాట్లు చీకటిలో బాధలలో ఆకలిలో
ఎదమరచిన నరజాతికి మేలుకొలుపు పాడేందుకు
అదే జ్యోతి!

యుద్ధాల దరిద్రాల ఈ చీకటి సముద్రాల
ఆవలిఒడ్డు చూపేందుకు, ఒకేజ్యోతి! అదేజ్యోతి!
జ్యోతి! జ్యోతి! ఒకే జ్యోతి!

కాని యెచట? జ్యోతి యేది?
మన నిద్రిత హృదయాల్లో
మన ముద్రిత నేత్రాల్లో
మన బానిస భావాల్లో జ్యోతియేది? జ్యోతిలేదు.

జ్యోతిని కోరేవారలు జ్యోతి పాదపూజారులు
ఈ జగ జీవితనిశిలో నూతన మార్గంకొరకై

భూతల స్వర్గంకోరకై వెదకే విప్లవకారులు
మీ ప్రాణం దివ్వెచేసి మీ నెత్తురు చమురుచేసి
జ్యోతిని వెలిగించండి!
మీ హృదయపు తిరుగుబాటు ఆరిపోని నిప్పురవ్వ
ప్రపంచాన్ని మండించే మంటల పంటలు పండించే
మీ బ్రతుకొక హారతిగా జ్యోతిని పూజించండీ!
జ్యోతిని ఆరాధించండీ!

— బైరాగి

గతా గతాలు

వెలుతురు వెనుకను చీకటి
చీకటి చీలుకు వెలుతురు
అనుదినమూ వస్తున్నయ్
ప్రతిదినమూ వస్తున్నయ్
వెలుతురు చీకటి కలిసిన
మునిమాపులు వస్తున్నయ్
తొలి వెలుగులు వస్తున్నయ్
ప్రళయ మేఘ మాలిన్యము
ఆకాసపు నైర్మల్యము
తిరిగి తిరిగి వస్తున్నయ్
ఆకులు రాల్చే ఫాల్గుణే
చెట్లు చిగిర్చే చైత్రం

ఏకంగా వస్తున్నయ్
అలసి సొలసి వస్తున్నయ్ !

ఛాయల్తో పోరని తేజ
స్వేంత వేదకినా కనిపించదు
పిచ్చిదనం ఘక్కు-మన్న
నవ్వులు పిండును అశ్రుల-
(శోకం సంతోషం మిత్రులు-)
శోకస్థానం తోషం
తోషస్థానం శోకం
వెను వెంటనే మార్చుకొనును
ఈ జీవిత రంగాలో కూడా
అశత్రోడ ప్రేమికు లేడ్తురు

- రాంపా

విన్నావా?

జీవితమొక కారణ్యం
కావ్యమ్మొక రాచబాట
విన్నావా ప్రియురాలా !
రాంపా హే ప్రణయగాధ?

ం

ఒక పాగా తలకుచుట్టి
మెడలో బంగారు కండె

బుజంపైన కర్ర కొసను
ప్రేలాడే చద్ది ముంత
వెండి బిళ్ళ మొల్తాడూ
చెవిలో ఒక చుట్టపీక
వలపనిండి తొణకు ఎదను
కాశికట్టు గోచితో
పయనిస్తున్నా నెటకో
విన్నావా ప్రియురాలా,
రాంషాహీ ప్రణయగాధ ?

౨

తరతరాల తమవారలు
తలనువంచి మెలగుటచే
కృంగి కృంగి కృశియించిన
బడుగు ముసలి దేహంతో
చేతికర్ర ఊపుకొంటు
ముష్టివాడు ఎదురౌతూ
'అన్నా ! ఆకలి అంటే'
చద్దిముంత చేతికిచ్చి
'ఛలో ఛలో' అన్నాను
విన్నావా ప్రియురాలా !
రాంషాహీ ప్రణయగాధ ?

3

యుగయుగాల బానిసత్వ
జీవనమును రోసిరోసి

తరతరాల దారిద్ర్యం
సైపలేక తిరగబడీ
అడవుల్లో బాటపట్టి
పయనించే దారికాసి
నిలబెట్టిన గజదొంగకు
మెడకంటెను మొలకట్టును
ఇచ్చివేసి పయనించా
విన్నావా ప్రియురాలా !
రాంపా హే ప్రణయగాధ ?

ర

కొంత దూరమేగుసరికి
అడ్డుపడెను మృత్యురథం;
తనువంతా నలగిచావ
హృదయం కాపాడుకొంటి :
తిండిపోయె, సొమ్ముపోయె
ఊపిరికూడా పోయెను
ఐనా నాహృదయం వణకబోదు
నాపూవు పెడదలోపల
నీ ప్రేమలు పెనగొన్నవనే ధైర్యంతో
విన్నావా ప్రియురాలా !
రాంపా హే ప్రణయగాధ ?

— రాంపా

రేపటి రోజు

నిన్న :

బాణాల ప్రస క్తిలేని పురాణాలు లేవుసుమా !
ఫిరంగీల స్వరం వినని చరిత్రంటూ లేదుసుమా !

ఇవాళ :

రూపాయిల ప్రమోతలేని రోజంటూ గడవదు ;
తుపాకీలు లేకుండా దొరతనం సాగదు.
రాజుల మాటేగాని రైతుమాట వినం, వినం;
అణుబాంబుల మాటేగాని
మనిషిగూర్చి అనం; అనం;
అమానుషంగా బాంబులువేసే
విమానాలపై అస క్తే గాని
శాంతికి సంకేతాలైన చక్కనిపావురాళ్ళు అక్కర్లేదు?
'నిన్నా' 'ఇవాళా' వేర్వేరు
అన్నమాట వట్టి అబద్ధం !
'ఆగామి' మాత్రం వేరని ఆశించడం తప్పంటారు ?

రేపు :

కవిమాటకు విలువ హెచ్చి కలహంమాట నశిస్తుంది !
రూపాయికి విలువలేని గోజు రేపు వస్తుంది !

— దాశరథి

అడవి

నెత్తుటి చిత్తడిలో లేచిన
త్యాగుల శిరాలు పూచిన
కిరాతక పాతకం పండిన అడవి
నాయనా ఇది అడవి!

అనగనగా చిట్టడవీ,
చిట్టడవిలోపలనూ చీమలునూ పాకవట.
అనగనగా కారడవీ,
కారడవిలోపలనూ కాకులునూ వాలవట;
చీమలకూ కాకులకూ భయమండీ ఈఅడవి
ప్రాణంతో వుండేటీ జీవులకు తలకొరివి
ఆసామీ ఖామందూ మనిషునీబులూ జంతువులు
హాలికులూ పాటకులూ అలబర్లూ నరబలులు
సింగాలూ సివంగులూ గూబలయూ ఏలికలు
పిచ్చుకలూ దుస్సులునూ పావురమూ పాచికలు.

ఈ అడవి సందిటా
మానవుడూ ఖైదీ, మానవుడు బందీ!
ఈ అడవి గుబుకులో
తోటబకఖైదీ. ఊట ఒక బందీ!
రాబండ గొంతులో
నెలయేరు ఖైదీ, గాలి ఒక బందీ!
గాగా గీగీ మంటూ గోముగోము యీ అడవి

పోదు పోదు ఈ అడవి
నలుపులోపల లేత చిగురయా గీతం
చిగురయా గీతం
గీతం నినాదం నినాదం నినాదం !

మృగఘూోషలను మించి సాంద్రాలు చించీ
కరగోడలను చేరువేగం నినాదం
ముష్టి పొదరింట గులాబీ నినాదం
సింహగర్భాన ఒక బాణం నినాదం
పుష్పం నినాదం ఉదయం నినాదం
వాహిని నినాదం వాసన నినాదం
అడవిలోపల కొరివి సరికొత్తనాదం
అడవిలోపల గొప్ప కూటమి నినాదం
నాదం నినాదం వేగం నినాదం
నినాదం నినాదం.

— రమణారెడ్డి

సత్యం-శివం-సుందరం

ఆక్రోశిస్తున్నాను నేను
ఈ నరహంతకులమీద అభియోగం;
అరదండాలు మాత్రమే చాలవు;
మరణానికి మరణమే శిక్ష !

జేవ్రరించిన ముద్దాయికళ్ళు, నెత్తుటిచారలగోళ్ళు
పీడవాలకాలే అతని వాజ్మూలం !
పడిపోయిన చెడిపోయిన మనుషులు,
పడిచిన పసుచులు; కొరికితిన్న కసుగాయలు
ఎండిన పాలిళ్ళు, పూర్ణతరాని పిండాలు,
విరిగిన అంగాలు, జరిగిన మానభంగాలు,
పంటపొలపు గుండెమీద వుక్కు-ముచ్చుముద్దర;

పిడికిటికి యిముడని నమమిళ్ళాద, మూడుముసుతల
పొ త్తిపొట్టమీద,
ఊరుసీమమీద చీలమండమీద, మోకాలు మోచేయి
నెమ్మోమునుమీద,
నుదురుపీపు అరచేయి అరకాలి మీద,
పసుచు గాలియేరి కోరికూర్చిన పసిడి ఇసక అలల తిన్నెలమీద
ఉక్కు-జోడు ముద్దర !
ఉక్కు-మడిమ త్రొక్కిడి !

వినాశనం నేరానికి సాక్ష్యం ! వినాశనం నేరానికి శిక్ష !
కొత్తకాదు శిక్ష, కొత్తకాదు నేరం,
షాహో, నీరో, ఖానులు, సీజరు, జూహా. ఖైజరు,
ఖైజారుకుస్వాములు, దాసులు, విక్టరూ విక్టిమ్మలు,

౭

భూరి భూధరశిఖర పాషాణ పీఠమ్మీద
కూర్చున్నాను అవలోకిస్తున్నాను

హార్యక్షాన్ని ! నిష్క-పటాన్ని ! ప్రజను !
నేనేరాజ్యాంగాన్ని, సార్వభౌమాధికారాన్ని !
పూవిసులు తురిమిన కేసరాల కొప్పలను
కనికారంలేక కోసిన మంగలి కత్తిని,
క్షురికవెనుక శాసించే పురాణాన్ని పీడకలలో కాల్చి
మని చెప్పతున్నాను !
ప్రాకారాల వెనుకాతల నిలువుటద్దాల నీడలుగా, అవమానపు
ముసుగులుగా,
వికారాకారాల సందిటిలో, సంకటిలో ఊపిరి విడిచిన ఆడ
జీవాల

కావిరినిండిన కళ్లు సాక్షులు !

ముడిపడకముందు మంచినీటి పూటను
ప్రసవించకమునుపే అనార్థిక్షేత్రంగా రొంపిగా కంపుగా
ఎడారి కావించిన పసరాన్ని ! అడవి నీతిని !
ఆలిని అదలించి పూల పట్టణాలలో విహరించే వెర్రి దాహాన్ని!
ముగ్గుసు నలుగురు మూగి జీవాల మధుకలశాలను
రోగాల ముకి కాలువలు చేసే ద్రోహాన్ని,
నిందిస్తున్నాను నేను !

నిందిస్తున్నాను నేను ! అంకుశంకూడా నేనే !
అనవసరమైన పొత్తి పొట్టమీద మెత్తను,
అన్ని వేళ్ళకూ రవ్వల వుంగరాలను,
విస్తట్లో విడిచివేసిన భక్ష్యాలను,

వెయ్యిమందిని చించుక వెళిపోయే కారును,
రెండెద్దుబళ్ళ నాగరికతలో రోల్సు రాయిల్సును.
రాగిరూకల నమ్మని విలువలేని భర్మాన్ని,
పూరిగుడిసెల నమ్మని ఎక్కలేని హర్మ్యాన్ని !
విధిస్తున్నాను శిక్ష, బధిరుణ్ణి ప్రార్థనలకు;
కొవ్వును పని-కొలిమిలో కరగించండి !
వుంగరాలు పంచుకొనండి !
కొట్లు ముక్కలుచేసి మెక్కండి !
ఒక కాసువంటి కార్ల్స్ కొల్లలు నిర్మించండి !
మిద్దెమీద ప్రతిగదిలో జంటలుగా వుండండి !

ర

నిందిస్తున్నాను నేను పరిశుద్ధమైన గంధాన్ని;
బూతులకు వెలసేసే కలాలను
రూకబలానికి వ్రాసిగంచేసే కలాలను
కట్టు కథలు కూసే కలాలను
హాలానికి అన్యాయంచేసే కలాలను,
వనమధ్యంలో ముక్కుమూసుకున్న శాఖామృగాలను,
కొండకోనలమీద గుహల్లోకూర్చున్న జాంబవంతులను
మనుషులు మనుషులుగా బతకమంటాను
పసరనీతి బోధించే వాళ్ళను చితకతంతాను,

ళ

నిందిస్తున్నాను నేను దిగంబర న్యాయాన్ని;
పంజరాలను, చీకటిని, మంగళసూత్రాన్ని
నిందిస్తున్నాను, నేను,

బలహీనులను ద్రోహులను రాక్షసులను
కీతను గోతను పాతను;
పాతను నిందిస్తే ఎగిరిపడే నాలుకను,
దుఃఖం పోవాలంటే దిగులుపడే గుండెను,
నిందిస్తున్నాను నేను;
నెమలి సింహాసనాన్ని, తాజమహలు శిల్పాన్ని;
పిరమిడ్‌ను, మేడమీది కేళికారామాలను;
పీటికి శిక్ష, మ్యూజియములు కావటం,
నిందిస్తున్నాను నేను;
ఉండికూడ సిద్ధాంతంకోసం పస్తులు మాడేవాణ్ణి,
ఉండికూడ తృప్తిని చెప్పేవాణ్ణి, ధర్మంపాడేవాణ్ణి,
మర్మం కప్పినవాణ్ణి, చర్మం పచ్చటివాణ్ణి,
ఈ నరజంతువులకు శిక్ష, జంతు ప్రదర్శనశాల జీవితం
ముందు తరం దేవతలకు ఆశ్చర్యం కల్గించడం,
నిందిస్తున్నాను నేను;
ఉన్నదానితో తృప్తిపడమన్న మతాన్ని,
లేనిదానికి ఆశించకూడదన్న మతాన్ని,
మనుష్యులను యంత్రాలుగా తంత్రంచేసిన మతాన్ని,
రాజులతో పూసుక తిరిగిన మతాన్ని,
అజ్ఞానం ప్రబోధించిన మతాన్ని,
నిందిస్తున్నాను నేను:
లాభాలకు వ్యాపారాలను, తేలే నగరాలను,
విదేశ పెట్టుబడులను, విదేశ దురాక్రమణలను,
యుద్ధాలను, భీభత్సాలను, రాద్ధాంతాలను,

లాభాలను రద్దు చేస్తున్నాను !
సేనలకు శాశ్వత విరామ మిస్తున్నాను,
పూర్వపు సైనికులకు పని యిస్తున్నాను !
ఆయుధాలు జాతిపరం చేస్తున్నాను !
ధార్ ఎడారిలో గోధుమ పండిస్తాను !
విమానంలో ప్రయాణీకులకు అవకాశం
పెంపొందిస్తున్నాను !
ట్రాక్టరిస్తున్నాను, మెట్టపొలం
బెట్టపొలం రద్దుచేస్తున్నాను;
గట్లు, గనిమలు కరగోడలు పడగొడుతున్నాను,
సుఖం పంపిణీ చేస్తున్నాను.

ఈ

బహిష్కరిస్తాను, నరనివాస
గోళాంచలాల వెలికితోలుతాను;
విషాన్ని విషాదాన్ని నిషాను విషాదులను,
కషాయాన్ని కాషాయాన్ని; ఘోషాను గోసాయీలను,
వేషమహిమను, దోషపటిమను, పాషాణాలను భోషాణాలను,
మతాన్ని మఠాన్ని మాధ్యాన్ని, మసీదు గుడిగోపురచర్చీలను
చక్రవడ్డిని, వక్రబుద్ధిని
వ్యాకరణాలను, ఆకలి మరణాలను
భరణాలను, తలతిరుగుడు కరణాలను
దురాక్రమణాలను, మతి భ్రమణాలను
విషణవీధి కుంభ కోణాలను
లంచగొండి మంత్రుల దాణాలను,

ఎర్రబుట్ట అమ్మలపొది బాణాలను,
ఆవిష్కరిస్తాను: తొలి వేకువ
ఎరుపు తెలుపు వెలుగులోకి :
అక్షరాన్ని అనశ్వరత్వాన్ని
అచ్చరవంటి పంటపొలం తిని
రసాన్ని రాగాన్ని, తడిని, తమాపాని
కల్పలనను, కల్పకాన్ని, కులుకు కులాసాలను,
ఇతి సత్యం, ఇతిశివ మితి సుందరం !

— రమణారెడ్డి

ప్రతిజ్ఞ

ఇది దౌర్భాగ్యుని స్వప్నంలో,
తలచుకున్న స్వీయగాధ !
ఇది గర్భగుడి మూలల్లో,
కుములుచున్న మనోబాధ !

ఇది జీవిత పరమావధికై,
చేయుచున్న కర్తవ్యం !
ఇది భావికాల పరివర్తనలో,
దాగియున్న ఆంతర్యం !

ఇది లోకానికి స్పష్టపరిచి,
చాటుచున్న పరమసత్యం !

ఇది ప్రజలకు కనువిప్పుచు,
సాధించిన జయకృత్యం !

ఇది వసంత శకుంత సంతానంలో
ప్రదోషగీతిక లాలాపించినవిపంచి !
ఇది నియంత హంతక చర్యలు
అరికట్టిన క్రాంతి సాగరుల జయంతి !

ఇది అనాది భారత సంస్కృతిలో
రేకెత్తించిన తళుకురేఖ !
ఇది జనాధినేతల హృదయంలో
జ్వలించిన మెరపుతీగ !

ఇది శ్రమజీపుల స్వేదోద్భవ స్వేచ్ఛావాణి !
ఇది క్రమశిక్షిత యోధవరుల ప్రియపాణి !
ఇది పాతకొత్త భావాలకు,
అనుభవాలయుగసంధి !
ఇది జీవన పరిశోధనలో,
విజయానికి నాంది !

* * *

అది ఎదలో సాదయై మండిన అనలం
ఎమర్జైన ముళ్ళపొదల దహిస్తున్నది !
అది ప్రజలను పీల్చిన పిశాచహాననం
చీకటి తెరలను ఛేదిస్తున్నది !
అదిగో దానవమూకల మారణహోమం
దుర్గమ వర్ణాటవి కాలుస్తున్నది !

ఇది ప్రజలకు పరీక్షా సమయం
అందులకే రక్షు కడుతున్నారు
ఇది నరులకు దీక్షాసమయం
'అందులకే' ప్రతిజ్ఞ చేస్తున్నారు!

— రెంటాల

పల్లకీ బోయీలు

[కాకీక వాంఛలు కన్నుల కొక మాయెతెరను కప్పగా కంటతడిపెట్టే బ్లాలిని కాలదన్ని ఒక పెద్దమనిషి చీకటి తప్పు చేయడానికై పల్లక్లోం పొయగూరికి ప్రయాణంచేస్తున్న పుడు ప్రభువెక్కిన పల్లకిమాటగాక, అని భాగంగా, బాధగా మోస్తున్న బోయీల విషాద గీతిక.]

హూ హూ హోం, హూ హూ హోం!
హూ హూ హూం, హూ హూ హూం!!!

అడుగేర, అడుగేర, వడివడీగ, తడబడాక
పడివడీగ, తడబడాక, అడుగేర అడుగేర!

కటికో రాళ్ళానేల, కనిపెట్టి అడుగేయి
సూపుల్లాంటి ముళ్ళు, సూపూ కనపడనోణ్ణి!
దొరగోరిపనిత్వరగ, సేసే సెయ్యాలంట
వల్లూ కుదుపకుండ, పల్లాకీ పోనీయర!
వెలమూలి మొక్కేదో, వెళ్ళా బుచ్చాలంట
'మత్తానయ్య' ఉసుసుకు, మణుగుల కొద్దీ బెల్లం!

పోతూరాజుకాడ; బొగ్గడాయెయ్యాలంట
పోలేరమ్మకు పెద్ద, కొలుపూ సెయ్యాలంట !

ఇంటీలో ఇల్లాలు, కళ్ళల్లో నీళ్ళంట
మనసూ పొగ్గైతల్లి, కడుపూలో చిచ్చంట !

కామం పెరిగీపోయి, కళ్లూ పూడినయంట
కొగాలించిన సిరిని, కాలితో తన్నాడు !
పసిడీ నిమ్మాపండు, కమిలీ పోతుండాది
బుసలూ కొట్టేపాము, విసమూ కక్కుతోంది !

కుళ్ళూ గుంటాలోన, గుమగుమలు లేచాయి
గూటీలో దీపాలు, కొండెక్కు తుండాయి !

సుళ్ళాగల పాతెద్దు, ముళ్ళూ మేస్తూ ఉంది
గుళ్ళల్లో దేవుళ్ళు, గుండె మండూతోంది !
నరకంలో భూతాలు నవ్వూ కుంటుండాయి
పూశోటలో గాలి ఏడుస్తువుండాది !

హూ హూ హూం; హూ హూ హూం !

హా హా హూం, హా హా హూం !!!

* * *

నెలకూకే సరికల్లా, పొలిమేర తొక్కాల
సీకాటూచ్చిందంటె, సీకాకు పడతాడు !
తెల్లావారకముందె, తిరిగీ వచ్చేచూలా
పొల్లయిన ఈగుట్టు, బయటా పొక్కారాదు !

తుమ్మా బీమూకాడ, త్తుంగా మొలిసుండాది
సూదుల్లాంటీ ముళ్ళు, సూపూ కనపడనోణ్ణి !
చింతా తోపూకాడ, సెడ్డా భయమేస్తాది !
'స త్తిగాడూ' మొన్న సచ్చింది ఆడనే

కోడేతాసూ పడగ, ఎ త్తీ కొట్టిందంట
పల్లాకీ వదిలేసి, ఎగిరీ పడ్డాడంట !
నోటంట గుప్పిళ్ళు, నురుగూ కక్కి-ండంట
ఎర్రీగా కేకేసి, కన్నూ మూసిండంట !

'మునసేపు' దొరగారు, మూర్ఛాలన్నాడంట
ముసిలీదానీ పాణం, నిముసాల మీదుంది !
హూ హూ హూం, హూ హూ హూం !
హూ హూ హూం, హూ హూ హూం ! ! !

ఇంటీ దానికిజరం, వంటా కాస్తుండాది
సంటోము సనుబాల, కేషత్తు ఉంటాము !
సూసీపోదామని, సుట్టాలు వచ్చిర్రు !
సట్టీలో నూకాలీ పూటకే సరిపోవు !

పొద్దూ టేళానుంచి, పొయ్యో నిప్పెయ్యలేదు
'సద్ది' లేక దొరగారి సావిట్లూ ఉండాను !
హూ హూ హూం, హూ హూ హూం !
హూ హూ హూం, హూ హూ హూం ! ! !

పెదకాపు గారేమొ, పెసిడెంటవుతాడంట
మంతీరీ గోరెవరో, మనూరూ వస్తారంట !

మెలాబట్టలు దొరవి, మస్తూగ ఉండాయి
మల్లే పువ్వుల్లాగ 'సలవా,' సెయ్యాలంట !

పాడూ పడ్డా రేపు, సుక్కానీళ్లూ లేవు
ఎటూ చేయ్యాలీర, ఈ ఎటి సాకిరీ !
కరణమోరీలెక్క, రేపూ తనికీ అంట
కచ్చేరు కాడానే, 'కాపలా' వుండాలంట !

సలిపెడత ఉండాది, సంకా లెగుసుటలేదు
తలగుడ్డలోచుట్టు. ముక్కా గూడా లేదు !
దొరగోరి నడిగీతె, దుంపైనా ఎయ్యాడు
కలిగీ నోరీఇంట, కనికారముండాదు !

పూలా పల్లకిమోసి, పుళ్ళా పడ్డాయీర
బుజమూ నొప్పెడతాది, సెయ్యా మార్చుకోర !
భయమైన బాధైన, బరువైన కరువైన
పనుపూ కాపాడీదొర, పాణాలు నిలపాలి !

కటికే రాళ్ళానేల, కనిపెట్టి అడుగేయి
సూదుల్లాంటీముళ్ళు, సూపూ కనపడనోణి !
రాళ్లైన మోయొచ్చు, రధమైన లాగొచ్చు
గుండెలేనీ మనిషి, కూర్చున్న పల్లాకి
రంపాలతో కోసి నట్టూగ ఉండాది !

హూ హూ హూం, హూ హూ హూం !
హా హా హూం, హా హా హూం ! ! !

— రెంటూల

నిరాశ

నా గుండెలోమంట, నా గొంతులో బాధ
నా కడుపులో చిచ్చు ఏనాటికై నాను
అలాడి ఇటులనె మరణింతునా !
చల్లారి నేనింక సుఖియింతునా !

నా రక్తమును ద్రావి, నా కండలను నమిలి
నా పైన అధికార నటన జేయుచునున్న
కనలి నా బ్రతుకిట్లె కాలిపోతుందా !
తప్పు పద్ధతి యింక దగ్ధమౌనా,

నా కష్టఫలితమును నాడె దోపిడిజేసి
అన్నమన్న మటంచు అలాడ జేసిన
కనలి నా బ్రతుకిట్లే కాలిపోతుందా !
తప్పు పద్ధతియింక దగ్ధమౌనా,

ఎండలో వానలో బండనై పోయాను
బురదలో ముండ్లలో పూడిపోతునాన్నాను
కనలి నా బ్రతుకిట్లె కాలిపోతుందా !
తప్పు పద్ధతియింక దగ్ధమౌనా,

పాలులే కల్లాము పసిబిడ్డ ఏడ్పుతో
కూడు గుడ్డల కేమ్చ కులకాంత ఏడ్పుతో
కుమిలి పోతున్నాన్నాను
తప్పు పద్ధతియింక దగ్ధమౌనా,
కనలి నా బ్రతుకిట్లె కాలిపోతుందా !

ఎముకలను కొరికేయు ఇంత చలిలో గూడ
ఈ తోలు గుడిసెయే ఈ చింకి చాపయె
కనలి నా బ్రతుకిట్లె కాలిపోతుందా !
తప్పు పద్ధతియింక దగ్గమానా,

ఇంద్ర భవనములందు పట్టు పాన్పులవారు
కమ్మనీ తీయనీ కలలు గంటున్నారు,
కనలి నా బ్రతుకిట్లె కాలిపోతుందా !
తప్పు పద్ధతియింక దగ్గమానా,

ఎముకలన్నీ విరిగె కండలన్నీ తరిగె
జీవచ్ఛవంబునై జీర్ణించి పోయాను,
కనలి నా బ్రతుకిట్లె కాలిపోతుందా !
తప్పు పద్ధతియింక దగ్గమానా,

కష్టజీవిని నేను, కటిక లోకము నన్ను
కాల్చివేస్తున్నదీ మాడ్చివేస్తున్నదీ,
నిప్పులా నన్నిట్లె మాడ్చివేస్తుందా !
తప్పు పద్ధతియింక దగ్గమానా

— నారపరెడ్డి

గెరిల్లాలతో ఒక నిమిషం

అంతా క్షేమంగా, కులాసాగా
వున్నారా ప్రాణమిత్రుల్లారా !
ఎప్పుడూ 'జాగ్రత'పై ప్రయాణం
చేయండి నా పంచప్రాణాల్లారా !

మీకోసం చెట్టుకొక్క
పువ్వుకోసి మాలల గుచ్చాను !
లక్ష భాషా సంద్రాలు తరిచి
శతకోటి పాటలల్లాను !

మీరు రాలినా, నిలిచినా
మీ పేరుకొక్కటి కోటకట్టాను !
కోటకోటలో మీ స్మృతికై
నగరమొకటి సృష్టి చేశాను !

తేనెపట్టుకొక్క బొట్టుతీసి
అమృతంచేసి తీసుకొచ్చాను !
ఆవు ఆవుకు గిన్నెడు పాలు పితికి
మీ కాళ్ళకు వారుపోయ వచ్చాను !

ఎన్నో పాలవంటి తెల్లని పూలు
మీకోవనిండా పరిచేందుకు తెచ్చాను !
ఎన్నో తల్లివంటి స్వచ్ఛమైన
నా స్వప్నాలు ఏరి తెచ్చాను !

అనామకంగా అడవులలో వీరమరణం పొందిన
శూరుల మహోన్నత జీవిత కావ్యాలు వ్రాసుకొచ్చాను!
శత్రు తుపాకి కాల్పులకు కూలిన ప్రతి వీరుని
రక్తప్రమఖగున మహా జయ స్తంభం ఎత్తి వచ్చాను!

నడచినడచి బొబ్బలెక్కిన మీ పాదాలను, పాదధూళిని
నా వెచ్చని కన్నీళ్ళతో ప్రక్షాళనం చేయవచ్చాను!
మీ గుండెలలో వెలిగే మహోజ్వలాదర్శానికి
ఆకాశంతాకే స్వరూపం కల్పించి ఆయువు పోస్తాను!

ఒరిగిన యోధుల సమాధిమీద
నందనవనాలు నాటి వచ్చాను!
మొగ్గమొగ్గకూ, విషాదసంతప్త
జీవన రాగాలు నేర్పివచ్చాను!

వీరమాతా పితలు పంపిన
రక్తగంధం పట్టుకొచ్చాను!
అందిన ఆచూకీ, పొందిన అనుభూతి
కనురెప్పల్లో దాచి తెచ్చాను!

మీ తలిదండ్రుల, భార్యాపిల్లల
క్షేమసమాచారం తెలుసివచ్చాను!
పొలాలు పొలికేక లేస్తూ, పొరుపాలు
పండుతున్నవని చెప్పిరమ్మన్నారు!

ఎవరైనా కాస్త శాంతిగా వున్నా రేమోనని
దేశం నలుమూలలు గాలించిచూచాను!

అలజడి, అశాంతి, అన్యాయం, ఆక్రందన—
పరిపాలనలో మాతృదేవి బందీ అయింది !

ఎక్కడైనా ఒక చిరునవ్వు చూద్దామని
బండెడు ఆశలతో కళ్లు కాయలు కాయించాను !
అవమానం, ఆకలికొలిమిలో వేగుతున్న
దేశం, ద్వేషంతో భగ్గున మండుతోంది !

మరణం, కన్నీళ్ళ భూదేవి ముఖం
నుండి తుడిచేయను రణం కావాలి !
హత్యలు, మృత్యువు ప్రసాదించే
ఈ వ్యవస్థను భూస్థాపితం చేయాలి !

మండే ఎండలో కండ కదిగే రైతులు
గుండెలొడ్డి మీలో చేరవస్తున్నారు !
నెత్తురుపిండి యంత్రం నడిపే కార్మికులు
ఏకంగా తీవ్ర సంఘర్షణకుద్యమించారు !

కరకర పొడిచే పొద్దులుగా యువకులు
ఈ అర్ధరాత్రి మీలో చేరవస్తున్నారు !
చరచర పొంగే ఉప్పెనగా యువతులు
సాయంత్రం దళాలలో చేరిపోతారు !

నీరు తరచూ చిల్లర వెచ్చాలకు వెళ్ళే
అడవిపాలెంలో యం.యస్.పి. మాటుపెట్టింది !

మీరు రాత్రులు సంచరిస్తారని తెలిసిన 'జ'
ప్రదేశం చుట్టూ గట్టిపోలీసు నిఘావుంది !

క్యాంప్రేలో తెల్లజండా ఎత్తిన నాయకుడు
పత్రికలలో విద్రోహ ప్రకటనలకుపక్రమించాడు !
ద్రోహులు పోలీసు వ్యానులలో తిరుగుతూ
తెలిసిన సమాచారం పొల్లుపోనివ్వడంలేదు !

ఉత్తర దక్షిణ ప్రాంతా లెళ్ళిన
కొరియర్లు నిహతులయ్యారు !
పగవాళ్ళు ప్రతినీటిగట్టున
మాటుపెట్టుక పొంచి ఉన్నారు !

మీరు మంచినీళ్ళకు వెళ్ళుతున్న
నక్కలు మడుగులో మందుకలిపారు !
చిక్కిన దళాల నాయకుడు తల్లి
రొమ్ముగుద్ది రహస్యాలు కక్కుతున్నాడు !

పంచభూతాలు మన అక్షయ వజ్రకవచాలు !
అశేషప్రజానీకం మన విలువైన పంచప్రాణాలు !
చంద్రుడు మన గెరిల్లాక్యాంపులో లాంతరు !
పృథ్వీ హృదయం ఎర్రసేనల రక్షణప్రాంతం !
పదండి ! పరిక్రమించండి !! జయించండి !!!

— గంగిశెట్టి

తల్లి
తనయునికి :

నాయనా !

ఏమపుతప్ప ఏముంది చెప్పడానికో, వ్రాయడానికో !
ఉన్న తరతరాలనాటి ఆస్తి, గౌరవమర్యాదలు వూడ్చుకపోయ్యాయికదా !
బలవంతంగా చద్దామంటే స్నేహితులు చావనీయక,
చావురాక
ఎప్పుడూ నుయ్యోగొయ్యో చూసుకోడానికి వీలు
వెదుకుతున్నా !
నాలుగు ముక్కలు వ్రాద్దామని కూర్చుంటే, కమపు తరుక్కు-
పోక్కొంది
ఏ విషయం జ్ఞాపకం చేసుకున్నా చారెడంత పచ్చిరణాలను
కెలుకుతున్నట్లుంది !

నీకు తెలియదురా, తల్లిశోకం ఎంత పదునైనదో తెలియదు !
నీవు భూమిమీద పడ్డనాడు ఎంతగ ఉప్పొంగిపోయానో,
పాలుపోసి నీ చుట్టూ ఎన్ని ఆశల్ని, రెమ్మలు కొమ్మలు
తొడిగించానో
పూలల్లో పెట్టి ఎంత గొప్పగా పెంచానో నీకు తెలీదు !
నీకు ఒక్కఏపు తిరగకముందే మీ నాయన స్వర్గస్తుడైతే,
ఒంటరిదాన్ని నిన్ను పెంచడానికి ఎన్ని అవస్తలుపడ్డా !

పస్తులతో, బండబూతులతో పొద్దుపొడుస్తూంది, కూకుతోంది
ఏది తలుచుకున్నా కడుపులో చేతులు కలియబెట్టి నట్లుంది
'వాళ్ళ'కు భయపడి మనపాలం ఎవరూ కౌలుకు చేయడంలేదు
నాతోమాట్లాడితే, నాకు సహాయపడితే 'వాళ్ళు' బాధిస్తారని
పొరిగింటి కాకికూడ మన యింటిమీద వాలడంలేదు
దిక్కులేని ఈ గుడ్డిముండ ఎలా బ్రతకాలో చెప్పలనాయనా !

కాళ్ళుకళ్ళులేని నాకు మంచినీళ్ళిచ్చే దిక్కులేదు
ఇల్లు పోలీసులకప్పజెప్పి పరుల పంచల్లో పడిఉంటున్నా
ఏడ్చే ఓపికకూడ లేక బూడిదముద్దలాగున్నా !
గడ్డకట్టిన కాసారాలలా ఉన్న కనుగుడ్లవెంట నీళ్ళొరావు !
కాని నా నిమిత్తం అరనిమిషం విఫలమార్గం తప్పనద్దు !
నేనుపోతే భయపడనద్దు 'వాళ్ళ'సమాధిమీద నా సమాధి
కట్టించుతండ్రీ !

ఉడిగిపోయిన నన్ను నీ మహోన్నత సంకల్పం ఉప్పొగిస్తుంది !
మాతృభూమి విముక్తికి ప్రాణత్యాగం చేసే సుపుత్రుని
కన్నతల్లిని !
అందుకు హర్షనర్షంలో పునీతమవుతున్నా !
నిన్నుగురించి, నీ శౌర్యాన్నిగురించి ఊళ్ళల్లో ప్రాకిన
కథలు విని
ఆనందంతో నీక్షేమంకోసం అహోరాత్రాలు భగవంతుణ్ణి
ప్రార్థిస్తున్నా !
కాని, మృత్యునెమురైనాసరే, కన్నకడుపు కట్టతెగిన

నింపు చెయ్యివైనాసరే, వెన్నుచూపేవు, తలవొంచేవు !
శత్రు రుధిరంతో మా పరాభవాన్ని క్షాళితం చెయ్యి
నాయనా !

పెద్దలమాట పూరికేపోదు, నేనూ ఆశీర్వదిస్తున్నా :
తప్పకుండా నామాట సత్యమయి తీరుతుంది
రావణుణ్ణి సంహరించిన శ్రీరామునంతటి వీరుడ వౌతావు
ఆనాడు నాకు నిజంగా శాంతి లభిస్తుంది, జీవితం సార్థక
మవుతుంది !

'కృష్ణా, రామా' అంటూ కాలం వెళ్ళబుచ్చాల్సిన ఈ
వృద్ధాప్యంలో
దినగండం నూరేళ్ళ హింసాకాండగా బ్రతకాల్సి వచ్చింది !
లంకంత ఇల్లుగుల్లచేసి పోలీసులు క్యాంపు పెట్టారురా,
నన్నుచావచితక్కగొడితే భయపడలేదు, కానిచోటకాననిసీమల్లో
కడగండ్లలో ప్రమాదపు గండెకత్తెరలో నీవు తలదూర్చితే
ఏడ్చి ఏడ్చి ఊరుకున్నా—కాని నా కోడలు..... .....
అవును నీ భార్య..... ...కన్న బిడ్డలా నాకు అండగా ఉన్న
కోడలు..... ...

నీ భార్య..... ...ఏమని చెప్పేది నాయనా ! ఎలా చెప్పేది...
సీతాదేవివంటి నా కోడలు దిక్కులేని చావుచచ్చి బీటిలో
పడిఉంటే

కాకులు, గద్దలు పీక్కుతినే ఆ కళేబరంమీదపడి నిలువెల్ల
నీరయ్యాను !

నెలపొడుపు నాడూ ప్రయుగుకంటె హీనంగా చనిపోయింది
నాయనా !
ఎందుకు నేను బ్రతకటం, ఏమి చూసుకుని బ్రతికేది !

అబ్బిడ్డ మన గడపతొక్కగానే మనల్ని సకలైశ్వర్యాలు
నెత్తికెత్తుకున్నాయి,
ఆమె నిష్క్రమించగానే అష్టకష్టాలు మనల్ని చుట్టుముట్టాయి
ఎప్పుడూ నీవు జైళ్ళల్లో, అజ్ఞాత జీవితంలో మగ్గుతున్నావు
ఆమె కంటికే మింటికి ఏకధారగా కళ్ళు కరిగించింది నీకోసం !
నాలుగు దిక్కులు ముక్కలుగా మనవేలు పెట్టుకునేట్లు ఇల్లు
గడిపింది !

తులసికోట ప్రశాంతత చూస్తే ఆమె ముఖం జ్ఞప్తికొస్తుంది
పచ్చని పొలం గంభీరతలో ఆమెరూపం ప్రతిఫలిస్తుంది
రామాయణంలో సీతమ్మ చెరలు ఆమెముందు తీసిపోతయి
మనం దక్కించుకోలేక పోయాం, అతల్లి మనఇంటి మహాలక్ష్మి
నట్టేట్లో నన్నొదిలిపెట్టి నీవరణ్యాలలో ఇడుముల పాలయితే
పుట్టెడుదుఃఖంలో నానుతున్న నన్ను కన్నబిడ్డలా కళ్ళల్లో
పెట్టుకుంది !

ఒకరోజు పొద్దుకూకగానే 'వాళ్లొ'చ్చి ఇంటమీదపడి
కోడల్ని ఎక్కడికో ఈడ్చుకెళ్ళారు !
గజగజ వణుకుతున్న నేను పొద్దున్నే-ఊరంతా కుతకుతలాడే
వార్తలు పిచ్చెక్కిస్తే తలనేలకేసి బాదుకున్నా !
గుంపులుగుంపులుగా కూడి కన్నీళ్ళు మింగారు గ్రామస్తులు !

ఆనైచ్యం చెప్పడానికి నోరు పెగలడంలేదు, చేతులు
వణుకుతున్నాయి,

అదృశ్యం ఎంత భీభత్సమో మనస్సుతో చూడు !
తక్షణం ప్రళయరుద్రుడవై అంతకు వేయంతల క్రోధంతో
విజృంభించి, విక్రమించి, వారిగుండె రక్తం పిండిరా !
అమె అత్మకు శాంతి ప్రసాదించు ! అదే పదివేలు ! !

నీ క్షేమ సమాచారం తెలిపి ఆరుమాసాలవైనయింది
నేను కళ్ళు మూసేముందు నిన్ను కళ్ళారా చూడాలని వుంది
ఈనా చిట్టచివరి కోరిక చెల్లించాలి నాయనా
మృత్యువు నిత్యం తలుపు తడుతూనే ఉంది
కోడలు పోయిననాడే నేను కాళ్ళు కాటికి చాచాను
కలుసుకోవడానికి వీలులేకపోతె, నాకడసారి క్షణంలో
నిన్ను స్మరిస్తూ, దీవిస్తూ, నీ విజయం ఆశిస్తూ కన్ను
మూశానని
తెలుసుకో నాయనా !

— గంగినేని

త్రిశంకు నరకం

ఎందరెందరో స్వర్గం స్వర్గం స్వర్గం అన్నారు
ప్రత్యేకొక బుద్ధి; జిహ్వాకొకరుచి;
మనిషి మనిషికీ తలవొక స్వర్గం;

పెద్దలో మొద్దులో అన్నారు
దేవుని ప్రతిబింబం మానవుడని;
మానవ ప్రతిబింబమే దేవుడని
మొన్నటి థింకర్ ఒకడన్నాడు,

అదీ యిదీకూడా కాదంటూ
సైతాన్ ప్రతిబింబమె మానవుడో
మానవ ప్రతిబింబం సైతానో
అంటూ—కాదనే దెవరంటూ;

శంకరుడొకడూ గౌతముడొకడూ
ముండిత మస్తకులై అన్నారు.
'లోకం శోకమయం సమస్తం
సర్వం దుఃఖం ఖల్విదం జగత్'
ముందో వెనకో తెలియని అటు
స్వర్గం అనేది లేనేలేదు.
ముందో వెనకో తెలియని యిటు
నరకం లేదన గుండెయే లేదు

ముందూ వెనకా కాని మధ్య
అంతా నరకం; చింతా నరకం
కుశంక నరకం; త్రిశంకు నరకం;
కావాలిప్పుడు త్రిశంకు నరకం;
రావాలిప్పుడు త్రిశంకునరకం;

ఘనీభవించిన నారకతమస్సు
గభీరగర్భం ననవకాంతులు
ప్రజ్వరిల్లగా రావాలిప్పుడు
కావా లిప్పుడు త్రిశంకు నరకం ;

పదిహేడువందల యెనభయినాటి
పేరిసు నరకపు బజారు వీధులు
వీధుల డ్రెయినేజ్ తీరాలందు
పిల్లాజెల్లా తట్టాబుట్టా
వీపున వేసుక మహామహా ప్రజ–
కడుపులాకాళ్ళు, కళ్ళల్లో నీళ్ళు; బయళ్ళు,
ఎండి ఎండి వ్యాపించిన పెద్ద పెద్ద బయళ్లు
బయళ్ళ నడుమని రయిలుదారిపై
మెయిళ్ళ మాదిరి మహాప్రజ–
సిండారీలో, మరాఠిజనులో
పిత్రుదేవతల పొలాలగనులో
అడవుల కొండల నదుల చీకటుల
మహామహా మహామహా మహాప్రజ ;
కళ్ళల్లో నిప్పులు కురవాలీ
ఎొళ్ళువిరిచి పైపైకి లేవాలీ ;
ప్రళయ ప్రభంజనావేగంతో
అమావాస్యా తమస్సాగరతరంగ పటలోద్వేగంతో

విరుచుకుపడాలి ;
కావాలి! త్రిశంకు నరకం :
లుక్‌ఫర్ ఎనిథింగ్ నెయివ్
ఓన్లీ ఆన్ ది గ్రేవ్ !!

— పూషా

ఇసుకగడియారం

జనత గాఢనిద్రా లగ్నము
కవిత దీర్ఘ స్వప్ననిమగ్నము
ఈ సివిలిజేషను డొల
ఇక భవితవ్యము కల్ల

తొలి అజ్ఞానపు చైదము
కడతేర్చెను మానవనైజము
లేదు ఇచట ధావళ్యము
లేదు మనకు కైవల్యము

విడదు శిరోజముల చిక్కు
కడతేరదు మానవభుక్కు
ప్రడమి ఊరితాళ్ళ వ్రేలును
పడి ఒక్కుమ్మడి వ్రేలును

నేటి అత్యున్నత శిఖరము
రేపు పెన్పల్లము నిఖరము
ఎందులకో కొలమానమ్ములు
దండుగ మన ఉపమానమ్ములు

— ఆకుద్ర

నీటి గడియారం

నువ్వు ఎక్కడలచుకొన్నవైలు
ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు
ఏళ్ళూ పూళ్లూ నిరీక్షించలేక
ఎక్కేస్తా వేదో ఒక బండీ
నీ అదర్శాల లగేజీ
ఎక్కెసంటాము టి. ఐ. సీ.
నీ ఈప్సితాల ట్రంకు పెట్లు
కలల బ్రేకులో పారెజ్యాలి
నువ్వు తెచ్చుకొన్నవన్నీ ఎక్కించీ లోపున
కదిలిపోతుంది బండీ
అందుకే అందులో కొన్ని
నీ అభిమాన హీగోల దగ్గరే ఒదిలెయ్యి
నువ్వు వెళ్ళదలచుకొన్న ఊరు
నువ్వు బతికుండగా చేరదా వైలు
దేవుడా! ఇంత చేశావా అని
ఉన్న ఊళ్ళోనే ఉండు!

— ఆకుద్ర

ఓం తత్సత్

ప్రపంచ శాంతి సంరక్షణకోసం
పదిమూల సూత్రాల పథకం వేశాం.
సామదాన భేద దండోపాయాలురా !
సరిచూసి వేలిముద్రలు వేశాయిరా !

హక్కులూ అశయాలూ దండగుచ్చాం
వీధి పోయేవాడి మెళ్లో పడేశాం.
పీటముడి వడిందా ? పీక తెగుతోందా ?
విడుతుందిలే, భయపడకు !
ముహూర్తం వస్తుందిలే, తొందరపడకు !

నువ్వెవరు ? నేనెవరు ?
అందరం సర్వం, శ్రీజగన్నాథం
భూగోళ గర్వం
అది మహాలక్ష్యం, సాధనే సాక్ష్యం

ఇస్తానులే పదిరూపాయిల నోటొక్కటి
నామాటవిని చెప్పింది చేయొక్కటి
భాష్యాలు లక్ష్యం చేయకు
మట్టికొట్టుకు పోతావు.
వేషాలకు లోకం నీకు ?
భరతనాట్యం కూడ చేస్తావు !
వస్తాయికద తమ్ముడూ !

ఎంతవాడికైనా పాట్లు
దీపమున్నప్పుడే, చక్కపెట్టాలంది
మూల సూత్రాలలో, మొదటనే ఉంది!

— పన్యాల

మా న వ తా!

తరతరాల క్రిందటి, చరిత్రల ఊహల కందని
"నేండర్ థల్" భూఖండాన 'ఏప్' రూపంలో
ఇంచుకంత తొంగిచూచిన మానవతా!

ఇలాగర్భకోశంలో జీర్ణమైన 'జావామనిషి'
ఫాలఫలక రేఖల్లో ప్రతిఫలించిన మానవతా!

కిరణశకలం చొరలేని
'ఎస్కిమో'ల హిమకుటీరాల్లో ఒప్పించిన
మానవతా!

శతసహస్రాబ్దాలనుండి గతానుగతికంగా కల్గిన
జగద్వ్యాలయ చలనం ఫలితంగా——
మంచులు పేరుకొన్న
మానవుని మేధోమండలంలో విజృంభించిన
పరిణామాగ్ని జ్వలనం ఫలితంగా——
మొన్న మొన్ననే పశుత్వపు
పొలిమేరలు దాట గల్గినావు మానవతా!

•

జిజ్ఞాస పెచ్చు పెరిగినకొద్ది విజ్ఞానం వేళ్ళు తన్నినకొద్ది
జగత్తునుండి చంద్రబింబానికి రహదారులు తీసే
రహస్యాల్ని శోధించడానికి
తహ తహ పడుతున్న నాగరికతా జీవి !
అణువణువున అణగారిన
ఘనశక్తుల కనుక్కోవడానికి,
మెదళ్ళను చిదగొడుతున్న నేటివమనిషి !
సిరికి పదం కదలించినా
వెనక్కి వెనక్కి ఈడ్వబడుతున్నాము.

పశుచిహ్నాలు తిన్నగా నశించినా
ఇంకా నీ నీడల్ని స్పృశించలేదు
నీ నిర్మలనేత్రాల్లో అహింసామూర్తులు
నెత్తురుచారల చిత్రించక తప్పలేదు;
నీ శీతలవదనాంగణంలో భస్మీకృతభవనాలు
నిశ్వాసధూమధునుల నిగుడించక తప్పలేదు
నీ నిశ్చలహృదంతరాళంలో
నిశావికల విలయాగ్ని జ్వాలాఘోషలు
నినదించక తప్పలేదు.

ఐనా నీ జీవాధారం సంస్కృతి;
అందులోనే వుంది నీ విస్మృతి
నూయూర్క్ నగర గగన సౌధ
శిఖరదృశ్యాలకన్న

అజంతా కుడ్యాంతర శిల్పసుందరీ జీనలాస్యాలు
నీ నిత్యవికాస నిదర్శనాలు
నీ సత్యస్వరూపదర్పణాలు, మానవతా !

పొగచూరిన—— తలదిగజారిన——
'నల్లమనిషి' నాళాల్లో నక్కి—యున్న మానవతా !

పరమాణువు గుండెచెరలో ఉడిపడి
ఊపిరాడక ఉక్కి—రిబిక్కి—రౌతున్న మానవతా !
'క్రిమిబొంబు'ల గరళకరాళ
దంష్ట్రాయుగ్మంలో నొక్కు—వడ్డ మానవతా
నీకు విముక్తి యెన్నడో?

మనిషి మనిషిని మనస్సు మనస్సును పరస్పరంగా
పరిశీలించు కున్ననాడే;
ఝరీజలాలనుండి విరివిగా సృష్టించిన విద్యుత్ కీలలతో
విశ్వమానవాంతస్సుల వెలిగించిననాడే;
నల్లవాని చర్మం క్రిందుగా
అరుణా రుణ రుధిరం ప్రవహిస్తుందని
వర్ణాహంకారులు తొలిసారిగా తెలుసుకున్ననాడే
అణుజాలంనుంచి అమృతం పిండిననాడే
నీకు విముక్తి!
మానవతా ! నీకు విముక్తి!

— నారాయణరెడ్డి

బ్రతుకు లోతులు

ఎక్కణ్నో తళుక్కు మన్న జ్యోతిశ్శకలం కోసం
ఇంతగా ఉద్యోగ మెందుకు ? ఇక్కణ్నే వెలిగించుకుంటే సరి
ఏదైనా కొవ్వొత్తి ముక్కలాంటిది లభిస్తే—
బ్రతుక్కి 'ఫాయిదా' ఏముందని ? చిత్తికి సీరాతా వెందుకు ?

అరుణోషస్సాధం అందుకోగానే
అమగడుక్కో పరవశమైపోతా వెందుకు ?

దాటిన చీకటి మెట్లను తలచుకో ఒక్కొక్కటిగా—
శిరస్సులు తెగిపోయిన శిథిలగోపురాల చూస్తూ
నిట్టూరుస్తా వెందుకు ?

ఇరుకు పూరిగుడిసెల్లో మరణంతో కుస్తీపడుతున్న
తరుణ జీవితాల విలువల పరిశోధిస్తే మంచిది—
శిశిర నగ్నదృశ్యాలను చూడలేక
విసుక్కుంటా వెందుకు ?

రసరాట్టులు చూడదగిన వసంతనాట్యాలు
శీర్ణశిరచ్ఛాయల చివురించినవే కదా ?

వల్లకాడు స్మృతికిరాగానే
బ్రతుల్భిపడతా వెందుకు ?
సమతాపాఠం నేర్చుకోవాలంటే
స్మశానమే సహజకావ్యం సుమా !

— నారాయణరెడ్డి

అశోకవృక్షం!

బ్రతుకొక అశోకవృక్షం!
ప్రపంచమొక లంకానగరం!
నేను సీతను!

జీవితాశోక వృక్షచ్ఛాయలో
కూర్చున్నాను.
నా చుట్టూ
బాధిస్తూ దానవులు - మానవులు!

నేను సీతను!
జీవితాశోక వృక్షచ్ఛాయలో
హనుమంతుని రాక ఎదురుచూస్తూ!
లంకా దహనం ఎదురు చూస్తూ!

— రామదాసు

*

బ్రతుకే ఒక క్రాస్!
మనిషే ఒక క్రైస్ట్!

— రామదాసు

జీవయాత్ర

నీకై సృష్టించిన జీవయాత్ర బహుకొలది,
నీవై పయనించు మార్గం చిన్నది
నీవు నిర్ణయించు ఆశల అంచులు అల్పాలు !

ఉత్తర ధృవం నుంచి దక్షిణ ధృవందాకా
జపానునుంచి పెనామా దాకా;
శతసహస్ర వత్సరాల చరిత్రలో
మహాప్రయాణంలో అధివసించిన
మానవ సమాజ వైవిధ్యం;
ఎవరెస్టు శిఖరాంతరాన
వ్యూహాకు మిక్కుటంగా కన్గొన్న ఆశాభావం;
ఎంత దొడ్డది !

ఎందరు తమరొమ్ముల ఛిద్రపుదొంతరలు గావించి
ఈ సోపానం నిర్మించలేదు ?
ఎందరు హిమవన్నగముల బొటలు
నందనవనములుగా తీర్చి
దేశపు ఎల్లల ఛేదించలేదు ?
ఎందరి వ్యూహాల ముత్యాల తోరణములు
జ్వాలల్లో కరిగిపోయి వెలుగునీడల ఆలయాల్లో
జీవాకృతులై నిలువలేదు ?

— సి. వి. కృష్ణారావు

ముళ్ళల్లో మల్లెలు

ఈ మా వినిర్మలాకాశంలో నల్లమేఘాల్ చరిస్తున్నవి !
క్రమక్రమంగా సూర్యుడు సహితం దిగనారి పోతున్నాడిలపై !
పచ్చటి నులివెచ్చటి దినసౌందర్యం
వసివాడి పోతూన్నది కలయై
ఏమో...ఏమీ బోధపడదుతల్లీ !

గడియారం ముళ్ళమధ్య చిక్కుకున్న కాలం
సాలిగూడు లోకము నెంచాతో క్రైంచలేదు జననీ !
జైలుగోడల కెగ్రబాకే ఆశాలత లేమో
శలరహితంగా నేలక్రవాలు మాతా !
ఏమో...ఏమీ అవగత మవడం లేదమ్మా !
పెళ్ళి కంకణాన్ని కట్టెను తల్లీ మరణం !
కావిలించుకు మోవి నందించెనమ్మా మరణం !

మరణం...మరణం...మరణం...!
భీతావహ శీతహస్త పీడన మా కంఠానికి ఆనవ లెతల్లీ !
శక్తిలాంటి విచ్చుకత్తిలాంటి మరణాన్నెరుగుదుమమ్మా !
పులినోట యెరవడ్డ పలలాన్ని మరణాన్ని
కలికంట విడివడ్డ అనలాన్ని మరణాన్ని
భీభత్స రసపూర్ణ తరుణాన్ని మరణాన్ని
మరణాన్ని...మరణాన్ని...మరణాన్ని...
మరణాన్నెరుగుదుమమ్మా !

కాని,—

ప్రేమలాగ, ప్రాచుపాములాగ చుడుతోందమ్మా ఏదో...
పువ్వమీంచివీచి నవ్వులోంచితోచి కవ్వస్తూందమ్మా ఏదో.
చేతిలోన చేయికలిపి కళలో కళ్ళనిలిపి
నలిపేస్తుందమ్మా ఏదో...ఏవేవో నవ్వులు తల్లీ !
ఏవేవో సువాసనల పువ్వులు !
సుందర కాశ్మీరం నెత్తురుమయమై పోయిందా నవ్వుకొరకు !
మానవమందారాల్ మకరందం స్యందించిన వీ షట్పదముకు !
ఎర్రకోట మీంచివీచి యావదాభరతాన్ని ముంచేస్తున్నది
మాతా మరణం...
మరణం ! మరణం ! మరణం !

— శశాంక

పోస్టు చెయ్యని ఉత్తరం

ఏమని రాసేది సఖా *
ఏమని చెప్పేది సఖా !

'దవాఖానా' కెళ్ళిన పెద్దపిల్ల ఇంటిముఖం పట్టలేదు
ఆరోగ్యమంత్రి మార్పు పేపర్లో వచ్చినదేగా ?
కింగ్ ఖోటీ గోడ ప్రక్క
ఒకడు తెలుగు, ఒకడు ఉరుదు !

---

* ఆప్తుడైన మిత్రునికి అప్పుపడి రాసి పోస్టుచెయ్యనిది.

ఒకడు మహారాష్ట్రిభాష
వేదనతో ప్రతిగల్పుతు రకరకాల నొక్కులతో
నొసటి రాతచదువుకోక,
పగటిని వ్యాఖానిస్తూ భాషిస్తున్నారు—వారు !

అర్థగంట ప్రకితం ఒకముఖమూ మన మెరుగము;
అర్థగంట తదుపరి అందరు మనకపరిచితులు
అర్థగంట సంభాషణ అవనిని చుట్టేస్తుంది !
నిన్నటి మాటలపై నేటి ప్రసంగం
'పోలీస్ యాక్ట్' సాగిస్తుంది !
ఒకడు-ఒకణ్ణి వెక్కిరిస్తాడు
ఒకడు-ఇంకొకడి సిగరెట్ కాలుస్తాడు
ఒకడు-పత్నిని పరిత్యజించిన త్యాగి
ఒకడు-అన్నం చూడని విరాగి
ఒకడు-కన్నులు మూయనిరోగి
ఒకడు-డబ్బులు అడుగని భోగి——

నిద్రించిన ఈ నగరంలో
నిద్రించని ఈ సామాన్యుల అడుగులు
క్షణక్షణాన్ని ముడివేస్తున్నాయ్
దారులన్ని కలిపేస్తున్నాయ్!

కుతకలెండి గోలకొండ
మూసీ వొడ్డుకురాగా
మూసీలో వల్లవిసరేసిన 'పీటర్'

బంజారా హిల్లునీాద పాపిట దిద్దుకొన్న మేరీ
రాహులుణ్ణి విడచి, మహాబోధినేమరచి
నల్లగొండ నాగటి చాళ్ళలో
నడచినచ్చు తథాగతుల, నాగతులను
రామరాజు ఖడ్గాన్ని, షక్కర్ ఖేడ్ -చంద్రవంక
లధిగమించు భాగీరధిదాటి స్తే
చేజారిన ఒక విజయం—
బ్రతుకు క్రాసురోడ్డునీాద
పరుచుకొన్న చీకటి—
పరులను చొరనివ్వని ఆకలి,
చీకటి ఒరలో పొంచివున్న ఛురక త్తి,
అవిశ్రాన్త కాలచక్రనేమికి
ఒకపాఠం చెప్పవచ్చు ! ఒకమార్గం చూపవచ్చు ! !
సామాన్యుని చొరనివ్వని చరిత్రలో
'ఒయాసిస్సు' కనవచ్చును ! ! !

పాడుపడ్డ రహదారుల
నాగజెముడు మొలుస్తుంది,
ఋషులూ, ఋక్కులు, దిక్పాలకులే
పదవీచ్యుతులై, పరిభ్రష్టులై
భువిలో, దివిలో స్థానంలేదని మాయంకాగా
ఈ 'రక్షకభటవర్గంపై' కట్టుగట్టు 'నవశిక్షణ'
ప్రణమిల్లే ఈచేతుల పనిచెయ్యండని శాసిస్తుంది !

కదలుతున్న ఈ పెదిమల
పలకరించమని ఘోషిస్తుంది !

భూతల స్వర్గంలో అందరి బ్రతుకొక టేనని,
భువిపై మసలే మనమంతా బంధువులని,
ఇదినరకటి లోపాలను ఇక చెయ్యొద్దని
ఇకవచ్చే లోకాలకు అమృతగుళికలవ్వని
శోకాన్ని శ్లోకంగా అవతరింప జేస్తున్నది !
పాపానికి, మోసానికి, నేరానికి, ఘోరానికి
ఒకవంశం ఉన్నది ! విషవృక్షంలా పెరిగినవని
ఒకడు రాజు, ఒకడు మంత్రి, ఒకడు సేనకధినాథుడు
వస్తులుండు మహానీయుడు నడిపాడు చదువులబడి
సహనం—ఏమిటి ఈ మెడపై కాఫీ ?
వినయం—ఏమిటి ఈ బంధితహస్తం ?

దీతికొడుకు తపము వేడికి తప్తమైన అమరావతి
ఇస్తున్నదిలే – ఒక నవసందేశం ?
అప్పలకూ-అర్థానికి వేస్తారొక ఇనుపడారి
హైకోర్టుల కుడ్యాలకు కన్నులొచ్చి శాసిస్తాయి !
భువి బరువుల మోసేవారు, భువి నిద్రించనివారు
రాళ్ళను మలిచేవారు, గోడలు కట్టువారు
ఓడలు నడిపేవారు, విమానాల నిర్మాతలు
నయశీలురు నడుపుతారు మన రథాన్ని !
వినువీధిన ప్రవహించే దేవనదిలో జలకమాడి
ఇంగీలముతో బంగారము వన్నెతేలు సంగతి

గుర్తిస్తామిక - పగలు రేయి కుడ్యాలై అడ్డుతగులు
యుదాలకు స్వస్తిచెప్పి, చదువుచెప్పి
మనచేతల 'హారావళి' భావికి అర్పణ చేస్తాం !

దిగులు పడకునే సం—
నీఅప్పులు తీరుతాయి
గుండె కొట్టుకొనుటఆగి,
స్వేదమొలుకునపుడుగూడ
నీఋణాన్ని మరిచిపోము !
శూన్యశూన్య గుహాంతరాల
భయభయంగ నడచి నడచి
శబ్ద మహార్ణవ గర్భపులోతుల ప్రవాళమాలల
వెతికి వెతికి తీసుకవస్తాం !

ఇదిగో — వెలుతురు
కనిపించని 'జ్యోతుల' చేతులు ఇవిగో
ఖర ఖరకర ఘృతగాత్రుల నూరడించు—
ఈ లేఖని చెల్లదనకు బ్యాంకులలో
ఈమాటలు దొంగవనకు నేస్తం
పదహారణాల కాళ్ళ పదాతులిక రక్షించవు
ఘనీభవించిన అర్థం ఇక భయపెట్టదు
మనమాటలు నమ్మిన నేస్తం మరణించాడెప్పుడో
మనమాటలు నమ్మక మనమే మనుతున్నాం శవాలలా
అవిశ్వాస మిక మనకెందుకు ?
నీడలు వెతుకాడి మనం చీకటిలో పడుతున్నాం !

భయపడకునేస్తం, కొత్త పిక్చరొస్తుంది—!
భయపడకు నేస్తం, మనమాటలు నిజమవుతాయి
ఉరికంబం తొలుచుక నరకేసరులొస్తుంటే
భయమెందుకు నేస్తం, రాస్తాను మరో ఉత్తరం
వితంతులకు తంతివ్వాకు !
సూర్యుడు అస్తమించడం ఉదయించుటకే
న్యాయం అస్తంచడం ప్రభవించుటకే ! !

— ఏల్చూరి

వ్యత్యాసం

అదృష్టవంతులు మీరు. వెలుగును ప్రేమిస్తారు.
ఇరులను ద్వేషిస్తారు, మంచికీ చెడ్డకీ నడుమ
కంచుగోడలున్నాయి మీకు.

మంచి గదిలోనే సంచరిస్తాయి మీ ఊహలు.
ఇదివరకే ఏర్పడిందా గది.
అందుకే వడ్డించిన విస్తరి మీజీవితం.

నిశ్చల నిశ్చితాలు మీవి.
మంచినిగురించి,
మర్యాద, మప్పితంగురించి,
నడతా, న్యాయం, విలువల విషయం
నిశ్చల నిశ్చితాలు మీవి.

మీకన్నుల చూపులు సరళరేఖలలో !
రేఖచెదిరితే గొల్లుమని పోతారు.
రేఖ కవతలివారంతా నేరగాళ్లు.
రేఖను రక్షించడానికే
న్యాయస్థానాలు, రక్షకభటవర్గాలు,
చెరసాలలు, ఉరికొయ్యలు.
రేఖను కాపాడక తీరదు,

* * *

అభాగ్యులం మేము.
సరిహద్దులు దొరకనిసంధ్యలలో మా సంచారం.
అన్నీ సమస్యలే, సందేహాలే మాకు
వెలుగులోని చీకట్లే
ఇరులలోని మిణుగురులే చూస్తాం.
నూరుదోషాలలోని ఒక సుగుణం,
నూరుపుణ్యాలలోని ఒక ఘోరం !
వ్యత్యాసాలూ, వ్యాఘాతాలే
అడుగడుగునా మాకు.
మా వంట మేమే వండుకోవాలి.
ఒకొక్కమారు విస్తరే దొరకదు.
జీవితపు సన్నని సందులకే
ఆకర్షణ మాకు.

మా దృష్టిది వర్తులమార్గం, ఆద్యంతగహితం.
సంధ్యాజీవులం, సందేహభావులం,

ప్రశ్నలే, ప్రశ్నలే.
జవాబులు సంతృప్తి పరచవు.
మాకు గోడలులేవు.
గోడలను పగులగొట్టటమే మాపని.
అలజడి మా జీవితం.
ఆందోళన మా స్వాపిరి.

తిరుగుబాటు మా వేదాంతం.
ముళ్ళూ, రాళ్ళూ, అవాంతరా లెన్నిఉన్నా
ముందుదాకి మాది.
ఉన్నచోటు చాలును మీకు.
ఇంకా వెనక్కి పోతామంటారుకూడా
మీలో కొంచము.
ముందుకు పోతాంమేము.
ప్రపంచం మావెంట వస్తుంది.

తృప్తిగా చచ్చిపోతారుమీరు.
ప్రపంచం మిమ్మల్ని మరచిపోతుంది.
అభిప్రాయాలకోసం
బాధలు లక్ష్యపెట్టనివాళ్ళు
మాలోకి వసారు.
అభిప్రాయాలు మార్చుకొని
సుఖాలు కామించే వాళ్ళు
మీలోకి పోతారు.

— శ్రీ శ్రీ

తెగిపోయిన COSMOS జగత్తు !

పగలు పగిలిన గాజుపేటిక
మంత్రకత్తె కాలం గుప్పిట !
రాతి హస్తరేఖలు ఆకాశం ప్రసవించు చూపులు !
తెరిచిన ఎముకల ప్రేళులు బాటలు !

నాలుక సాచి మొగర్చే
జూలు విదల్చే ఆకలి !
ఆకలి; ఆకలి; ఆ-హా-కలి !

నడిసంద్రపు మొడిలో గగ్గోలై మునిగిన ఓడలు,
తృష్ణవిడక బుసకొట్టే మృతజీవుల నీడలు,
బాటలపై పడిపోయే ప్రజలు !

వెన్నెల నూనె తాగి
మిన్నెగసే ఆకలి !
చెదిరిన కాకి గూళ్ళు,
ప్రబ్దలైన పచ్చని చమురుసాగు పసిగుడ్లు,
పడివిచ్చే శిశువుల శిరములు !

ప్రతికిన -
నమలి చీల్చి నెళ్ళే మొసళ్ళు-ఉన్నవాళ్ళు !
గాదెల సుడిగుండాలలో పెరిగిన పుణ్యం,
ముక్తికొరకు వరం !

బ్రతికిన—
కొరికి మింగి వెళ్ళే మనుషులు-జంతువులు!
అస్తుల లోలోపాయలలో చలించు వెలుగే
ముకి కొరకు వరం!

కత్తుల బోనులలో తిరిగి,
శక్తుల పాదాలకు నలిగి,
పిప్పిబొమ్మలు - పడిపోతూ ప్రజలు!
తూలుతూ, వాలుతూ
కాలే సమిధల పొగ తీగలు
పడి నడిచే నీడలు!

అవును మను కేకల మూకలు!
పొగతాగే వాయువులో ఆవిరులా ఆయువులు!

తోవతప్పి మారుపడిన అతిథులు -
రుతువులు; రానేరావు!
గడప విడిచి వెళ్ళదు, జూలు విదల్చే గర్జించే
ఆకలి గుండెను బాకుగుచ్చి పకపకనవ్వే నిస్పృహ!

శాంతి యుగం!?!
దిక్కులు పుక్కిట తుపాను;
శాంతి?
సముద్ర గర్భపు బడబాగ్ని;
శాంతి?

మీటిన ప్రక్కలయే నల్లని కూటికుండ;
పడిపోయే రాత్రి!
పిండిన రక్తంకక్కే పితికిన పొదుగు;
దిగివచ్చే పగలు!

మంత్రకత్తె విప్పిన గుప్పిట,
ఎముకల ప్రేళులపై —
శోభాకులిత జ్వాల విదల్చే ఉకలి నాలుక!
పడినడిచే నీడల నృత్యం!
తెగిపోయిన Cosmos – జగత్తు!

— అనిసెట్టి

నూతిలోనిగొంతుకలు

చీకటి చలన మెరుగదు
లక్షల నక్షత్రాలు సూర్యచంద్రులు
మానవ మేధస్సుల మొగ్గలిడిన సిగ్గరి మిణుగురు నెలుగులు
నిగ్గుగల మెరుపు కొరుగుర్రెళ్ళ ఓడల దివ్వెల పరుగులు
ప్రశాంత కుటీరాల నిశ్చల దీపక కాంతులు
చిత్తడినేల కనలి కడుపుల వినీల భాస్వరకాంతులు
చంచల నయన కాంతులు
ఎన్నో ఉన్నాయి కాని చీకటికి చలనంలేదు.
చారిత్రిక చిహ్నాలై విరిగిన చేత్రాలు త్రోవనిండా
ముళ్ళపొద నలంకరించినది జెండా

ఒండొంటిని మ్రింగేసిన రాకలపోకల జాడలు
తుప్పట్టిన కృపాణాలు, అట్లకాడలు
ఎక్కడ పన్నెటి బుడ్లు ?
భూగర్భ నాగరికతల మిగిలిన గుర్తు మరుగుచొడ్లు,
ఎక్కడ ఉన్నాయి రోమ్, బ్యాబిలోన్, ఇంద్రప్రస్థం ?
దస్తావేజే లేదే దస్తూరెలా స్వహస్తం ?
అంధకారసాగరాన పయనించిన ఓడల గుర్తులుండవు,
వల్లకాటి మునివాకిట నాటిన మొక్కలు పండవు.
చివరకు చీకటొకటే, చలనమెరుగదే చీకటి ?

* * *

ప్రతి మనిషీ ఒక గదిలో
చెదపురుగులు ప్రతి మదిలో
ప్రతి మనిషీ ఒక నదిలో
సుడిగుండం ప్రతి ఎదలో
ప్రతిమనిషీ ఒక చెరలో
ఉరికంబం ప్రతి మదిలో
ప్రతి మనిషీ ఒక మరలో
మరమేకులు ప్రతి హృదిలో
ప్రతి మనిషీ ఒక సెగలో
పొగగొట్టం ప్రతి మదిలో
ప్రతి మనిషీ ఒక పొదలో
బెబ్బులి రొద ప్రతిఎదలో

ఉన్నది ప్రతి హృదయంలో గోరీ ఒకటి
పాడె ఒకటి పుర్రె ఒకటి
పదికొమ్మల మర్రి ఒకటి
మర్రిలో తొర్ర ఒకటి
తొర్రలో బుర్రుపిట్ట, ఏది తుర్రుమనే ప్రోవ ?
ఎక్కడుంది చీకటులను దాటించే నావ ?

ఒంటరిగా, ఒంటరిగా
నీడల కాడనున్న మోడులాగ
మోడుల నీడనున్న నీడలాగ
ప్రోవతప్పిన పేతంలాగ
దిక్కులేని కుక్కలాగ
తిరుగుతున్నా, తిరుగుతున్నా
చీకటిలో, చీకటిలో
నే నెరిగిన ముఖమెక్కడ ?
ఎరిగిన సుఖమే దుఃఖం
నేనెరుగని సుఖ మెక్కడ ?

ఆశించను శుద్ధవివేకపు పథవిద్యుత్కాంతులు
ఆసించను త్యాగరాగరంజిత ప్రణయ జ్యోతులు
శాసించ సాహసించ ఆశించను జీవిత ధ్వాంత భ్రాంతుల
భాసించగ ఆశించను అదృశ్య రహస్యాల కడలిలోతులు
ప్రభాస్ఫూత పరమ ప్రాతశ్శాంతిగాని,
రాకేందు సుధానందపు నిర్ద్వందకాంచనకుందకాంతిగాని

ఆశించను, ఆశించ సాహసించను
జననమరణ మంగళ ఝుంఝులకందని తీరాల్లోని
సంశయ శాపశ్వాసలు సోకని దివ్యతీర్థ నీరాల్లో
ప్రభాభాసవశ్వేతశతపత్రం కొరకు ఆశించను
నాకు చాలు నొక కిరణం
ఒక నిర్బల కాంతికణం
ఈ మృణ్మయ దీపంలో
ఒక నిముసపు ప్రజ్వలనం
కాంతి ఝణం
కాంతి కణం
కాంతి కిరణం

... ...

సాహసికుడా కనిపించవు చీకటి కూకటిపేళ్ళ సాటికలు
చొచ్చుకపో చీకటిలోకి చీకటి గదుల్లోకి
కూకటివేళ్ళ రహస్యాలు తెలిసిన తరువాతనే
తెలిపూవుల తొలిపలుకులు వినవస్తాయ్ నీ చెవులకు,
కన్నీరుల కుంభవృష్టి వెలిసిన తరువాతనే
హరివిల్లుల రంగవల్లులు కనవస్తాయ్ నీ కనులకు
పడుగోడల పెటనికోట దాటితేనే
రాకుమారి నివసించే ఒంటి స్తంభం మేడ
ఎగిరే ఇసుకదిబ్బల ఎడారి దాటగానే
దేవులో స్వదేశానికి గొనిపోయే ఓడ
చొచ్చుకపో ఆత్మల చీకటిలోకి సాహసికుడా !

ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలు
ప్రాలేయ ప్రళయ ఝంఝూ విజృంభణ హిమగిరిపై
దుర్భర లావాకీలలు అగ్నిశైల గర్భంలో
ఆఫ్రికా అరణ్యాల్లోకి వన్యమృగాక్రందనాలు
ప్రశాంత సాగరాంతర నిరతాశాంత రాగమాల
నిరాడ్వేశ్వమందిరాల కవాటాలు మూసినధ్వని
కోపభవనపు కైకేయి, మంథరా మందిరగతులు
విదూషకుని నిషాదం, ఉన్మాదపు టాహ్లాదం
వేశ్యల వివాదం, ఓంకార ప్రణవనాదం
బ్రహ్మాండ భాండాల పగిలిన చిల్లపెంకులు
గ్రహగోళ రసాళాల చీకిన ఎండు పొంకలు
వింధ్యా గర్వభంగం, సంధ్యా గర్భవేదన
సంధ్యా శివతాండవం, సప్తసాగర నీరాన్ని
పుడిసెటపట్టి త్రాగిన ఘటోద్భవుని దాహం,
నయాగరా కన్నీరుల తీరాల ధరాధరాలు

... ...

ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలు
విమోచనపు యోచనలేని శోచనీయ శర్వరిలోన
ఆలోచనలలోచనాలు మూతబడిన ముహూర్తాన
ప్రాతస్సూర్యస్వర్ణశంఖం, రాకారజనీపతి రజతశంఖం
రెండూ మూగబోయిన వేళ
తిరుగు పోకకు త్రోవలేని చిలికిన చీకటులమూల
సకల రేఖల సంగమ కేంద్రబిందువు క్రింద

ఆక్రందన స్యందనాల మందాగమ రవం ముందు
నిలబడి ఒక్కటగుతానుబాబూ ! చెప్పు
ఎక్కడ బయలుదేరాం మనం ?
కడకెక్కడ చేరాం మనం ?
చీకటికాటుక పామకాటందినచోటు ఇదే
నిలువెల్లా విసపుటలలు పొంగిపొరలే పోటు ఇదే
దిక్కు-తోచని దిక్కు- ఇదే క్రిమింగరాని గ్రుక్క- ఇదే
ఇదే నరుని శ్రమసంకట సహనయాత్రకు చరమసీమ.

జీవితమె నిరావరణ నిరాభరణ నగ్నచ్ఛది
వికటకుటిల ఘనఘటాచ్ఛటా జటానటభైరవి
జీవితమిట కామాతురకంకాళ కరాళకేళి
ప్రేమేతర మృతికాతర కపాళాల కృపణధూళి
జీవితమిట భీభత్సోత్సవోత్సాహ ప్రేతహేళ
రుధిర మధువుగ్రోలి సోలి దైత్యుల మత్తిలినలీల
జీవితమిట సమ్మార్ధం, సంఘర్షణ, సంక్షోభం
దుశ్శోకపు దుస్స్వప్నం, దుర్మోహపు దుర్లోభం
జీవితమిట ఒక అవిరత నీరవభూతన
అవిరళ గరళ స్తన్యద కుహనాధాత్రీ పూతన
జీవితమిట శ్రమసైకత తృషామృషా మరుమరీచి
హాలాహాల తరళానల గళవిచల ద్వికంపీచి
జీవితమిట ఒక దుస్తర ప్రస్తరహస్తపు సత్యం
జీవితమే దుష్కృత్యం మృత్యోచ్ఛాయల నృత్యం
అయితే యిక మిగిలివదీ నేను పొందగలిగినదీ

ఏమున్నది లోకంలో ఈ శోకపు లోకంలో,
ఘణుకరులపు నాకంలో !
నిరవధి కాలావీథిలో అరనిముసం
ఇరుప్రక్కల అగాధాల ప్రేవుల్లో పిరికిపాట
చూపులేని ఆకాశపు కన్నుల కనుపించని
జీవనమ రణాల సంజవెలుగుల దోబూచులాట
అరనిముసం మిళ్ళా నీముందు, వెనుక అంతా మసి.
తప్పొప్పుల నిర్ణయమిట దుస్సాధ్యం.
మానవునికి క్రియ ఒకటే ఆరాధ్యం;
నీలోంచి నీదికానిది ప్రతిదీన్ని తాను పలుకు
చీలుబొటన్ని నిలచిన తెరవది ఎదలోనిములుకు
నీ వెంబడి నీ ప్రేతం, నీదే ప్రేతపు గొంతుక
స్మృతిపటలపు సౌదామిని, విగతకుసుమ వాసంతిక.
ప్రేతానివి నీవైనా, నమ్మకు ప్రేతాన్ని నీవు
ప్రేతంకాలిడినచోట విరియ దింక బ్రతుకు పూవు.
అంతస్సాక్షుల గుసగుసలో ప్రేతపు వెక్కిరింత
చేతం సంశయ గ్రస్తం, అడుగడుగొక రోతవింత.
మనమనసేమ నలనిలా, చేస్తుంది పిరికివాళ్ళను.
పిరికిమందు నూరుతుంది శల్యాని లానీరధాన
మురుగుపరుస్తవి నిజాన్ని ఊహల చిలువలుపలువలు
ప్రతిభావం క్రియలో శృతికుదరని ఒక భగ్నవీణ
మసిదక్కి చైతన్యపు మరణోన్ముఖ దీపశిఖలు
పలవరించి పొకలుతుంది పీడకలలు కాగె ప్రాణి;

— బైరాగి

గుడిగంటలు

చీకటి :

గుడిలో గలగంటలేవో
గుండెలపై కొటుతున్నవి,
గుడ్డివాళ్ళ గుంపులెన్నో
తమముకుంటు పోతున్నవి !

నరలోకపు జీవితాలు
చిరిగిన చిరుకాగితాలు,
గాలిలోన ధూళిలోన
కలిసి ఎగిరి పోతున్నవి !

హృద్రోళమునాశావళి
శిఖిఅంచున కొడిలాగున
అంటివిడువలేకున్నది,
అగ్ని వెంట నిలిచున్నది !

జీర్ణించిన చీకటిగదిలో
జీవులు విలపిస్తున్నవి,
'జరా దేవి' నోరువిప్పి
జగతిని కబళిస్తున్నది !

మానవ హృదయాలను
వ్యసనం పీడుస్తున్నది,
మానవ జీవితాలను
స్వార్థం ఈడుస్తున్నది !

చైతన్య జ్యోతిచుట్టు
గుడ్లగూబ విహరిస్తోంది,
ప్రకృతి పాదాబ్జాల
కుష్ఠువ్యాధి నమలుతోంది !

జీవితాలు చెదలుపట్టి
చీకటిలో ఆశపుట్టి
ఛిద్రమైన జగత్తులో
చివరిచూపు చూస్తున్నవి !

బ్రతుకంతా భయంతో
దారిలేని ఎడారిలో
అంతులేని నడకతో
మృత్యువును చూస్తున్నది !

విడిచినమొల
పూడినజల.... ...
తెగిపోయినకల,
జీవితమే ఒకవల !

జననంలో విషాదం !
ఖననంలో విలాసం !

అగ్నిజ్వాలల నీడల
పసిప్రాణులు నిద్రిస్తున్నవి,
ఉక్కు-తెరలచాటున
శివశక్తులు భోగిస్తున్నవి !

మృత్యుదేవి ఇనుపగజ్జెలు
ముందువెనుక మ్రోగుతున్నవి,
మూగవోయిన ముజ్జగాలు
ముళ్ళపొదలు మేస్తున్నవి !

కాలిన కాలం
కళ్ళుమూసి నడుస్తోంది,
కదిలే పాషాణం
కంతమెత్తి పిలుస్తోంది !

లోకపు వాకిలిగుండా
శోకం ప్రవహిస్తున్నది,
నాకపు సింహాసనమున
చీకటి కూర్చొనిఉన్నది !

తెలుగు :

భూమినుండి తారలెన్నో
పైకిలేచి పోతున్నవి,
'బూది' నుండి పూవులెన్నో
పుట్టి బయటికొస్తున్నవి !

కూలిన భవనాలమీద
గుడిసెలు లేస్తున్నవి,
చీలిన గోడలపై
దీపాలు వెలుగుతున్నవి !

నీటి అడుగు నీడనుండి
నిప్పుకణము లొస్తున్నవి,
ఎండిపోయిన చెట్టుకొమ్మ
లెర్రపూలు పూస్తున్నవి !

పరిఫుల్లిత హృదయాగ్నికి
పాషాణం కరుగుతోంది,
ఫణిఫణాగ్ర మణిద్యుతికి
బ్రహ్మాండం వెలుగుతోంది !

నడుస్తున్న శవం ఒకటి
నభఃపథము చూస్తున్నది,
జ్వాలిస్తున్న కాంక్ష ఒకటి
జగత్తును దహిస్తున్నది !

అదిగో ఒక నరలోకం
ఆక్రందన చేస్తున్నది,
కొండలలో శిఖరంపై
కోటబురుజు కటుతున్నది !

గుడిలోగల గంటలేవో
గుండెలపై కొడుతున్నవి !
గుడ్డివాళ్ళ గుంపులెన్నో
తడుముకుంటు పోతున్నవి !

— రెంటాల

ప్రియుడు
ప్రియురాలికి :

[కాలేజీ జీవితంలో ఒక విప్లవకారుడు, మరో విద్యార్థిని గాఢంగా ప్రేమించుకున్నారు. పెళ్ళి తేదీ పెద్దలు నిర్ణయించారు. ఇంతలో పాల పొంగులా పొంగే ప్రతిఘటనోద్యమంనుండి అతనికి పిలుపువస్తుంది. ఆమెకు అతనితో వెళ్ళే విప్లవస్ఫూర్తి లేదు. కాని విప్లవాన్ని ఆమె ఆహ్వానిస్తుంది; అభినందిస్తుంది. పవిత్రతతో అతన్ని ఆరాధిస్తుంది. ఆమె ఓ జాబుకు జవాబుగా అతను ఈ లేఖ వ్రాస్తాడు.]

ప్రేయసీ,

నీ వుత్తరం—కాదు నీ హృదయ స్పందన ఇప్పుడే అందింది. అందులో నీవు నీడతీసుకునే అశోక వృక్షం, నివసించేనరకం, తపించే, తపస్సు చేసే మహాగ్నిగుండ వైశాల్యం చూశాను! అందుకు కృతజ్ఞుణ్ణి, అన్నీ విశదమయ్యాయి.

అమ్మ, నాన్న, అన్నయ్య,అక్కాయి
నా మీద ఆశలకు తిలోదకాలొదిలినా,
రచ్చబండమీద చర్చలలో నా చరిత్ర
ప్రస్తావన అనుకోకుండా అస్తమించినా;
మీ చెల్లాయి బావమీద పాటలుపాడి
నిన్ను జవ్వనిపించటం మానినా,
నీవు మాత్రం తదేక దీక్షతో నా కోసం నిరీక్షించు!

నన్ను నిరాశచేసుకొని మీ వాళ్ళు మరొకర్ని
పెళ్ళిచేయను ప్రయత్నించినా, బలవంతంచేసినా,

తోటి ఆడపిల్లలు దిగులుతో కుమిలే నిన్ను
నా మరణ వార్తలు చెప్పి నిస్పృహలో పడద్రోసినా,
విలయవిరహరాత్రులు రాకసికోరలు విప్పి నిన్ను
చెప్పరాని యమయాతనలలో ఘటం ఘెట్టినా,
నా కోసం నా రాకకోసం ఎదురుచూడటం మానేవు !

రోజురోజుకు సగమయ్యేట్లు నిన్ను కరోకటక
దుఃఖం దిగ్రాహుతోందని నాకుకూడ తెలుసు !
ఇవాళ నన్ను నీవు చూసినా, నిన్ను నేను చూసినా చప్పన
గుర్తించలేనంతగా మారిపోయామనుకుంటా !
నేను నిరంకుశప్రభుత్వ క్రూరమృగంతో పోరుతూ,
చిక్కి శల్యమవుతోంటే, నాకోసం తపించి, జితించి
పదిహేడేళ్ళ వయస్సులో నీ వస్తిపంజర మయ్యావు !

నన్ను రణరంగానికి ప్రేమతో నీవు సాగనంపినక్షణం—
జీవితంలో మరిచినా మరపురాని మహాకావ్య శీర్షిక !
ఆదర్శాన్ని పాటించి ఉత్సాహంతో వీడ్కోలిచ్చిన ఆ
నిమిషం—
నీలో విజృంభించిన ఉప్పెన విశ్వరూపం నీముఖంలో చదివా !
చవితినాటి చంద్రుడు మనిద్దర్ని చీకటిలో ముంచాలనుకున్నా,
అరమైలుదూరం నడిచిందాకా ఆ కీ వెన్నెలలో ఏకాకిగా
నిలబడ్డ నీవు-
కడలి గర్భంలో కల్సిన ప్రియుని దర్శనార్థం ఒడ్డున శిలా
విగ్రహామయిన
ప్రేయసిలా ఉన్నావు !

ఏ నేస్తం మరచినా, ఏ ఆత్మీయత నన్ను తలచుకోకపోయినా,
తలవనితలంపుగా మనచూరు నోరుపడి నా పేరు కదపక
పోయినా,
వీధిబళ్ళో పిల్లలు నన్నుగూర్చి కట్టు కథలు చెప్పుకోకపోయినా,
చెరువుకట్ట కూడలి సంభాషణలో నేను వినపడకపోయినా,
నీవు అద్దంలో చూసుకున్నప్పుడు నీతోపాటు నేను కనపడక
పోయినా,
ఈ రాత్రి మా అమ్మ నన్ను మరచి సుఖనిద్రాప్రపంచ
పట్టాభిషిక్తయైనా,
నీవుమాత్రం ఈ నిశ్శబ్ద నిశీధిలో నన్ను దర్శించు, పలకరించు!

అయితే మనం దాగుడుమూతలు ఆడుకున్న మామిడితోపు
భావగీతాలు పాడుకున్న కాలవగట్టుకూడా మరిచాయా!
ఒక రాత్రి నక్షత్రాల్ని ఇద్దరం లెక్కపెడుతూ, నా లెక్క-
తప్పంటే
నిన్ను చెళ్ళున బాదగా చూడలేక బల్లున రాలిన నక్షత్రం
జ్ఞాపకముందా!
ఛిన్నమైన ఆనాటి ఆకాశరాణి పదేపదే నన్నడగటం లేదా!
కాలేజీ సమ్మెలో నన్ను పోలీసులు చితకగొడితే, కన్నతల్లిలా
ఉపచర్యలు చేసిన నీ చల్లని హస్తం నన్నెలా మరిచింది!

ఎన్నో ఆనందాలు, అనురాగాలు కలలుగన్న నిన్ను
అగచాట్ల ఆవరణలో వదలిపెట్టినందుకు విచారిస్తున్నా!
అన్నెం పున్నెం ఎరుగని వట్టి అమాయకురాల్ని
అగాధ ఖేదంలో దించినందుకు దుఃఖిస్తున్నా!

పెళ్ళికి సర్వాంసిద్ధపరచి విహంగాలలా సైర్వ్యవిహారం
చేస్తున్నప్పుడు
పెళ్ళి పదిరోజులముండే మాతృభూమి పిలుస్తుందను
కున్నామా !
నీకోరిక మన్నించి మహాదాదర్శ అనతి శిరసావహించికదా
కారడవులలో మరణం తలకొడుతోంది !

ప్రాణస్నేహితులు సైతం నిగుత్సాహం అందజేసినా
మీ యిల్లు నా లేమితో నెలితిగా కనపడక పోయినా
నీకేసి రకరకాల పువ్వులు హేళనగా నవ్వుతున్నా
మన ప్రేమను ఓర్వని కుళ్ళుతనం కుళ్ళికంపు కొడుతున్నా
కాలేజీ ఆడపిల్లలు వెకిలింపులతో నిన్నుడికించినా
పోలీసు కిరాతకులు కారుకూతలతో కండలు చీరినా
నన్ను మనస్సునుంచి నిస్పృహతో తుడిచేసేవు !

ఉత్తరాలు ప్రతిరోజూ వ్రాస్తూవుంను,
అక్షర అక్షరంలో నీ మధుర స్వర ఆలాపన వింటాను !
పంక్తి పంక్తిలో నీ జీవన దృక్కోణం స్పర్శిస్తాను !
లేఖలో నీవు కనపడతావు, కరిగిస్తావు, గరళం ప్రాగే
శక్తినిస్తావు !

రెండు హృదయాలు కారణాంతరాలవల్ల వేర్వేరుగా
దూరప్రదేశాలలో ప్రవాసం చేస్తున్నప్పుడు,
ఉత్తరాలు మహత్తర కార్యభారాన్ని నెరవేరుస్తాయి:

మాట్లాడతాయి, ఏడిపిస్తాయి; నూతనోత్సాహం ప్రసా
దిస్తాయి !

క్రొత్త ఫోటోలు, పుస్తకాలు ఏమైనా ఉంటే పంపించు
నిత్యం నవ్వులో, పువ్వులో, నిర్మల కన్నటి ధారలో
కనపడతావు !

సెలయేరు జలజలలో, అరణ్య ప్రాణోదనలో నీపలుకు
ప్రతిధ్వనిస్తుంది !

నిన్ను తలుచుకుంటే ఆకలితృష్ణకేశాలు అంతర్ధాన మవు
తాయి !

నీ ఫోటో హృదయ పేటికలో పెట్టి దాచిపెట్టుకున్నాను !
విప్లవం జయిస్తుంది, నేను త్వరలో యింటికి వచ్చేస్తాను !
నాకు స్వాగతం చెప్పడానికి పథాన్నలుగు ప్రపంచాల్ని
పిలిపించు !

నేను విప్లవ విధ్యుక్తధర్మాన్ని తు.చ తప్పకుండా
నిర్వర్తిస్తున్నా
విప్లవ సైనికుడి గమ్యం శత్రుమూక విచ్ఛిత్తి అని నీకు
తెలుసు

కనుచూపుమేరలో గమ్యస్థానం మనకోసం పడికాపులు
కాస్తోంది
మన పెళ్ళి పందిరికోసం శత్రురక్తంతో విశాలాంధ్ర అరుణా
రుణం చేశాను !

మనకోసం మంచికోజులు దండిగా ముందుకు ఎగబ్రాకు
తున్నయి !
మహావిప్లవ విజయోత్సవంనాడు మన వివాహ మహో
త్సవం జరుప్రదాం !
నా హృదయంలోని హృదయమా, నాకోసం నిరంతరం
ఎదురుచూస్తుంటవు !

దివ్వెన శ్వేతు తుపాకిగుళ్లు తలనొరుసుక పోతున్నవి—
ఎక్కడో మిత్రుడు "హాహా" కారంతో నేల కొరుగు
తున్నాడు !!
విషకీత తుపాకి కాల్పులు అడవి గుండెను స్తంభింపజేసినవి !
ఉత్తరం ముగించి పగవాడి గుండెకు మరతుపాకి గురి
పెడుతున్నా !
భయపడకు నాపేరు మృత్యుంజయుడు, నాకోసం ఎదురు
చూడకు !!!

— గంగిశెట్టి

తరువాత

చాలీచాలని కూలి జీవనం
కండ్లు తెరుచూ మండే పేదలు
తెలియని అజ్ఞానంలో చిమ్మచీకటి చీకటిలో
నిరాశలో నిద్రించిన జీవులు !

మనిషిని మనిషీ జాతిని జాతీ
దోచుకున్న పురాతన గాధలవి !
కల్పించిన సాకుల ముసుకులలోపలి
దోపిడికై ఆకాశంలో దూకించిన విమానాలు
విడిచిన గురితప్పిన బాంబుల దెబ్బకు
తిమింగిలం భయబడ్డది,
పేరుకున్న పేరాశలు వేసపురుగులై
కూలిన సామ్రాజ్యాలు పాలించిన
నాటి చరిత్రల పోకడలవి !

శతాబ్దాలు తెరమరుగై చరిత్ర పరువెత్తిన
చీకటి కోనల్లో ప్రజావిజయ చైతన్యం
ప్రబలిన మానవ హృదయం
అగ్నిపర్వతం బ్రద్దలయింది !
కాలం చీకటి మార్గాలను కబళించిన తేజశ్శాలీ !
అగ్ని పర్వతపు విముక్తి వదనపు మొదలూరిన
శాంతికరా !

నిలువ లేవు నీముందు నీ కనుచూపుల బాకులముందు

దేశభక్తి ద్రోహమనీ దోపిడి పరిపాలనమనీ
నిరూపించు కురూపి శాసనాలు !
ప్రాణత్యాగంలో, రక్తంలో, బలిలో
కరశృంఖలలలో నవోదయం నాట్యమాడి
పెట్టుబళ్ళ ప్రభుత్వాలకు,

వర్తక సామ్రాజ్యాలకు
వినాశ హేతుక విప్లవ శంఖం వినపడ్డది—
కనపడ్డది కార్మిక లోకం!
శివమెత్తిన రక్త తాకం!

జగచ్ఛక్ర, మొకబలివిత్తర్డిగా
చేసిన నరహంతలపాలన
శాంతిమూర్తి కరవాలపు
మెరుగుల్లో విరిగిందో!
సకలం వికసించిన విజ్ఞానం
అంధకార జగన్మార్గములు వెలిగించిందో!

మనలో మనకే పెనుమంటలు పెట్టింది
కనుకట్టులు కట్టింది,
యుగయుగాల చరిత్ర సంధుల్లో పెరిగిన
తంతమ వర్గ విభేదం
మరణశిలలు వేసుకుంది—

నియంతల నిటలాక్షుల్లో
నిప్పులు చెరిగిన కదనావనిలో
నిర్మించిన శవసామ్రాజ్యాలకు
పాడమంది భరతవాక్యం!

పరపీడనలో బానిసత్వమూ
ఉరిశిక్షలు ద్వీపాంతరవాసం
పెట్టుబళ్ళ రాజనీతి పుట్టించిన

చట్టాలకు న్యాయాలకు
టు
చదవమంది స్వస్తిగీతి !

ఒకవైపున అధికోత్పత్తి
మరోవేపు డొక్కలకరువూ
కట్టిన ఆరిక సోపానాలూ
టు ధి
సాధనాల వ్యక్తి గతత్వం
చాలన్నది సాగవంది !

అన్యాయం అక్రమమూ
సంఘంలో చదరంగం
పరస్పరం దొమ్మ్రా దోపిడి
ఆరంభించని ఆదియుగంలా
మంచిమూద బ్రతకమంది !

అందరికీ అవకాశాలూ సరిపోయే వస్తూత్పత్తి
పంపిణీలో సమానభాగం కోరుకోను హక్కుందిట !

స్వార్థపరత్వం తెచ్చిన జగడం,
ఈర్ష్యాసూయల రగిలిన పోరూ,
ష
రణరంగం చెప్పినతీర్పూ,
ఒకజాతికి నెత్తినకళ్ళూ, మరోవర్గపు మహానమూనం
పొడచూపని ఏదోవ్యవస్థ
సంఘానికి కొత్త స్వరూపం వస్తుందట——

— కుందుర్తి

అరుణతార

ఆకాశము నొసటపొడుచు అరుణారుణతార !
ఏకాకి నిశీధి నొడుచు తరుణకాంతి ధార !
జయపతాక ! యువపతాక !వియదాపగ వెడలునొక !
యుగ యుగాల పీడకలలు ! సాగయబోని సంకెలలు !
తెగనివి కావోయి, క్రమోల ధగధగా స్వాతంత్ర్య విభా
తాకాశము నొసటపొడుచు అరుణారుణతార !

అంతులేని ద్వేషము, విషరోషము,స్వార్థము మోసము,
పంతగించి నిలువవు, ఆవంతయేని శాంతావిభా
తాకాశము నొసట పొడుచు అరుణారుణతార !

ముందుగలదు మనజాత్రికి ముక్తి, అమరజీవశక్తి,
క్రిందు వెనుకగనక నడువుడందరు, అభ్యుదయ విభా
తాకాశము నొసటపొడుచు అరుణారుణతార !

— కృష్ణశాస్త్రి

అవనిఅంతా

అవనియంతా పెద్ద యక్షయపాత్ర !
అక్షలేహహస్తమే అన్నపూర్ణమ్మ !
ఆరిపోవనిది నా ఆకలే యైతే
అంతుదొరకనిది ఆ యమృతాబ్ధికాదా !

అన్నమో, అమృతమో, ఆకొన్న వేదకో
కన్నతల్లీ ! బ్రతుకునిండ భిక్షాందేహి !

గుడిసెలో గుడులలో, గునుకుబిచ్చగుడు
వాడవాడలఁ దిరుగువాఁడె యిచ్చువాఁడు
పిలువవచ్చినవేళఁ దలుపుతీయనినాకు
అంతరాంతరములో ననతువొయేమొ !

అమ్మవో, అతిథివో, ఆఁకొన్న వేదకో
కన్నతల్లీ ! బ్రతుకునిండ బిక్షాందేహి !

ఆవాడ నీవాడ నాయింట నీయింట
నఖిలేశు హృదయమే అన్నపూర్ణమ్మ !
ప్రతినన్ను పలికించు పంచపున్నమివైతే
ప్రతిగుండె పులకించు పాల్కుడలి కాలేద !

కరుణకో వలపుకో, ఆకొన్న వేదకో
కన్నతల్లీ ! కన్నతల్లీ ! భిక్షాందేహి ! !

— కృష్ణశాస్త్రి

శపథం

"లోకమంటే భయమదేలా ? లోకశ్రేయస్సునే కోరి
లోకసేవనె చేయగలిగిన లోకమెటుపోవున్ ?

లోకమే మన జన్మదాత, లోకమే మనజీవగర్ర,
లోకమే మన కర్మభూమి, లోకమే సత్యం !

లోకమిపు డజ్ఞానతిమిర వ్యాకులంబై యున్నదని నీ
వేకతమ ఎండ్దేగెదవు? ఈ లోకమును విడచి—

లోకమంతా చీకట్లై తే నీకు చీకటి లేక పోయెనా?
లోకపుం జోక్లు నీపై దూకకుండేనా?

నీ ప్రబోధము నీ ప్రవర్తన నిండి నీరాజనములై, ఈ
లోకముకు మేల్కొ-లుపులై, నిను పైకి తేగలవు?

ఎందుకోసర మాత్మహృదయ
స్పందనముల జగధిత శ్రుతి
నందుకొని విశ్వైక కావ్యానంద మందితివో—

అందుకోసమె కష్టనష్టము లవగణించి, నిరోధకత్వము
నధిగమించి, జగత్తునకు నభ్యుదయ మొనగూర్చు!

సాధు నవసాహిత్యబోధల సర్వలోక శ్రేయమునకై
కలము సాగించగల శక్తి కలదుగద నీకు!

లోకమును మేల్కొ-లిపి నీ కవి
తాకృతిన్ గొనినట్టి భావము
వేగుచుక్క-వలెం జగత్తున వెలుగు జిమ్మెడిని!

చివరి నెత్తుచుక్క-యును వె
చ్చించి, లోక శ్రేయమునకై
భారత స్వాతంత్ర్యమునకై
ప్రతిన బూనుమిక!-"

— విశాలాక్షి

కక్ష!

అలవలె అలత్రోడ్వాటున పోతూ నేనే అలయైనానేమో,
అలత్రోడ్వాటున అలవలె చేతులు స్వర్ణవర్ణములు తాకేను!
ప్రజవలె ప్రజ తోడ్వాటునపోతూ నేనే ప్రజగా మారితినో,
ప్రజ తోడ్వాటున ప్రజవలె గొంతుక దివ్యదృశ్యములు
పాడేను!

అలయైనానో, ప్రజయైనానో
మనుజతరంగమునేనై నానో
భావి స్వర్గమును భావింతు!

వధువు కాంక్ష నన్నావేశించెనో మధుబుతు పురుషుని
కోరెదను:

ఈ ఒక కోరికతో వికసన్నవ జన్మప్రమదావనమే తోచు

వధువైనానో మధువైనానో వధు హృదయపు మధువే
నైనానో

ముందునాళులను మోహింతు!

పెచ్చుగలేచే చిచ్చునునేనో కచ్చల నెచటా కోరెదను
ఈ ఒక కోరికతో నిచలత్వాచీన రౌరవమె కనుపించు.

చిచ్చయినానో కట్టయినానో
చిచ్చుల కట్టను నేనైనానో
వర్తమానమును విమతింతు!

— రమణారెడ్డి

కరువు కత్తెరలు

చితికిపోవు మా రాయలసీమ ; బ్రతుకు
పేజీపై ; మొండివడిన అంపెరాత
నునరాల తరలిపోయే నిప్పుపోత
మానవత్వమున మానని గుండెక్రోత

భావిశిఖిల కెగురబోయి కుప్ప వడుచు
తునిగిపోవు పాపల పసిరెక్కలు
భూతవర్తమాన సంధి నిరుక్కొనుచు
చినిగిపోవు యువకుల మసి డొక్కలు

గుండెల్లో జీవత్రైల మెండిపోవ
మండిపోయెరా ఆకలి దివిటీలు
నరాల్లో పరచిన నెత్తురు తెరల
కత్తించెరా కరువు కత్తెరలు

కళాహృదుల నద్దుకొన్న దివ్య "రత్న
గర్భం"లో విచ్చె విసపు వెట్టి పుచ్చ
చిరవాసనలెన్నో రుద్దుకొను చరిత్ర
గాత్రంలో పూచిందొక నల్లమచ్చ

చెవిటివిరా చిలుమెక్కిన ధనం చెవులు
మూగవిరా బిరుసెక్కిన 'గద్దె'నోళ్ళు-
పేడమియెడద ప్రమింగివేసె మంచినీళ్ళ
వృధా విమతురేల? మొసలి కన్నీళ్ళ

అగ్నిరసం త్రాగి చావమంటారా ?
నీటికణం గతికి బ్రతుకుమంటారా—
మృత్యు రథంక్రింద నలుగమంటారా ?
జీవపథం నీడల పొమ్మంటారా.

— నారాయణరెడ్డి

శంఖనాదం

పలికింది. పలికింది పరపార వరతీర
పరన్య దుర్జేయ వార్జేయ శంఖం
పరిభూత నరపుంఖ పునరుద్యమాంకం, చిరనిరాతంకం,
శంఖం, శంఖం, పలికింది ! పలికింది !

ధనహీన దారిద్ర్య జన ధైర్యవంతం,
అవమాన భరనమ్ర భరతావనీ ధూమ్ర
యువమాన సోద్రిక్త నవదీప్తి మంతం,
విజయోచ్చ మంత్రం ! స్వాతంత్ర్య తంత్రం !
స్వారాజ్య యంత్రం ! పలికింది, పలికింది !

ఎవరోయి, చిరదాస్య మూర్ఛాడు విడలేక
జవలేని మృతజీవితములోన పడివేగు
భరతావనీపుత్ర ! ఘనపూర్వచారిత్ర !
వినలేదొ దరిదాపు నినదమ్ము, అరిభంజ
నరథ ప్రగమనమ్ము. జయకేతుచలనమ్ము,

రణచక్ర రణనమ్ము ప్రళయోగ్ర భయదమ్ము;
నవజాగృతి పథమ్ము కనలేదొ ! వినలేదొ !

ఖరసూర్య కరతూర్య కలరావము ప్రభాత
నవజీవనానంద యువభావ స్వచ్ఛంద
చలచంచలాచ్ఛందముల నూత్నగమనోల్ల
సిత నిధ్వనితమై భరతభూమి మేలొ్కాల్పె !
పలికింది, పలికింది !

కనుదమ్ములను విచ్చి, జయకేతనము పుచ్చు
కొని చేత, నవసభ్యతను గౌరవము తెచ్చి
కొని, మాత భరతావనిని పూజన మొనర్చ
నరుదేరు మల తూర్పు తెలవారె-తెరజారె-
పలికింది, పలికెంది !

నారీ నరులు, దీన దారిద్ర్యపరులు, సం
ఘారాధ్యులౌ మహామానవులు, భూనాథు
లేనాడు సమభావ నారూఢులై నిలుతు
రానాడు స్వారాజ్య మేనాడు నాడునం
దో నాగరకులార ! ఓ జానపదులార !
ఓ రాజులార ! ఓ ప్రజలార !
జరలేని రుజలేని జనతాలయముగా భరతభూమి
నొనగూర్చ మభలగ్న మొనగూడెనని పాడి,

పలికింది, పలికింది పరపార వరతీర
పర్జన్య దుర్జేయ వార్జేయ శంఖం!
శంఖం! శంఖం! పలికింది! పలికింది!!

— మల్లవరపు

మా తృ గీ తి

తల్లిరానేవచ్చె, తడవాయె రారండు!
చల్లగా మన తెనుగుతల్లి రానేవచ్చె—
ప్రణమిల్లి జయగీతి పాడండి మృదురీతి,
ముక్కోటి తెలుగుల్లు మొఱయండి జయగీతి...

కనుమలో నీలాలు కరిగి ఒలికెనో యేమొ,
తల్లిజడ, ప్రాచులా, కళ్ళలో మెసిలింది,
కృష్ణవేణీరుచులె నిజమూ, ప్రకేపులా
ప్రక్కేళ్ళిరుకు కటిపైన సతమూ...

గోదావరీవారి కులుకులవిగోరా!
తెలుగీమల్లెల పొగరు వెలుగు లవిగోరా!
హోషుగా, ఊగుతూ, నీటుజూపేనూ,
దేవికంఠాన కత్తెరదండయేను...

పసరుపైరులలోన మిసమిసలు చూడరా!
పచ్చలద్దిన తెలుగు పట్టుచీరేమోను;
పంటపొలములపైని పసిడిజిలుగదుగోను,
బంగారు జలతారు, పైటచెరగేమోను...

తెలుగుపాటలోన తీపిపాలవిగోను,
తల్లిపలుకల్లెనె చల్లగా పిలిచింది;
అందాలు నగలలో, చిందులాడెనుచూడు
నాగార్జునులచేతి నాజూకు పనులేను...

జాజ్వల్యరోచిఃప్రభాజాల మదిగోను!
చండకిరణుడు దిశల మండెనదిగోనూ!!
స్వాతంత్ర్యభానుండు తోచెనదిగోనూ!
దేవీకిరీటకోటీరమనియేను!!...

మెఱుగు నాగలిగోరు మేనసోకెనో యేమొ
సస్యలక్ష్మిని మేన జలదరించెను తల్లి;
మనభాగ్యములవెల్లి తల్లియేరా!
మనకోరికల కల్పవల్లియేరా!

తల్లిహృదయములోతు తడువుకోరా,
తరళకాంతుల వసువు త్రవ్వుకోరా,
ఒకరియూచించేటి గతియేలరా?
పరుల పాదముబట్టు బ్రతుకేలరా...?

దేశదేశాలలో తెజరిల్లేవారు,
తెలుగుతల్లీకన్న దివ్యసంతానంబు,
తల్లిపూజలవేళ తరలిరారండోయి!
తల్లికీరితి దిక్కులెల్ల తెలుపండోయి!—
ఆకాశవీధిలో చీకాకువాయంగ,
ఆంధ్రరాష్ట్రపు కేతనంబెత్తి నిలుపండి...

కులములని మతములని కూటికా? గుడ్డకా?
చిలిపి తగఫ్రలు రేపు పలుకులేలా?—
ముళ్ళమాటలు మీరు మానండిరా,
అమ్మవింటేకోప పడుతుందిరా...

అంటరాదని యొకడు, అధికుడని మరియొకడు
గొంతుల్లు కోసుకుంటారా!—
తల్లికందకు బిడ్డ లొకటేనురా!
తల్లివింటే ఖేద పడుతుందిరా!...
యుగయుగాలుగ వీరయోధులనె కన్నదిర,
తల్లిపరు ఎొకయింత తలంచండిరా!
పారతంత్ర్యపు బ్రతుకు బ్రతుకనేలా?—
స్వాతంత్ర్యయోధులై సాగండిరా!!!...

— తెన్నేటి

చెప్పరాని చిన్న గుట్టు

చెప్పరాని చిన్నగుట్టు చెప్రతా రావోయ్
గొప్పకవులు ఈ కిటుకును చెప్పరులేవోయ్
గొప్పవాడ వవడానికి తప్పనిదారోయ్

కప్పలేని గుడిసెలు వేయ్ కలగబట్టునోయ్
గొప్పవారి మేడొక్కటి కులుకుతుంటాది।
వెన్నునంటు కపుప్రలు వేయ్ కలగబట్టునోయ్
ఉన్నవారి బ్రార ఒకటి ఉబ్బుతుంటాది।

మొండి దిస్సె మొల లొకవేయ్ కలగబట్టెనోయ్
ధనికుల కొక పట్టుదుస్తు దక్కుతుంటాదిll

ఎముకపంజరాలు వేయ్ కలగబట్టెనోయ్
నిండారిన విగ్రహాలు నిగనిగమంటాయ్।
నెత్తురేమ్చ కన్నులు వేయ్ గలగబట్టెనోయ్
కలిమి తళుకు ఒక ధనికుని కంటనుంటాదిll
తిండిలేని నోరులు వేయ్ కలగబట్టెనోయ్
సావుకార్ల విందొక్కటి సాగుతుంటాదిll

కరిగి తరుగు కండలు వేయ్ కలగబట్టెనోయ్
పెద్దవారి ఫాక్టరీలు పెరుగుతుంటాయి।
ఏమ్చుకూమ కొంపలు వేయ్ కలగబట్టెనోయ్
సంగీతముత్తో ఒకిల్లు కంగుమంటాదిll

కంపు చీకటిల్లొకవేయ్ కలగబట్టెనోయ్
ధూప దీప వాసన లొక యింట నుంటాయిll
కటికినేల పక్కలు వేయ్ కలగబట్టెనోయ్
మెత్త మెత్త పరుపు లొక్క మేడనుంటాయిll

చప్పని కలిసుత్తలు వేయ్ కలగబట్టెనోయ్
పాయసాల కొక్క వెండిపళ్ళె ముంటాదిll

[హెచ్చరిక : వెయ్యి అంటే వెయ్యి కాదు; పది లక్షలు]

— తాపీ

ఊహల పొలిమేరలు

మరణాంతకమై
మనసంతా మండిస్తున్న
ఈ బాధలనే కావాలన్నావో

అర్ధరాత్రి నిద్రలేచి
మదమత్త జగత్పరి ఖేలనలో
బుస కొట్టాలను కున్నావో!
ఒకరొకరే బాధాజగత్పరి వేదనలో
శోధించి, మథించి
తెలసిందనుకున్న పరమరహస్యం
అప్పుడే అవగతమను కున్నావో !
మమత్వం నశించి;
భ్రమాలోకనం కృశించి,
వ్యక్తిత్వానికర్థం మరిచే మానవుడా !
చిరకాలంగా ఎదురు చూచిన జరలో జ్వరంలో ;
నీ కాంక్షయె తీరునో !

శాంతి దాంతుల పునాదులలో అనంతబాధలు
నీ వెనుక తరాల జీవనాడులకు తెలుసు-

కమ్మని కారుమబ్బులలో కరుణార్ద్ర హృద్వీధి
గమనించు చిచ్ఛక్తికి నమోస్తు-

వెన్నెల తీగసొంపులలో మమతా క్త శోభలు
ఘటించు పరమశ క్తికి నమోస్తు-
హృత్కాళసీమ జనియించి లోకమంతా
పెకలించి కలియజుటిన నిరు కికి నమోస్తు
గూళ్ళలో మనుషులు మనుషులలో గూళ్ళు
గొలుసులు గొలుసులై భ్రమించి క్రమించిన
మహామానవుడా ! అజేయుడా!
నీ శోధనకోరకై బాధల కెరగా
నోరెరుగని పాపలు-పసిపాపలు
చలిమంటలలో మిగిలిన మసిగా
హృదయాలలో అగ్నిమహారాలు.
మనిషికి, తనకే అర్థం తెలియని మనిషికి
నీ రహస్యం తెలిసే దెలాగ తల్లీ !
ప్రకృతీ ! ప్రాణాకృతీ !
రానీ ! నీ దయావిషం రానీవమ్మా !
నన్నో, నీ ప్రియజగత్తునో రెండు కళ్ళతో
చూడవవమ్మా !

దుర్గంధాలే ఉద్యానాలై
నీచత్వాలే నికషాలై
మరిగి మరిగి గడకటిన రోతలు
పెకలించగ రానీవమ్మా !
నీ కృపాప్రభంజను రానీవమ్మా !
మమతలు మాత్రం తెలిసిన
మానవత్వం వెల్లువలై

నశించనీ ! కుళ్ళిన మనసుల్లు
నశించనీ ! మనసుల మనుషులు
ఒకడొకడే ఒక జగత్తు-
జగ తే విడిగా ఒక డొకడు—నశించనీ !
ఎవరికి వారై సడలిన జగత్తు నశించనీ !
నీ రక్తారుణ నయన విక్షేపం దారుణమై.
మా బాధలు ఒకేసారి మండనిమ్మ్ర తల్లీ !
మా మనసులు ఒకేసారి వేగనిమ్మ్ర తల్లీ !

ఓహో ఓహో మానవుడా !
నీలాకాశపు పెనుగాలి తెరలలో
కలసే, మెరిసే. ఊహల పొలిమేరలలో
ఉన్న రహస్యం ఏదో అడుగవద్దు అర్థాలడుగవద్దు-
మరచి పోవయ్యా !
నిన్ను నీవే తెలిసి మరచి పోవయ్యా !
నీలోనే నీ నాడులు గూఢచారులై
నెన్నాడే శారీరక యోగంలో
మారవయ్యా ! నీలో నీవే పోరవయ్యా !
నిను సంధించిన ప్రకృతి రహస్యం
తెలిసి పోరవయ్యా ! మానవుడా !

— బాధర్

అరచేతిలో మృత్యువు

[చిమ్మ చీకటి కప్పుకునిపడుకున్న అర్ధరాత్రి. అర్ధరాత్రిచుట్టూ కీకారణ్యం. అరణ్యాహృదయంలో గెరిల్లాదళ రక్షణ కేంద్రం. దళవిూద యవ్ు. ఎ. పి. క్రూరమైనదాడి. నిశీధి వీధిలో దళం ప్రయాణం. దోవ తెన్ను లేవు. దూరంలో దయ్యాలలా కూర్చున్న కొండలే దిక్కూన్నచి.]

జాగ్రత, కామేడ్స్
బ్రతుకు జాగ్రత !
ముందు బాట జాగ్రత !
నెత్తిమీద బరువు జాగ్రత !
మన బ్రతుకు జాగ్రత !

లోయగుండా, తోవ
ముందుపారచూడు కామేడ్ !
వీపుమీద మూట—
అజాగ్రత కూడదు కామేడ్ !
జాగ్రత, భుజంపై తుపాకి
అదే మన పంచప్రాణం !
మొలలో తూటా బెల్టు !
అదే అదే మన సర్వస్వం !

జీవితం అసిధారావ్రతం
నూలుపోగుమీద సాము
మరణంపై తిరుగుబాటు
బ్రతుకు మనంతప్ప వీరులు లేరు !

దారినిండా ముళ్ళకంచెలు—
ఏం క్టి చెడకుండా కామ్రేడ్ !
జాగ్రత ! కాలికింద చెప్పాలు
చేతిలో నీటికడవలు !

గుసగుస పనికిరాదు భాయీ !
కీచకీచ—ఎక్కడో చప్పిడి !
చకచక నడవండి కామ్రేడ్స్ !
గమ్యానికి చేరువగా వచ్చాం !

ఇక్కడకాదు ముళ్ళు తీసేది
నమూనా కామ్రేడ్ !
ఇప్పుడు కాదు కాళ్ళు కుంటడం
దళంలో కలిసి పదవయ్యా !

చలి, తీవ్రంగా చేదుగా కరుస్తుంది
ముళ్లు సూటిగా, కర్కశంగా నాటుతున్నాయి
బాధనకుండా, బద్ధగించకుండా పదండి!!
జాగ్రత, భుజంపై తుపాకి, బొడ్డులో బాకు!!

ఏదో అలజడి వినపడుతోంది
చెవులు గోళాలు చేయండి!
ఏదో వెలుగుపోచ తగులుతుంది !
కళ్ళు కాగడాలుచేసి చూడండి !

"నక్కలు కూస్తున్నాయి
పూరేదన్నా దాపులో వుందా !
మృగాలు అరుస్తున్నాయి
ఏదన్నా ఏటిదరి చేరామా !"

"కుక్కలు మొరగందే
వూరెక్కడ క్రామేడ్ !
కొందరయినా కూలందే
నీరెక్కడ దొరుకుతుంది !"

ఇస్ ! నిశ్శబ్దం, కసి !
ఉష్ ! ప్రమాదం, పగ !
చుట్టూ నల్ల తాచులు !
కటికి చీకటి కోరలు !

ఆ కొండ గమ్యంచేసి
నడిచి వస్తున్నామే !
కొండ తప్పుతున్నట్లుంది !
దారి అగాధంలో దిగిందే !

జాగ్రత ! చిమ్మచీకటి !
ఎక్కడ టార్చిలైటు !
అటుపదండి క్రామేడ్స్ !
అప్పుడే చుక్క పొడిచింది !

మళ్ళీ ఆక్రామేడ్స్ నాడి చూడండి !
నలుగురు క్షతగాత్రుల్ని మోయడానికి
ఎనమండుగురు చాలడంలేదా ?
నెత్తురు ఇంకా ధారగా కారుతూనే వుందా !

జాగ్రత, నెత్తిమీద ప్రమాదం !
అడుగడుగులో అపాయం !
దారి చెరగకుండా పదండి !
చుక్కల్ని గమనించండి !

ఇంటిదగ్గర అంతా కులాసా
రేపేపాటికి ఈ ప్రాంతం మనది
తెలీదా, నిన్న అరుపరగణాలు
మనవాళ్ళు విముక్తి చేశారు !

ఇనుకులో తిరుగుతున్నందుకు
అడవి ఎంత దిగులుపడుతుందీ !
ఇబ్బందిలో దిగబడ్డందుకు
ఎంత మౌనంగా వాపోతుందీ !

కాకులు ఆడని కారడవే
చీమలుదూరని దండకారణ్యమే
ఎలా శత్రువులు ముట్టడించారు ?
ఎవరో ద్రోహంచేసి వుంటారు !

సకాలంలో కొరియర్లు చేరకపోగానే
వెంటనే జాగ్రత పడాల్సింది !
అయితే 'పందులు' కూడ నాలుగో
ఐదో నేల కరవ లేదంటారా !

జాగ్రత, అలికిడి పొడకడుతుంది
వేకువ గొంతు విప్పుతోంది
కష్టమనకుండా నడవండి కామ్రేడ్స్ !
గమ్యం కాస్త దూరంలోనేవుంది !

వళ్ళు పగిలిన పుండయిందా
కాళ్ళు నెత్తురు చారలయ్యాయా
తూలి నేలపడబోతున్నారేం-
కామ్రేడ్స్, ఎరజండా చిన్నబుచ్చుకోదా !

కామ్రేడ్స్ !
తడబడకుండా నడవండి !
గమ్యం చేరండి, కాంక్షను సాధించండి !
ప్రపంచాన్ని వెలిగించే
పతాకను నిలబెట్టండి !

— గంగిశెట్టి

శాసిస్తా జగతిని

వర్తమాన సత్యాన్ని నేను-
శాంతిలేని విశ్వాత్మను,
ప్రగమించే విప్లవాన్ని !
ప్రళయజ్వాలా ముఖిని !
పీడిత జన హృదయాన్ని నేను
నా కంఠం నా గీతం
నినదించును నిర్వికామ సమకఘోష-
సంధ్యా సమయ హేష !
కాలం బహుకాలంగా ఆకాంక్షించిన ఆశను
కనువిప్పిన చరిత్రదారుల పథిక సఖుల కాచ్ఛాదనగా
విజయయాత్ర సంకేతంగా నీడనిస్తు నిలుచుంటాను !

ధనం నన్ను బంధించదు ఆశ నన్ను కబళించదు
మృత్యుకరం వాలదు నాపై అమరయాత్ర కవధిలేదు
జనయానం అడ్డకండి జగతి ప్రగతి అడ్డకండి
అధోజగత్సహోదరుల ఐక్యగీతి నేను
వర్తమాన సత్యాన్ని నేను !

— గిడుతూరి

నవ్వండి!

నవ్వండి, నవ్వండి
నాల్గు దిక్కులజనం
నవ్వండి, నవ్వండి
నాలుగు చీలిన జనం!

నవ్వండి నవ్వండి, నవ్వుతూనవ్వండి
నవ్వులో నర్తించు నాగుబాము విషం!

నడివీధిలోమమ్మునగ్నంగ నిలబెట్టి,
నవ్వుతూ నాటండి నవ్వులో నారసాల్!
నారసాల్ నాటుతూ నవ్వండి నవ్వండి,
నవ్వండి నవ్వండి పగలబడి నవ్వండి!

మీలాగ పుట్టాము, మీలాగ పెరిగాము
తేడాలు పెట్టారు, భేదాలు పెంచారు
మట్టి కలిసిననాడు మీరుమేమూకూడ
ఒకచోటె ఉంటాము!

గోడలను కట్టారు, తేడాలు పెట్టారు
తేడాలు పెట్టారు, తిండిపోగొట్టారు
మా పొట్టలను కొట్టి మేడలే కట్టారు
కట్టండి కట్టండి, నవ్వుతూ కట్టండి
కట్టకడకూ మనము కలుసుకుంటామురే!

బొచ్చెమాకిచ్చి మీ బొక్కసం నింపారు
పీడించి పీడించి పిండారు నెత్తురు
పిండి పిండీ మమ్మ్మ భిక్షువుల చేసారు
క్రాగండి రక్తాన్ని క్రాక్షరసంలాగ!

'బిచ్చగాళ్ళ'ను చేసి పిచ్చిగా నవ్వండి
'బిచ్చగాళ్ళ'ను చూసి బిగ్గరగ నవ్వండి!

జోలెకట్టించారు, జోగి ఎత్తించారు
కూలిచేయించుకొని కూడైన పెట్టని
'కుందనపుకుర్చీ'లో కూర్చున్న లోకమా
కూరోచని కూరోచని కుళ్ళిపోతావులే!

బిచ్చమెత్తిన నరుడు బొచ్చెపట్టిన శివుడు
అవుతాడు అవుతాడు అవతారు డౌతాను!
బిచ్చమెత్తీ ఎత్తి, బొచ్చె పట్టీ పట్టి
నటరాజు ప్రళయంగ తాండవం చేస్తాడు
ముల్లోకములు కాల్చి ముక్తి కలిగిస్తాడు!

'బొచ్చె' నుగ్గవుతుంది. 'బిచ్చం' అగ్ని అవుతుంది
అందాక అందాక, పగలబడి నవ్వండి,
పగలబడి నవ్వండి, విరగబడి నవ్వండి!

నవ్వండి నవ్వండి నాల్గుదిక్కుల జనం!
నవ్వండి నవ్వండి నాల్కచీలిన జనం!

గుంపుగా నవ్వండి
గుమికూడి నవ్వండి !
నవ్వండి నవ్వండి
నవ్వుతూ ఉండండి !

— రెంటాల

ఎంచక్కనికల

మీటనొక్కి చంద్రుణ్ణి వెలిగించు
మీటనొక్కి చిరుగాలి విసిరించు
ప్రియురాలి పెదవిమీద పెదవి మూసి
సన్నని సంగీతంలాంటి నడుంచుట్టూ చెయ్యివేసి
ఆనందించు అబ్బాయీ ! ఆనందించు
అందించు అమ్మాయీ ! పెదవి అందించు

సద్దుచెయ్యకుండా పడుకొంది సముద్రం
ముద్దుపెట్టుకుంది చంద్రుణ్ణి మేఘం
మీ ఇద్దరి కోసమే ఆగిపోయింది రాత్రి
మీ కోసమే వెలుగుతూంది అగరువత్తి
కావలించుకోండి కావలసినంత ఏకాంతం
కలకలా నవ్వండి మీ చుట్టూ ప్రశాంతం !

నిన్న సాధ్యంకాని తీరుబాటు
నిన్న అందనటువంటి ఆనందం

ఇవాళ ఒడ్డులొరసి పారుతూంది
చేతినిండా దొరుకుతూంది !

నిన్న మనతండ్రులు చాలా నిస్సహాయులు
వాళ్ళ తండ్రులు అంతకన్న అసహాయ్యులు
వాళ్ళచుట్టూతా మైళ్ళకొద్దీ బీళ్ళు
ఎప్పుడో ఇంకిపోయాయి వాళ్ళ కన్నీళ్లు
నిన్న చెరువులూ చెట్లూ ఎండిపోయాయి
బావులూ బతుకులూ ఇంకిపోయాయి
పశువులూ శిశువులూ చచ్చిపోయాక
కడుపుదహిస్తే ఆడవాళ్ళు పడుచుకొన్నాక
కడుపున పుట్టిన వాళ్ళని అమ్ముకొన్నాక
మన తాతలూ తండ్రులూ విలపించారు
తమ దరిద్రం కారణం గుర్తించారు

తెరచినకన్నులు మూయకముందే
దీనులు వేదలు లేచేవారు
తీరుబాటుగా నిదురించే
తొలి కోడిని తామే లేపేవారు

అరకకట్టుకు దున్నబోతే అంతా మెరక
అందులో మొలిచేదికాదు కనీసం గరిక
బక్కచిక్కిన ముసలి ఎద్దులకు పాషం
దుక్కి దున్నకముండే వచ్చేది ఆయాసం

ఎొళ్ళు హూనంచేసుకొని పండించిన పంట
కళ్ళలో వత్తులేసుకొని కాపుకాచిన పంట
సగం వడ్డీకింద తతిమ్మాది శిస్తుకింద
రోజంతా పనిచేస్తే అరగంట విశ్రాంతి
తన బ్రతుకులాగే మాసికలు సైతంచిరిగి
అమావాశ్య ఆకాశంలా అరవేసేది చీర
గుడిసెలోంచి బయటకువచ్చేదికాదు చెల్లి
పొయ్యిలోంచి లేచేదికాదు ముడుచుకున్న పిల్లి!
అప్పుడు అందరం కలసి ఆలోచించాం
ఎగుడు దిగుళ్లు చదునుచేసే
యంత్రాన్ని తీసుకువచ్చాం
అప్పుడు అందరంకలసి సంతోషించాం
బండలూ బొధలూ పగిలిపోయాయి
చింతలూ వంతలూ చితికిపోయాయి
తాళ్ళూ రాళ్ళూ నలిగిపోయాయి
కంచెలూ కరువులూ కరిగిపోయాయి
కలకలానవ్వుతూ యంత్రాలు తోలుతూ
కనుచూపు మేరంతా చదునుచేశాం
మళ్ళుకట్టి పొలం పదునుచేశాం
అరగంట పనిచేస్తే రోజంతా విశ్రాంతి
వానలు కురిశాయి పంటలు విరిశాయి
చెరువులు నిండాయి చేలుపండాయి
గనులు దొరికాయి పనులు దొరికాయి
ఫ్యాక్టరీలు వెలిశాయి పట్నాలు నవ్వేయి

ఇవాళ విశాఖపట్నం సందిట్లో గోదావరి పరిహాసం
ఇవాళ అనంతపురం పందిట్లో కృష్ణవేణి దరహాసం !
శోభనంపెళ్ళి కూతురులా పండిన ధాత్రి
పచ్చపైరు తలవంచి సిగ్గుపడుతూంది
పుష్కలంగా పంటలూ ఆశలూ పండే
పుష్యమాసమంతా మనకి పండుగే
కోతలు కోశాక కుప్పలు వేశాక
చేతినిండా మనకి తీరుబాటే

తాతానగరంలో చెంజీకటిలాగ
ఆంధ్రదేశ మంతటా ఎర్రని రాత్రి
ఆరుబయట చలిమంటలు వేసుకొని
అడామగా సాయలాపాయిలా ఆడుతూపాడుతూ
అప్పుడే గానుగాడిన చెరుకు పానకం తాగుతూ
మూడోఝామూ దాటాక అలసిపోయాం

జామిచెట్టుమీది జాతి రామచిలుక
చింతచెట్టుమీది ఇంతి గోర్వంక
జోడీలుగా వాళ్ళకి వలపులు
బేడీలుగా చెట్టాపట్టాలు !

ఆనందించండి అబ్బాయిలూ ఆనందించండి
అందించండి ఆమ్మాయిలూ పెదవులందించండి
ఒంటరిగా ఎవ్వరూ ఉండకూడదు
జంటమాత్రం విడువనేకూడదు

పంటకాలువలో పడవషికార్లు చెయ్యండి
పరవశత్వంతో కన్నులు ముయ్యండి
పోయింది పాడుకలలాంటి నిన్నటి రేపు
పోబోదు తియ్యని కల మనికి నేడే రేపు!

చీకూ చింతాలేని ఏదేశంలోనైనా
శాంతిసౌఖ్యం వెలసే ఏ కాలంలోనైనా
కౌగిలిలో కన్నుమూసిన ప్రియురాలి పెదవి
కలకాలం కోరదగ్గ దేవేంద్రపదవి!!

— ఆరుద్ర

నాకే వృద్ధాప్యం వస్తే

నాకే వృద్ధాప్యం వస్తే మానస కల్లోలిని శాంతిస్తే
కల్లోలం లయించి కమలంలాగ భవిస్తే
సుందర ధరిత్రి వదనం,
చిగురు టాకు ననలో త్తేనుమెత్తన విస్మరిస్తు,
చల్లారిన చితులెగ బోసిన భూళుల ధవళిమ నా కాంక్షించెద,

ఈ సకలంకాడేదీ నాకసలర్థం ఈర్ష్యా పీడితలోకంలో
ఈ భాధా భరిత వ్యధాకులిత
మహోద్విగ్న వ్యాధిగ్రస్త నేత్రం,
మంత్రసాని చిరునవ్వుల చిరునవ్వుల తరంగాల
తరంగిణుల కరకట్టల శిఖరంపై దీపం చూడదు!

ఈవిషాద నిశిగర్భం ప్రవ్యాలించు ఖడ్గం దుయ్యదు !
ఈరోదించే దారుణ నిశేరోదన వినసియ్యదు.

ఈకర్కశ కాళరాత్రి ఈకఠోర కంటకపథాల
ఒంటరిగా అడుగిడనియ్యదు !
కన్నులు పండువుగా కన్నులు చూడని పతంగిలా
మిన్నుల కెగబ్రాకనీదు !
ఆటవికుల పర్వతభాషణ; ఖేచరాళి భీకరప్రసరణ
పరిప్లవిత ప్రపంచ ఘుర్ణ
ఆగామిజనయుగ ఆపూర్వ భాషణ
వినబడవిక నేనే వృద్ధుణయితే—
ప్రబుకుగోడ ప్రకీనీడల వెన్నంటక
వాయువులా పరిప్రవజించక, ఈథర్ లా పరివేష్టించక
వితంతినిక ప్రయోగించక, అస్తికలా, తెగిన నాల్క-లా
హంపీ శిధిలపు సింహాస్వప్నాన్నై
ఋతుచంక్రమణపు గాయాలకు కట్టుగట్టి
వగలంటక, సెగ సోకక నీరవించు నా నాడులు
నిరన నిరీవనిబిడ నిశ్శబ్దపు టవధికి
జ్ఞానాంతపు జడతకు యాత్రిస్తే
నిజం నాకు తెలుస్తుంది ! ఇపపంచమిక మారుతుంది !
జము, రుజలిక గుర్తించని ప్రబుకుతీరు తెలుస్తుంది !

కూలుతున్న గోడలను, పగులుతున్న ఆలయాన్ని
పాడుపడిన కోనేటిని పలకరించి చెప్పగలను -

"పడిపోయిన ఒక ఇటుకను సరిచేయుము
నీచేతులతో ని చేతులతో నీచేతల చేతులతో
ఫలితాన్నాశించక కష్టించుము !
నవధర్త్రి సృష్టించుము !

ఈ రెక్క-లు ఎగరవింక ఇంక లేదు నాకు, "రేపు"
ఇంక రాదు 'రేపు' నాకు ఇంకుతున్న వార్ధక్యం !
వర్తమాన పత్రంపై పడుతున్నది నల్లమచ్చ-చరమ సంధ్య ! !

— ఏల్చూరి

ఎతండి కాంతి పతాకాలు
ఒత్తండి శాంతి బొకాలు

ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ ఒక్క-మాటు చూసిందిటు ;
తమస్సు పాషాణ కిరీటం తీస్తూ ఒక్క పరుగు తీసిందటు !
అటు, ఉల్క-లు, ఉన్మాదమ్ములు, ఆక్రందన, లభివాదమ్ములు,
జీర్ణాలయశివ రూపమ్ములు, శిధిలవనాంతర కూపమ్ములు
అటు-రాజులు, రాచరికాలు, స్వార్థాలు, చట్టాల్, జైలు
ఆకలి, ఆరాటం, వేదన, ధనాధిపుల ఘన సంపాదన
అటు-క్రౌర్యం, కౌటిల్యం, కసి, మారణాయుధాల్, మంటలు,
మసి
చెడిపోయిన ధాన్యపురాసులు, వాటినీడలో క్షుధిత ప్రవాసులు

అటు, రణాలు, వ్రణాలు, మరణాలు, ఖాతాలు, ఖామందులు
కరణాలు

సిండికేట్లు. మాగ్నేట్లు, సేట్లు నిరుపేదలకు మూసిన గేట్లు
అటుభీషణ స్తనధాగ్ని గీతం, బంగారం వ్రిమింగిన భూతం
.....—రక్తపాతం, కాల్పానికి పెద్ద జలపాతం!

ఇటు—జలపాతానికి నాంది, విద్యుదగ్ని వ్రభవించ కేముంది?
కుళ్ళిన సమాజపు మర్కంధం కొట్టుకోపోయే నీటి అందం!
గొంతుదాటి పలకని శబ్దాలు దాగివున్నై ఇన్ని శతాబ్దాలు!
ఇక విందాం వ్రజాగళ గర్జన వ్రజాద్రోహుల తర్జన భర్జన.

నరనరాల వీణాతంత్రీ మూర్ఛన కవిత్వానికి జరిగే అర్చన!
చనిపోయిన ధీరుల గుండెలు అరుణపతాకమ్ముల దండలు
అవి తెచ్చును వ్రభాకిరీటం. అవి విచ్చును ఉషఃకవాటం.
యుగాంతర స్వర్ణద్వారం జగానికొక స్వేచ్ఛాతీరం.

పదండి ఆగామి పథమ్ముల పాడండి అందాల పదమ్ముల;
ఎత్తండి కాంతి పతాకాలు ఒత్తండి శాంతి బాకాలు.
ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ ఒక్క మాటు చూసిందిటు;
తమస్సు పాషాణ కిరీటం తీస్తూ ఒక్క పరుగు తీసిందటు.

— దాశరథి

రాజకీయ బాధితుడు

(ఐన ఓ ప్రణయ కవి దురంత ఉదంతం)

ఆసుకర్మ్మడా ఫీసరా గ్రేసరుండు
అఖిల భారత నిర్వాహణాధికారి
కాగితంబు దుర్భిక్ష మేఘూళి కతడు
చండ చండాతిచండ ఝుంఝూనిలుండు

అఖిల ప్రత్యక్షయాబ్ధి హేణాంకు డతడు
సకల ప్రత్యక్షయాబ్ధి తీక్ష్ణాంకు డతడు.

ఆ కలాప విలాస విన్యాసమే, కు
లాసగా అంటె, తెనుగు హాలీసకాల:
కాగితపు కర్వానేటి వంకాయ కతడు
బకుడి వంటింటి రోకటి బండగాడు

*　　*　　*

వారు ఆఫీసు స్వీకరించారో లేదో
అఖిల భారత శ్వేత పత్రాళి పొదుపు
పాలసీ ఓటి ఓంకార పరచినారు
దిగ్దిగంత మందుభులు దిద్దిరిగిపోవ.

"కాగితం ఖర్చుచేయ బోకండి మీరు"
"ఖర్చుచేకండి చేయనీకండి మీరు"
అంచువాలు పోస్టర్లు వేయించె అచ్చు
విశ్వ రూపాలవంటివి వేయికోట్లు.

నవనవోన్మేష కుడ్య విజ్ఞాపనమ్ము
పత్ర రచన పాలసీ ప్రథమచర్య
కంటికిం దగిలి జనాళి వంటబట్టు
వంటబట్టదా గోడకే పట్టినపుడు.

అంచు లైటంచు ఆహ్లాద మందినాము.
కాని

చాంతో నిలవున్న సర్వ పత్రాళికెల్ల
అమర మంజుల మంగళ హారతోదపి
దుర్భరంపు దుర్భిక్ష మావిర్భవించె.

లేవులే యింక కాగితాల్లేవు, లేవు
బిల్లునైన, అంటించు లేబిల్లునైన
నోటునైనను, పాంశరీ నోటునైన
లార్డులాంటి మా నోటీసు బోర్డునైన.

సరుకు దేశాన పూర్ణాను స్వారమయ్యె
అంటె అడుగు మన గవర్న మెంటు స్టోరు;
అయ్యోయో లేదు, చిన్న ముక్కైన, మంత్రి
శలవుప్రాయ, ప్రధాని రిసైనుజేయ.

అంతియేకాదు యీ ప్రళయాంతకమున
భారతాధ్యక్షు కేలేదు పావుతావు;
కార్యధౌరంధరుండు దీక్షావిభాసి
అసుఖిర్మడి డిస్పాచ్రి ఆర్డరేయ.

* * *

ఈ ప్రణయకవి బాధయింకెట్లు తీరు
ఉన్న సఖియ దూరాన యిరుక్కు-పోయె
ప్రణయకావ్యమ్ము ప్రాయ పత్రాలు లేవు
ప్రణయలేఖైన ప్రాయ పత్రమ్ము లేదు,

— మాచిరాజు

ఓ రాత్రీ!

కనికరించు,
కన్నుమూయకు
ఓ రాత్రీ,
నీకెంతో కృతజ్ఞుణ్ణి!

ఈ గాఢాంధకార వృత్తంలో
విరిగిన మనోరథాలు
మూలపడితేనే
చాల సంతోషం!

ఆద్యంతరహిత తిమిరంలో
గతం గడ్డపలుగులతో
పొడిచినా బాధలేదు!

ఏకాంత నిశీథంలో
హృదంతర గాయాలొక్కొక్కటి
బాధ్యతో కృశించనీయండి!

ఛిన్నంగా, సన్నంగా,
పరాభవిత ధరణోకం—
వేకువ ఝామే వినలేను !

విషవార్తలతో ఉషస్సు
ఒళ్ళువిరిచిలేస్తే
భయపడి పడిపోతా !

వధల గాథలతో
బరువుగా, బలంగా
నోరువిప్పే పత్రికలు
చదవను నోరురాదు !

దయా ధర్మం,
ఉరితీసే ఉదయం
ఒక్కనాటికైనా వద్దు !

హత్యలు, అబద్ధాల మధ్య
జూలువిప్పే తూరుపుకొండ
చూస్తే గుండె ఆగుతుంది !

పచ్చని నురుగులు కక్కే—
పామునంటి పగలు
నా కంటికి పడదు !

ప్రొద్దున్నే—
అన్యాయం, అమానుషం,
ప్రచురించే, ప్రచారంచేసే
పత్రికల ముఖం చూడలేను!

నెత్తుటి వరదపై
ప్రొద్దుపొడిస్తే, నడిస్తే
పాదరసంలా పాకితే,
తనువు తల్లడిల్లదా!

పగలా, పులిపంజలా,
సాగే పదునైన ఎండ
పొడ నే భరించలేను!

దయచేసి
ఓ రాత్రీ,
కన్నుమూత
పడనీయవద్దు!

— యంగిసేని

పండుగనాడు
(సంక్రాంతి)

పాడాలట !

పాడాలట !

చలిచే ఆకలిచే విలపించే
ముష్టివాని రెక్కలమీదికి సంతుష్టి కొరకు చింకిగుడ్డ,
జీవన హేమంతపు చలికాగగ కవులకు ఒక గీతం
కావాలట!
కావాలట !

ఆముదపు ప్రమిదలో వెలిగే దీపాలు
హృదయంలో భావాలు
పండుగట !
పండుగట !

కాలిన ప్రేయసి దేహం చముకంపు ఈలోకం
పాడాలట !

—శరీరమె రామభజన సెమ్మె గీతాలె భక్తులు—
తిరువీధులు తిండి కొరకు తిరిగి తిరిగి అలసినారు
పండుగట ! డబ్బులు మెండుగ దొరకునట !

గళమె నాదస్వరముగ కాలమె ముందంజనై చి
గంగిరెద్దు బ్రతుకు నాది
ముక్కున విధి తాడై వేలాడగ పట్టి పట్టి లాగుతుంది
పాడాలట !
పాడాలట !

— నారాయణబాబు

భిక్షుకులారా!

భిక్షుకులారా ! లోకంలో భిక్షుకులారా !
జబ్బులతో; బాధలతో గబ్బువేయు పుండులంతో
దిక్కులేని భిక్షుకులారా ! లోకంలో భిక్షుకులారా !

ఏలావచ్చారయ్యా మీరూ ? ఏ దారిని, ఏ ఎడారిదారిని ?
ఎక్కడినుంచీ వచ్చారయ్యా ? ఎవరయ్యా మీరంతా ?

2

అమెరికాలో ఇంగ్లండులో ఆనాడున ఈనాడున
దేశాలంతట పురాల గామాలలో
దెసమొలలతో చిరిగినగుడ్డలతో
ఎముకల పోగులుగా కుమిలిన బ్రతుకులుగా
భిక్షుకులారా ! లోకంలో భిక్షుకులారా !

3

దొంగలు మీరూ మాయకాండ్రు దోపిడికాండ్రూ జూదర్లూ
రోగాలనే శిల్పించీ రోడ్డుపక్క ఉంటారూ

ఊళ్ళుఊళ్ళు తిరగగలరు మైళ్ళుమైళ్ళు నడవగలరు
ధనమివ్వక రైలెక్కి దారియాత్ర సేయగలరు

ఎవరయ్యా భిక్షకులారా ! లోకంలో భిక్షకులారా !
గంగిరెడ్ల దాసర్లూ జంగాలూ, పాటకాళ్లు
దొమ్మరులూ, బొమ్మరాండ్లు, బైరాగులు, బీబీనాంచారులు
బుడబుడక్కి సోదెకాండ్రు, రుంజకాండ్రు, నూనెవాళ్లు
రామదాస భక్తుళ్ళూ, ఎవరయ్యా మీరంతా
ఎవరో భిక్షకులారా ?

౫

మిమ్మల్నిలా చేసిందెవరయ్యా ఎవరయ్యా నిలువనీడలేక
భువి అంతా తిప్పేదీ పండ పక్కి కట్టగుడ్డ తిండైనా లేకుండా
ఎవరయ్యా మిము మాయచేసి ఈ బ్రతుకే ఇచ్చారూ ?
ఎవరయ్యా ఆ ద్రోహులు రక్కసులూ, రక్కసులూ
ఓహో బిచ్చకులారా ఎవరయ్యా మీరు ?

౬

మీ దొకజాతా, నీతా ? మీదొకరంగా, రక్తమ ?
మీదొకనేలా, ఇల్లా ? ఎవరయ్యా మీకో దుర్భర
మార్గం చూపిందీ ?
ఎవడా జమీనేలు ఖామందూ ?
ఎవడా ధనస్వామి రాంబొందూ ?
ఎవరయ్యా మీరంతా ? ఎవరయ్యా భిక్షకులూ ?

— భాపిరాజు

భయం బ్రతుకు భయం!

భయం భయం బ్రతుకు భయం!
భయం బ్రతుకు భయం భయం!
అన్నా! మనకీలోకం
పన్నిన పద్మవ్యూహం!

ఆశలతో బ్రతుకీడ్చే అస్థిపంజరాలు మనం,
ఆవేదన హతమయ్యే ఆశాజీవులం మనం!

గతమంటే కారుచెగటు, రేపంటే తగనిభయం!
ప్రళయం ఈ ప్రస్తుతం, క్షణక్షణం దుర్మరణం!

ఛిద్రమైన జీవితాలు, చితికిన సంసారాలకు
స్వప్నం ఒక స్వర్గసీమ, సౌభాగ్యం, సౌందర్యం!

భయం భయం బ్రతుకు భయం!
భయం బ్రతుకు భయం భయం!
అన్నా! మనకీలోకం
పన్నిన పద్మవ్యూహం!

స్వప్నంలో స్వర్గసుఖం, సౌభాగ్యం, సౌందర్యం!
స్వప్నసుఖం మనభ్రాంతి, సత్యదీక్ష మనకుశాంతి!

స్వప్నలోక మాశయించి బ్రతుకీడ్చే సంసారాల్,
ఈ వాస్తవ జీవితాగ్ని శిఖలదగ్ధమౌను సుమా!

భీకుపులో ! పీడితులో ! పెరిగిరండి మానవులై,
చైతన్య జ్యోతులార ! జగతిని శాసించండి !

అన్నా ! మనకీలోకం
పన్నిన పద్మవ్యూహం !
భయం భయం బ్రతుకు భయం !
భయం బ్రతుకు భయం భయం !

— అనిసెట్టి

మా దా క బ ళ్ళం

ఘోరని గాలిదుమారము లెగరెన్
భోరని ధారావర్షము కురిసెన్.
చీకటిలో ఎవరో ఆనీడలు !
ఆకలితో ఏ వే వో ఘోషలు !

అమ్మా ! మాదాకబళం ! తల్లీ !
అమ్మా ! పిల్లల మన్నం ! తల్లీ !

వరుసం దొలకరి వానలు కురియున్
వరిపైరులు బంగారమె పండున్
కానీ, మా వీధులలో మాత్రము !
ఆ నీరసరవ దరిద్ర గాత్రము !

అమ్మా ! మాదాకబళం తల్లీ !
అమ్మా ! పిల్లల మన్నం తల్లీ !

వలాహకముల బలాకా గళములు
కులాయముల ప్రులుగుల కలకలములు
వానకురియ సర్వము వికసించెన్
కానిదీన శిశుగళమే మ్రోగున్ !

అమ్మా ! మాదాకబళం తల్లీ !
అమ్మా ! పిల్లల మన్నం తల్లీ !

ఓ విషాద సాగరమణి తరణీ,
ఓ విశాల సర్వ జగజ్జననీ !
వినబడునో వినబడదో నీకై !
కనికరమే కలగదొకో మాపై !

అమ్మా ! మాదాకబళం తల్లీ !
అమ్మా ! పిల్లల మన్నం తల్లీ !

— గణపతిశాస్త్రి

వా న!

వాన హాయిగా కురిసెను గానీ !
కానీలేని దరిద్రుల కన్నీ
ళ్ళెన్నో యీనీళ్ళల్లో ప్రవహి
స్తున్నాయిగదా ! ఓ కవితా !

చల్లగాలి లేచిందంటే క
ళ్ళల్లో మెరుపులు పరిగిడితే ప
లెల్లో హూరున వానపడేగుడి
సైల్లో పాపల కెల్లాగో !

తడిసిన చిరుగుల చొక్కాతో ఒక
పిడిచకోసమై ఒగరుస్తూ వడి
వడిగా పోయే రిక్షాతో పరి
గెడదామా ! యీ చీకటిలో !

గాలిమేడలో మనగల్గిన చిరు
సాలెగూళ్ళలో కుళ్ళే మనుషుల
జోలినీకు నాకేలా ! రా ! యీ
వేళ ! వర్షధా రల్లోకే !

సుళ్ళు తిరిగి మరి జంఝూనిలమే
పళ్ళు పటపటా కొరికిన, మెరుపులు
కళ్ళు జిగేల్ మనిపించాయంటే
ఒళ్ళు ఒణికి పోతుందేమో !

లేదు భయం ! మరిలేదు రక్షణం !
లేనున్నవి ! పోయేదికలేనే
లేదు ! మనకడే ! గాలివాన ! రా
పద పోదాం సుడిగాలులమై !

జూలుహుమ్మని వినిపించే ఆ
గాలివాన సింహంపై పిడుగులు
రాలే మెరుపుల కమ్మిచీఖణేల్ఖి
ణేలని పిసూసవాలి చేదాం !

చాలని బియ్యపు నూకలకోసం
కూలిజనంతో ఎర్రని కంకర
ధూళివేడిలో గరిదామీ
నేలంతా వణికేదాకా !

పిల్లల కలకల నవ్వులతో మన
తల్లుల చల్లని జోలలతో ప్రతి
పల్లెల్లెలో ఇళ్ళల్లో మెల
మెల్లనందనం విరిసేదాకా !

తరతరాల ఈజన సామాన్యం
తరగని గుండెల బరువులలో మసు
పెరగని చిరవేదనలో లోలో
కరిగి సురిగి పోదామో ! కవితా !

— గణపతిశాస్త్రి

సంప్రార్థనం

వానా వానా ఓ వానా వానా
ఎందుకు విచ్చేశావు ? ఎవరికి కృపజూపేవు !
పట్నం చూసే సరదా పడివచ్చావా వానా !

ఇచ్చటి జనుల విచిత్రం ఏమోచూడాలని వచ్చావా!
రాత్రిని పగలుగ చేసే మనిషిని దేవుని చేసే
నిరతము లోకాభ్యున్నతి కోరుచు శ్రమ చేసే తెగ
ఎట్లా బ్రతుకుదురోయని ఏదో భావిస్తూ యిటు
వచ్చావా వానా వానా !

చూసేవా మా జీవనగతి
సుత్తి సూదీ కలమూ బలమూ
అన్నీ ఎన్నో ఎన్నెన్నో ధరించి శ్రమించి
భవిష్యదరుణోదయ శ్రీకాంతుల ఆహ్వానిస్తూ వుండే
శ్రామిక జన సందోహం అందుకునే శుభములివే !

నీవే స్వేచ్ఛగ విహరిస్తే ;
మార్చుకొను పొడిబట్టలు కూర్చుందికి పొడిజాగా
కుడువగ బియ్యం గింజలు లేవు సుమీ రావు సుమీ!

గొడుగులేక వడి నడిగా నడచి పోవు పనివారల
తడిపి మంచమెక్కించకు, కడుపు వృత్తి పోగొట్టకు
చెట్లకింద, అరుగులపై శిశువులతో తలదాచుకు
జీవించే నిర్భాగ్యుల చెదరగొట్టకోవానా !
వ్యథల పెట్టకో వానా !

పరమార్థం లేకుండా పట్నానికి రానెందుకు
మాపంటలు పల్లెల్లో మంటగలసి పోతున్నవి !
ఓ వానా పో వానా !

రాయలసీమ పొలాల విశాఖ మండల తలాల
వర్షించుము వానా వ నా ! ఓవానా ! వానా !

— మసూనా

కిరణ శకలం

జలప్రపాతంలో వినబడు
విద్యుత్తు గుసగుసనలె
నా మనస్సులో ఏవో
భవిష్యత్తు మాటలు.

ఆద్య పాషాణ యుగంపోయి విద్యుత్యుగం దిగిన ఈనాడు ఏడ్చేదీనుని కన్నీళ్ళలో ఎంతోకొంత విద్యుత్తు పుడుతుంది. పరమాణువు పగులగొట్టి ధరిత్రికి ప్రమాదాలు తెచ్చిన 'శిరస్సు'లకు బుద్ధిచెప్పే పురస్సరత్ కవిత ఇది. కోతిని మనిషిగా తొలిచిన కాస్మిక్-రేడియేషన్ బలమే నా కలంలో చొరబడి నేను మనిషిని దేవతగా మలుస్తుంది.

విద్యుత్తులా ప్రవహించగల మనకు
మద్యంలా పారే పాత ఛందస్సులో
పద్యం రచించడం పడదు. అందుకే ఇలా రాస్తున్నాం.
ఇది విద్యుత్ ఛందస్సని అందరికీ తెలిసినదే.
ఇందులోని కవిత్వపు యక్స్-కిరణం
హృదయాంతస్సుల్ని శోధిస్తుంది.
'స్కెలీ'కి వాయుమండలంలో అయిదోవంతు "ప్రాణం" వుందని

అదే మొదటిసారి తెలిసినట్లు నాకో కొత్తమాట తెలిసింది.
అడేమిటని అడిగేరా ? అణువుల్ని పేల్చే ఈనాడు
ఆ అయిదోవంతు "ప్రాణం" అయిపోయిందయిపోయిందని!

పీల్చితే విషపుగాలి, రాల్చితే కన్నీరు
ఆలిస్తే ఆక్రందన, కాలూనితే అడుగడుక్కీ విషక్రిములు
చల్లని నీటిలో ఎంకో జలవిద్యుత్తున్నప్పుడు
పల్లెవాని గుండెల్లో పెల్లుగా తిరుగుబాటుండదూ ?
మూల పదార్థాలకోసం వేలేళ్ళు తపంచేసిన
శాస్త్రజ్ఞులవలె మేమూ శాంతికొరకు తపిస్తాము.
యుద్ధాల మహాగ్నిలో శాంతి నేడు జోన్-ఆఫ్-ఆర్క్ !
భూమిని చుట్టిన జలనిధి మాదిరి శాంతిని పెంచి
యుద్ధాన్ని ఎరెస్టుచేసి మరణశిక్ష విధిస్తాము.
చితిమంటల యుద్ధానికి ప్రతికవి ఒక ఫైర్ బ్రిగేడ్.
అణుఅస్త్రపు అర్కరుచికి ప్రతి పద్యం మబ్బు ముక్క.

కలం అంటేనేగా బలం ?

కలంలేంది బలంలేదు.

జనం అంటేనేగా మనం ?

జనంలేంది మనం లేము.

— దాశరథి

స్వాగతం

రావోయి మావూరు రత్నాల దీవి
రమ్మోయి మా తల్లి రక్షించు దేవి

గాలి గోపుర మొండు
నీలి నింగికి బ్రాకి
పాలిమేరపై నిన్ను
పోల్చు కొనుటే కాక
అదుకొను రా బాల
చెలిమితో దగ్గరికి

చేర రా మావూరు శిఖరాల వూరు
శిఖరాల చిరునవ్వు చెన్నొందు వూరు

బాటపక్కల చెట్లు
బాటసారుల జోరి
ఎలనవ్వు నీడలన్
ఎదగదిమి లాలించు
తల నిమిరి ముద్దాడి
తల్లివలె దీవించు

నిలుమోయి మావూర నిండైన నీడ
నిండు ప్రేమలతోడ నిండారు నీడ

చెరువులో పద్మాలు
చెంప చారెడు కళ్ళు

ఇంతలై విప్పారి
అంతలై వెల్గొంద
పలకరించును నిన్ను
ప్రలకరించగ మేను

పదవోయి మావూరు పద్మాల వాడ
పద్మకాంతుల తోడ భాసించుమేడ

కొలనులో కుముదాలు
కీలకిలా నవ్వుతూ
కాళ్ళ కిచ్చును నీళ్ళు
'కావాలె దాహమ్ము
తమ్ముడా నీకంచు
తమితోడ ప్రశ్నించు'

కలువల మా వూరు కానంగ రమ్ము
చెలువుల మా వూరు చేరంగ రమ్ము

ఆలయం సంపెంగ
అరమోడ్పు కనులతో
ఆప్యాయముగ జూచి
ఆశీస్సు లందించు ;
చీకుచింతల దీర్చు
శిరి సంపదల గూర్చు

ఆగరా మావూళ్ళు అను రాగ వల్లి
ఆదరంబుల వల్లి అమృతంపు తల్లి

— నాగ

ఊ ర వ త ల

కలలపొదిరిళ్ళలో
సౌఖ్యంపు నిదురలో
కనిపించి యొకతన్వి
మేనక నాపేరు మేఘాలకు వెనుకపక్క
మా ఊరని మాయమయ్యె
చిరునామా తెలిసికూడ
చేసేదేమి లేక
ఊరవతల కేళ్ళాను
ఊహాగానం శ్రాయగ

* * *

కావు! కావు! ఆకాశం
కాకిపిల్ల నోరుతెరచె మేతకోరకు
పాపిష్టి యినోదయమ్మె
పాము కాటు
ఎండ పొడిచె;
భువికి తగిలె శివజ్వారం!

ఫలములు లేనేలేవు
పచ్చనకూడా చచ్చి
నీడకూడ యీయలేని
క్రమోడుచెట్ల జంట పొత్తు!

"యినుపసరుకు" ఎనిపోతు
ఎమునెక్కడో దించేసి
తనుమాత్రం ఎదురాయెను.

క్రేతలతొయిల్లట్ల
బూరుగ వృక్షంమీద
కళ్ళజోడు పెట్టుకున్న
గరుడ పురాణ బ్రాహ్మడు
కంతమెత్తె ఘూకమ్మ!

కాటకంపు తాటకిలా
ఆకుబయట మిల్లు
విశ్వకర్త హృదయంలో
దుస్వప్నంలా
భుగభుగమను పొగగొట్టం
ఆకాశమె
చిల్లులు వడ
అతితారస్తాయీ నా
మిల్లరచింది.

పోలీసుల ఈలకు
నిశ రాతిరి
పసి పిలడు
కలత నిదుర
కళవళ పడటు
కణకణ మండె కళ్లతో
కార్మిక సోదరు డదరెను !

జీవనమ్మె తీసినారు
జలమంత మిల్లు కెత్త
పాడలేని గలకరాళ్ళ
పాతవడ్డ సెలయేరు !

మురికిబట్ట లెన్నొ కూసి
రజకుని చెరట్టు
ఊరంతా రాతిరంత తిరగడం
కాగితాల భోజనం
పోయిన యాయేటి నవ్వె
పుక్కిట నెమ రేసుకుంటు
గండశిలా సిడలోన
కనుమోడ్చెనుగార్ధభస్వామి !!!

శిల కెంతో దగ్గరగ
గొప్పవారి చూపుల్లా
గుచ్చుకొనె యీాతచెట్టు!

అవిశ్వాసంపు బ్రబుద్ధకు
అరఘుడి యైనను నోర్వదు
పోయినయా పూర్వపు యజమాని
పోతిరాజు ఎముకలతో
చెలగాటం సాగించి
శ్మశానాల తిరిగివచ్చు
శునక సందడి !
"అల్ బిదా ! అల్ బిదా !"

తుంకల పండుగలోను
ఊరేగే పీరుల్లో
ఏతచేత గీతంగడ తాటివనం !
బ్రహ్మచెముడు కంచె మధ్య
పూర్ణిమ సంధ్యల్లోను
ఘడియైనా యుద్రయాత్రాదిని
రుధిర జ్యోతై వెలిగె
జాబిల్లి !

మృత శరీర యాకమణ
ఘటాకాశ యరుణారుణ
రక్త సిక్త మోముతోడ
"మా అమ్మ చంపింది !"
'మా అమ్మ చంపింద'ను
మౌనముగ గాజుకళ్ళ పురుటిపిల్ల !

వెనుతిరిగె చూచాను
వెంటాడె మృత్యువులా
వెలుపు గొలిపెనా ఛాయ.
అసురులతో పోరాటం మిషన్
గన్ను లారాటం !
జీవహింసకుడదని చేత చిక్కినారు !
భూమికంత యీనాడె
గ్రామదేవతోత్సవమ్మ్రి
కాలజ్ఞానులు మీరు
కాచుకోండి కత్తిపదును
కత్తిపదును కాచుకోండి
కవిగారని గాలికబురు చెప్పింది!

— నారాయణబాబు

రహదార్లు

[శ్రీ శ్రీ వ్రాసిన విలక్షణమైన "దేశ చరిత్రలకు" సలక్షణమైన వికట కవిత్వ పరివర్తనం]

ఏ రోడ్డు చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం ?
రహదార్ల చరిత్ర సమస్తం
ధూళి ధూసర పరిన్యస్తం.

రహదారీ చరిత్ర సమస్తం
యాతాయాత జన సంయుక్తం :
రహదారి చరిత్ర సమస్తం
పథిక వాహన ప్రయాణసిక్తం,

భూంకార గర్జిత దిగ్భాగం,
చక్రాంగ జ్వలిత సమస్తాంగం !
రహదారీ చరిత్ర సమస్తం
పై జమ్మాక్షరాలను పాడుచేయడం.

పినుదారులు కాలిబాటల
సామంతుల కావించెను :
హైరోడ్డులు అశోకుడై
చరిత్రమున ప్రసిద్ధికెక్కెను.

బాటలు తీరని పట్నం భూ
స్థలమంతా వెదికిన దొరకదు :
పురమంతా తీరును వీధులు,
కాకుంటే కోయును మధ్యకి.

దుమ్మెక్కిన సితభిత్తికలూ,
సళ్ళిచ్చిన పృథువేదికలూ,
ఇహ లోకపు వైతరణీ
పరవీధుల భూషించెను.

చిక్‌షిన్‌క్వా, దంతపుకట్టూ,
చైనా పాపూ, గోవిందప్పా,
గిడ్డంగులు, గుళ్ళూ, కోనేళ్ళూ,
వీధుల భాగ్యం నిరూపించినవి.

లారీ రాజం, భారీ బస్సూ
రోడ్డు రోలర్, బ్రెన్‌గన్ కారీర్,
ట్రాంకారూ, ఏవైతేనేం?
ఒత్తేయును టూత్‌పేస్టుల ట్యూబల్లె.

జమీందారూ, గుట్టపు సార్టూ,
సర్కిల్ శకటపు ఘుర్ఘురనాదం,
యుద్ధపు సైన్య పాద విఘాతం
నాడుల నన్నిటి స్పందించును,

వామహస్తపు వక్రీకరణం,
భటవేదిక కర్ద్రీభమణం,
కుచోద్ధారిత తీవ్రధ్యానం
పుట్టిన వెన్నో రక్షణకై.

ఆకస మెక్కే ఓవర్ బ్రిడ్జీ
ప్రక్కన పరచిన పథవేదికలూ
పచ్చని యెర్రని దీపక్కాంతీ
తగ్గించున ప్రాణాపాయం?

ఒక కారును వేరొక కారూ
ఒక లారిని యింకొక లారీ
చుంబించే క్షణమందున
రూల్సన్నీ దాగును యెచ్చట ?

ఈ నడివీధికి సంగమ ముందా ?
ఆ రహదారీ వాలంబెంతది ?
పోసిన రాళ్ళూ, నడపిన గుళ్ళూ
యివి కావోయి బాటల భాగ్యం

శృంగాటక కింకరు నాట్యం,
బంగాళా దీపపు తేజం,
క్రాసింగుల కేటాయింపులు
యిది కావోయ్ బాటల శాస్త్రం.

వింధ్యధరా విపిన శ్రేణుల
భీకరకానల చిందులు క్రొక్కే—
మార్గాలెన్నో కావాలిప్పుడు !
మరణించిన మరణించని సత్యం.

ఏథెన్సున ఫియిడీ ఫైడ్సు,
బర్మాదేశపు కాందీ శీకులు,
లంఘించిన వాయుతనూజుడు,
దారెరుగని ధీరులందరూ—

ధృవాంతరస్కేటర్, యెస్కిమో,
పంథాలెరుగని పాదచారులు
మారాటవి గమ్య విశేషం.
గ్రోలింతురు గోల్డ్ఫ్లేక్ల్లే.

రహదారుల మధ్యదారిలో
అగుపించే హంతకు లెవ్వారు ?
ఫకాన పెట్టిన రోలర్ కాదోయ్,
చూని గ్రుద్దిన బండ్లెన్నో ?

నల్లమలా కనుమల మధ్యన
జల్లించని వంకర లెచ్చట ?
మైలున్నర కృతమైరందున
గోళ్ళను లేపని రాళ్లెన్ని ?

కారోకారం, లక్ష్మణఝూలా,
టర్కీలో గృహాంతర మార్గం.
హూగ్లీబ్రిడ్జి, ధర్మాఫైలే,
యమునా స్థంభిత ఘట్టంలో-
చారిత్రక విభాత సంధ్యల
మార్గ వినిర్గత శాస్త్రం బెట్టిది ?

ఎ గీతం ? ఏ కాలంలో ?
సాధించిన దీపరి పూర్ణం ?
ఏజల సూత్రం ? ఏకల వింకం ?

చూపించిరి యీ వికటత్వం ?
యెగతాళుల యీ ప్రతిబింబం ?
ఈ భావం ? ఈ కిష్కింధం ?
ఈ భాష్యం ? ఈ బాంధవ్యం ?

— మాచిరాజు

ప్రగతి

జయమాయె విజయమాయె ననుము
గళమెత్తి కాహళి,
అయుతాయుత దేశ దేశ
నరమందిర గేహళి !

అధికార మధమకాలము
అతిహేయ మర్థ మత్తత
పృథివీ తలి మాయ మాయె
రణం హింసోన్మత్తత !

గదులై విసి, అరలై చెడి
కలకాలపు లోగిలి
కదియించె ప్రతీచి ప్రాచి
కలిపి యొక్క కొగిలి !

నిరుపేద పురుగు బొనిసీడు, తిరుగు
పాడులోకము
పరువెత్తె; ప్రజావళికి ఇంక
నవమంగళ నాకము!

— కృష్ణశాస్త్రి

పూర్ణమ్మ

మేలిమి బంగరు మొలతల్లారా!
కలవల కన్నుల కన్నెల్లారా!
తల్లులగన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా యీ కథను.

అటల పాటల పేటికలారా!
కమ్మనిమాటల కొమ్మల్లారా!
అమ్మలగన్నా అమ్మల్లారా!
వినరమ్మా మీరీ కథను.

కొండల నడుమను కోనొకటున్నది;
కోనకినడుమా కొలనొకటుంది;
కొలనిగట్టునా కోవెల లోపల
వెలసెను బంగరు దుర్గమ్మ.

పూజారింటను పుట్టెను చిన్నది
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా.
అన్నల తమ్ముల కనుగైదుర్గకు
పూజకు పువ్వులు కోసేది.

ఏయేవేళల పూసేపువ్వుల
ఆయావేళల అందించి
బంగరు దుర్గను భక్తితో కొలిచెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మ.

ఏయే ఋతువుల పండేపళ్ళను
ఆయా ఋతువుల అందించి
బంగరు దుర్గను భక్తితో కొలిచెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మ.

పళ్ళను మీరిన తీపులనడలను
పువ్వులమీరిన పోడుములున్
అంగములందున అమలెను పూర్ణకు
సౌరులు మించెను నానాటన్,

కాసుకులోనై తల్లీ తండ్రీ
నెనరూ న్యాయం విడనాడి
పుత్తడి బొమ్మను పూర్ణమ్మను ఓక
ముదుసలి మొగడుకు ముడివేస్రీ.

ఆ మనిరాగా దుర్గకొలనులో
కలకల నవ్వెను తామరలు;
ఆమనిరాగా దుర్గవనములో
కేలకిల పలికెను కేరములు.

ముద్దునగవులూ మురిపెంబుమరి
పెనిమిటి గాంచిన నిమిషమున
బాసెను కన్నియ ముఖకమలమ్మును
కన్నుల గ్రమ్మెను కన్నీరు!

ఆటల పాటలతోటి కన్నియలు
మొగుడు తాతయని కేలించ,
ఆటల పాటల కలియక పూర్ణము
దుర్గను చేరీ దుఃఖించె.

కొన్నాళ్ళకు పతికొని పోవచ్చెను
పుత్తడి బొమ్మను పూర్ణమను
చీరెలు సొమ్ములు చాలగదెచ్చెను
పుత్తడి బొమ్మకు పూర్ణమకు.

పసుపురాసిరి బంగరు మేనికి
జలకము లాడెను పూర్ణమ్మ;
వదినెలు పూర్ణకు పరిపరి విధముల
నేర్పులు మెరసీకై చేసీ.

పెద్దల కప్పుడు మొక్కెను పూర్ణము
తల్లీ తండ్రీ దీవించ్రి;
దీవనవింటూ పక్కన నవ్వేను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మ!

చిన్నలనందరి కౌగిటచేర్చుకు
కంటను బెట్టెను కన్నీరూ:
అన్నల తమ్ముల నప్పుడు పలికెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మ.

"అన్నల్లారా తమ్ముల్లారా!
అమ్మను అయ్యను కానండీ!
బంగరు దుర్గను భక్తిగొ కొలవం
డమ్మల కమ్మా దుర్గమ్మ.

ఆయావేళల పూసే పువ్వుల
ఆయా ఋతువుల ఫళ్ళన్నీ,
భక్తినిగోసి శక్తికి యివ్వం
డమ్మలకమ్మా దుర్గమ్మ.

నలుగురు కూచుని నవ్వేవేళల
నాపేరొకదరి తలవండీ.
మీ మీ కన్నబిడ్డల నోకతెకు
ప్రేమను నాపేరివ్వండి"

బలబల కన్నుల కన్నీరొలికెను
పుత్తడి బొమ్మకు పూర్ణమకు
కన్నులు తుడుచుకు కలకలనవ్వెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మ.

వగచిరి వదినెలు, వగచిరి తమ్ముళ్లు
తల్లియు కంటను తడిబెట్టెన్,
కాసుకులోనై అల్లుని తలచుకు
అనందించెను అయ్యోకడే.

యెప్పటి యట్టుల సాయంత్రమ్మున
యేరిన పువ్వులు సరిగూర్చి
సంతోషమ్మున దుర్గను, కొలవను
వొంటిగ బోయెను పూర్ణమ్మ.

ఆవులు మొదవులు మందలజేరెను
పిట్టలు చెట్లను గుమిగూడెన్
మింటను చుక్కలు మెరయుచు పొడిమెను
పూర్ణమ యింటికి రాదాయే.

చీకటి నిండెను కొండల కోనల
మేతకు మేకములు మెసలబీనెన్
దుర్గకు మెడలో హారముల మరెకు
పూర్ణమ యింటికి రాదాయె

కన్నుల కాంతులు కలవలచేరెను
మేలిమి జేసెను మేనిపసల్!
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ.

— గురజాడ

దేశభక్తి

దేశమును ప్రేమించుమన్నా,
మంచి అన్నది పెంచుమన్నా,
వొట్టిమాటలు కట్టిపెట్టోయి
గట్టిమేల్ తలపెట్టవోయి,
పాడి పంటలు పొంగి పొర్లే
దారిలో నువ్వు పాటుపడవోయి,
తిండి కలిగితె కండకలదోయి
కండకలవాడేను మనిషోయి!

యీసురోమని మనుషులుంటే
దేశమే గతి బాగుపడునోయి?
జల్లుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయి.

అన్ని దేశాల్ క్రమ్మవలెనోయి,
దేశి సరుకుల నమ్మవలెనోయి!
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపద లబ్బవోయి.

వెనకచూసిన కార్యమేమోయి ?
మంచిగతమున కొంచెమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనక పడితే వెనకే నోయి !

పూనుస్పర్ధను విద్యలందే
వైరములు వాణిజ్యమందే
వ్యర్థకలహం పెంచబోకోయి
కత్తివైరం కాల్చవోయి !

దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయి ;
పూని యేదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయి !

ఓర్వలేమి పిశాచి దేశం
మూలుగులు పీల్చేసెనోయి,
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి !

పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయి !
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయి !

స్వంత లాభం కొంత మానుకు
పొరుగువారికి తోడు పడవోయి
దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయి !

చెట్ట పట్టాల్ పట్టుకుని
దేశ్ధుల నడువవలెనోయి,
అన్న దమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి.

మతం వేరై తేను యేమోయి ?
మనసులొకటై మనుషులుంటే
జాతియన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయి !

దేశమనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తనలెనోయి,
నరుల చమటను తడసిమూలం,
ధనం పంటలు పండవలెనోయి !

ఆకులందున అణగి మణగీ
కవిత కోవిల పలకవలెనోయి
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయి ! !

— గురజాడ

324

సూచిక

శ్రీరంగం శ్రీనివాసరావు

కవితా ! ఓ కవితా !	17
మహా ప్రస్థానం	24
దేశచరిత్రలు	49
శైశవగీతి	60
అవతలిగట్టు పరాజితులు	83
ఆఁ !	84
వ్యత్యాసం	233

శిష్టా ఉమామహేశ్వరరావు

నవమి చిలుక మున్నుడి !	27
జ్ఞాపకాలు	28
మహాలయ అమావాస్య !	42
వెతరణి	43
ప్రేమ	44
యుగశక్తికి ఆహ్వానం	47
బీదమందు	66

శ్రీరంగం నారాయణబాబు

ఏమంది 31

కపాలమోక్షం 34

కిటికిలోదీపం ! 39

గడిపరక 63

డూమానశంఖం 69

పండుగనాడు 293

ఊరవతల 306

పురిపండా అప్పలస్వామి

గీతం 37

పులిపంజా 38

పతాభి

మృణాళిని 66

సంపత్

దర్శనపరీక్ష 51

అ సమయము 52

పాలగుమ్మి పద్మరాజు

చీకటి 53

పురిటిపాట 57

జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

ఆసుపత్రిలో కోకిల 64

సింగరాచార్య

VIBGYOR 79

దేశిరాజు కృష్ణశర్మ

హాద్దులు 81

బెల్లంకొండ రామదాసు

నాగీతం 84

ఈరోజున 87

అశోకవృక్షం ! 225

వీల్చూరి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి 90

పోస్టుచెయ్యని ఉత్తరం 228

నాకే వృద్ధాప్యంవస్తే 284

అనిసెట్టి సుబ్బారావు

వ్యాససంతతివాణి 93

ప్రాణోత్సవం 94

పృథ్వీగీతం 129

అణుసంగీతం ! 151

తెగిపోయిన COSMOS జగత్తు 236

భయం బ్రతుకు భయం ! 296

కుందుర్తి ఆంజనేయులు

మన్వ్యావిష్లవం 95

ఆకలియాత్ర 98

తరువాత 254

డి. బాలగంగాధరతిలక్

మాగ్నాకార్టా 100

గుండెకింద నవ్వు 102

సైనికుని ఉత్తరం 144

పోలూరి ఆంజనేయప్రసాద్

కదలండి ! 104

తెన్నేటి సూరి

అరుణరేఖ 106

మాతృగీతి 265

సుంకర సత్యనారాయణ

విప్లవం 107

పంటచేను పిలుపు 143

ప్రయాగ కోదండరామశాస్త్రి

ఉగాది 108

భూస్వర్గం రావాలి ! 159

చాగంటి సోమయాజులు

విరిగిన హరివిల్లు 110

కరుణశ్రీ

నాన్నకోసం 111

తప్పులేని తమ్ముడు 114

తుమ్మల వెంకట్రామయ్య

చెల్లీ ! 115

అవసరాల సూర్యారావు

కత్తెరలో కంఠం 117

కాటూరు, యలమర్రు, కడలూరు 120

కలకత్తా కాళిముందు 140

నిజంగా, బలంగా ! 164

వేములపల్లి శ్రీకృష్ణ

తెలుగోడా ! 125

విశ్వం

ధిక్కారం 128

ఆవంత్స సోమసుందర్

సమధర్మం 134

ఆకలి నాలుకలన్ని 137

ఖబడ్దార్ ! 167

భగత్సింగు 169

కొనకళ్ళ వెంకటరత్నం

స్వాగత వచనం 147

పులుపుల శివయ్య

తల్లి ఒడిలోకి 149

మాచిరాజు దేవీప్రసాద్

మావాహనం 156

నేర్చుకోండి ! 157

సంక్రాంతి కానుకలు 158

రాజకీయ బాధితుడు 288

రహదార్లు 310

దాశరథి కృష్ణమాచార్య

రక్తారుణ వైజయంతి 163
చేపటిరోజు 191
ఎ తండి కాంతిపతాకాలు 286
కిరణశకలం 302

ఆరుద్ర

పర్వతదశ 170
చిరంజీవి మానవునకు మృత్యువు 173
ఇసుక గడియారం 218
నీటి గడియారం 219
ఎంచక్కనికల 280

అజంతా

భయపడినవాడు 177
పరిత్యాగి పరివేదన 179

నార్ల చిరంజీవి

కాలరథం 183

బైరాగి

ఒకే జ్యోతి! 184
నూతిలోని గొంతుకలు 238

రాంషా

ఆకాశాలు 187
విన్నావా ? 188

కె. వి. రమణారెడ్డి

అడవి 192
సత్యం, శివం, సుందరం 193
కష్ట ! 261

రెంటాల గోపాలకృష్ణ

ప్రతిజ్ఞ 199
పల్లకీబోయీలు 201
గుడిగంటలు 245
నవ్వండి ! 278

నారపరెడ్డి రామిరెడ్డి

నిరాశ 205

గంగినేని వెంకటేశ్వరరావు

గెరిల్లాలతో ఒకనిమిషం 207
తల్లి తనయునికి 211
ప్రియుని ప్రియురాలికి 249

అరచేతిలో మృత్యువు 272
ఓరాత్రీ ! 290

పూషా

త్రిశ్శంకునరకం 215

పన్యాల రంగనాథరావు

ఓం తత్సత్ 220

సి. నారాయణరెడ్డి

మానవతా ! 221
బ్రతుకులోతులు 224
కరువు కత్తెరలు 262

సి. వి. కృష్ణారావు

జీవయాత్ర 226

శశాంక

ముళ్ళల్లో మల్లెలు 227

దేవులపల్లి కృష్ణశాస్త్రి

అరుణతార 258

అవనిఅంతా 258

ప్రగతి 315

వటికొండ విశాలాక్షి

శపథం 259

మల్లవరపు విశ్వేశ్వరరావు

శంఖనాదం 263

తాపీ ధర్మారావు

చెప్పరాని చిన్నగుట్టు 267

బాధర్

ఊహల పొలిమేరలు 269

గిడుతూరి సూర్యం

శాసిస్తా జగతిని 277

—ం

అడివి బాపిరాజు

భిక్షుకులారా 942

పిలకా గణపతిశాస్త్రి

మాదాకబళం 297

వాన ! 298

మసూనా

సంప్రార్థనం 300

నార్ల వెంకటేశ్వరరావు

స్వాగతం 304

గురజాడ అప్పారావు

పూర్ణమ్మ్రి 316

దేశభక్తి 321

★

X'1'L



Check List

Book Number	NPR01B281	Date	29/03/2023
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CT, 2, 6, 16, 324, xii, xiii,		
Missing Pages	NO		
Prepared By	Sandhya	Cutting By	Sandhya
Scanned By	pradhiksha	Pages	341